సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16 సంచిక: 115
మంగళవారం 9-1-2024
SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



ఇషా డబుల్ ధమాకా
ఆసియా క్వాలిఫయింగ్ షూటింగ్ టోర్నీలో రెండు స్వర్ణాలు - 12లో



సెన్సెక్స్ 671 పాయింట్లు క్రాష్
నిఫ్టీకి 198 పాయింట్ల నష్టం.. ప్రపంచ ప్రతికూల సంకేతాల ప్రభావం - 13లో



ముదిరిన మాల్దీవుల వివాదం
లక్షద్వీప్‌పై మాల్దీవుల మంత్రుల అక్కసుతో మొదలైన వివాదం ముదిరింది. 'బాయ్‌కాట్ మాల్దీవులు' ట్రెండ్‌కు మద్దతు పెరిగింది.
వివరాలు 6లో ▸



'అవామీ'కి 223 స్థానాలు
బంగ్లాదేశ్ పార్లమెంట్ ఎన్నికల్లో 299 స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా.. అధికార అవామీ లీగ్ 223 స్థానాల్లో గెలిచింది.
వివరాలు 6లో ▸



అర్ధ శతాబ్దం తర్వాత చంద్రుడిపైకి..
అమెరికాకు చెందిన ఆస్ట్రోబోటిక్ టెక్నాలజీ సంస్థ తయారు చేసిన పెరిగ్రీన్ ల్యాండర్‌ను నాసా నింగిలోకి పంపింది.
వివరాలు 6లో ▸



పాక్‌లో ఉగ్ర పంజా
పాక్‌లోని ఖైబర్ పంఖ్తునా ప్రావిన్సులో ఉగ్రవాదులు విసిరిన బాంబు పేలి ఆరుగురు పోలీసులు చనిపోయారు.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

లోకేశ్ దెబ్బకు టీడీపీ కకావికలు

టీడీపీ నేత లోకేశ్ దెబ్బకు ఎన్టీఆర్ జిల్లాలో ఆ పార్టీ కకావికలవుతోంది. టీడీపీకి ఎంపీ కేశినేని నాని గుడ్‌బై చెప్పడంతో జిల్లాలో పార్టీ నేతలు అధిక సంఖ్యలో రాజీనామాలకు సిద్ధమవుతున్నారు. కార్పొరేటర్ కేశినేని శ్వేత తన పదవికి రాజీనామా చేశారు.
వివరాలు 14లో ▸

యనమల ఇంట్లో టికెట్ లొల్లి

తునిలో తన చిన్నాన్న కుమారుడైన కృష్ణుడికి చెక్ పెట్టేందుకు కుమార్తె దివ్యను తెర పైకి తెచ్చిన టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు.. ఇప్పుడు సొంత సోదరుడి కుమారుడు రాజేష్‌ను కూడా రంగంలోకి దించారు. దీంతో తాడోపేడో తేల్చుకునేందుకు కృష్ణుడు సిద్ధమయ్యారు.
వివరాలు 5లో ▸

'ఆడుదాం ఆంధ్రా' అదుర్స్

ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహిస్తున్న మెగా క్రీడా టోర్నీ 'ఆడుదాం ఆంధ్రా'కు క్రీడాభిమానం వెల్లువెత్తుతోంది. తొలి దశలో భాగంగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో క్రీడా పోటీలు దిగ్విజయంగా ముగిశాయి. 10వ తేదీ నుంచి మండల స్థాయి పోటీలు మొదలుకానున్నాయి.
వివరాలు 2లో ▸


నేటి నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పాఠశాలలకు పాఠశాల విద్యాశాఖ సంక్రాంతి సెలవులను సోమవారం ప్రకటించింది. మంగళవారం నుంచి ఈ నెల 18వ తేదీ వరకు ఈ సెలవులు కొనసాగనున్నాయి. ఈ నెల 19న తిరిగి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి.

గురివింద.. గుంజీలు

విజయవాడ 'ఈనాడు' స్థలాన్ని ఖాళీ చేసిన రామోజీరావు

- ఎట్టకేలకు అసలు యజమాని వల్లూరి రామకృష్ణ చేతికి
- 40 ఏళ్లుగా పత్రిక పేరుతో నామమాత్రపు లీజుకే మూడెకరాలు
- రహదారి విస్తరణను 20 ఏళ్లపాటు అడ్డుకున్న గురివింద
- లీజు ముగిసి పదేళ్లు దాటినా ఖాళీ చేయకుండా తిష్ట
- పరిహారంగా ఇచ్చే టీడీఆర్ బాండ్లు తనకే ఇవ్వాలని కోర్టుకు
- న్యాయం గెలవటంతో యజమానికి భూమి అప్పగించి పలాయనం
- విశాఖలోనూ ఇలాగే 'భూమోజీ' అక్రమాలు.. అక్కడా ఇదే ఫలితం



ఇరుకు రోడ్లతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ 'ఈనాడు' యజమాని ఓ సంఘ సంస్కర్తలా వార్తలు అచ్చేస్తుంటారు!

...విజయవాడలో అత్యంత రద్దీగా ఉండే బెంజ్ సర్కిల్‌లో రహదారి విస్తరణను ఇదే రామోజీరావు 20 ఏళ్లు అడ్డుకున్నారు.

ప్రైవేట్ వ్యక్తుల ఆస్తులను కబ్జా చేస్తున్నారు..! సామాన్యులు హడలిపోతున్నారంటూ.. ఈనాడు ఎక్కడలేని ఆవేదన వెళ్లగక్కుతుంది..

.. బెజవాడ బెంజ్ సర్కిల్ వద్ద అత్యంత విలువైన మూడెకరాల భూమిని లీజు ముగిసినా ఖాళీ చేయకుండా స్థలం యజమానిని రామోజీ తీవ్రంగా వేధించారు.

ఒకరికి దక్కాల్సిన నష్ట పరిహారాన్ని మరొకరు కాజేస్తున్నారంటూ ఈనాడు వాపోతుంది!

..రహదారి విస్తరణకు ప్రభుత్వం భూమి తీసుకుంటే అందుకు నష్టపరిహారంగా ఇచ్చే టీడీఆర్ బాండ్లను భూ యజమానికి కాకుండా తనకే ఇవ్వాలంటూ రామోజీ కోర్టుకెక్కారు. ప్రశ్నించిన వారిపై పత్రికా స్వేచ్ఛపై దాడి చేస్తున్నారంటూ ఎదురుతిరిగారు. చివరకు న్యాయం గెలిచింది. ధర్మం నిలిచింది. రామోజీ ఓడారు.

10లో



అబద్ధాల గురువు.. బాబుకు దరువు

'సాక్షి' కేసుల్లో జగన్ వాయిదాలంటూ దిగజారి దుష్ప్రచారం

నిజానికి ఒక్కటీ మిస్ కాకుండా ప్రతిసారీ హాజరవుతున్న వైఎస్ జగన్ లాయర్లు

- ముఖ్యమంత్రి కావటంతో ప్రత్యక్ష హాజరు నుంచి ఆయనకు మినహాయింపు
- ఈ వాస్తవాలన్నీ తొక్కిపట్టి నైచ్యానికి పరాకాష్టగా 'ఈనాడు' కథనం
- కాంగ్రెస్‌లో ఉన్నంతకాలం ఏ కేసూ లేదు.. పార్టీని వీడటంతో కక్ష సాధింపు
- బాబు సన్నిహిత ఐటీ అధికారి ఇచ్చిన నోటీసుతో 'సాక్షి'పై కేసులు మొదలు
- పెట్టుబడులన్నింటినీ ఆదాయంగా పేర్కొంటూ అడ్డగోలుగా నోటీసు
- దాన్నే కోర్టుకు లేఖగా పంపిన కాంగ్రెస్ నేత శంకర్రావు
- జతకలిసిన టీడీపీ నేతలు ఎర్రన్నాయుడు, అశోక్ గజపతి
- సీబీఐ, ఈడీ దర్యాప్తులను కర్త, కర్మ, క్రియగా నడిపించిన ఎల్లో మీడియా
- చివరకు ఆధారాలేవీ లేక.. ఐటీ నోటీసులోని అంశాలే ప్రస్తావిస్తూ సీబీఐ చార్జిషీట్లు
- ఆ ఐటీ అధికారికి 'ఏపీ ఈడీబీ' సీఈఓగా కానుక ఇచ్చిన చంద్రబాబు
- సీబీఐ చార్జిషీట్లనే యథాతథంగా కాపీ చేసి దాఖలు చేసిన ఈడీ
- రెండేళ్ల కిందటే ఐటీ నోటీసులను కొట్టేసిన ఐటీ అప్పిలేట్ ట్రిబ్యునల్
- 'సాక్షి'లోకి వచ్చిన పెట్టుబడులన్నీ సక్రమమేనని తేల్చిచెప్పిన ట్రిబ్యునల్
- ఇవన్నీ వదిలి... రూ.10 షేరు రూ.350కి విక్రయించారని 'ఈనాడు' అరుపులు.. తన రూ.100 విలువైన షేరు ఏకంగా రూ.5,28,630 చొప్పున అమ్మిన 'ఈనాడు'

14లో

'సాక్షి' పెట్టుబడులు
సక్రమమే
2022 డిసెంబర్లో తీర్పునిచ్చిన ఐటీ అప్పిలేట్ ట్రిబ్యునల్.. షేర్ ప్రీమియాన్ని ఆదాయంగా పరిగణించలేం..
ఇన్వెస్ట్‌మెంట్ల విషయంలో నిబంధనలన్నీ పాటించారు.. జగతి సంస్థ పెట్టుబడి లావాదేవీలన్నీ చట్ట పరిధిలోనే జరిగాయి
14లో

ఫిరాయింపుదారుల అనర్హతకు వైఎస్సార్‌సీపీ
చర్యలు

నలుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీల విషయంలో పార్టీ సీరియస్
లెజిస్లేచర్ సెక్రటరీ జనరల్‌కు ఫిర్యాదు


లెజిస్లేచర్ సెక్రటరీ జనరల్ రామాచార్యులుకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

సాక్షి, అమరావతి: పార్టీ ఫిరాయించిన నలుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలపై వైఎస్సార్‌సీపీ అధిష్టానం సీరియస్ అయ్యింది. ఫిరాయింపు నిరోధక చట్టం ప్రకారం వారిపై అనర్హత వేటు వేయాలని రాష్ట్ర లెజిస్లేచర్ సెక్రటరీ జనరల్ పీపీకే రామాచార్యులుకు సోమవారం
మిగతా 5వ పేజీలో ▶

అంగన్‌వాడీల సమ్మెలో రాజకీయ ప్రమేయం



- సమయం మించిపోలేదు.. విరమించండి
- అంగన్‌వాడీల డిమాండ్లు అన్నీ పరిష్కరించాం
- వేతనాల పెంపునకు సమయం కాదు.. సమ్మెతో బాలింతలు, గర్భిణులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు
- అందుకే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం
- అడ్డుపడితే చర్యలు తప్పవు
- మున్సిపల్ ఉద్యోగులు కూడా సమ్మెపై పునరాలోచించాలి
- ప్రభుత్వ సలహాదారు సజ్జల

10లో

'బిల్కిస్' దోషులకు.. శిక్ష తగ్గింపు చెల్లదు

సుప్రీంకోర్టు సంచలన తీర్పు.. గుజరాత్ ప్రభుత్వ 'రెమిషన్' కొట్టివేత

- మతి లేని నిర్ణయమంటూ మండిపాటు.. దోషులతో గుజరాత్ సర్కారు కుమ్మక్కైంది
- తీవ్ర అధికార దుర్వినియోగానికి పాల్పడింది
- దోషులు సుప్రీంనే ఏమార్చారు.. వారిని 2 వారాల్లోగా జైలుకు పంపండి: ధర్మాసనం

10లో



“ ఈ రోజే నాకు నిజమైన న్యూ ఇయర్. దోషులందరినీ మళ్లీ జైలుకు పంపడం ద్వారా సుప్రీం కోర్టు నాకు న్యాయం చేసింది. రెమిషన్‌పై వాళ్లు బయట గడిపిన ఈ ఏడాదిన్నర కాలం నాకు నరకంగా గడిచింది. కోర్టు తీర్పుతో కొండంత భారం తొలగినట్టుగా ఉంది. ఆనందంతో నా పిల్లలను హత్తుకున్నా. దేశంలో న్యాయం అందరికీ సమానమేనని మరోసారి నిరూపించిన సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు. ఈ పోరాటంలో నా భర్త, పిల్లలు, మిత్రులతో పాటు దేశవ్యాప్తంగా వేలాదిమంది సామాన్యులు, మహిళలు నాకు తోడు నిలిచారు. లాయర్ శోభా గుప్తా నాకోసం 20 ఏళ్ల పాటు పట్టు వదలకుండా సుదీర్ఘంగా పోరాడింది. నాకు న్యాయం దక్కేలా చేసింది. వీళ్లందరికీ మనస్ఫూర్తిగా నా ధన్యవాదాలు. - సుప్రీంకోర్టు తీర్పుపై బిల్కిస్ బానో

ఎంపీ అభ్యర్థులు కావలెను

బరువైన సూట్‌కేసుతో వచ్చిన వారికే ప్రాధాన్యం

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో టీడీపీ దయనీయం
- గుంటూరు ఎంపీ బరి నుంచి తప్పుకున్న గల్లా జయదేవ్..
- మాకొద్దంటే మాకొద్దంటున్న ఆలపాటి, ధూళిపాళ్ల.. ఓ విద్యా సంస్థల చైర్మన్ సైతం వెనకడుగు
- నరసరావుపేట, బాపట్ల లోక్‌సభ స్థానాలకూ ఎవరికి వారు ససేమిరా
- రూ.వంద కోట్ల లోకేశ్ షరతుతో బెంబేలు.. ముందుకు రాని నేతలు
- దీంతో ఎన్నారైల కోసం పార్టీ అన్వేషణ



సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ పరిస్థితి పైన పటారం లోన లొటారం అన్నట్లుగా ఉంది. ఆ పార్టీ అధినేత చంద్రబాబువి అన్నీ ఢాంబికాలేనని క్షేత్రస్థాయి పరిస్థితులు చూస్తే తెలుస్తుంది. ఎందుకంటే.. రాజధాని ప్రాంతం, మాకు పట్టుందని చెప్పుకుంటున్న ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మూడు లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులు దొరక్క తెలుగుదేశం పార్టీ తలలు పట్టుకుంటోంది. గుంటూరు, నరసరావుపేట, బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గాల్లో పోటీచేయడానికి ఎవరూ
మిగతా 10వ పేజీలో ▶

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

వ్యవసాయం పండగైంది



నేను మా గ్రామంలో ఎనిమిది ఎకరాల పొలం కౌలుకు తీసుకుని వరి పంట పండిస్తున్నా. మాకు సొంతంగా 80 సెంట్ల భూమి ఉంది. గత చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో వ్యవసాయం భారమైపోయింది. ఒక దశలో వదిలేద్దామనుకున్నాను. అంతలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రావడంతో రైతుల దశ మారింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతును నెత్తిన పెట్టుకుని చూసుకుంటున్నారు. విత్తనం నుంచి విక్రయం వరకు అన్ని సమయాల్లో అండగా నిలుస్తున్న ప్రభుత్వం దేశంలో ఎక్కడైనా ఉందంటే అది మన రాష్ట్రంలోనే అని గర్వంగా చెప్పుకోవచ్చు. మాది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురం మండలం వెల్ల గ్రామం. ఇప్పటి వరకు రైతు భరోసా పథకం ద్వారా రూ.63,500, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా రూ.1,509, వైఎస్సార్ పంటల బీమా ద్వారా రూ.2,74,592, పంట నష్ట పరిహారం ద్వారా రూ.57,750 ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందింది. ఇంతగా సాయం పొందిన దాఖలాలు గతంలో ఎప్పుడూ లేవు. మా కుటుంబ జీవనం సాఫీగా సాగిపోతోంది.

– దునే వీర్రాఘవులు, వెల్ల
(నరాల రాధాకృష్ణ, విలేకరి, రామచంద్రాపురం రూరల్)

చదువుకు దిగుల్లేదిక



మా నాన్న హనుమంతు విఘ్నేశ్వరరావు షాపులో గుమస్తా. అమ్మ గృహిణి. మాది పశ్చిమగోదావరి జిల్లా భీమవరం. నేను, మా అన్నయ్య ప్రభుత్వం అందిస్తున్న సహాయంతోనే విద్యనభ్యసించగలుగుతున్నాం. నేను పదో తరగతిలో ఉండగా అమ్మ ఒడి పథకం ద్వారా లబ్ధి పొందాను. తర్వాత ఇంటర్మీడియట్ రెండేళ్లు అమ్మ ఒడి తీసుకున్నా. ప్రస్తుతం ఇంజనీరింగ్ (ఇఇఇ) మొదటి సంవత్సరం చదువుతున్నా. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా దీవెన (ఫీజు రీయింబర్స్‌మెంట్) కారణంగానే ఇది సాధ్యమైంది. మాలాంటి మధ్య తరగతి కుటుంబాలకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతోంది. నేను చదువుతున్న ఇంజనీరింగ్ కళాశాలలో ఏటా దాదాపు రూ.70 వేలకు పైగా ఫీజు చెల్లించాల్సి ఉండగా ఒక్క రూపాయి కూడా మాపై భారం పడటం లేదు. ఈ ప్రభుత్వం పుణ్యమా అని రాష్ట్రంలో విద్యా రంగం స్వరూపమే మారిపోయింది. పేద విద్యార్థుల ఉన్నత చదువుకు భరోసా లభిస్తోంది. స్కూల్ లెవెల్‌లో కూడా విప్లవాత్మక మార్పులు వచ్చాయి. మా లాంటి విద్యార్థుల చదువుకు దిగ్గుల్లేదు.

– హనుమంతు హరి, భీమవరం
(పీఎస్ సాయిబాబా, విలేకరి, భీమవరం)

నెరవేరిన దశాబ్దాల కల



మూడు దశాబ్దాల నుంచి ఏ ప్రభుత్వం మాకు ఇంటి స్థలం ఇవ్వలేదు. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం సంగాయగూడెంలోని రోడ్డు మార్జిన్‌లో 30 ఏళ్లుగా పూరి గుడిసెలో ఉండేవాళ్లం. రోజు వారీగా కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాం. ఇంటి స్థలం ఇప్పించాలని అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగాం. మా గోడు ఎవరూ పట్టించుకోలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో మా పేదోళ్ల గుడిసెలు పీకడానికి వచ్చిన అధికారులు, ప్రజాప్రతినిధులను అడ్డుకుని ప్రతిఘటించాం. అప్పట్లో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు మాకు అండగా నిలిచారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే ఇళ్ల స్థలాలు ఇచ్చి, గృహాలు మంజూరు చేస్తామని వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. ఆ హామీ ప్రకారం ఎవరి సిఫార్సులు లేకుండానే వలంటీర్ మా ఇంటికి వచ్చి వివరాలు నమోదు చేసుకుని వెళ్లారు. కొద్ది రోజుల్లోనే మాకు ఇంటి స్థలం, ఇల్లు మంజూరు చేశారు. ప్రస్తుతం ఇంటి నిర్మాణం పూర్తి కావచ్చింది. నాకు పింఛన్ రూ.3000 వస్తోంది. పెరిగిన పింఛన్‌తో ఎంతో ఊరట లభిస్తోంది.

– తమ్మినపూడి రత్నం, సంగాయగూడెం
(కాసాని వెంకటేశ్వర్లు, విలేకరి, దేవరపల్లి)

'ఆడుదాం ఆంధ్రా' తొలిదశ అదుర్స్

మొత్తం 37.35లక్షల మంది క్రీడా రిజిస్ట్రేషన్లు ఇలా			
క్రీడలు	పురుషులు	మహిళలు	మొత్తం
క్రికెట్	10.58	3.10	13.68
బ్యాడ్మింటన్	2.07	1.36	3.43
వాలీబాల్	5.26	2.45	7.71
కబడ్డీ	3.08	2.66	5.74
ఖోఖో	2.59	4.20	6.79

- సచివాలయ స్థాయిలో 1.68 లక్షల మ్యాచ్‌ల నిర్వహణ
- మండల స్థాయి పోటీలకు సిద్ధమవుతున్న జట్లు
- ఇప్పటికే 9 వేలకుపైగా సచివాలయాల్లో ముగిసిన వేడుకలు
- విజేతలకు 34.20 లక్షల టీషర్టులు, టోపీలు పంపిణీ
- 10వ తేదీ నుంచి మండల స్థాయి పోటీల నిర్వహణకు ప్రణాళిక
- ఇప్పటికే ప్రొఫెషనల్ స్పోర్ట్స్ కిట్ల తరలింపు పూర్తి



తొలి దశలో నిర్వహించిన మ్యాచ్‌ల సంఖ్య (మహిళలు, పురుషులు)	
క్రికెట్	40,856
బ్యాడ్మింటన్	58,424
వాలీబాల్	24,145
కబడ్డీ	25,751
ఖోఖో	19,635

సాక్షి, అమరావతి: దేశ చరిత్రలో మునుపెన్నడూ తలపెట్టని మెగా క్రీడాటోర్నీకి క్రీడాభిమానం వెల్లువెత్తుతోంది. రాష్ట్రంలోని క్రీడాకారుల్లో ప్రతిభకు 'ఆడుదాం ఆంధ్రా' అద్దం పడుతోంది. తొలి దశలో భాగంగా 15,004 గ్రామ/వార్డు సచివాలయాల (జీఎస్‌డబ్ల్యూఎస్) పరిధిలో క్రీడా పోటీలు దిగ్విజయంగా ముగిశాయి. ముందుగా ప్రకటించిన షెడ్యూల్‌కు (9వ తేదీ కంటే) ఒక రోజు ముందుగానే సచివాలయాల స్థాయిలో పోటీలు విజయవంతంగా పూర్తి చేశారు. 15 ఏళ్లకు పైబడిన మహిళలు, పురుషులు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడల్లో తమ సత్తా చాటారు. ఐదు క్రీడాంశాల్లో మొత్తం 1.68 లక్షల మ్యాచ్‌లను వంద శాతం సమర్థవంతంగా నిర్వహించారు.

రేపటి నుంచి మండల స్థాయి..

జనవరి 10వ తేదీ నుంచి మండలాలు, మున్సిపాల్టీలు కలిపి 753 మండల స్థాయి పోటీలు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. జీఎస్‌డబ్ల్యూఎస్ పరిధిలో 'పెర్ఫార్మెన్స్ టాలెంట్ హంట్' ఆధారంగా క్రీడాకారులతో మండల స్థాయి పోటీలకు జట్లు ఎంపిక చేశారు. వీరికి 10వ తేదీ నుంచి సంక్రాంతి లోగా పోటీలు పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. అనంతరం నియోజకవర్గ స్థాయి పోటీలకు వెళ్లే వారికి ప్రాక్టీస్‌కు ఎక్కువ సమయం ఇచ్చేలా శాప్ అధికారులు వేగంగా అడుగులు వేస్తున్నారు. వాస్తవానికి ఈనెల 10 నుంచి 23 వరకు మండల, జనవరి 24 నుంచి 30 వరకు నియోజకవర్గ స్థాయి, జనవరి 31 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు జిల్లా, ఫిబ్రవరి 6 నుంచి 10వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి పోటీలకు షెడ్యూల్ ఇచ్చారు. ప్రతి మండలంలో ఎంపిక చేసిన 2/3 క్రీడామైదానాల్లో సకల వసతుల మధ్య పోటీ నిర్వహించనున్నారు. జీఎస్‌డబ్ల్యూఎస్ స్థాయిలో విజేతల్లో ఉత్సాహాన్ని నింపేలా స్వాగత తోరణాలు, మస్కట్ లోగోలు, కామెంట్రీ, గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం 1.49 లక్షల మంది స్పోర్ట్స్ వలంటీర్లు స్కోరర్లుగా, అంపైర్లుగా సేవలందిస్తున్నారు.

విజేతలకు టీషర్టులు..

ఐదు క్రీడాంశాల్లో 9,478 క్రీడా ప్రాంగణాల్లో డిసెంబర్ 26వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు జరిగిన పోటీలు వీక్షించేందుకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి క్రీడాకారులకు మద్దతుగా నిలిచారు. జీఎస్‌డబ్ల్యూఎస్ దశలో మొత్తం 3.30 లక్షల జట్లను ఎంపిక చేశారు. ఇందులో 2.08 లక్షలు పురుషులు, 1.22 లక్షల మహిళల జట్లు ఉన్నాయి. వీరితో సమానంగా 14 రోజుల పాటు ఏకంగా 34.04 లక్షలకుపైగా వీక్షకులు పోటీలను ప్రత్యక్షంగా తిలకించారు. జీఎస్‌డబ్ల్యూఎస్ పరిధిలో పోటీలు ముగించుకుని మండల స్థాయి వేదికపై ప్రతిభ చాటేందుకు వెళ్లే జట్లకు సంబంధించి 34.20 లక్షల ప్రొఫెషనల్ టీషర్టులు, టోపీలను అందజేస్తున్నారు. ఇప్పటికే 15,004 గాను 9వేలకుపైగా సచివాలయాల్లో ముగింపు వేడుకలను నిర్వహించగా మంగళవారం (నేడు) మిగిలిన వాటిల్లో గెలుపొందిన జట్లకు టీషర్టులను బహూకరించనున్నారు. అనంతరం నియోజకవర్గ స్థాయి పోటీలకు ప్రొఫెషనల్ స్పోర్ట్స్ కిట్లను అందించనున్నారు. ఇప్పటికే వాటి తరలింపు పూర్తి చేశారు.

ఆన్‌లైన్‌లోనే మ్యాచ్‌ల డ్రా

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు తొలి దశలో సమర్థవంతంగా నిర్వహించాం. 10వ తేదీ నుంచి మండల స్థాయి పోటీలకు సన్నద్ధమవుతున్నాం. గ్రామ/వార్డు సచివాలయ స్థాయిలో పోటీలు అనంతరం తుది జట్లను ఎంపిక పూర్తి చేస్తున్నాం. మండల స్థాయిలో తలపడే జట్లకు ఆన్‌లైన్‌లోనే డ్రా నిర్వహిస్తున్నాం. ఈ దశ పోటీలను సమీపంలోని పెద్ద మైదానాలు, స్టేడియాల్లో నిర్వహించేలా ఆదేశించాం. ఇక్కడ ప్రతి క్రీడాకారుడు ఆడుదాం ఆంధ్రా జెర్సీలు, టోపీలు ధరించి పోటీల్లో పాల్గొంటారు. వీటిని అన్ని సచివాలయాలకు తరలించాం. నేటితో అక్కడ ముగింపు వేడుకలు నిర్వహించి టీషర్టులను అందజేస్తారు.

– ధ్యాన్‌చంద్ర, ఎండీ, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ

నాడు



అల్లూరి సీతారామరాజు జిల్లాలో అధ్వానంగా హుకుంపేట మండలం బాకూరు ఘాట్‌రోడ్డు

ఇదీ మార్పు

నేడు



అల్లూరి సీతారామరాజు జిల్లాలో హుకుంపేట మండలం బాకూరు ఘాట్‌రోడ్డు

రహదారి రయ్.. రయ్..

నాడు

- ✔ రాష్ట్రవ్యాప్తంగా రహదార్లు పూర్తిగా నిర్లక్ష్యం
- ✔ మరమ్మతుల నిర్వహణను ఏమాత్రం పట్టించుకోని వైనం
- ✔ రోడ్ల పునరుద్ధరణకు 2017–18లో తీసుకున్న రూ.3 వేల కోట్ల రుణం 'పసుపు–కుంకుమ' పథకానికి మళ్లింపు
- ✔ 2019 నాటికి రాష్ట్రంలో పూర్తిగా దెబ్బతిన్న రోడ్లు
- ✔ అప్పుడు భారీ వర్షాలు, మహమ్మారి కోవిడ్ లేదు
- ✔ ఐదేళ్లలో రోడ్ల నిర్మాణానికి వెచ్చించిన నిధులు రూ.2,953.81 కోట్లు
- ✔ ఈ లెక్కన ఏడాదికి సగటున రూ.591 కోట్లు
- ✔ రాష్ట్ర, జిల్లా ప్రధాన రహదారుల పునరుద్ధరణకు వెచ్చించిన నిధులు రూ.4,325 కోట్లే
- ✔ పంచాయతీరాజ్ రోడ్ల కోసం రూ.3,160.38 కోట్లు మాత్రమే.
- ✔ ఇతరత్రా కలిపి మొత్తంగా 2014 నుంచి 2019 వరకు రోడ్లకు వెచ్చించిన నిధులు రూ.23,792.19 కోట్లు

నేడు

- ✔ వరుసగా రెండేళ్లు భారీ వర్షాలు, కోవిడ్ ప్రతికూల పరిస్థితులు ఎదురైనా రోడ్ల పునరుద్ధరణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు
- ✔ ప్రాధాన్యతా క్రమంలో రహదారుల నిర్మాణం
- ✔ ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని రహదారులకు మోక్షం
- ✔ గ్రామీణ ప్రాంతాల రహదారుల నిర్మాణానికి సత్వర చర్యలు
- ✔ రోడ్ల మరమ్మతులకు రూ.4,148.59 కోట్లు
- ✔ రాష్ట్ర రహదారులు, జిల్లా ప్రధాన రహదారుల నిర్మాణానికి రూ. 7,340 కోట్లు
- ✔ పంచాయతిరాజ్ రోడ్ల నిర్మాణానికి రూ. 5,443.69 కోట్లు
- ✔ జాతీయ రహదారుల నిర్మాణానికి రూ. 25,304 కోట్లు
- ✔ మొత్తంగా నాలుగున్నరేళ్లలో వెచ్చించిన మొత్తం రూ.42,236.28 కోట్లు
- ✔ మొత్తంగా రోడ్ల నిర్మాణం 7,600 కిలోమీటర్లు

– సాక్షి, అమరావతి

నేడు, రేపు కేంద్ర ఎన్నికల సంఘం పర్యటన

ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించనున్న కేంద్ర ఎన్నికల కమిషనర్లు



ఎయిర్‌పోర్ట్ నుంచి బయటకు వస్తున్న చీఫ్ ఎలక్షన్ కమిషనర్ బృందం

సాక్షి, అమరావతి : రానున్న సాధారణ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా సవరణ, సన్నద్ధత వంటి అంశాలను పరిశీలించి తగు సూచనలు ఇవ్వడానికి కేంద్ర ఎన్నికల సంఘం బృందం మంగళవారం నుంచి రెండ్రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించనుంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్, కమిషనర్లు అనూప్‌చంద్ర పాండే, అరుణ్ గోయల్‌తో కూడిన ఉన్నతాధికారుల బృందం మంగళవారం, బుధవారం సమీక్షించడానికి సోమవారం రాత్రికే విజయవాడ చేరుకున్నారు. జనవరి 9వ తేదీ ఉ.10 గంటల నుంచి 12 గంటల వరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరుగుతుందని, మధ్యాహ్నం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు ఆయా జిల్లాలకు సంబంధించి ఎస్ఎస్ఆర్–2024 కార్యకలాపాలు, ఎన్నికల సన్నద్ధత ప్రణాళికను సమీక్షించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (ఎస్ఈసీ) ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. ఓటర్ల జాబితాలో ఎటువంటి గందరగోళం లేకుండా పారదర్శకంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, వివిధ రాజకీయ పార్టీల నుంచి వచ్చిన 5.64 లక్షల పేర్లను అనర్హులుగా తేల్చినట్లు ఆయన తెలిపారు. అలాగే, రాష్ట్రంలో ఎన్నికల సన్నద్ధత కోసం తీసుకున్న చర్యలను జనవరి 10న ఉ.9.30 నుంచి 11 గంటల వరకు స్టేట్ పోలీస్ నోడల్ ఆఫీసర్‌తో కలిసి కేంద్ర ఎన్నికల అధికారులకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం.. కేంద్ర, రాష్ట్రాలకు చెందిన వివిధ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలకు చెందిన అధికారులతో సమావేశం ఉంటుందని.. అలాగే, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, వివిధ శాఖల కార్యదర్శులతో ఈసీఐ ఉన్నతాధికారులు సమావేశమవుతారన్నారు. ఆ తర్వాత.. సమావేశ వివరాలను కేంద్ర ఎన్నికల సంఘ అధికారులు 10వ తేదీ సా.4.30కు మీడియాకు వివరిస్తారని ముఖేష్‌కుమార్ మీనా అన్నారు.

సమావేశాలకు ఏర్పాట్లు పూర్తి..

ఇక ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ–2024, ఎన్నికల సన్నద్ధత కార్యకలాపాలపై విజయవాడలో ఈనెల 9, 10 తేదీల్లో ఈసీఐ ఉన్నతస్థాయి సమావేశాలు జరగనున్నాయని.. విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు తెలిపారు. ఏర్పాట్లను పరిశీలించేందుకు ముఖేష్‌కుమార్ మీనాతో కలిసి కలెక్టర్ ఢిల్లీరావు విజయవాడ నోవాటెల్ కాన్ఫరెన్స్ హాల్‌ను పరిశీలించారు.

విజయవాడ చేరుకున్న సీఈసీ బృందం

గన్నవరం: కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్‌కుమార్ నేతృత్వంలోని బృందానికి సోమవారం గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. రానున్న సార్వత్రిక ఎన్నికల సన్నద్ధతపై విజయవాడలో జరగనున్న సమీక్ష సమావేశాల నిమిత్తం రాజీవ్‌కుమార్‌తో పాటు ఎలక్షన్ కమిషనర్లు అనూప్‌చంద్ర పాండే, అరుణ్ గోయల్ ఢిల్లీ నుండి రాత్రి ఇక్కడికి చేరుకున్నారు. విమానాశ్రయంలో వీరికి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా, కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్పీ పి. జాషువా, ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి. సంపత్‌కుమార్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్వాగతం పలికారు. అనంతరం వీరు విజయవాడ నోవాటెల్ హోటల్‌కు వెళ్లారు. విజయవాడలో వీరికి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు, కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, సబ్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్‌ఓ నాగేశ్వరరావు ఘనస్వాగతం పలికారు.

బద్వేల్‌లో బడుగుల సాధికార పండుగ

- ఘనంగా వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర
- వేలాదిగా తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు
- 'జగనే రావాలి.. మళ్లీ జగనే కావాలి' అంటూ నినాదాలు



నియోజకవర్గ స్థాయిలో బద్వేలులో నిర్వహించిన సాధికార యాత్రకు తరలి వచ్చిన అశేష జనవాహిని

సాక్షి ప్రతినిధి, కడప: వైఎస్సార్ జిల్లా బద్వేల్‌లో బడుగు, బలహీన వర్గాల ప్రజలు సాధికార ఉత్సవం నిర్వహించాయి. సీఎం వైఎస్ జగన్ అందించిన చేయూతతో ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా సాధించిన అభివృద్ధిని తెలియజేస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు వైఎస్సార్‌సీపీ సోమవారం ఇక్కడ నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రలో వేలాదిగా పాల్గొన్నారు. యువత కేరింతలు, బాణసంచా, వాయిద్యాలు, జానపద నృత్యాలతో యాత్ర పండుగలా సాగింది. ఆర్థికంగా చేయూతనిచ్చి, రాజకీయ, సామాజిక ప్రాధాన్యతనిచ్చి, ఉద్యోగావకాశాలు కల్పించిన సీఎం వైఎస్ జగన్‌కు అండగా ఉంటామని బడుగు, బలహీన వర్గాలు నినదించాయి. ర్యాలీకి స్థానిక ప్రజలు అడుగడుగునా హారతులు పట్టారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం జరిగిన సభకు ర్యాలీలో పాల్గొన్న వారితో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి కూడా ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సభలో నాయకులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు, ఇతర వర్గాలకు చేస్తున్న మేలును వివరించారు. ప్రజలు పెద్ద ఎత్తున కరతాళ ధ్వనులతో హర్షధ్వానాలు చేశారు. 'జగనే రావాలి.. మళ్లీ జగనే కావాలి' అంటూ సభ ఆద్యంతం నినాదాలు చేస్తూనే ఉన్నారు. బద్వేల్ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపిన సీఎం వైఎస్ జగన్‌తోనే నడుస్తామని నేతలు, ప్రజలు మూకుమ్మడిగా ప్రకటించారు.

పేదలకు మరింత సంక్షేమం : డిప్యూటీ సీఎం నారాయణస్వామి

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థాయిని పెంచిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి చెప్పారు. సీఎం జగన్ చేసిన మేలుతో మన కుటుంబాలు బాగుపడ్డాయన్నారు. చంద్రబాబు హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను చాలా చులకనగా చూశారని, హేళన చేసే వారని అన్నారు. కూలివాడి కొడుకు కూలీగానే ఉండాలని ఆలోచించేవాడు చంద్రబాబు అయితే, కూలివాడి కొడుకు కలెక్టర్ కావాలని ఆలోచించి, అందుకు ఏమి చేయాలో అదంతా చేసే వ్యక్తి సీఎం జగన్ అని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.

బీసీ సీఎంలు కూడా సాహసించలేదు: కడప మేయర్ సురేష్‌బాబు

దేశంలో ఎంతో మంది బీసీ ముఖ్యమంత్రులు ఉన్నప్పటికీ, ఎవరూ పాటించని సామాజిక న్యాయాన్ని సీఎం వైఎస్ జగన్ మాత్రమే చేతల్లో చూపించారని కడప మేయర్ సురేష్ బాబు అన్నారు. అన్ని సామాజిక వర్గాలకు పెద్దపీట వేశారన్నారు. జగన్ సీఎం అయ్యాక బ్రహ్మంసాగర్‌కు రూ.600 కోట్లు మంజూరు చేసి నీటి నిల్వ సామర్థ్యాన్ని 17 టీఎంసీలకు పెంచారని తెలిపారు. కలసపాడు, పోరుమామిళ్ల, బి.మఠం మండలాల్లో వేలాది ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నారన్నారు.



సంఘీభావం ప్రకటిస్తున్న నేతలు

ఆడపడుచులకు దేవుడిచ్చిన అన్నయ్య సీఎం జగన్ : మాజీ ఎంపీ బుట్టా రేణుక

సీఎం వైఎస్ జగన్ పేదింటి ఆడపడుచులకు దేవుడిచ్చిన అన్నయ్య అని మాజీ ఎంపీ బుట్టా రేణుక చెప్పారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో వివిధ పథకాల ద్వారా నేరుగా బ్యాంకు ఖాతాలకు నగదును జమ చేస్తున్నారని తెలిపారు.

బద్వేలులో రూ.1268.72 కోట్లు : ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

బద్వేలు నియోజకవర్గంలో సంక్షేమ పథకాల ద్వారా సీఎం జగన్ 1,38,763 మందికి రూ.1268.73 కోట్లు నగదు బదిలీ చేశారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి చెప్పారు. ఇందులో 88,214 మంది ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ లకు రూ.782.72 కోట్లు ఇచ్చారన్నారు. ఈ సంక్షేమం కొనసాగాలంటే జగన్‌ను మరోసారి సీఎంను చేయాలని పిలుపునిచ్చారు. సీఎం జగన్ గోపవరం వద్ద రూ.1000 కోట్లతో సెంచరీ ప్లైబోర్డ్స్ పరిశ్రమ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తున్నారని ఎమ్మెల్యే సుధ చెప్పారు. ఎమ్మెల్సీలు ఇషాక్, రమేష్ యాదవ్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ అమర్‌నాథరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా...

బాబువి సిగ్గులేని రాజకీయాలు

మంత్రి కారుమూరి ధ్వజం



ఇరగవరం: రాష్ట్రంలో ప్రజలకు సీఎం వైఎస్ జగన్ మంచి చేస్తుంటే చంద్రబాబు చూస్తూ ఓర్వలేకపోతున్నారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని స్పష్టంచేశారు. చంద్రబాబు సిగ్గు.. ఎగ్గు లేకుండా రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. సోమవారం పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం మండలం రేలంగిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆదివారం జరిగిన చంద్రబాబు సభకు ప్రజాస్పందన కరువైందని చెప్పారు. ఎన్నికలు ముగిసిన తర్వాత రాష్ట్రంలో సొంతిల్లులేని చంద్రబాబు, లోకేశ్, పవన్‌ను హైదరాబాద్‌లోని సొంతిళ్లల్లోకి రావాలని రా.. కదిలిరా.. అని పిలుస్తారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు చరిత్ర అందరికీ తెలుసని, ఎంత గ్యాస్ కొట్టుకున్నా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు.

మళ్లీ జగన్‌దే గెలుపు

- ఆచంట సభలో చంద్రబాబు వ్యాఖ్యలు దారుణం
- మాజీ మంత్రి చెరుకువాడ



పెనుగొండ: చంద్రబాబు ఎన్ని కుట్రలు చేసి, ఎంతమందితో పొత్తు పెట్టుకున్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ గెలవడం ఖాయమని ఆచంట ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆచంటలో నిర్వహించిన తెలుగుదేశం రా.. కదలిరా సభలో సీఎం జగన్‌పైనా, మంత్రులపైనా, ఎమ్మెల్యేలపైనా చంద్రబాబు విమర్శలు చేయడంపై మండిపడ్డారు. తూర్పుపాలెంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ కనీస గౌరవం లేకుండా ముఖ్యమంత్రి, మంత్రులను, ఎమ్మెల్యేలను వ్యక్తిగతంగా కించపరచడం, విమర్శలు చేయడం చంద్రబాబు స్థాయికి తగదన్నారు. సంక్షేమ పథకాలపై నిన్న మొన్నటి వరకూ విమర్శలు చేసిన చంద్రబాబు.. నేడు సంక్షేమ పథకాలను అమలు చేస్తానంటూ ప్రజలను మభ్య పెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. బాబును నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు.

వైఎస్సార్‌సీపీకి 175 సీట్లు ఖాయం

ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసులరెడ్డి



సాక్షి, అమరావతి: రానున్న ఎన్నికల్లో 175కు 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించటం ఖాయమని పల్నాడు జిల్లా నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసులరెడ్డి ధీమా వ్యక్తంచేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్ద సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు ధ్వంసం చేసిన రాష్ట్రాన్ని నాలుగున్నరేళ్లగా సీఎం వైఎస్ జగన్ సుపరిపాలనతో అన్ని రంగాల్లో ప్రగతిపథంలో నిలిపారన్నారు. మంచి చేసిన సీఎం జగన్‌కు ప్రజలు అండగా నిలుస్తున్నారన్నారు. గత ఎన్నికల కంటే మరింత మెరుగైన ఫలితాల కోసమే సీట్ల కేటాయింపుల్లో మార్పులు చేర్పులు చోటుచేసుకుంటున్నాయని గోపిరెడ్డి వివరించారు. సీఎం జగన్ నిర్ణయానికి వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు కట్టుబడి ఉంటారని, ఎక్కడైనా చిన్నచిన్న అసంతృప్తులు ఉంటే సర్దుకుంటాయన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావాలని అభిమాని పాదయాత్ర



పాదయాత్రలో బసవరావు

పెళ్లకూరు(తిరుపతి జిల్లా): సీఎం వైఎస్ జగన్ రాబోయే ఎన్నికల్లో 175కి 175 స్థానాలను గెలిచి మళ్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాలని కోరుతూ ఆయన అభిమాని కట్టెపోగు బసవరావు చేపట్టిన పాదయాత్ర సోమవారం చిత్తూరు జిల్లా పెళ్లకూరు చేరుకుంది. బసవరావు నవంబర్ 17న ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద నుంచి పాదయాత్ర ప్రారంభించారు. సుమారు వంద రోజుల పాటు 900 కి.మీ. మేర నడిచి ఇచ్ఛాపురం చేరుకోనున్నారు.

టీడీపీ సీనియర్ నేత పోతిరెడ్డి రాజీనామా



బనగానపల్లె: బనగానపల్లె నియోజకవర్గంలోని కొలిమిగుండ్ల మండలం బెలుం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దనరెడ్డితో పాటు ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలినట్లయింది. ఆయన సోమవారం బనగానపల్లె సమీపంలోని బేతంచర్ల రోడ్డులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేశానన్నారు. కొంత కాలంగా మాజీ ఎమ్మెల్యే బీసీ సొంత బంధువును అయినప్పటికీ తనను పార్టీకి దూరంగా ఉంచి అవమానిస్తున్నాడన్నారు. తాను ఏ పార్టీలో చేరేది త్వరలోనే నిర్ణయం తీసుకుంటానని చెప్పారు.

అసంతృప్తి 'కన్నా'లెన్నో!

కన్నా లక్ష్మీనారాయణకు కలిసిరాని సత్తెనపల్లి.. టీడీపీ అధిష్టానం సూచనతో అయిష్టంగానే అక్కడికి..

- సహకరించని తెలుగు తమ్ముళ్లు
- మూడు గ్రూపులుగా విడిపోయిన పార్టీ
- ఇంటింటికీ రెబల్ కోడెల శివరాం
- టీడీపీకి వ్యతిరేకంగా కాపులను ఏకం చేస్తున్న జనసేన ఇన్‌చార్జి
- గుంటూరు వెస్ట్‌కు వెళ్లిపోతానని అధిష్టానంతో కన్నా మొర



సాక్షి, నరసరావుపేట: ఎన్నో ఆశలతో రాజకీయ బద్ధశత్రువు, టీడీపీ అధినేత చంద్రబాబు చెంత చేరిన మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సీనియర్ నేత. పలువురు ముఖ్యమంత్రుల వద్ద మంత్రిగా పనిచేశారు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగానూ చేశారు. వంగవీటి రంగా తర్వాత కాపు సామాజికవర్గంలో తానే కీలక నేతనని ఆయన భావిస్తుంటారు. అలాంటి కన్నా... వంగవీటి రంగా హత్యకు కారణమైన టీడీపీలో చేరడంతో రాజకీయంగా ఆత్మహత్యకు పాల్పడ్డారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. చంద్రబాబు పంచన చేరిన తర్వాత కన్నాకు పార్టీలో అనుకున్నంత ప్రాధాన్యం లభించడం లేదు. తనకు గుంటూరు వెస్ట్ అసెంబ్లీ స్థానం కేటాయించాలని ఆయన కోరినా బాబు వినకుండా సత్తెనపల్లికి పంపారు. అక్కడ అప్పటికే పార్టీ క్యాడర్ మూడు గ్రూపులుగా విడిపోయి ఉంది. కోడెల శివరాం, వైవీ ఆంజనేయులు, అబ్బూరి మల్లి వర్గాలు పరస్పరం కత్తులు నూరుతున్నాయి. ఇందులో అబ్బూరి మల్లి కొంత కన్నాకు సహకరిస్తున్నా, వైవీ ఆంజనేయులు పార్టీ కార్యక్రమాల్లో అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్నారు. మరోవైపు కోడెల శివరాం పల్లె నిద్ర పేరిట ఇంటింటికీ తిరుగుతున్నారు. శివరాంను నిలువరించే యత్నం టీడీపీ అధిష్టానం చేయడం లేదని కన్నా తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్టు తెలుస్తోంది. తనకే టీడీపీ టికెట్ ఇస్తుందని, ఒకవేళ ఇవ్వని పక్షంలో కోడెల శివప్రసాదరావు ఆశయ సాధన కోసం స్వతంత్ర అభ్యర్థిగా అయినా పోటీ చేస్తానని శివరాం నిత్యం ఏదో ఒక కార్యక్రమం చేపడుతుండటం గమనార్హం.

కన్నాకు వ్యతిరేకంగా కాపులను ఏకం చేస్తున్న 'బొర్రా'

కాపు సామాజికవర్గం బలంగా ఉన్న సత్తెనపల్లి నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయిస్తారని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. పవన్ కళ్యాణ్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారని, జనసేనకే ఇక్కడ పొత్తులో సీటు ఖరారవుతుందని చెబుతున్నారు. ఆ పార్టీ ఇన్‌చార్జి బొర్రా వెంకట అప్పారావుకు గానీ, మరో నేత బోనబోయిన శ్రీనివాస్ యాదవ్‌కు గానీ అవకాశం రావచ్చనే చర్చ జరుగుతోంది. ఇదిలా ఉంటే కన్నా లక్ష్మీనారాయణ జనసేన నేత బోనబోయిన శ్రీనివాస్ యాదవ్‌తో మాత్రమే సన్నిహితంగా ఉంటున్నారు. బొర్రా అప్పారావును దూరం పెడుతున్నారు. దీంతో ఆర్థిక, అంగబలం ఉన్న బొర్రా అప్పారావు నియోజకవర్గంలోని కాపు నేతలను ఏకం చేసి జనసేన వైపు ఉండేలా చూస్తున్నారు. జనసేనకు టికెట్ ఇస్తేనే ఈ నియోజకవర్గంలో కాపులకు ప్రాధాన్యం ఉంటుందని, టీడీపీ తరఫున కన్నా గెలిచినా పెత్తనం ఓ సామాజిక వర్గం చేతుల్లోనే ఉంటుందని ప్రచారం చేస్తున్నారు. జనసేనతోపాటు టీడీపీలోని గ్రూపులు కన్నాకు వ్యతిరేకంగా పనిచేసేలా ప్రణాళికలు రచిస్తున్నాయి. దీంతో తనకు గుంటూరు వెస్ట్ నుంచి పోటీ చేసే అవకాశం ఇవ్వాలని చంద్రబాబును కన్నా కోరుతున్నట్టు సమాచారం. దీనిపై పార్టీ నుంచి ఎలాంటి సంకేతాలూ లేకపోవడంతో ఆయన అసంతృప్తితో ఉన్నారని తెలుస్తోంది. పైగా కాపు సామాజికవర్గంలో బలమైన నేతనైనా తనకన్నా పవన్ కళ్యాణ్‌కే పార్టీ అధిష్టానం అధిక ప్రాధాన్యం ఇస్తుండడం ఆయనకు రుచించడం లేదని సమాచారం. టీడీపీలో చేరి తప్పు చేశారనే భావన కన్నా వర్గాల్లో వ్యక్తమవుతున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో టీడీపీ కూడా సత్తెనపల్లి సీటును జనసేనకు కేటాయించేందుకే సుముఖంగా ఉందని గుసగుసలు వినిపిస్తున్నాయి. కాగా, సత్తెనపల్లి నియోజకవర్గంలో గత నాలుగున్నరేళ్లుగా చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో వైఎస్సార్ సీపీ ప్రజల మన్ననలు పొందింది. టీడీపీ, జనసేన పార్టీలలో ఎవరు పోటీలో ఉన్నా.. గెలుపు ఖాయమనే ధీమా వైఎస్సార్‌సీపీలో వ్యక్తమవుతోంది.

సీఎం అంశంపై టీడీపీ, జనసేన మధ్య

బయటపడ్డ విభేదాలు

- చంద్రబాబు సీఎం అని ఎలా ప్రకటిస్తారని నిలదీసిన జనసేన నేతలు
- పవన్ కళ్యాణ్ సీఎం కావాలని పార్టీ శ్రేణులు కోరుకుంటున్నారని వెల్లడి
- చంద్రబాబు పాలనలో చాలా తప్పులు జరిగాయని విమర్శ



టీడీపీ నాయకులపై విమర్శలు చేస్తున్న జనసేన నేత బాలసుబ్రహ్మణ్యం

ఒంగోలు టౌన్: అంగన్‌వాడీ కార్యకర్తల సాక్షిగా టీడీపీ, జనసేన నేతల మధ్య విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. చంద్రబాబు సీఎం అయ్యాక అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం అవుతాయని టీడీపీ నేతలు పేర్కొనగా.. జనసేన నాయకులు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. టీడీపీ నాయకులు ముందుగానే చంద్రబాబు సీఎం అని ప్రకటించడాన్ని తప్పుబట్టారు. పవన్‌కళ్యాణ్ ముఖ్యమంత్రి కావాలని జనసేన నాయకులు, కార్యకర్తలు కోరుకుంటున్నారని స్పష్టంచేశారు. ఈ ఘటన ప్రకాశం జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఒంగోలులోని కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలకు మద్దతు తెలిపేందుకు టీడీపీ ఒంగోలు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ సోమవారం దీక్షా శిబిరం వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా బాలాజీ ప్రసంగిస్తూ.. రానున్న ఎన్నికల తరువాత చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమని, అంగన్‌వాడీల సమస్యలను ఆయన దృష్టికి తీసుకుని వెళతానని చెప్పారు.

చంద్రబాబే ముఖ్యమంత్రి అని ఎలా చెబుతారు?

ఆ తరువాత జనసేన నాయకుడు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎన్నికల తరువాత చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బాలాజీ చెప్పడాన్ని తప్పుపట్టారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని ఇప్పుడే ఎలా చెబుతారని, ఎన్నికల తరువాత కూటమిలో ఏ పార్టీకి ఎక్కువ సీట్లు వస్తే వారే ముఖ్యమంత్రి అవుతారని స్పష్టంచేశారు. 2014లో పవన్ కళ్యాణ్ మద్దతుతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు చాలా తప్పులు చేశారని, ఇప్పుడు కూడా ఆయన అలాగే తప్పులు చేస్తే పవన్ కళ్యాణ్ సహించరని హెచ్చరించారు. కాగా.. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈదర అన్నపూర్ణమ్మ కూడా నూకసాని బాలాజీ వ్యాఖ్యలపై గట్టి కౌంటర్ ఇచ్చారు. అంగన్‌వాడీలకు ఎంత జీతం ఇస్తారో అంకెలతో సహా టీడీపీ మేనిఫెస్టోలో పేర్కొనాలని డిమాండ్ చేశారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అంగన్‌వాడీ కార్యకర్తలను గుర్రాలతో తొక్కించడం తాము మరిచిపోలేదని కొందరు అంగన్‌వాడీలు చెప్పుకోవడం కనిపించింది.


జనసేనలో ఆధిపత్య పోరు

ఇదే సందర్భంలో జనసేన పార్టీలో ఆధిపత్య పోరు మరోసారి బయటపడింది. అంగన్‌వాడీలకు మద్దతు ఇవ్వడానికి వచ్చిన జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ మధ్య పోరు మరోసారి రచ్చకెక్కింది. తొలుత జనసేన తరఫున ప్రసంగించడానికి అరుణకు మైకు ఇచ్చారు. అయితే.. ఆమె నుంచి మైకు లాక్కుని రియాజ్‌ను ప్రసంగించాల్సిందిగా కొందరు కార్యకర్తలు కోరారు. రియాజ్ ప్రసంగించిన తరువాత తన అనుచరులతో కలిసి వెళ్లిపోయారు. కాగా.. ఇటీవల ఒంగోలు గద్దలగుంటలో జరిగిన కార్యక్రమంలోనూ రియాజ్, అరుణ వర్గాల మధ్య వివాదం జరిగింది.

సంక్షేమ సారథి వైఎస్ జగన్‌ను

మళ్లీ సీఎంను చేసుకుందాం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి



సాక్షి,అమరావతి: ప్రజా సంక్షేమమే పరమావధిగా నాలుగున్నరేళ్ల కాలంలో విప్లవాత్మకమైన సంస్కరణను తెచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత, పార్టీ దక్షిణ కోస్తా జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ వేణుంబాక విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. తాడేపల్లి పార్టీ కార్యాలయంలో సోమవారం నరసరావుపేట నియోజకవర్గ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో ద్వితీయ, తృతీయ స్థాయి నాయకుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో సమస్యలను స్థానిక ఎమ్మెల్యేతో సమన్వయం చేసుకుని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఏవైనా సమస్యలు పరిష్కారం కాకుంటే తన దృష్టికి తేవాలని, సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తానని, లేకుంటే సీఎం కార్యాలయం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. నరసరావుపేట నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ 2014, 2019 లో గెలిచిన విధంగానే మరోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించి హ్యాట్రిక్ సాధించాలన్నారు. ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా ప్రతి కుటుంబం సంతోషమే ధ్యేయంగా రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్ పని చేస్తున్నారని చెప్పారు. జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు డీబీటీ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసిన సొమ్ము అక్షరాలా రూ.2.41 లక్షల కోట్లుగా వివరించారు. స్థానిక ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు గజ్జల బ్రహ్మారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, హానిఫ్ పాల్గొన్నారు.

ఎంపీ సీటు రూ.150 కోట్లకు అమ్ముకున్న చంద్రబాబు

- గుడివాడలో రూ.100 కోట్లు ఇచ్చినోడికి టికెట్
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కొడాలి నాని ఫైర్
- కేసీఆర్‌కు శస్త్రచికిత్స జరిగింది కాబట్టి జగన్ వెళ్లి పరామర్శించారు
- రేవంత్‌రెడ్డిని పరామర్శించడానికి ఆయనకు ఏమీ విరగలేదు కదా!



సాక్షి, అమరావతి: చంద్రబాబునాయుడు సీట్లు అమ్ముకుంటున్నారని, రూ. 150 కోట్లకు ఎంపీ సీటు కేశినేని చిన్నికి అమ్మారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) చెప్పారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ కోసం అహర్నిశలు పనిచేసిన కేశినేని నానిని చంద్రబాబు మోసం చేశారని విమర్శించారు. గుడివాడలో కూడా రూ.100 కోట్లు ఇచ్చినోడికి సీటిచ్చారని తెలిపారు. రాజ్యసభ, ఎమ్మెల్సీ సీట్లు కూడా చంద్రబాబు అమ్ముకుంటారని మండిపడ్డారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

రేవంత్‌ను కలవాల్సిన అవసరం ఏముంది?

తెలంగాణలో మేం ఏ పార్టీకి మద్దతు తెలపలేదు. ఆ రాష్ట్ర సీఎం గురించి ఇక్కడ చర్చ అనవసరం. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ తరఫున ఎన్నికైన సీఎం. ఆయనది ఏమైనా ప్రాంతీయ పార్టీనా? ఆయన ఏమైనా సుప్రీమా? ఆయనకు ఏందీ ఫోన్ చేసేది. రేవంత్ ముఖ్యమంత్రి అయినందుకు సీఎం వైఎస్ జగన్ కంగ్రాట్స్ చెబుతూ ట్వీట్ చేశారు. చంద్రబాబు అయితే ఎవరు సీఎం అవుతారా అని చూస్తుంటారు. రేవంత్‌రెడ్డిని సీఎం జగన్ ప్రత్యేకంగా ఎందుకు కలుస్తారు. తుంటి ఎముక విరిగినందుకు మాజీ సీఎం కేసీఆర్‌ను సీఎం జగన్ పరామర్శించారు. రేవంత్‌ను పరామర్శించడానికి ఆయనకు తుంటి ఎముక విరగలేదు కదా?. ఏపీలో సీట్లు ఎవరికి ఇవ్వాలో కాంగ్రెస్ అధిష్టానం చూసుకుంటుంది. రేవంత్ చెప్తే ఇక్కడ సీట్లు ఇవ్వరు. ఇక్కడికి వచ్చి రాజకీయం చేయాలి అనుకుంటే తెలంగాణలో సీఎం పదవికి రాజీనామా చేసి ఏపీలో పోటీ చేయాలి. ఆయనే ఆంధ్రాలో పీసీసీ అధ్యక్షుడు అయినా మాకేం అభ్యంతరం లేదు. చంద్రబాబును గెలిపించేందుకే షర్మిలను వినియోగించుకుంటున్నారు. మా సీఎంను కలిసేందుకు మాకు సమయం సరిపోవడం లేదు. పక్క రాష్ట్రం సీఎంను కలిసి మేం ఏం చేస్తాం. పక్క రాష్ట్రాల రాజకీయాలు పట్టించుకునే స్థితిలో మా నాయకుడు, మేము లేం. ఏబీఎన్ రాధాకృష్ణవి అన్నీ వెకిలి ప్రోగ్రాములు. ముగ్గురిని కంటే రూ.45 వేలు ఇస్తానని చంద్రబాబు అంటున్నారు. అదే రూ.45 వేలు ఇచ్చి వాళ్ల పప్పుగాడిని పిల్లలను కనమని చెప్పాలి. వాడినే ఐదారుగురుని కనమని చెప్పాలి.


కృష్ణా జిల్లాలో పార్టీని ఎవరూ వీడటంలేదు

కారణాలు చెప్పి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలను సీఎం జగన్ మారుస్తున్నారు. ఏ సీటు మార్చుతున్నారో వారినే సీఎం పిలిచి మాట్లాడుతున్నారు. కృష్ణా జిల్లాలో ఎవరూ పార్టీ నుంచి వెళ్లడం లేదు. పార్థసారథికి సీటు ఇవ్వడంలేదని సీఎం ఎక్కడా చెప్పలేదు. ఎక్కడ ఎవరు పోటీ చేస్తే బాగుంటుందనేది లిస్టు పెట్టుకుని సీఎం చర్చిస్తున్నారు. నా నియోజకవర్గంలో సమస్యలపై సీఎంను కలిసి మాట్లాడా.

మా వల్ల కాదు బాబూ..

సభకు కోట్లు కోట్లు కావాలంటే ఎక్కడి నుంచి తేవాలి?

- టికెట్ నాకే ఇస్తున్నట్లు సభలో ప్రకటిస్తామంటేనే ఖర్చు పెట్టుకుంటా
- టీడీపీ అధినేత చంద్రబాబుకు భూమా అఖిలప్రియ అల్టిమేటం
- జన సమీకరణ గురించి పట్టించుకోని వైనం నేడు చంద్రబాబు సభ నేపథ్యంలో కేడర్‌లో అయోమయం
- పరువు పోకుండా చూడాలని జిల్లా నేతలు అధిష్టానానికి వినతి
- అఖిల బెదిరింపులకు లొంగమని బాబు స్పష్టీకరణ
- పక్క నియోజకవర్గాల నుంచి జనాన్ని రప్పించాలని పెద్దల ఆదేశం



సాక్షి, నంద్యాల: రాజకీయంగా ఎంతో ప్రతిష్ట కలిగిన ఆళ్లగడ్డ నియోజకవర్గంలో పోటీకి ముందే టీడీపీ చేతులెత్తేస్తోందా? భూమా అఖిలప్రియ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుకు అల్టిమేటం జారీ చేశారా? తనకే టికెట్ ఇస్తున్నట్లు మంగళవారం నాటి సభలో ప్రకటించాలని డిమాండ్ చేశారా? మరోవైపు ఆమె ఆర్థిక సమస్యల్లో ఇరుక్కుపోయారా? పార్టీ కోసం కనీస ఖర్చులు సైతం పెట్టుకోలేని స్థితికి చేరుకున్నారా? అనుచరులందరూ చేజారి పోతున్నారా? తన విచిత్ర వైఖరితో అందరినీ దూరం చేసుకుంటున్నారా? ఈ ప్రశ్నలన్నింటికీ స్థానికులు 'అవును' అని సమాధానం చెబుతున్నారు. మంగళవారం (నేడు) పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు 'రా కదలిరా' సభకు ఏర్పాట్ల విషయంలో ఆ పార్టీ వైఖరి తేటతెల్లమైంది. పార్టీ అధ్యక్షుడు వస్తున్నారంటే టికెట్ ఆశిస్తున్న వారు ఎవరైనా జనసమీకరణపైనే దృష్టి పెడతారు. నియోజకవర్గంలో తన బలం చెక్కుచెదరలేదని ఎలాగైనా సరే నిరూపించుకోవడానికి ఎన్ని పాట్లయినా పడతారు. కానీ ఆళ్లగడ్డలో మాత్రం అందుకు విరుద్ధ పరిస్థితి కనిపిస్తోంది. నేటి సభకు జన సమీకరణ, ప్రజలకు భోజనాలు, తరలింపు ఏర్పాట్లు.. ఇలా ఏమీ కనిపించడం లేదని పార్టీ కార్యకర్తలు వాపోతున్నారు. వాస్తవానికి మంగళవారం నిర్వహించనున్న భారీ బహిరంగ సభను టీడీపీ అధిష్టానం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. లక్ష మందితో సభను నిర్వహించి తమ సత్తా చాటేందుకు ఉవ్విళ్లూరుతోంది. సభ నిర్వహణకు కనీసం రూ.రెండు కోట్లు ఖర్చవుతుందని, ఆమాత్రం ఖర్చుతో ఏర్పాట్లు చేయాలని పార్టీ అధిష్టానం నుంచి సూచనలు అందినట్లు పార్టీ నాయకులు చెబుతున్నారు. అయితే ఈ మాత్రం ఖర్చు పెట్టేందుకు కూడా ఆళ్లగడ్డ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి భూమా అఖిలప్రియ మీనమేషాలు లెక్కిస్తుండటం సర్వత్రా చర్చనీయాంశమైంది. అయితే తనకే టికెట్ ఇస్తామని సభలో ప్రకటించాలని డిమాండ్ చేసినట్లు తెలియవచ్చింది. అఖిల ఆర్థిక పరిస్థితి, ఇతరత్రా విషయాలన్నీ పూర్తిగా తెలుసుకున్న అధిష్టానం అందుకు ససేమిరా అన్నట్లు సమాచారం. ఇలాంటి బెదిరింపులకు లొంగే ప్రసక్తే లేదని, సభ నిర్వహణ అంతా పార్టీనే చూసుకుంటుందని, ఆ మేరకు జన సమీకరణ ఏర్పాట్లు జిల్లాలోని ఇతర టీడీపీ నేతలకు అప్పగించినట్లు ఆ పార్టీకి చెందిన ఓ నాయకుడు తెలిపారు.

జన సమీకరణ ఎలా?

సభకు అయ్యే ఖర్చు పెట్టుకోలేనని తెగేసి చెప్పిన అఖిలప్రియ.. మరో వైపు ఎలాగైనా టికెట్ తనే దక్కించుకోవాలని ప్రయాస పడుతోంది. అయితే ఆమెకు సొంత పార్టీ నేతల నుంచే సహాయ నిరాకరణ ఎదురవుతోంది. మరోవైపు తమ నియోజకవర్గాల నుంచి భారీగా జనాలను తరలిస్తే ఆ క్రెడిట్ అంతా అఖిలప్రియకు దక్కుతుందని.. ఇలా చేస్తే మనకేంటి లాభమని టీడీపీ నాయకులు ఆందోళనకు గురవుతున్నారు. సభ విజయవంతమైతే తన వల్లే సభ సక్సెస్ అయ్యిందని.. విఫలమైతే ఆ నెపం తమ మీద వేస్తారని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో జన సమీకరణ బాధ్యత మీదే కదా అని జిల్లాలోని పలువురు టీడీపీ నేతలు నేరుగా అఖిలప్రియను ప్రశ్నించినట్లు సమాచారం. మరోవైపు ఆళ్లగడ్డ టికెట్ తమకేనంటూ జనసేన నాయకులు సోషల్ మీడియాలో తెగ ప్రచారం చేసుకుంటున్నారు. కాగా, ఆళ్లగడ్డ పట్టణంలోని బీబీఆర్ పాఠశాల సమీపంలో సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ స్థలాన్ని అనుకుని ఉన్న తన స్థలాన్ని పాడు చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని ఆళ్లగడ్డ బీజేపీ కన్వీనర్ భూమా కిశోర్ రెడ్డి చెబుతున్నారు. మరో వైపు భూమా అఖిలప్రియ భర్త భార్గవరాంతో నియోజకవర్గ నేతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సభ ఖర్చులను పూర్తిగా తమ మీద వేసే ప్రయత్నం చేస్తున్నారని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, సభ నిర్వహణ గురించి పట్టించుకోకుండా.. సభకు ఏవీ సుబ్బారెడ్డి వస్తే బాగోదంటూ భూమా అఖిలప్రియ హెచ్చరించడం కొసమెరుపు.

దళితులంటే చంద్రబాబుకు చులకన

మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



సింగరాయకొండ: చంద్రబాబునాయుడుకి దళితులంటే చులకన భావమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. ప్రకాశం జిల్లా కొండెపి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన వైఎస్సార్ పింఛన్ల పంపిణీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం తనను కలిసిన విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను మంత్రి ఖండించారు. ఎవరు చెత్తో.. ఎవరు బంగారమో రానున్న ఎన్నికల్లో ప్రజలే నిర్ణయిస్తారని అన్నారు. చంద్రబాబు ఎప్పటికీ దళిత వ్యతిరేకేనన్నారు. గతంలో చంద్రబాబు ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాల్లో ఎన్నో సీట్లు మార్పిడి చేయలేదా అని ప్రశ్నించారు. గత ఎన్నికల సమయంలో మాజీ మంత్రి జవహర్‌ను తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు నుంచి కృష్ణాజిల్లా తిరువూరు నియోజకవర్గానికి, వంగలపూడి అనితను పాయకారావుపేట నుంచి తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరుకు, పీతల సుజాతను ఆచంట నుంచి చింతలపూడి నియోజకవర్గానికి మార్చలేదా అని గుర్తు చేశారు. దళిత నాయకులను నియోజకవర్గాలు మారిస్తే వారిని చెత్తతో పోల్చుతావా అని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో బాబుకు దళితులు తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు.

కరెంట్ షాక్‌తో ముగ్గురు యువకుల మృతి

- కన్నడ సినీనటుడు యశ్ కటౌట్ ఏర్పాటు చేస్తుండగా ప్రమాదం
- కర్ణాటకలోని గదగ్ జిల్లా సొరణగి గ్రామంలో ఘటన



మృతి చెందిన యువకులు (ఫైల్)

శివాజీనగర: ప్రముఖ కన్నడ సినీనటుడు, కేజీఎఫ్ ఫేం యశ్ కటౌట్ ఏర్పాటు చేస్తుండగా జరిగిన విద్యుత్ ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి చెందిన ఘటన కర్ణాటకలోని గదగ్ జిల్లా సొరణగి గ్రామంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. వివరాల్లోకి వెళితే... సినీ నటుడు యశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలోని యువకులు ఇనుప కడ్డీలతో కటౌట్ సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో పైన ఉన్న కరెంట్ తీగలకు ఈ ఇనుప కడ్డీలు తగలడంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై హనుమంత హరిజన్ (24), మురళి నడువినమని (20) నవీన్ గాజి (20) అక్కడికక్కడే మృతి చెందారు. మంజునాథ్, ప్రకాశ్, హనుమంత అనే యువకులకు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. మృతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. గాయపడిన వారికి రూ.50 వేలు అందజేయనుంది.

దేశవ్యాప్తంగా పవర్ సెక్టార్‌కు ఇబ్బందులు

- శైలేంద్ర దూబే

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోను ప్రభుత్వ, విద్యుత్ ఉద్యోగుల వేతనాల్లో వ్యత్యాసం ఉందని, మొత్తం పవర్ సెక్టార్ ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఆలిండియా పవర్ ఎంప్లాయిస్ యూనియన్ చైర్మన్ శైలేంద్ర దూబే చెప్పారు. ఆయన సోమవారం విజయవాడలో ఏపీఎస్ఈబీ ఇంజనీర్స్ అసోసియేషన్ 2024 డైరీని టేబుల్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ చట్ట సవరణ బిల్లు -2020ని ఆమోదింపజేయడంలో కేంద్రం విఫలమవుతోందని చెప్పారు. బిల్లు పాస్ చేయకపోయినా అందులో ఉన్న అంశాలను కొన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్నాయని తెలిపారు.



నేను ఇవ్వాళ వ్యాకులతను తప్పించుకున్నాను.
కాదు... దాన్ని పరిహరించాను. ఎందుకంటే అది నాలోనే ఉంది,
నా భావనలో ఉంది – బయట కాదు!
– మార్కస్ అరేలియస్

సాక్షి
మంగళవారం, 9 జనవరి 2024

అనుచిత వ్యాఖ్యల చిచ్చు

బాధ్యతా రహితమైన వ్యాఖ్యలు చేస్తే, ఫలితం భారంగానే ఉంటుంది. మాల్దీవులకు చెందిన ఒక ఎంపీ, ముగ్గురు మంత్రులకు బహుశా అది ఇప్పుడు అనుభవంలోకి వచ్చి ఉంటుంది. మాల్దీవుల ప్రభుత్వంలోని ముగ్గురు డిప్యూటీ మంత్రులు మరియమ్ షివునా, మల్షా షరీఫ్, మహజూమ్ మజీద్... భారత్‌కూ, భారత ప్రధానికీ వ్యతిరేకంగా అనుచిత వ్యాఖ్యలు చేసి, పదవి నుంచి సస్పెండయ్యారు. రెండు దేశాల మధ్య దౌత్య వివాదానికి దారి తీసిన ఆ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో బోలెడంత రచ్చ జరుగుతోంది. మాలే మంత్రుల వ్యాఖ్యలపై భారత ప్రముఖులు గట్టిగానే స్పందించారు. మాల్దీవ్స్ బహిష్కరణ నుంచి మన సొంత ద్వీపాల పర్యాటకాభివృద్ధి దాకా నినాదాలు జోరందుకున్నాయి. వ్యవహారం లక్షద్వీప్ వర్సెస్ మాల్దీవ్స్‌గా మారింది.

జరిగిన కథ గమనిస్తే – 'మీలోని సాహసికుడికి సరైన గమ్యస్థానం లక్షద్వీప్' అంటూ, అక్కడి సముద్రతీరంలోని తన ఫోటో జోడించి జనవరి 5న భారత ప్రధాని ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ పెట్టారు. ఈ పోస్ట్ మీద మాల్దీవుల మంత్రులు, ఎంపీల అనుచిత వ్యాఖ్యలు ఇంత దూరం తెచ్చాయి. మంత్రి అబ్దుల్లా మాజిద్ ఇదంతా మాల్దీవుల నుంచి దృష్టి మరల్చి, లక్షద్వీప్‌ను మరో పర్యాటక కేంద్రంగా ప్రోత్సహించడానికేనని విమర్శించడంతో రాజకీయ వివాదం రేగింది. ఆయనలా అంటే, మరో మంత్రి మరియమ్ షియునా 'ఎక్స్'లో ఇజ్రాయెల్‌తో భారత సంబంధాలను ప్రస్తావించారు. ఆమెతో మరో మహిళా సహచర మంత్రి మాల్షా స్వరం కలిపారు. భారత పర్యాటక ప్రాంతాలు, గదులు దుర్వాసన వేస్తుంటాయన్న నోటి తీట మాటలూ వచ్చాయి. ఇవన్నీ చిచ్చు రేపేసరికి, చైనా పర్యటనలోని మాల్దీవుల అధ్యక్షుడు దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సి వచ్చింది. మంత్రుల సస్పెన్షన్, వారి వ్యక్తిగత వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదని ప్రభుత్వ వివరణ చకచకా జరిగాయి.

భారత్‌లోని పర్యాటక ప్రాంతాల గురించి, ప్రధాని గురించి నోటికొచ్చినట్టు మాట్లాడడం మన వారికి కోపం తెప్పించింది. సెలవులకు మాల్దీవులకు వెళదామనుకున్న వేలాది భారతీయులు టికెట్లను రద్దు చేసుకుంటూ, సదరు స్క్రీన్‌షాట్లను 'ఎక్స్' వేదికగా పంచుకుంటున్నారు. అలాగే, దేశంలోనే ఉన్న అందమైన సముద్ర తీరాలు, ఆహ్లాదకరమైన దీవుల గురించి అన్వేషణ ఆరంభమైంది. ఈ వివాదం పుణ్యమా అని ఇంటర్నెట్‌లో లక్షద్వీప్ గురించి అన్వేషణ గత 20 ఏళ్ళలో ఎన్నడూ లేనంత గరిష్ఠ స్థాయికి చేరింది. అయితే, గత ఏడాది లక్షద్వీప్‌కు 10 వేల మంది లోపే వెళితే, మాల్దీవులకు వెళ్ళిన పర్యాటకుల సంఖ్య లక్షల్లో ఉందని గమనించాలి. ఈ పరిస్థితుల్లో సెంటిమెంట్లు రేపి, ప్రస్తుత వివాదాన్ని ఆత్మాభిమాన, ఆత్మనిర్భర అంశంగా, లక్షద్వీప్ వర్సెస్ మాల్దీవ్స్‌గా చేస్తే అది వట్టి హ్రస్వదృష్టి. ఎర్ర సముద్రంలో నౌకలపై దాడులు నిత్యం సాగుతున్న వేళ, మాల్దీవ్స్‌తో మన దీర్ఘకాలిక బంధం దెబ్బతినకుండా చూడడం ముఖ్యం.

హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత్‌కు కీలక పొరుగుదేశం మాల్దీవులు. 'ప్రాంతీయ భద్రత, పురోగతి' (సాగర్) లాంటి ప్రయత్నాల్లో ఆ దేశానిది ప్రధాన పాత్ర. అలాగే, 'పొరుగుకు పెద్ద పీట' లాంటి భారత ప్రభుత్వ ప్రాధాన్యాలకు మాల్దీవులు ఓ ప్రధాన కేంద్రం. అలాంటి మాల్దీవులతో ఇటీవల పొరపొచ్చాలు వచ్చాయి. భారత వ్యతిరేక అజెండాతో గెలిచి, గత 2023 నవంబర్‌లో మహమ్మద్ మొయిజు మాల్దీవ్స్‌కు అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ వెంటనే మాల్దీవుల ద్వీపబృందం నుంచి భారత సైన్యాన్ని ఉపసంహరించాల్సిందిగా కోరారు. భారత్ మాత్రం హిందూ మహాసముద్రంలోని సుదూర ద్వీపాలకు వైద్యసాయానికై తమ సైనికులు అక్కడున్నారంది.

తాజా వివాదాల వేళ మరో పొరుగు దేశం చైనా వైఖరి పక్క ఇల్లు తగలబడుతుంటే, చలి కాచుకుంటున్నట్టుంది. భారత్, మాల్దీవుల మధ్య రచ్చను అది ఆస్వాదిస్తోంది. మాల్దీవుల విదేశాంగ విధానం బాగుందనీ, ఆ దేశాధ్యక్షుడు భారత్‌తో సరైన రీతిలో వ్యవహరిస్తున్నారనీ చైనా మీడియా ప్రశంసిస్తోంది. అసలీ అంశంలో ఢిల్లీయే విశాల దృక్పథంతో ఉండాలంటూ బీజింగ్ సుద్దులు చెబుతోంది. ఇప్పటికే భారత్‌కు దక్షిణాన, పశ్చిమాన వివిధ దేశాల్లో చైనా పాగా వేసింది. హిందూ మహాసముద్రంలో కీలకమైన మాల్దీవుల్ని కూడా తన బుట్టలో వేసుకొనే పనిలో ఉంది. ఢిల్లీతో దీర్ఘకాలిక దౌత్యబంధమున్న మాలే సైతం క్రమంగా చైనా వైపు మొగ్గుతున్నట్టు కనిపిస్తోంది.

మరోపక్క మాలేలో పెరుగుతున్న ఇస్లామిక్ తీవ్రవాదం ఆందోళన రేపే అంశం. అత్యధికులు ముస్లిమ్‌లైన మాల్దీవుల నుంచి 600 – 700 మంది ఇస్లామిక్ తీవ్రవాద 'ఐసిస్'లో చేరారని లెక్క. ఈ పరిస్థితుల్లో మాల్దీవులు కేంద్రంగా వ్యూహాత్మక ప్రయోజనాలెన్నో ఉన్న భారత్ ఆచితూచి వ్యవహరించాలి. నెటిజన్ల 'బాయ్‌కాట్ మాల్దీవ్స్' లాంటి వ్యాఖ్యలు వినడానికి బాగున్నా, భౌగోళిక అనివార్యతల రీత్యా కుదిరేపని కాదు. సంచలన ప్రకటనల కన్నా సవ్యమైన కార్యాచరణే మన పర్యాటకాభివృద్ధికి కీలకం. ఇందులో మన పాలకులు చేసింది తక్కువ, చేయాల్సిందే ఎక్కువ.

లక్షద్వీప్‌కు ప్రాముఖ్యం కల్పించాలని మోదీ సర్కార్ భావిస్తే తప్పు లేదు కానీ, ఆ చిరు కేంద్రపాలిత ప్రాంతంలో భారీ నిర్మాణాలతో జీవ్యావరణాన్ని దెబ్బ తీసే యత్నాలు మానాలి. మాల్దీవ్స్ ప్రజాస్వామ్యం బాట పట్టి అంతా కలిపి దశాబ్దిన్నరే అయింది. కొద్ది నెలల క్రితమే వచ్చిన కొత్త ప్రభుత్వం ఇంకా కుదురుకోనే లేదు. ఈ పరిస్థితుల్లో చేతి నిండా పని ఉన్న మాల్దీవ్స్ మంత్రులు భారత్ గురించి, భారత్‌లో భాగమైన లక్షద్వీప్ గురించి మాట్లాడాల్సిన పని లేదు. అది వారి పరిధి కూడా కాదు. తాగునీటి కొరత నుంచి ఇటీవలి కోవిడ్ నియంత్రణ దాకా పలు సందర్భాల్లో మానవతతో అండగా నిలిచిన భారతే తాము నమ్మదగిన, చిరకాల మిత్రుడని గ్రహించాలి.

కృత్రిమ మేధతో నవ ప్రపంచం?

విశ్లేషణ



ప్రభు రామ్

స్మార్ట్ ఫోన్ల రాకతోనే జనం వాస్తవ ప్రపంచానికి దూరమయ్యారని ఒక విమర్శ. అలాంటిది జనరేటివ్ ఏఐ మనదాకా వస్తే? అప్పుడు వర్చువల్ ప్రపంచంలో మరింత కూరుకుపోతామా? మన చాలా పనులను ఏఐ చేయడం మొదలుపెడితే, మన చేతికి బోలెడు సమయం చిక్కుతుంది. అప్పుడు మనం తోటలో తిరుగుతూనో, వ్యాయామం చేస్తూనో గడపవచ్చు. విద్యార్థులకు పుస్తకాల బరువు తగ్గిపోతుంది. పిల్లల శక్తిసామర్థ్యాలకు తగ్గట్టుగా రోబోలు చదువులు చెబుతాయి. కానీ ఎప్పుడో మొదలైన డిజిటల్ విప్లవ ఫలాలు ఇప్పటికీ అందరికీ చేరనేలేదు. ఈ నేపథ్యంలో కృత్రిమ మేధ వంటి అత్యాధునిక టెక్నాలజీ కేవలం కొందరికి మాత్రమే ప్రయోజనం కలిగించేదిగా మారుతుందా అన్నది ప్రశ్న!

ఒక సగటు భారతీయుడు ఏడాదికి 2,300 గంటల సమయం స్మార్ట్ ఫోన్ మీద గడిపేస్తున్నాడని ఒక అంచనా. 580 గంటలు ఓటీటీ(ఓవర్ ద టాప్) ప్లాట్‌ఫామ్‌లలో కంటెంట్‌ను వెతుక్కుని వాటిని చూసేందుకు ఉపయోగిస్తున్నారు. సోషల్ మీడియాలోనూ దాదాపు ఇదే రకమైన ధోరణి కనిపిస్తోంది. సైబర్ మీడియా రీసెర్చ్ ద్వారా మేము జరిపిన అధ్యయనంలో ఈ పోకడలు వెల్లడయ్యాయి. కొన్నేళ్లుగా డిజిటల్ వినియోగదారుల తీరుతెన్నులను పరిశీలించేందుకు మేము ఈ సర్వేల్లాంటివి చేస్తున్నాం. స్మార్ట్ ఫోన్లు, టెక్నాలజీలతో మన జీవితాలు ఎంతగా పెనవేసుకుపోయాయో సూచిస్తాయి ఈ సర్వే విశేషాలు.

చేతిలో కావాల్సినంత సమయం

2024 అంటే ఈ ఏడాది ఇప్పటివరకూ చెప్పుకున్న అంశాలన్నింటిలోనూ విప్లవాత్మక మార్పులు వస్తే? జరగబోయేది ఇదే. అంతా జనరేటివ్ ఏఐ పుణ్యం! 2023లో కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్– ఏఐ), మరీ ముఖ్యంగా జనరేటివ్ ఏఐ అనేది ప్రపంచం మొత్తాన్ని ఒక్క కుదుపు కుదిపేసింది. అన్ని రంగాల్లోనూ తనదైన ముద్ర వేసింది. టెక్నాలజీ ధోరణులను నిత్యం పరిశీలించే విశ్లేషకుడిగా 2024లో ఈ ఏఐ విషయంలో ఏం జరగబోతోందన్నది నాకెంతో ఉత్సుకత రేకెత్తించే అంశం. అయితే ఒక్కటైతే నిజం. ఈ ఏడాది కృత్రిమ మేధ విస్తృత స్థాయికి చేరుతుందన్నది నా నమ్మకం.

జనరేటివ్ ఏఐ అనేది మన చిన్న చిన్న పనులను ఇట్టే చేసేస్తుంది. టెక్స్ట్ జనరేట్ చేయడం, చిత్రాలు, మోడల్స్‌ను సిద్ధం చేయడం వంటి చాలా పనులను ఆటోమేట్ చేయనుంది. భవిష్యత్తులో ఏం జరుగుతుందన్నది ఒకసారి చూస్తే... ఏఐ, జనరేటివ్ ఏఐ నైపుణ్యాలు కలిగిన వారు మిగిలిన వారికంటే మెరుగైన స్థితిలో ఉంటారు. దీనివల్ల 2024లోనే కాదు... ఆపై కూడా మన చేతుల్లో బోలెడంత సమయం మిగిలిపోనుంది. ఈ మార్పు పుణ్యమా అని ఉత్పాదకత పెరుగుతుంది. కాసేపు ప్రకృతి ఒడిలో సేద తీరడం మొదలుకొని మన ఫిట్‌నెస్ గోల్స్‌ను సాధించుకునేందుకు ప్రయత్నించడం, లేదా తోటపని చేసుకోగలగడం ఎంత గొప్ప అనుభూతిని ఇస్తుందో ఆలోచించండి.



విద్యార్థుల నేస్తం

మనుషులు సర్వవ్యాప్తమైన ఏఐ, జనరేటివ్ ఏఐలతో కలిసి జీవించడం అలవాటు అవుతున్న తరుణంలో జనరేషన్ ఆల్ఫా పరిస్థితి ఏమిటి? 2010, అటుపై పుట్టినవాళ్లను జనరేషన్ ఆల్ఫా అంటున్నాం. వీరు కృత్రిమ మేధకు స్థానికుల కింద లెక్క. వీరికి ఏఐ అనేది మునుపటి తరానికి స్మార్ట్ ఫోన్‌మాదిరిగా మారి ఉంటుంది. మనతో మాట్లాడగలిగే ఆటబొమ్మలు ఇప్పుడు బోలెడు అందుబాటులోకి వచ్చేశాయి. భావోద్వేగాలను పలికించగల, ఏఐ భాగస్వామి అని పిలుస్తున్న తెలివైన రోబోలు పిల్లలకు వారి శక్తిసామర్థ్యాలకు తగ్గట్టు చదువులు చెప్పేందుకు సిద్ధమవుతున్నాయి. వారితోపాటు తాము ఎదిగేందుకు రోబోలు ప్రయత్నిస్తున్నాయి.

పాఠశాలల్లో ఉన్న విద్యార్థులకు జనరేటివ్ ఏఐ ఓ కొత్త ప్రపంచాన్ని వారి కళ్లముందు ఆవిష్కరించనుంది. భవిష్యత్తులో పిల్లల భుజాలపై పుస్తకాల సంచి బరువు ఉండకపోవచ్చు. ఇంటరాక్టివ్ సిములేషన్స్, అడాప్టివ్ టెక్స్ట్ బుక్స్, ఏఐ మెంటర్స్... విద్యార్థుల అవసరాలు, ఆశయాలకు అనుగుణంగా బోధించడం మొదలవుతుంది. ఇప్పటిమాదిరిగా బట్టీపట్టే విషయం గత చరిత్ర కానుంది. పిల్లలు గొలుసులన్నీ తెంచుకుని, పిచ్చి పోటీని వదిలించుకుని తమకు నచ్చిన అంశాన్ని చదవుకునే వీలు ఏర్పడుతుంది. ప్రతి దశలోనూ కృత్రిమ మేధ వారికి తోడుగా నిలుస్తుంది. కృత్రిమ మేధ ప్రపంచంలో ఉపాధ్యాయుల పాత్ర కూడా గణ నీయంగా మారనుంది. సృజనాత్మకత, ఇష్టాయిష్టాలకు అనుగుణంగా విద్యార్థులు చేసే ప్రయత్నాలకు సహాయం అందించే వారిగా వీళ్ల మారిపోతారు. ఇలాంటి వాతావరణంలో పెరిగి పెద్దయిన పిల్లలు ఏఐ ఆధారిత టూల్స్, లాంగ్వేజ్ మోడళ్ల సాయంతో భాషా భేదాలను అధిగమిస్తారు.

అంతరాలు తగ్గేనా?

కృత్రిమ మేధ కచ్చితంగా ఓ అందమైన, సానుకూల భవిష్యత్తును చూపుతున్నప్పటికీ దీనికి ఇంకో కోణమూ ఉంది. ఇప్పటికే ఉన్న డిజిటల్ అంతరం మరింత పెరుగుతుందా? ఫలితంగా ఏఐ లాంటి అత్యాధునిక టెక్నాలజీ ఫలాలు కేవలం కొందరికి మాత్రమే పరిమితమవుతాయా అన్నది ఇంకో ప్రశ్న. ఎప్పుడో దశాబ్దాల క్రితం మొదలైన డిజిటల్ విప్లవ ఫలాలు ఇప్పటికీ అందరికీ చేరనేలేదు. డిజిటల్ డివైడ్ అని పిలుస్తున్న ఈ అంతరమే పూర్తిగా పూడని నేపథ్యంలో కృత్రిమ మేధ వంటి అత్యాధునిక టెక్నాలజీ కేవలం కొందరికి మాత్రమే ప్రయోజనం కలిగించేదిగా మారితే ఎలా అన్నది ఆందోళన కలిగించే అంశం.

ఇక మనుషుల మధ్య సంపర్కం ఇంతకుముందులానే ఉంటుందా? మానవ సంబంధాలు మునుపటి మాదిరిగానే కొనసాగుతాయా? ఈ నేపథ్యంలో కృత్రిమ మేధను బాధ్యతాయుతంగా వాడుకోవడం చాలా అవసరమవుతుంది. ప్రైవసీ, వివక్ష, విశ్వసనీయత వంటి విషయాల్లోనూ ప్రశ్నలు మిగిలే ఉంటాయి. ఒక్కటైతే వాస్తవం. ప్రపంచగతిని మార్చేసే శక్తి ఏఐ సొంతం. సమర్థత అనేది అన్ని రంగాల్లోనూ పెరిగిపోయేందుకు ఇది కారణమవుతుంది. ఈ తరం పిల్లలు ఏఐ నేతృత్వంలోని ప్రపంచంలో ఎదుగుతారు. తమ చుట్టూ ఉన్న ప్రపంచంతో మరింత సృజనాత్మకంగా మసలుకునేందుకు వీరికి అవకాశాలు ఎక్కువ.

వ్యాసకర్త సైబర్ మీడియా రీసెర్చ్(సీఎంఆర్)లో ఇండస్ట్రీ ఇంటెలిజెన్స్ గ్రూప్ విభాగాధిపతి ('ది హిందుస్తాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



రెండూ కావాలంటే...



నియమబద్ధంగా ఉండే మనుషులు అరుదుగా కార్యసాధకులుగా ఉంటారు. కార్యసాధకులైనవాళ్లు అరుదుగా నియమబద్ధంగా ఉంటారు.

– నసీమ్ నికోలస్ తలెబ్, గణాంక శాస్త్రజ్ఞుడు

పాడు చేయడంలో...



నిజానికి మాల్దీవుల్లో గందరగోళం సృష్టించడానికి ఉన్న ఉత్తమ మార్గం, మరింత ఎక్కువ మంది భారతీయ యాత్రికులను అక్కడికి పంపడమే. చూడండి, మనం కలంగుట్, బాగా పట్టణాలకు ఏం చేశామో! (రెండూ గోవా తీర పట్టణాలు.)

– అజయ్ కామత్, నేత్ర వైద్యుడు

మతలబేమిటి?



సిరియాలో ఐదు లక్షల మందిని చంపారు– నిశ్శబ్దం. యెమెన్‌లో 3,77,000 మందిని చంపారు– నిశ్శబ్దం. కాంగోలో 54 లక్షల మందిని చంపారు– నిశ్శబ్దం. సూడాన్‌లో ఐదు లక్షల మందిని చంపారు– నిశ్శబ్దం. ఇరాక్‌లో మూడు లక్షల మందిని చంపారు– నిశ్శబ్దం. గాజాలో 20,000 మందిని చంపారు– తీవ్ర నిరసనలు. ఎందుకలా?

– లుయీ అహ్మద్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

మద్దతు పార్టీకా? ప్రదేశానికా?



మధ్ ఐలండ్ (మహారాష్ట్ర)లో దిగిన తమ హనీమూన్ ఫొటోలను పోస్ట్ చేసే నటుడికి తర్వాతి జాతీయ అవార్డు పక్కా. (మాల్దీవులకు వ్యతిరేకంగా, లక్షద్వీప్‌కు మద్దతుగా సెలబ్రిటీల పోస్టుల నేపథ్యంలో).

– వీర్ దాస్, కమెడియన్

దెబ్బ పడింది!



రాజస్థాన్‌లోని శ్రీకరణ్‌పూర్ ఉప ఎన్నికలో ఇప్పటికే మంత్రి వర్గంలో చేర్చుకున్న బీజేపీ అభ్యర్థి (సురేంద్ర సింగ్) మీద కాంగ్రెస్ అభ్యర్థి (రుపీందర్ సింగ్ కున్నర్) గెలవడం అనేది రానున్న మార్పులకు సంకేతం. తమ అభిప్రాయానికి విలువ ఇవ్వకపోతే ఓటర్లకు నచ్చదు. కానీ అహంకార అధికార పక్షానికి ఇది అర్థమవుతుందా?

– శశి థరూర్, కాంగ్రెస్ ఎంపీ

మొదట్లోనే ఇలా ఉంటే...



లక్షద్వీప్‌లో దిగిన ఫొటోలను ప్రధాన మంత్రి మోదీ పోస్ట్ చేస్తారు... మాల్దీవుల పేరే ఆయన ఎత్తరు... ఇంటర్నెట్‌లో దాని రిఫరెన్స్ వస్తుంది... మాల్దీవుల మంత్రులు తమ విచక్షణ కోల్పోయి వ్యాఖ్యలు చేస్తారు... మూడు రోజుల ట్విట్టర్ యుద్ధం అనంతరం, ఆ ముగ్గురు మంత్రులు సస్పెండ్ అవుతారు, చాలామంది భారతీయులు మాల్దీవులకు చేసుకున్న ప్రయాణాలను రద్దు చేసుకుంటారు. 2024 సంతృప్త దశ మరీ త్వరగా వచ్చేసినట్టుంది.

– నూపుర్ జె. శర్మ, సంపాదకురాలు

సమయం లేదు టీచర్



ఉత్సాహకర క్షణం. చాలా ఏళ్ల కింద, ఖైజాగ్‌లో జరిగిన ఒక ఉపాధ్యాయ సదస్సు కోసం ఎన్ని పత్ర సమర్పణలను అంగీకరించారంటే – కేవలం సారాంశం చెప్పి వెళ్లిపోవాలని వక్తలను మళ్లీ మళ్లీ కోరుతూనే ఉన్నాడు ఛైర్మన్. కొంత సేపటికి ఇది కూడా పనిచేయకపోవడంతో, దయచేసి మీ సారాంశాన్ని క్లుప్తంగా చెప్పి పోవాలని కోరాడు.

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

సారాంశం
సరికొండ చలపతి

ఆశ.. నిరాశ... ఊగిసలాట...

డిసెంబర్ 31, 2023.
అర్ధరాత్రి 11. 55 నిమిషాలు.
ఎప్పటిలాగే నడుచుకుంటూ వెళుతున్నాడు.. ఆ మలుపు తిరిగితే ఇల్లు.

ఆ మూలనే ఓ గుడి. కొద్ది సేపట్లో కొత్త సంవత్సరం. ప్రతి సంవత్సరం లాగే గుడి ముందు ఆగి ..''వచ్చే సంవత్సరమైనా బాగా కలిసొచ్చేలా చూడు స్వామీ..'' అని మనసులో అనుకుంటూ గుడివైపు ఓ లుక్కేసుకుంటూ వెళుతున్నాడు. మనసులో ఓ మూల దొంటనుమానమే.. ప్రతిసారీ డిసెంబర్ నైట్ తనిలా దేవుణ్ణి రిక్వెస్ట్ చేయడం.. అది అలా మూలన పడిపోవడం.. ప్రతి సంవత్సరం ఎప్పటిలాగా మామూలుగా నడవడం... అదే ఇల్లు, అదే ఉద్యోగం, అదే జీతం.. అదే జీవితం..'' ఈ సారైనా రిక్వెస్టును దేవుడు ఖాతరు చేస్తాడా..'' ..''ఏమో! కొత్త గవర్నమెంట్ ఇలా గ్యారంటీలు ఆఫర్ చేస్తే అలా కోటికిపైగా దరఖాస్తులు వచ్చాయట.. ఈ లెక్కన దేవుడి దగ్గర ఎన్ని అర్జీలుండాలి..'' తన ఆలోచనకు తనకే నవ్వొచ్చింది.. వెంటనే నిరాశ వచ్చింది.

అప్పుడు సమయం.. సరిగ్గా 12 గంటలు.. కొత్త సంవత్సరంలోకి ఎంట్రీ... మరోసారి గాట్టిగా నిట్టూర్పి... గుడి దాటుతుండగా ఓ సాధువు ఎదురొచ్చాడు.
''ఏం నాయనా.. ఏదో నిరాశ కనిపిస్తోంది?''
''ప్రతి సంవత్సరం ఇలాగే ఉంది స్వామీ... ఏం మార్పూలేదు.''
వెంటనే ఆ సాధువు జాలిపడి తన చూపుడువేలు పక్కనే ఉన్న రాయికేసి చూపాడు.
ఆ రాయి బంగారంగా మారిపోయింది.
'' సంతోషమే కదా .. అది తీసుకెళ్లు..''
అవాక్కయిన మిడిల్‌క్లాస్ ఫెలో.. చటుక్కున తేరుకుని



''అదొక రాయేకదా...'' – అన్నాడు. మన వాడి తత్వం అంచనా వేసిన వాడి మళ్లీ పక్కనే ఉన్న చెట్టును చూపుడు వేలుతో బంగారు చెట్టుగా మార్చి ''ఓకేనా..''– అని అడిగాడు.
''కేవలం చెట్టే కదా...''
ఆ పక్కనే ఉన్న మనవాడి ఇల్లువైపు చూపుడు వేలును నిలిపాడు
అది బంగారు ఇల్లుగా మారిపోయింది.
''ఇది చాలా...'' సాధువు అడిగాడు.
''అది ఇల్లే కదా...'' అని మనవాడు నసిగాడు.
''ఈ కొత్త సంవత్సరమైనా నిన్ను సంతోష పెడదామనుకున్నా... నీకు ఇంకేం కావాలి నాయనా?''
''నీ చూపుడు వేలు స్వామి..''– మన మిడిల్ క్లాస్ మనిషి రిక్వెస్ట్.
''దేవుడు మీ రిక్వెస్టులను ఎందుకు రిసీవ్ చేసుకోవడంలేదో అర్థం అయ్యింది నాయనా...'' అంటూ భయంతో సాధువు చటుక్కున మాయమయ్యాడు.
.. ఇదో కొత్త సంవత్సరపు సరదా కథ.

....

అయితే.. 2023, 2024 లాంటివి కాల గమనంలో అంకెలే అని తెలిసినా ఎలా ఆశలు పెట్టుకుంటారు.. తమ బతుకు ఎలా మారాలని ఆశిస్తారనేది ఆసక్తికరమే. పైన సరదాగా చెప్పుకున్నంత 'హెవీ'గా కాకపోయినా సాధారణ మనిషికి కొత్త సంవత్సరం 2024 ఏమైనా ఇవ్వకపోతుందా అని ఆశ.. ఏం ఇస్తుందిలే అనే నిరాశా ఉన్నాయట... మార్కెట్ రీసెర్చ్, కన్సల్టెన్సీ సేవల సంస్థ ఇప్సోస్ తాజాగా నిర్వహించిన అధ్యయనం ఈ సంగతి తేల్చింది.
34 దేశాల్లో విస్తృతస్థాయిలో ఈ అధ్యయనం చేసినట్టు ఇప్సోస్ తెలిపింది.

2024.. ఓ ఆశ

సర్వేలో పాల్గొన్నవారిలో 70 శాతం మంది 2023 కన్నా 2024 ఎంతో బాగుంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. గత ఏడాది చేసిన సర్వే (65%) కంటే ఇది ఐదుశాతం ఎక్కువ. ఇటీవలి వరకు ఆర్థిక సంక్షోభం దిశగా పయనించిన యూరోపియన్ దేశాల్లో ఈ 'ఆశ' మరింత ఎక్కువగా కనిపించింది.

- 2024లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందని సగటున 50 శాతం మంది పేర్కొంటే.. ఇండియా, చైనా, ఇండోనేషియా వంటి దేశాల వారిలో 80 శాతం మందికిపైగా సానుకూలంగా స్పందించారు.

2023.. ఓ నిరాశ

సర్వేలో పాల్గొన్నవారిలో 2023పై నిరాశే కనిపించింది. గత ఏడాది తమకు అంతగా ఏమీ కలసి రాలేదని 53 శాతం మంది, తమ దేశానికీ ఏమీ లాభం లేదని 70 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు.

'ఆశ'ల దేశాలు..

- 2023తో పోలిస్తే 2024 ఏడాది బాగుంటుందని ప్రపంచవ్యాప్తంగా సగటున 70 శాతం మంది ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆసియా, దక్షిణ అమెరికా ఖండాల్లోని అభివృద్ధి చెందుతున్న దేశాల వారు ఎక్కువ సానుకూలంగా ఉంటే.. అభివృద్ధి చెందిన దేశాల వారిలో నిరాశ ఎక్కువగా కనిపించింది.
- భవిష్యత్తు మెరుగ్గా ఉంటుందన్న నమ్మకం ఎక్కువగా కనిపించింది ఇండోనేషియా వారిలోనే. ఆ దేశానికి చెందినవారిలో 91 శాతం ఆశాభావంతో ఉన్నారు.
- ఇండియా, మెక్సికో, చైనాలలో 87 శాతం మంది మంచి భవిష్యత్తుపై నమ్మకం పెట్టుకున్నారు. ఫిలిప్పీన్స్ (86%), పెరూ (83%), చిలీ, దక్షిణాఫ్రికా, కొలంబియా (79%), బ్రెజిల్ (78%), థాయిలాండ్ (77%) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.
- వచ్చే ఏడాదిపై పెద్దగా ఆశలు లేని దేశం జపాన్. అక్కడి వారిలో 39 శాతం మంది మాత్రమే భవిష్యత్తుపై ఆశలు పెట్టుకున్నారు. మిగతా 61 శాతం మంది నిరాశగానే స్పందించారు. ఫ్రాన్స్ (54%), బెల్జియం (48%), దక్షిణ కొరియా (53%), జర్మనీ (57%), టర్కీ, ఇటలీ (59%) తక్కువ ఆశాభావమున్న లిస్టులో ఉన్నాయి.

కొలువుల కలవరం

సర్వే చేసిన అన్ని దేశాల్లోనూ వచ్చే ఏడాది ఆర్థిక పరిస్థితులు, ఉద్యోగాలు, వాతావరణం వంటి అంశాలపై పెద్దగా ఆశలేమీ పెట్టుకోని పరిస్థితి కనిపించింది.

- 2023తో పోలిస్తే 2024లో తమ దేశంలో ప్రజల ఆదాయం కంటే ధరలు ఎక్కువగా పెరగవచ్చని 79 శాతం అభిప్రాయపడ్డారు. రుణాలపై వడ్డీ రేట్లు పెరగొచ్చని 70 శాతం, నిరుద్యోగం పెరగవచ్చని 68 శాతం పేర్కొన్నారు.
- 2024లో కృత్రిమ మేధ (ఏఐ) వల్ల అదనంగా వచ్చే ఉద్యోగాల కంటే.. దానివల్ల మరింత ఎక్కువ ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని 64 శాతం మంది ఆందోళన వ్యక్తం చేశారు.

ఇండియా, చైనా వంటి దేశాలు ఏఐతో ప్రయోజనం ఉంటుందంటే.. అమెరికా, యూకే వంటి చోట నష్టమేనని అభిప్రాయపడ్డారు.

- సోషల్ మీడియా వినియోగాన్ని తగ్గిస్తామని 41 శాతం మంది చెప్పారు.

యుద్ధం.. మహమ్మారి

- కరోనా తరహాలో 2024లో మరో కొత్త మహమ్మారి వచ్చే ప్రమాదం ఉందని 48 శాతం, ఆ చాన్సే లేదని 34 శాతం, ఏమీ చెప్పలేమని 18 శాతం మంది పేర్కొన్నారు. ఉక్రెయిన్ యుద్ధం ఈ ఏడాది ముగియకపోవచ్చని 47 శాతం మంది చెప్పారు.

వాతావ'రణం'!

- 2023తో పోలిస్తే వచ్చే ఏడాది పర్యావరణ మార్పులు మరింత పెరగవచ్చని ఎక్కువమంది అభిప్రాయపడ్డారు.
- ప్రకృతి విపత్తులు మరింత పెరుగుతాయని 71 శాతం, ఉష్ణోగ్రతలు మండిపోతాయని 81 శాతం మంది చెప్పారు. పెట్రోల్, డీజిల్ వాహనాలపై నియంత్రణ పెరగవచ్చని 55 శాతం మంది అంచనా వేశారు.

అ'సహనం'

మీ దేశంలో ఒకరి పట్ల మరొకరు సహనంతో వ్యవహరించే అవకాశం పెరుగుతుందా? అని సర్వేలో ప్రశ్నించగా.. 56 శాతం మంది 'సహనం పెరిగే చాన్సే లేదు' అని అభిప్రాయపడ్డారు. ఏమో చెప్పలేమని 9 శాతం మంది పేర్కొంటే.. సహనం పెరుగుతుందన్నవారు 35 శాతమే.

....

పేదవాడు ఎవరంటే...

ఉన్నంతలో తృప్తిగా బతికేవారు బహు తక్కువ. మరీ ముఖ్యంగా రాజులైతే రాజ్య విస్తరణ చేసుకుంటూ పోయి సామ్రాజ్యాధిపతులు కావాలని కోరుకుంటారు. ఈ క్రమంలో లక్షలాది జనం, సైనికులూ యుద్ధంలో మరణించడమో, ఇక్కట్ల పాలు కావడమో జరుగుతుంది. అటువంటి వారికి జ్ఞానోదయం కలిగించిన కథ ఇది.

విక్రమ వర్మ అనే రాజు ఎప్పుడూ ఏదో ఒక దేశం మీద దాడి చేయడం, వారిని లొంగ దీసుకోవడం పనిగా పెట్టుకున్నాడు. ఎప్పటిలాగే అతను పొరుగు రాజ్యం మీద దండయాత్రకు బయలుదేరాడు. అడవిలో ఓ మునివర్యుని చూశాడు. ఎముకలు కొరికే చలిలో కేవలం నడుముకు పంచె మాత్రమే చుట్టుకుని ధ్యానం చేస్తున్నాడు. 'అయ్యో ఈ ముని చలినెలా తట్టుకుంటాడో' అని తన దగ్గరున్న శాలువ కప్పాడు రాజు.



దాంతో కళ్ళు తెరచిన ముని 'ఎవరు నువ్వు?' అని ప్రశ్నించాడు. 'స్వామీ, నేను ఈ రాజ్యాన్ని పాలించే రాజుని. పొరుగు దేశంపై దండయాత్రకు బయలుదేరాను. విజయం సాధించడానికి మీ దగ్గర ఆశీస్సులు పొందుదామని మీ చెంత నిల్చున్నాను' అన్నాడు. 'సరే, నాకు కప్పిన ఈ శాలువను తీసుకుపో. నేను ఇప్పటికే ధనికుడిని. నాకున్న ఆస్తితోపాటు ఈ శాలువ భారాన్ని మోయడానికి సిద్ధంగా లేను' అన్నాడు ముని.

అంతట రాజు, 'స్వామీ, మీరలా అనకండి. మీరు మునులు. మీకన్నీ తెలుసు. నా దగ్గర అనేక శాలువలు ఉన్నాయి. వాటిలో ఒకటే నేను మీకిచ్చాను. ఇది స్వీకరించడానికి మీరెందుకు తిరస్కరిస్తున్నారు? మీరు అడగలేదు. నా అంతట నేనే మీకిది కప్పాను' అన్నాడు రాజు.

రాజు మాటలన్నీ విన్న ముని, 'పుత్రా, నీ దగ్గర ఇప్పటికే ఓ దేశం ఉంది. అది చాలదంటూ మరొక దేశంపై యుద్ధానికి పోతున్నావు. అలాగే నీ దగ్గర అనేక శాలువలు ఉన్నప్పటికీ నీకు మరో శాలువ అవసరం ఉంది. అవసరాలున్నవాడే పేదవాడు నా దృష్టిలో. అతనికే అనేక వస్తువులు కావాల్సి ఉంటుం' దన్నాడు.

ముని మాట రాజుకి చెంప దెబ్బలా అనిపించింది. దాంతో మనసు మార్చుకున్న రాజు స్వదేశానికి తిరుగు ప్రయాణమయ్యాడు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.త్రయోదశి రా.8.46 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** జ్యేష్ఠ రా.8.04 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** తె.3.52 నుండి 5.22 వరకు (తెల్లవారితే బుధవారం), **దుర్ముహూర్తం:** ఉ.8.47 నుండి 9.35 వరకు, తదుపరి రా.10.51 నుండి 11.39 వరకు, **అమృతఘడియలు:** ఉ.11.07 నుండి 12.43 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.37, **సూర్యాస్తమయం:** 5.37.

రాజకీయంగా ఎదుర్కోలేకనే టార్గెట్ చేశారు

- నా ఫోన్‌ను, ఫేస్ బుక్‌ను హ్యాక్ చేసి అశ్లీల చిత్రాలు పంపిస్తున్నారు
- ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి



ఎస్పీ సిద్ధార్థ కౌశల్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి

కడప అర్బన్: రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తన వ్యక్తిగత జీవితాన్ని సాంకేతికంగా టార్గెట్ చేశారని వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి అన్నారు. తన అనుచరులతో కలిసి సోమవారం ఆయన కడప జిల్లా ఎస్పీ సిద్ధార్థ్‌కౌశల్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. తనను భౌతికంగా, మానసికంగా, రాజకీయంగా ఇబ్బందులకు గురి చేయాలనే దురుద్దేశంతో ఆస్ట్రేలియాలోని ఓ సంస్థతో ప్రత్యర్థులు రూ.50 లక్షలకు డీల్ కుదుర్చుకుని హ్యాకర్స్‌కు కొంత ముట్టచెప్పారన్నారు. తనకు వ్యాపార, వ్యక్తిగతానికి సంబంధించిన ప్రత్యర్థులు ఎవరూ లేరని, రాజకీయంగా తన ఎదుగుదల చూడలేకే ఈ చర్యలకు పాల్పడుతున్నారని స్పష్టం చేశారు. తన ఫోన్‌ను హ్యాక్ చేసేందుకు ప్రయత్నించడంతో పాటు, తన ఫేస్‌బుక్ అకౌంట్‌ను హ్యాక్ చేసి అందులో అశ్లీల చిత్రాలను పెడుతూ.. తన వ్యక్తిగత జీవితంపై బురదజల్లుతున్నారని వివరించారు.

కాంగ్రెస్‌లో చేరడం వల్ల షర్మిలకు ఉపయోగం లేదు

వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరికపై ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎవరైనా ఏపార్టీలో చేరొచ్చు కానీ, ఆ పార్టీ వల్ల షర్మిలమ్మకు ఎలాంటి ఉపయోగం ఉండదన్నారు. ఎమ్మెల్సీ రామచంద్రయ్య పార్టీ మారుతున్నపుడే వైఎస్సార్‌సీపీది అరాచకపాలన అని గుర్తొచ్చిందా అని ప్రశ్నించారు.

12 నుంచి విశాఖలో సంక్రాంతి ఉత్సవాలు

బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు

ఏయూక్యాంపస్: ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఈ నెల 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకు సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పల్లె సంస్కృతిని ప్రతిబింబించే విధంగా కార్యక్రమాల నిర్వహణ ఉంటుందన్నారు. ఉత్తరాంధ్ర జానపద కళారూపాలను ప్రదర్శిస్తామన్నారు. ఇక్కడ సుమారు 150 స్టాళ్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అన్నిపార్టీల వారిని ఆహ్వానిస్తామన్నారు. ఈ ఉత్సవాలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖులు హాజరుకానున్నట్లు చెప్పారు.

అక్కచెల్లెమ్మలకు అన్ని వసతులతో ఇళ్లు

గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దొరబాబు



మాట్లాడుతున్న దొరబాబు

సాక్షి, అమరావతి: 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం కింద రాష్ట్రంలోని నిరుపేద అక్కచెల్లెమ్మలకు అన్ని వసతులతో పక్కా ఇళ్లను సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం అందిస్తోందని ఏపీ గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ డి.దొరబాబు అన్నారు. గృహ నిర్మాణ సంస్థ 14 మంది డైరెక్టర్ల పదవీకాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు వీరు పదవిలో ఉంటారని తెలిపింది. ఈ క్రమంలో సంస్థ 35వ బోర్డు సమావేశం సోమవారం చైర్మన్ దొరబాబు అధ్యక్షతన విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇళ్లు లేని ఏ ఒక్క పేద కుటుంబం ఉండటానికి వీల్లేదన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆశయమని చెప్పారు. త్వరలోనే మరో ఐదు లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి లబ్ధిదారులకు అందించేలా వేగంగా అడుగులు వేస్తున్నామన్నారు. పేదల ఇళ్లను సకాలంలో పూర్తి చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. గృహ నిర్మాణ సంస్థ ఎండీ డాక్టర్ లక్ష్మీశా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చీపురు పట్టి రోడ్లు ఊడ్చిన ప్రభుత్వ విప్

జగ్గయ్యపేట అర్బన్: పారిశుద్ధ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఉదయభాను సోమవారం చీపుర్లతో తొలగించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే పారిశుద్ధ్య కార్మికుల జీతాలను రూ.18 వేల నుంచి రూ.21 వేలకు పెంచారని, వారి న్యాయమైన కోరికలను ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. మున్సిపల్ కార్మికులు ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే సమ్మెను విరమించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

యనమల ఇంట్లో టికెట్ లొల్లి

- తమ్ముడు కృష్ణుడిని పక్కనపెట్టిన యనమల
- కూతురు దివ్యను ఇన్‌చార్జిగా నియమించడంతో రగిలిపోతున్న తమ్ముడు
- తాజాగా తెరపైకి యనమల రాజేష్.. అతన్ని దూరం పెట్టాలని కృష్ణుడి పట్టు
- 'బాబు' తుని సమావేశం లోపు తేల్చాలని డిమాండ్



యనమల సమక్షంలో కృష్ణుడు, రాజేష్ వర్గీయులు కుమ్ములాట (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఒకప్పుడు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా టీడీపీలో తెరవెనుక రాజకీయాలను శాసించిన యనమల రామకృష్ణుడికి ఇంటిపోరు పెద్ద తలనొప్పిలా మారింది. సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో ఆయన సొంత నియోజకవర్గం తునిలో తన రాజకీయ వారసురాలిగా కూతురిని తెరపైకి తీసుకొచ్చి.. తమ్ముడు యనమల కృష్ణుడికి మొండిచేయి చూపుతూ చక్రం తిప్పారు. ఈ ఇంటి పోరుతో తుని నియోజకవర్గంలో ఇప్పటికే తెలుగు తమ్ముళ్లు తలలు పట్టుకుంటున్నారు. నిన్న మొన్నటి వరకూ కాకినాడ జిల్లా తునిలో పార్టీ ఇన్‌చార్జిగా యనమల కృష్ణుడే అన్నీ తానై చూసుకున్నారు. కష్టకాలంలో పార్టీని నడిపించిన తమ నాయకుడిని కాదని రాజకీయ వారసత్వాన్ని కొనసాగించేలా ఎక్కడో ఉన్న రామకృష్ణుడి కుమార్తె దివ్యను రంగంలోకి దించడంతో కృష్ణుడి అనుచరవర్గం మండిపడుతోంది. ఇప్పుడు రామకృష్ణుడు తన చిన్నాన్న కుమారుడైన కృష్ణుడికి పూర్తిగా చెక్ పెట్టేందుకు.. సొంత సోదరుడి కుమారుడు రాజేష్‌ను రంగంలోకి దించడంతో తాడేపేడో తేల్చుకునేందుకు కృష్ణుడు సిద్ధమయ్యారు.

పక్కా వ్యూహంతో తమ్ముడిని దెబ్బకొట్టిన యనమల





యనమల కృష్ణుడి వల్లే టీడీపీ నష్టపోయిందనే సాకుతో అభ్యర్థి బరి నుంచి ఆయనను తప్పించడంలో రామకృష్ణుడి వ్యూహం ఫలించింది. ఇది కృష్ణుడి వర్గానికి ఏమాత్రం రుచించడం లేదు. అలాగని ఇప్పటికిప్పుడు బయటపడకుండా వేచిచూసే ధోరణి అవలంభిస్తున్నారు. మరోవైపు దివ్యకు పార్టీలో ప్రతికూల వాతావరణం ఎదురు కాకుండా కృష్ణుడిని పొమ్మనకుండానే పొగపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకు రామకృష్ణుడు సోదరుడి కుమారుడు రాజేష్‌ను పావుగా వాడుకుంటున్నారనే వాదన వినిపిస్తోంది. దివ్యను టీడీపీ తుని నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించిన సందర్భంలో తీవ్ర అసంతృప్తితో రగిలిపోయిన కృష్ణుడు.. పార్టీ మారే ఆలోచన కూడా చేశారనే ప్రచారం జరిగింది. దివ్య నియామకాన్ని పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో కృష్ణుడి వర్గం బాహాటంగానే వ్యతిరేకించింది. పార్టీని ఇంతకాలం మోసిన కృష్ణుడిని పక్కన పెట్టిన రోజే యనమల కుటుంబంలో ఇంటి పోరుకు తెరలేచింది. అనంతర పరిణామాల్లో ఆయనను బుజ్జగించడంతో కృష్ణుడిని దారిలోకి తెచ్చుకున్నామని రామకృష్ణుడు సంబరపడ్డారు. లోలోన రగిలి పోతున్న కృష్ణుడు సమయం కోసం వేచిచూశారు.

తాడోపేడో తేల్చుకునేందుకు కృష్ణుడు సిద్ధం



రాష్ట్ర రాజకీయాల్లో రామకృష్ణుడు నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతుండగా.. ఆయన తరఫున తునిలో అన్నీ తానై చూసుకున్న కృష్ణుడికి ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ మండిపడుతున్నారు. రాజకీయాల్లో తనకంటే వెనకాల వచ్చిన రాజేష్‌కు టీడీపీలో ప్రాధాన్యం ఇవ్వడం కృష్ణుడికి పుండు మీద కారం చల్లినట్లయ్యింది. ఉంటే రాజేష్ అయినా ఉండాలి లేక తమ నాయకుడికైనా పూర్తిగా బాధ్యతలు అప్పగించాలని కృష్ణుడి వర్గం వాదన వైరి వర్గానికి మింగుడు పడటం లేదు. తునిలో బుధవారం జరగనున్న చంద్రబాబు సభలోపు ఈ విషయంపై తాడోపేడో తేల్చాలని పట్టుబడుతున్నారు. ఈ పరిస్థితులతో యనమల రామకృష్ణుడికి ఎటూ పాలుపోని పరిస్థితి ఉంది. ఈలోగా ఈ వ్యవహారం ఎటు దారి తీస్తుందోనని పార్టీ శ్రేణులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి.

రాజేష్ రాకతో కాక



రామకృష్ణుడి సోదరుడి కుమారుడు రాజేష్, కృష్ణుడి వర్గాలు రామకృష్ణుడి సమక్షంలోనే ఇటీవల పరస్పరం కొట్లాటకు దిగారు. దివ్యను ఇన్‌చార్జిగా నియమించిన సమయంలో కృష్ణుడు రాజకీయంగా అస్త్రసన్యాసం చేసి కొంతకాలం మౌనంగా ఉన్నారు. ఆ సమయంలో దివ్య వెంట రాజేష్ క్రియాశీలకంగా వ్యవహరించారు. నియోజకవర్గంలో తుని, కోటనందూరు, తొండంగి మండలాలు ఉండగా, రాజేష్ తొండంగి మండల పార్టీ బాధ్యతలు చూస్తున్నారు. ఇంతలోనే కృష్ణుడు ఇటీవల పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. దీన్ని జీర్ణించుకోలేని రామకృష్ణుడి వర్గం కృష్ణుడికి పొమ్మనకుండానే పొగబెట్టేలా చేస్తున్నారని తెలుగు తమ్ముళ్ల మధ్య విస్తృత చర్చ సాగుతోంది. పార్టీ కార్యకలాపాలకు కృష్ణుడు దూరంగా ఉన్నంతసేపు ఖుషీగా ఉన్న ఆ వర్గానికి.. కృష్ణుడు తిరిగి పార్టీలో చురుగ్గా ఉండటం రుచించడం లేదంటున్నారు. ఇందుకు రాజేష్‌ను పావుగా వాడుకుంటూ కృష్ణుడిపైకి ఉసిగొల్పుతున్నారనే ప్రచారం పార్టీలో వినిపిస్తోంది.

కొలికపూడి, టీవీ5 సాంబశివరావులను విచారించిన సీఐడీ

- ఆర్జీవీపై వివాదాస్పద వ్యాఖ్యల కేసులో సుదీర్ఘ విచారణ
- ఈ నెల 12న మరోసారి విచారణకు రావాలని ఆదేశం



కొలికపూడి



సాంబశివరావు

సాక్షి, అమరావతి: సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ తలనరికి తెస్తే రూ.కోటి ఇస్తామన్న వివాదాస్పద వ్యాఖ్యల కేసులో అమరావతి పరిరక్షణ సమితి అధ్యక్షుడు కొలికపూడి శ్రీనివాసరావు, టీవీ 5 న్యూస్ యాంకర్ సాంబశివరావులను సీఐడీ అధికారులు సోమవారం విచారించారు. గుంటూరులోని సీఐడీ కార్యాలయంలో సోమవారం ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు దాదాపు 5.30 గంటలపాటు వారిద్దరిని కలిపి, విడివిడిగానూ విచారించారు. టీవీ 5 చానల్ నిర్వహించిన డిబేట్ ద్వారా తన హత్యకు ప్రేరేపించేందుకు ఉద్దేశపూర్వకంగానే కొలికపూడి శ్రీనివాసరావు ఆ వ్యాఖ్యలు చేశారని రామ్‌గోపాల్ వర్మ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అందుకు బాధ్యులుగా ఆయన పేర్కొన్న కొలికపూడి శ్రీనివాసరావుతో పాటు, టీవీ 5 చానల్ ఎండీ, చీఫ్ ఎడిటర్ బి.ఆర్.నాయుడు, న్యూస్ యాంకర్ సాంబశివరావు, ఫిరోజ్, టీవీ 5 మేనేజింగ్ ఎడిటర్లపై పలు సెక్షన్ల కింద సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఈనెల 3న కొలికపూడి శ్రీనివాసరావును సీఐడీ అధికారులు మొదటి దఫా విచారించారు. కాగా ఆరోజు న్యూస్ యాంకర్ సాంబశివరావు విచారణకు హాజరుకాలేదు. దాంతో వారిద్దరిని సోమవారం సీఐడీ అధికారులు విచారించారు. ఆర్జీవీని హత్య చేసేలా ఎందుకు వ్యాఖ్యానించారు? ఉద్దేశపూర్వకంగానే మాట్లాడారా? ఆ వ్యాఖ్యలతో ప్రేరేపితమై ఎవరైనా అవాంఛనీయ ఘటనకు పాల్పడితే పరిణామాలు ఎలా ఉంటాయో అవగాహన ఉందా.. సమాజంలో విద్వేషాలు రేకెత్తించకూడదన్న అవగాహన లేదా..? అంటూ వారిద్దరిపై సీఐడీ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. కానీ సీఐడీ అధికారుల ప్రశ్నలకు కొలికపూడి శ్రీనివాసరావు, సాంబశివరావు సూటిగా సమాధానం చెప్పలేదని సమాచారం. వారిద్దరి వాంగ్మూలాలను నమోదు చేసుకున్న సీఐడీ అధికారులు ఈ నెల 12న మరోసారి విచారణకు రావాలని ఆదేశించారు. అందుకు వారిద్దరూ సమ్మతించారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల భూసేకరణ ప్రక్రియ వేగవంతం

సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, అమరావతి: జర్నలిస్టుల ఇళ్ల స్థలాల భూసేకరణకు అవసరమైన బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం రెండు, మూడు రోజుల్లో విడుదల చేయనున్నట్టు సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎంవో అధికారులు, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించామన్నారు. ఇళ్ల స్థలాలకు సంబంధించిన భూసేకరణ సమయంలో జర్నలిస్టుల అభిప్రాయాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారన్నారు. ఇప్పటి వరకు జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం 10,017 దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రాథమిక పరిశీలన అనంతరం 7,651 మంది అర్హులైన జర్నలిస్టుల జాబితాను తదుపరి వెరిఫికేషన్ కోసం 26 జిల్లాల కలెక్టర్లకు పంపించామని చెప్పారు. అసంపూర్తిగా ఉన్న 766 మంది జర్నలిస్టుల దరఖాస్తులను సరిదిద్దుకునేందుకు మరో అవకాశం కల్పించామన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలం కేటాయించడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు.

బద్వేలు టీడీపీలో అసమ్మతి సెగలు

- తన ఓటమికి పార్టీ ఇన్‌చార్జీలదే బాధ్యత
- టీడీపీ నేత ఓబుళాపురం రాజశేఖర్ నిరసన గళం
- అసమ్మతి నేతలతో ప్రత్యేక భేటీ



వైఎస్సార్ జిల్లా కాశినాయన మండలంలోని అసమ్మతి నాయకులతో ఓబుళాపురం రాజశేఖర్ భేటీ

అట్లూరు: వైఎస్సార్ జిల్లా బద్వేలు నియోజకవర్గంలో అసమ్మతి సెగలు బయటపడుతున్నాయి. గత ఇరవై ఏళ్లుగా బద్వేలులో టీడీపీ ఓడిపోవడానికి ఇన్‌చార్జీలదే బాధ్యత అని గత ఎన్నికల్లో ఓటమిపాలైన ఓబుళాపురం రాజశేఖర్ అసమ్మతి నేతలతో కలిసి తన నిరసన గళం స్వరం వినిపిస్తున్నారు.

తన అనుయాయులతో ప్రత్యేక శిబిరం..

నియోజకవర్గ ఇన్‌చార్జి ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ పార్టీని నమ్ముకున్న వారికి ప్రాధాన్యత ఇవ్వడంలేదని ఓబుళాపురం రాజశేఖర్ చిటపటలాడుతున్నారు. అంతటితో ఆగకుండా మండలాలవారీగా నియోజకవర్గ ఇన్‌చార్జిపై అసమ్మతిగా ఉన్న నాయకులైన టీడీపీ తెలుగు మహిళా జిల్లా మాజీ అధ్యక్షురాలి భర్త కర్నాటి వెంకటరెడ్డి, కలసపాడు మాజీ మండల అధ్యక్షుడు పామూరు బాలిరెడ్డి, బద్వేలు మండలం మాజీ జెడ్పీటీసీ బీరం శిరీషా, సీనియర్ నాయకుడు బీరం జయరామిరెడ్డి, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపు చిన్నమునిరెడ్డి, కాశినాయన మండలం నర్సాపురం మాజీ సర్పంచ్ కర్నాటి సుబ్బారెడ్డి, చెరుకూరి రవి, చంద్రగిరి ప్రహ్లాదరెడ్డిలతో కలసి గత నెల 31వ తేదీన అట్లూరు మండలంలో సమావేశం నిర్వహించారు. శనివారం రాత్రి కూడా కాశినాయన మండల పరిధిలోని పలు గ్రామాల్లో తిరిగి అసమ్మతి నాయకులతో కలసి నియోజకవర్గ ఇన్‌చార్జి ఏకపక్ష నిర్ణయంతో కొనసాగలేమని, అలా అని పార్టీని వీడలేమన్నారు. సమస్యను అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకోనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ప్రభుత్వ ఉద్యోగులే బలి...

ప్రతి ఎమ్మెల్యే ఎన్నికలకు ప్రభుత్వ ఉద్యోగిని బరిలోకి దించడం, అభ్యర్థి ఓటమి పాలైన వెంటనే పక్కన పెట్టడం, మళ్లీ మరో ఉద్యోగిని బరిలోకి దించడం నియోజకవర్గంలో ఆనవాయితీగా మారిందని ఆయన బహిరంగంగా విమర్శలకు దిగడం ఆ పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

- 2009లో ప్రభుత్వ ఉద్యోగం చేసుకుంటున్న లక్కినేని చెన్నయ్యను టీడీపీ అభ్యర్థిగా బరిలో దింపగా ఆయన ఓటమిపాలయ్యాడు.
- అనంతరం బ్యాంకు మేనేజర్ ఉద్యోగం చేస్తున్న ఎన్డీ విజయజ్యోతిని 2014లో టీడీపీ అభ్యర్థిగా పోటీ పెట్టగా ఆమె కూడా ఓటమిపాలైంది. ఆమె అప్పట్లోనే 'నా ఓటమికి ఇన్‌చార్జి విజయమ్మ కారణమని' ప్రచారం చేశారు.
- డాక్టర్ ఉద్యోగం చేసుకుంటున్న ఓబుళాపురం రాజశేఖర్‌కు 2019లో టికెట్ కేటాయించి బరిలో నిలపగా ఆయన కూడా ఓడిపోయారు. అయితే ఆయన ఆ పార్టీని కనిపెట్టుకుని కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటూ వచ్చినా 2024లో టికెట్ ఇవ్వడంలేదని, డీఈగా కొనసాగుతున్న బొజ్జా రోషన్నకు టికెట్ ఇవ్వనున్నట్లు పార్టీ అధిష్టానం ప్రకటించడం గమనార్హం.

నకిలీ బంగారంతో రూ. 3 కోట్ల లోన్

బ్యాంక్‌ను బురిడీ కొట్టించిన గోల్డ్ అప్రైజర్ అరెస్ట్



కేసు వివరాలను వెల్లడిస్తున్న టూ టౌన్ సీఐ ఇబ్రహీం

ప్రొద్దుటూరు క్రైం: నకిలీ బంగారాన్ని తాకట్టు పెట్టించి బ్యాంక్‌లో రూ. 3 కోట్లకు రుణం తీసుకున్న గోల్డ్ అప్రైజర్‌తో పాటు మరో ఆరుగురిని వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. టూ టౌన్ సీఐ ఇబ్రహీం సోమవారం రాత్రి మీడియాకు వివరాలు వెల్లడించారు. ప్రొద్దుటూరులోని గురువయ్యతోటకు చెందిన పుల్లగూర చంద్రమోహన్‌రెడ్డి ఎస్‌బీఐ శివాలయం వీధి బ్రాంచ్‌లో గోల్డ్ అప్రైజర్‌గా పని చేసేవాడు. కొన్ని రోజుల క్రితం ఆయన కొంతమంది ఖాతాదారులతో కుమ్మక్కై నకిలీ బంగారు ఆభరణాలను బ్యాంక్‌లో తాకట్టు పెట్టించాడు. చంద్రమోహన్‌రెడ్డి వాటికి ప్యూరిటీ (స్వచ్ఛత) సర్టిఫికెట్ ఇవ్వడంతో బ్యాంక్ అధికారులు రూ. 3,17,40,647 రుణం మంజూరు చేశారు. ఇటీవల పరిశీలనలో గోల్డ్ అప్రైజర్ బండారం బయటపడింది. ఈ మేరకు స్టేట్‌బ్యాంక్ రీజినల్ మేనేజర్ బీఎంవీఎల్ నారాయణరావు ఫిర్యాదు మేరకు గత ఏడాది నవంబర్ 6న టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో నిందితులు గోల్డ్ అప్రైజర్ చంద్రమోహన్‌రెడ్డితో పాటు ప్రొద్దుటూరు వసంతపేటకు చెందిన పుష్ప చలపతి, అవ్వారు నాగశ్రీనివాసులురెడ్డి, బాలాజీనగర్‌కు చెందిన అచ్యుత గురుస్వామి, కడపలోని అరవిందనగర్‌లో ఉన్న రామాలయం వీధికి చెందిన అవ్వారు సుధాకర్, ఖాజీపేట మండలంలోని అప్పనపల్లెకు చెందిన నల్లమారు నాగేష్, తూగుట్ల వెంకటసుబ్బయ్యలను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.


ఫిరాయింపుదారుల అనర్హతకు వైఎస్సార్‌సీపీ చర్యలు

▶ మొదటి పేజీ తరువాయి

ఫిర్యాదు చేసింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా పోటీ చేసి శాసనసభకు ఎన్నికైన ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖరరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి పార్టీ ఫిరాయించారు. వారిపై చట్ట ప్రకారం అనర్హత వేటు వేయాలని కోరుతూ లెజిస్లేచర్ సెక్రటరీ జనరల్ పీపీకే రామాచార్యులుకు చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. అలాగే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా పోటీ చేసి శాసన మండలికి ఎన్నికైన వంశీకృష్ణ, సి.రామచంద్రయ్యలు పార్టీ ఫిరాయించారు. వారిపైనా చట్ట ప్రకారం అనర్హత వేటు వేయాలని కోరుతూ లెజిస్లేచర్ సెక్రటరీ జనరల్ పీపీకే రామాచార్యులుకు ఎమ్మెల్సీలు మేరుగు మురళి, లేళ్ల అప్పిరెడ్డి ఫిర్యాదు చేశారు.

26న ఇన్‌శాట్–3డీఎస్ ఉపగ్రహ ప్రయోగం!

ఈ నెలలోనే రెండో ప్రయోగానికి ఇస్రో సన్నద్ధం



సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఈ నెలలోనే రెండో ప్రయోగానికి సిద్ధమవుతోంది. ఈ నెల 26వ తేదీన సతీష్ ధావన్ స్పేస్ సెంటర్(షార్)లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్‌వీ ఎఫ్–14 రాకెట్ ద్వారా 2,060కిలోల బరువు కలిగిన ఇన్‌శాట్–3డీఎస్ అనే మెట్రాలజీ శాటిలైట్‌ను ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు. షార్‌లోని రెండో ప్రయోగ వేదికకు అనుసంధానంగా ఉన్న వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో రాకెట్ అనుసంధానం పనులు చేస్తున్నారు. ఇన్‌శాట్–3డీఎస్ ఉపగ్రహం ఇప్పటికే షార్‌కు చేరుకుంది. షార్‌లోని క్లీన్ రూమ్‌లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. వాతావరణ పరిశోధనకు ఉపయోగించే ఈ ఇన్‌శాట్–3డీఎస్ ఉపగ్రహానికి నాసా కూడా సహకారం అందించింది. ఈ ఉపగ్రహానికి సంబంధించి యాంటీనాను నాసా తయారు చేసి ఇచ్చింది. ఈ ఉపగ్రహంలో 6–చానెల్ ఇమేజర్, 19–చానెల్ సౌండర్ అనే పేలోడ్స్‌ను అమర్చి పంపిస్తున్నారు.ఈ ఏడాది 12 ప్రయోగాలను లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగుతున్న ఇస్రో జనవరిలోనే రెండు ప్రయోగాలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఒక ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తిచేసింది. అంతా సవ్యంగా సాగితే ఈ నెల 26న రెండో ప్రయోగం చేయనుంది. ఏదైనా కారణం వల్ల వాయిదా పడితే ఫిబ్రవరి మొదటి వారంలో ఈ ప్రయోగాన్ని పూర్తి చేయనున్నారు.

చంద్రబాబుకు ఇప్పుడు పేదలు గుర్తుకురావడం సిగ్గుచేటు

1,198వ రోజు రిలే నిరాహార దీక్షలో మండిపడిన బహుజన పరిరక్షణ సమితి నాయకులు



తాడికొండ: పద్నాలుగేళ్లు అధికారంలో ఉండి వ్యవస్థలను ఖూనీ చేసిన మాజీ సీఎం చంద్రబాబుకు ఇప్పుడు పేదలు గుర్తుకురావడం సిగ్గుచేటని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యాన గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 1,198వ రోజుకు చేరాయి. బహుజన నాయకులు మాట్లాడుతూ ధనదాహం, పదవి పిచ్చితో ఉన్న చంద్రబాబు సీఎం కుర్చీ కోసం అడ్డదారుల్లో వెళుతూ సమాజాన్ని తప్పుదారి పట్టిస్తున్నాడని మండిపడ్డారు. మళ్లీ అధికారంలోకి రాకపోతే తన అవినీతి మొత్తం బయటకు వచ్చి జీవితకాలం జైల్లో మగ్గిపోవాలనే భయంతో చంద్రబాబు రానున్న ఎన్నికల్లో ఎన్‌ఆర్‌ఐలను రంగంలోకి దించి కోట్ల రూపాయలు కుమ్మరించేందుకు సిద్ధమయ్యాడన్నారు. దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ఏపీలో పాలనా సంస్కరణలు తీసుకువచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా బహుజనుల ఖాతాలకు నగదు బదిలీ చేస్తున్నారని, దీంతో పేదలు ఎక్కడ ఆర్థికంగా స్థితిమంతులు అవుతారో అనే అక్కసుతో చంద్రబాబు చేస్తున్న అరాచకాలు అంతా ఇంతా కాదన్నారు. ఇప్పటికే ఏపీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఆర్థికంగా, రాజకీయంగా, నామినేటెడ్ పదవుల్లో ఉన్నత హోదాల్లో ఉన్నారని చెప్పారు. చంద్రబాబు మోసపూరిత మాటలను నమ్మితే పేదలు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు పులి దాసు, కారుమూరి పుష్పరాజు, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఎస్మాను రద్దు చేయాలి

సీపీఎం రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

సాక్షి, అమరావతి: ఎస్మాను రద్దు చేసి చర్చల ద్వారా సమస్యను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని ప్రభుత్వాన్ని సీపీఎం రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. విజయవాడలో సోమవారం ప్రతిపక్ష పార్టీల ప్రతినిధులతో సీపీఎం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించింది. అంగన్‌వాడీ, మున్సిపల్, సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మెపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జోక్యం చేసుకుని జీతాలు పెంచాలని కోరారు. సమ్మెను పరిష్కరించకపోతే రాష్ట్ర బంద్‌కు కూడా వెళ్తామని ప్రకటించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ తదితరులు మాట్లాడారు.

నాణ్యత లేని రొయ్య సీడ్ అమ్మితే కఠిన చర్యలు

- అప్సడా కో–వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్

సాక్షి, అమరావతి: నాణ్యత లేని రొయ్య పిల్లలు అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అప్సడా కో–వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ స్పష్టం చేశారు. అప్సడా ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్ అభివృద్ధి చేస్తున్నామని, ఈ యాప్ ద్వారా రైతులు కంపెనీల నుంచి కొనుగోలు చేసే సీడ్ వివరాలను రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. పంపిణీ చేసిన సీడ్ నాసిరకమైనదని నిర్ధారణ అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అప్సడా ఆధ్వర్యంలో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రాకిష్ వాటర్ ఆక్వా కల్చర్ (సిబా), కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ (సీఏఏ), ఎంపెడా, ఆల్ ఇండియా ష్రింప్ హేచరీస్ అసోసియేషన్ (ఐషా), జాతీయ, ఏపీ రొయ్య రైతుల సమాఖ్య ప్రతినిధులు, హేచరీలు, ప్రాసెసింగ్ ఆపరేటర్లతో సోమవారం తాడేపల్లిలోని ఏపీ సమాఖ్య కార్యాలయంలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆక్వా రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. ఎంపవరింగ్ కమిటీలో తీసుకున్న నిర్ణయాలను కచ్చితంగా అమలు చేయాల్సిందేనన్నారు. సీడ్ నాణ్యత విషయంలో రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా చర్యలు తప్పవన్నారు. ఇప్పటికే సీఏఏ ప్రాంతీయ కార్యాలయాన్ని ఏపీ ప్రభుత్వ ఒత్తిడితో విజయవాడలో ఏర్పాటు చేశారని, సిబాతో పాటు జాతీయ పరిశోధన సంస్థలు ప్రాంతీయ కార్యాలయాలను కూడా ఏపీలో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నాణ్యమైన సీడ్ పంపిణీ కోసం ప్రభుత్వ పరంగా ఎలాంటి చర్యలు చేపట్టాలనే విషయమై సమావేశంలో చర్చించిన విషయాలను ఎంపవరింగ్ కమిటీ ద్వారా సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. విదేశాల నుంచి తల్లి రొయ్యలు (బ్రూడ్ స్టాక్) దిగుమతి చేసుకునే కంపెనీలతో సంక్రాంతి తర్వాత సమావేశమై నాణ్యత నిర్ధారించేందుకు ప్రొటోకాల్ రూపకల్పనపై చర్చిద్దామని సూచించారు. బ్రూడ్ స్టాక్‌కు ఎప్పటికప్పుడు జెనెటిక్ పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. సీపీ కంపెనీ సరఫరా చేసే బ్రూడ్ స్టాక్ నాణ్యతా లోపాలపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి థాయ్‌లాండ్ నుంచి కంపెనీ ప్రెసిడెంట్ సిరా పాంగ్, వైస్ ప్రెసిడెంట్ అరుణ్ హాజరై రైతుల సందేహాలను నివృత్తి చేశారు.

నిషిద్ధ కాంతి చిక్కింది

కనువిందు చేస్తున్న సుదూర గెలాక్సీ • తొలిసారి బంధించిన హబుల్ టెలిస్కోప్

ఇప్పటిదాకా వినడమే తప్ప కంటికి కనబడని విశ్వపు సుదూరాల్లోని నిషిద్ధ కాంతి ఎట్టకేలకు చిక్కింది. దాన్ని హబుల్ టెలిస్కోప్ తాజాగా తన కెమెరాలో బంధించింది. భూమికి ఏకంగా 27.5 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో హైడ్రా నక్షత్ర రాశిలో ఉన్న ఎంసీజీ-01-24-014 స్పైరల్ గెలాక్సీ నుంచి వెలువడుతున్న ఈ కాంతి తరంగాలను ఒడిసిపట్టింది. వాటికి సంబంధించి అబ్బురపరిచే ఫొటోలను భూమికి పంపింది. టెలిస్కోప్ తాలూకు అడ్వాన్స్‌డ్ కెమెరా ఫర్ సర్వేస్ (ఏసీఎస్) ఈ ఘనత సాధించింది. అత్యంత స్పష్టతతో ఉన్న ఫొటోలు చూసి నాసా సైంటిస్టులతో పాటు అంతా సంభ్రమాశ్చర్యాలకు లోనవుతున్నారు. ఈ కిరణాల వెలుగులో కనువిందు చేస్తున్న ఎంసీజీ గెలాక్సీ అందాలకు ఫిదా అవుతున్నారు. కాస్మిక్ ఫొటోగ్రఫీ చరిత్రలోనే దీన్ని అత్యంత అరుదైన ఫీట్‌గా అభివర్ణిస్తున్నారు.

హబుల్ ఫొటోల్లో కన్పిస్తున్న ఎంసీజీ గెలాక్సీ పూర్తిస్థాయిలో వికసించిన నిర్మాణం, అత్యంత శక్తిమంతమైన కేంద్రకంతో కనువిందు చేస్తోంది. ఇది అత్యంత చురుకైన కేంద్రకాలున్న టైప్-2 సీఫెర్ట్ గెలాక్సీల జాబితాలోకి వస్తుందని నాసా పేర్కొంది. సీఫెర్ట్ గెలాక్సీలు అంతరిక్షంలో మనకు అత్యంత దూరంలో ఉండే అతి ప్రకాశవంతమైన నక్షత్ర మాలికలైన క్వాసార్ల సమీపంలో ఉంటాయి. అయితే క్వాసార్లు తామున్న గెలాక్సీలను బయటికి ఏమాత్రమూ కన్పించనీయనంతటి ప్రకాశంతో వెలిగిపోతుంటాయి. సీఫెర్ట్ గెలాక్సీలు మాత్రం వీక్షణకు అనువుగానే ఉంటాయి. కానీ అత్యంత సుదూరంలో ఉన్న కారణంగా వీటి వెలుతురు ఇప్పటిదాకా మనిషి కంటికి చిక్కలేదు. ఆ కారణంగానే సైంటిస్టుల పరిభాషలో దాన్ని 'నిషిద్ధ కాంతి'గా ముద్దుగా పిలుచుకుంటూ వస్తున్నారు. పైగా ఈ కాంతి పుంజాలు భూమ్మీద మనకు ఇప్పటిదాకా తెలిసిన పరిమాణ భౌతిక శాస్త్ర నియమాలకు పూర్తిగా అతీతమన్నది సైంటిస్టుల నమ్మకం. అనంత విశ్వంలో అంతటి సుదూర అంతరిక్ష క్షేత్రంలో మన భౌతిక శాస్త్ర నియమాలన్నీ తల్లకిందులవుతాయని వారు చెబుతుంటారు.

- సాక్షి, నేషనల్ డెస్క్



పుణే ఉప ఎన్నికపై సుప్రీం స్టే

న్యూఢిల్లీ: పుణే ఎంపీ గిరీశ్ బాపత్ మృతితో తొమ్మిది నెలలుగా ఖాళీగా ఉన్న ఆ ఎంపీ స్థానానికి వెంటనే ఉప ఎన్నికలు నిర్వహించాలంటూ ఈసీని ఆదేశిస్తూ బాంబే హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు పక్కనబెట్టింది. ప్రస్తుత లోక్‌సభ కాలపరిమితి జూన్ 16వ తేదీతో ముగుస్తున్న కారణంగా ఆ ఒక్క స్థానానికి ఉప ఎన్నిక నిర్వహణ వృథా అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం వ్యాఖ్యానించింది. '' ఈ స్థానం ఖాళీగా ఉంటే ఈసీ ఇన్ని రోజులు ఈసీ ఏం చేస్తున్నట్లు?. ఇలాంటి సందర్భాల్లో ఉప ఎన్నికలు నిర్వహించాల్సి వస్తే పాటించాల్సిన విధి విధానాలపై మార్గదర్శకాలను త్వరలో వెలువరిస్తాం' అని బెంచ్ పేర్కొంది. గత ఏడాది మార్చి 29వ తేదీన ఇక్కడి బీజేపీ ఎంపీ గిరీశ్ బాపత్ కన్నుమూశారు. ఈ స్థానానికి ఉపఎన్నికలు ఉండవని ఈసీ చెప్పడంతో పుణేకు చెందినన సుఘోష్ జోషి గతంలో బాంబే హైకోర్టును ఆశ్రయించారు. పుణే స్థానం ఖాళీ అయినప్పటి నుంచీ పలు అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలకు ఈసీ ఉప ఎన్నికలు నిర్వహించింది. పుణే విషయంలో ఈసీ గతంలో ఇచ్చిన వివరణ హేతుబద్ధంగా లేదు. అందుకే అక్కడ తక్షణం ఉప ఎన్నిక నిర్వహించండి'' అంటూ ఈసీని బాంబే హైకోర్టు ఆదేశించింది. వాటిని ఈసీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది.

ఆ రోజు ప్రపంచ వ్యాప్తంగా 'రామోత్సవం'

సాక్షి, న్యూఢిల్లీ: అయోధ్య రామాలయంలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ రోజు ప్రపంచ వ్యాప్తంగా వేడుకలు జరగనున్నాయి. అమెరికా, బ్రిటన్ సహా 50కిపైగా దేశాల్లో 'రామోత్సవం'నిర్వహించనున్నారు. ఆయా దేశాల్లో నివసిస్తున్న రామభక్తులు ఇప్పటికే కొన్ని దేశాల్లో శోభాయాత్రలకు కూడా శ్రీకారం చుట్టారు. విశ్వహిందూ పరిషత్ (విశ్వ విభాగం) ఆధ్వర్యంలో మరి కొన్ని దేశాల్లో భారీగా సన్నాహాలు జరుగుతున్నాయి. జనవరి 22న అమెరికాలో 300, జర్మనీలో 100, మారిషస్‌లో 100, కెనడా, ఆస్ట్రేలియాల్లో 30, బ్రిటన్‌లో 25 కార్యక్రమాలు నిర్వహించనున్నారు. హిందువులు తక్కువగా ఉన్న ఐర్లాండ్‌తో పాటు మరికొన్ని దేశాల్లో ఒక్కో కార్యక్రమం ఉంటుంది. ఇలా మొత్తం 50కి పైగా దేశాల్లో 500 పైగా ధార్మిక, వైదిక, సాంస్కృతిక పరమైన సామూహిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ వర్గాలు తెలిపాయి.

అద్దె గర్భాలను నిషేధించాలి: పోప్

రోమ్: అద్దె గర్భాలతో మాతృత్వం పొందడం అనేది సంప్రదాయబద్ధం కాదని, ఇలాంటి అనైతిక విధానాన్ని ప్రపంచమంతటా నిషేధించాలని పోప్ ఫ్రాన్సిస్ చెప్పారు. ఆధునిక యుగంలో గర్భం, మాతృత్వం కూడా వ్యాపారమయం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. అద్దెగర్భం అనేది మహిళల గౌరవాన్ని కించపర్చడమే అవుతుందని అన్నారు. ఆయన సోమవారం వాటికన్ సిటీలో వివిధ దేశాల ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం, ఇజ్రాయెల్-పాలస్తీనా యుద్ధం గురించి ప్రస్తావించారు. ప్రపంచంలో శాంతియుత పరిస్థితులు నానాటికీ క్షీణిస్తున్నాయని, శాంతికి, మానవత్వానికి విఘాతం కలుగుతోందని చెప్పారు. ఈ పరిణామం ఎంతమాత్రం క్షేమకరం కాదని అన్నారు. కొన్ని దేశాల్లో సంక్షోభాలు, ఫలితంగా వలసలు పెరిగిపోతుండడం, వాతావరణ మార్పులతో ప్రకృతి విపత్తులు విరుచుకుపడుతుండడం పట్ల పోప్ ఆందోళన వ్యక్తం చేశారు. అణ్వాయుధాల ఉత్పత్తి పెచ్చరిల్లుతుండడం భూగోళంపై మానవాళికి మనుగడకు ఎప్పటికైనా ముప్పేనని పేర్కొన్నారు.

బంగ్లాదేశ్ ఎన్నికల్లో 'అవామీ' విజయం

- 300 పార్లమెంట్ స్థానాలకు 223 స్థానాలు కైవసం
- 62 నియోజకవర్గాల్లో నెగ్గిన స్వతంత్ర అభ్యర్థులు
- వరుసగా నాలుగోసారి ప్రధానమంత్రిగా షేక్ హసీనా

ఢాకా: బంగ్లాదేశ్ పార్లమెంట్ ఎన్నికల్లో అధికార అవామీ లీగ్ మరోసారి ఘన విజయం సాధించింది. మొత్తం 300 పార్లమెంట్ స్థానాలకు గాను 299 స్థానాల్లో ఎన్నికలు నిర్వహించగా, అవామీ లీగ్ ఏకంగా 223 స్థానాలు సొంతం చేసుకుంది. ఎన్నికలు ఆదివారం జరగ్గా, సోమవారం ఓట్ల లెక్కింపు పూర్తయ్యింది. తుది ఫలితాలు వెలువడ్డాయి. పార్లమెంట్‌లో ప్రధాన ప్రతిపక్షమైన జతియా పార్టీ 11 సీట్లు గెలుచుకుంది. బంగ్లాదేశ్ కల్యాణ్ పార్టీ కేవలం ఒక స్థానంలో గెలుపొందింది. 62 స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులు జయకేతనం ఎగురవేశారు. అలాగే జతియా సమాజ్ తాంత్రిక్ దళ్, వర్కర్స్ పార్టీ ఆఫ్ బంగ్లాదేశ్ ఒక్కో స్థానం చొప్పున గెలుచుకున్నాయి. అవామీ లీగ్ అధినేత, ప్రధానమంత్రి షేక్ హసీనా గోపాల్‌గంజ్-3 నియోజకవర్గం నుంచి అఖండ విజయం సాధించారు. బంగ్లాదేశ్ పార్లమెంట్‌కు ఆమె ఎన్నిక కావడం ఇది ఎనిమిదోసారి కావడం విశేషం.

హసీనా రికార్డు

76 ఏళ్ల షేక్ హసీనా 2009 నుంచి ప్రధానిగా కొనసాగుతున్నారు. ఇప్పుడు వరుసగా నాలుగోసారి బాధ్యతలు చేపట్టబోతున్నారు. మొత్తంగా ఆమె ప్రధాని అవుతుండడం ఇది ఐదోసారి. బంగ్లా చరిత్రలో అత్యధిక కాలం ప్రధానిగా పనిచేసిన నేతగా రికార్డు సృష్టించబోతున్నారు. మాజీ ప్రధాని ఖలీదా జియా నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీతో పాటు మరో 15 పార్టీలు ఈసారి ఎన్నికలకు దూరంగా ఉన్నాయి. ఈసారి కేవలం 41.8 శాతం పోలింగ్ నమోదైంది. 2018 ఎన్నికల్లో 80 శాతానికి పైగా నమోదవడం విశేషం.



ఇండియా గొప్ప మిత్రదేశం

భారత్ తమకు గొప్ప మిత్రదేశమని బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా కొనియాడారు. ఎన్నికల్లో విజయం అనంతరం ఆమె సోమవారం మీడియాతో మాట్లాడారు. ఇరుగుపొరుగు దేశాలైన భారత్-బంగ్లాదేశ్ ఎన్నో సమస్యలను కలిసి పరిష్కరించుకున్నాయని చెప్పారు. 1971, 1975లో భారత్ తమకు అండగా నిలిచిందని గుర్తుచేశారు. తనకు, సోదరికి, కుటుంబ సభ్యులకు ఆశ్రయం కల్పించిందని అన్నారు. ఇండియాను తమ పక్కింటిలాంటి మిత్రదేశంగా భావిస్తామని తెలిపారు. ఇండియాతో తమకు అద్భుతమైన సంబంధాలు ఉన్నాయని వెల్లడించారు. హసీనాకు ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. బంగ్లాదేశ్‌తో సంబంధాల బలోపేతానికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.

రాయ్‌బరేలీ, అమేథీల్లో సమరమే!

- యూపీలో కాంగ్రెస్ పార్టీ కంచుకోటల్లో పోటీకి సమాజ్‌వాదీ పార్టీ సన్నద్ధం
- 'ఇండియా' కూటమిలోకి బీఎస్పీ రాకను వ్యతిరేకిస్తున్న అఖిలేశ్ యాదవ్

సాక్షి, న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి వారి కంచుకోటలుగా పేరొందిన లోక్‌సభ నియోజకవర్గాల్లో పోటీ చేయడానికి సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) సిద్ధమవుతోంది. ఇటీవల జరిగిన మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ మధ్య పొత్తు విఫలమైంది. ప్రతిపక్ష 'ఇండియా' కూటమిలోకి బీఎస్పీని ఆహ్వానించాలన్న ప్రతిపాదనను సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ యాదవ్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దాంతో ఉత్తరప్రదేశ్‌లో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. బీఎస్పీ అధినేత్రి మాయావతి, అఖిలేశ్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. యూపీలోని 80 లోక్‌సభ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీలను నియమించింది. ప్రస్తుతం యూపీలో రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్‌ఎల్‌డీ), అప్నాదళ్ (కమేరావాదీ)తో సమాజ్‌వాదీ పార్టీ పొత్తు కొనసాగిస్తోంది.

సర్వశక్తులూ ఒడ్డుతాం: అఖిలేశ్

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని గద్దె దించడానికి సర్వశక్తులూ ఒడ్డుతామని, సంక్రాంతి తర్వాత పొత్తులపై మాట్లాడుతామని అఖిలేష్ యాదవ్ ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీతో స్నేహాన్ని వదులుకొని, తమ మిత్రపక్షాలతో కలిసి పోటీ చేయాలని ఆయన భావిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇటీవలి మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తమను బాగా అవమానించిందన్న భావన ఆయనలో ఉందంటున్నారు. యూపీలో కాంగ్రెస్ కంచుకోటలుగా పేరొందిన రాయ్‌బరేలీ, అమేథీ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో ఎస్పీ నుంచి అభ్యర్థులను బరిలో దింపేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ రెండు నియోజకవర్గాల్లో సమాజ్‌వాదీ పార్టీకి బలమైన క్యాడర్ ఉంది. అమేథీ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఐదు అసెంబ్లీ స్థానాల్లో ఎస్పీకి ఇద్దరు, బీజేపీకి ముగ్గురు ఎమ్మెల్యేలు ఉండగా, కాంగ్రెస్ పార్టీకి ఒక్క ఎమ్మెల్యే కూడా లేరు. రాయ్‌బరేలీ పరిధిలోని ఐదు అసెంబ్లీ స్థానాల్లో ఎస్పీకి నలుగురు, బీజేపీకి ఒక ఎమ్మెల్యే ఉన్నారు. కాంగ్రెస్ అగ్రనేత, సిట్టింగ్ ఎంపీ సోనియా గాంధీ ఇక్కడి నుంచి ఒక్క ఎమ్మెల్యేను కూడా గెలిపించుకోలేకపోయారు. రాయ్‌బరేలీ నుంచి ఉంచాహార్ ఎమ్మెల్యే మనోజ్ పాండేను, అమేథీ నుంచి గౌరీగంజ్ ఎమ్మెల్యే రాకేశ్ ప్రతాప్‌సింగ్‌ను బరిలో దింపే యోచనలో అఖిలేశ్ ఉన్నట్లు సమాచారం. నిజానికి కాంగ్రెస్, ఎస్పీ మధ్య పొత్తు లేనప్పుడు రాయ్‌బరేలీ, అమేథీ నుంచి సమాజ్‌వాదీ పార్టీ తమ అభ్యర్థులను పోటీ చేయించలేదు. ఈసారి మాత్రం పోటీకి సై అంటుండడం ఆసక్తికరంగా మారింది. సమాజ్‌వాదీ అభ్యర్థులు పోటీ చేస్తే రెండు కీలక నియోజకవర్గాల్లో ఎన్నికల పోరు రసవత్తరంగా మారనుంది. అప్పుడు కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం చెమటోడ్చక తప్పదు.

రాజస్తాన్‌లో బీజేపీకి భంగపాటు

ఉప ఎన్నికల్లో ఓడిపోయిన మంత్రి

జైపూర్: ఇటీవల రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో గెలిచి అధికారం కైవసం చేసుకున్న బీజేపీ సోమవారం ఒక అసెంబ్లీ స్థానం ఉపఎన్నికల్లో ఓటమిని చవిచూసింది. భజన్‌లాల్ శర్మ మంత్రివర్గంలో సహాయక మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సురేంద్ర పాల్ సింగ్ కరణ్‌పూర్ ఉపఎన్నికల్లో ఓడిపోయారు. పోలింగ్ జనవరి ఐదున జరగ్గా ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. మంత్రి సురేంద్రపాల్‌పై 11వేలకుపైగా మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి రూపీందర్ కూనర్ ఘన విజయం సాధించారు. రూపీందర్ తండ్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే గుర్మీత్ సింగ్ మరణించడంతో ఈ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో కాంగ్రెస్ గుర్మీత్ తనయుడికి టికెట్ ఇచ్చి బరిలోకి దింపింది. మంత్రి ఓటమిపై కాంగ్రెస్ స్పందించింది. ''బీజేపీ ప్రభుత్వం తమ వ్యక్తులను మంత్రులుగా చేయగలదు. కానీ ఎమ్మెల్యేగా చేయలేదు. ప్రజాప్రతినిధ్యం వహించగల నేతనే ఎమ్మెల్యే అవగలరు'' అని ఎద్దేవాచేసింది.

682 జేఎన్.1 కేసులు

న్యూఢిల్లీ: దేశంలోని 12 రాష్ట్రాల్లో ఈ నెల 7వ తేదీ వరకు కోవిడ్-19 సబ్ వేరియంట్ జేఎన్.1 కేసులు 682 బయటపడ్డాయి. ఇందులో అత్యధికంగా కర్ణాటకలో 199 కేసులను గుర్తించగా, ఆ తర్వాతి స్థానంలో ఉన్న కేరళలో 148, మహారాష్ట్రలో 139, గోవాలో 47, గుజరాత్‌లో 36, ఏపీలో 30, రాజస్తాన్‌లో 30, తమిళనాడులో 26, ఢిల్లీలో 21, ఒడిశాలో 3, తెలంగాణలో 2, హరియాణాలో ఒక కేసు బయటపడ్డాయని ఓ అధికారి చెప్పారు. జేఎన్.1 వేరియంట్‌కు సంబంధించిన కేసులు దేశంలో పెరుగుతున్నప్పటికీ ఆందోళన అవసరం లేదని ఆ అధికారి అన్నారు. స్వల్ప లక్షణాలతో ఇంటి వద్ద చికిత్సతోనే వ్యాధి నయమవుతోందని అన్నారు. ఇలా ఉండగా, దేశంలో 24 గంటల వ్యవధిలో కోవిడ్ కొత్త కేసులు 605 నమోదైనట్లు కేంద్ర ఆరోగ్య శాఖ సోమవారం తెలిపింది. యాక్టివ్ కేసులు 4002 ఉన్నాయని పేర్కొంది. కేరళలో ఇద్దరు, కర్ణాటక, త్రిపురల్లో ఒక్కరేసి చొప్పున కోవిడ్ బాధితులు చనిపోయినట్లు వివరించింది.

పేదల ప్రగతితో బలమైన భారత్

'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'లో ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ: పేదలు, రైతులు, మహిళలు, యువత సాధికారత సాధిస్తే దేశం శక్తివంతంగా మారుతుందని, బలమైన భారత్ ఆవిర్భవిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కేవలం ప్రభుత్వ యాత్రగానే కాదు, దేశ యాత్రగా మారిందని చెప్పారు. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా ప్రధాని మోదీ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. గత ప్రభుత్వాల హయాంలో రైతన్నలు నిర్లక్ష్యానికి గురయ్యారని, అప్పట్లో ప్రభుత్వ వ్యవసాయ విధానాలు కేవలం ఉత్పత్తి, అమ్మకానికే పరిమితం అయ్యాయని విమర్శించారు. తమ ప్రభుత్వం వచ్చాక అన్నదాతల సమస్యల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టామని చెప్పారు. పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ప్రతి రైతుకు ఇప్పటిదాకా రూ.30,000 బదిలీ చేశామని తెలిపారు. వ్యవసాయ సహకార సంఘాలను, వ్యవసాయ ఉత్పత్తి సంస్థలను బలోపేతం చేశామని అన్నారు. గోదాములు నిర్మించామని, పంటల నిల్వ సామర్థ్యాలను పెంచామని, ఆహార శుద్ధి పరిశ్రమను ఎంతగానో ప్రోత్సహించామని గుర్తుచేశారు. ''కంది పప్పును ఆన్‌లైన్ ద్వారా నేరుగా ప్రభుత్వానికి విక్రయించే సదుపాయాన్ని కల్పించాం. వారికి మార్కెట్ రేటు కంటే మెరుగైన ధర చెల్లిస్తున్నాం. పప్పుల కొనుగోలు కోసం విదేశాలకు చెల్లించే సొమ్ము మన రైతుల చేతికే అందాలన్నది మా ఉద్దేశం'' అన్నారు. గిరిజన ప్రాంతాల్లో నివసించే ప్రజల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు.

ప్రతి మూలకూ 'మోదీ గ్యారంటీ'

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలన్నదే వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర లక్ష్యమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అర్హుల్లో ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదన్నారు. అర్హులకు సక్రమంగా, సంతృప్త స్థాయిలో పథకాలు అందితేనే 'అభివృద్ధి చెందిన భారత్' సాధ్యమని చెప్పారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంభాషించారు. వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ యాత్ర ఇటీవలే 50 రోజులు పూర్తి చేసుకుందని, దేశమంతటా 11 కోట్ల మంది ప్రజలతో నేరుగా అనుసంధానమైందని హర్షం వ్యక్తం చేశారు. 'మోదీ కీ గ్యారంటీవాలీ గాడీ' దేశంలో ప్రతి మూలకూ వెళ్తోందని తెలిపారు. ప్రభుత్వ పథకాల కింద లబ్ధి కోసం సుదీర్ఘకాలం ఎదురు చూసే పేదలు ఇప్పుడు ఒక అర్థవంతమైన మార్పును చూస్తున్నారని పేర్కొన్నారు. పథకాలు అర్హుల గడప వద్దకే వెళ్తున్నాయన్నారు. ప్రస్తుత, భావి తరాల యువత గత తరాల కంటే మెరుగైన జీవితం గడపాలని ఆకాంక్షించారు.



హరియాణా మాజీ ఎమ్మెల్యేను అరెస్ట్ చేసిన ఈడీ

చండీగఢ్: అక్రమ మైనింగ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు సోమవారం హరియాణా మాజీ ఎమ్మెల్యే దిల్బాగ్ సింగ్, ఆయన సహాయకుడు కుల్వీందర్ సింగ్‌ను అరెస్ట్ చేశారు. ఇండియన్ నేషనల్ లోక్‌దళ్(ఐఎన్‌ఎల్‌డీ)కి చెందిన మాజీ ఎమ్మెల్యే సింగ్, కాంగ్రెస్ ఎమ్మెల్యే సురేందర్ పన్వర్, వారికి సంబంధించిన సంస్థలపై ఈ నెల 4న మొదలైన ఈడీ సోదాలు సోమవారం ముగిశాయి. సోదాల్లో అయిదు రైఫిళ్లు, 300 బుల్లెట్లు, 100కు పైగా లిక్కర్ బాటిళ్లు, రూ.5 కోట్ల నగదు దొరికాయని ఈడీ వర్గాలు తెలిపాయి.

అర్ధ శతాబ్ది తర్వాత చంద్రుడిపై అమెరికా కన్ను



కేప్ కనావరెల్(యూఎస్): యాభై సంవత్సరాల తర్వాత అమెరికా చంద్రుడిపై పరిశోధనలకు నడుం బిగించింది. ఆర్టెమిస్ మిషన్ సన్నాహకాల్లో భాగంగా నాసా.. ఆస్ట్రోబోటిక్ టెక్నాలజీ వారు తయారుచేసిన పెరిగ్రీన్ ల్యాండర్‌ను యూనైటెడ్ లాంఛ్ అలయన్స్ వల్కన్ రాకెట్ ద్వారా నింగిలోకి పంపింది. సోమవారం ఫ్లోరిడాలోని కేప్ కనావరెల్ స్పేస్ ఫోర్స్ స్టేషన్ నుంచి రాకెట్‌ను ప్రయోగించారు. పలుమార్లు కక్ష్యలను మార్చుకుంటూ ఫిబ్రవరి 23వ తేదీన అది చంద్రుడిపై దిగనుంది. దాదాపు రూ.900 కోట్ల వ్యయంతో ఈ ల్యాండర్‌ను తయారుచేశారు. ల్యాండర్ తయారీలో ఆస్ట్రోబోటిక్‌కు అవకాశం ఇవ్వడం ద్వారా నాసా.. అంతరిక్ష 'డెలివరీ' సేవల రంగంలోకి ప్రైవేట్ సంస్థలను ఆహ్వానించినట్లయింది. చంద్రుడిపై దిగాక పెరీగ్రీన్ పలు పరిశోధనలు చేయనుంది. ఈ పరిశోధనలు ఈ ఏడాది చివర్లో నాసా నలుగురు వ్యోమగాములతో చేపట్టే ప్రయోగానికి సాయపడనున్నాయి. ఆస్ట్రోబోటిక్‌తోపాటు నోవా-సీ ల్యాండర్‌ను తయారుచేసేందుకు హ్యూస్టన్‌కు చెందిన ఇంట్యూటివ్ మెషీన్స్‌తోనూ నాసా ఒప్పందం కుదుర్చుకుంది. నోవా-సీను ల్యాండర్‌ను వచ్చే నెలలో స్పేస్‌ఎక్స్ రాకెట్ ద్వారా చంద్రుడి మీదకు పంపనున్నారు. నేరుగా ప్రయాణం కారణంగా పెరిగ్రీన్ కంటే ముందుగా వారం రోజుల్లోనే ఇది చంద్రుడిపై దిగనుంది. 1960, 70 దశకాల్లో చంద్రుడిపై విజయవంతంగా ల్యాండింగ్‌లతో అమెరికా, సోవియట్ యూనియన్‌లు పోటాపోటీగా ప్రయోగాలు చేపట్టడం తెల్సిందే. చంద్రుడిపై శోధనాపర్వంలో 2013లో చైనా, 2023లో భారత్ చేరాయి. గతేడాది రష్యా, జపాన్ ల్యాండర్లు విఫలమయ్యాయి.

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇళ్లపై ఈడీ దాడులు

బెంగళూరు: కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే కేవై నంజెగౌడకు సంబంధించిన సంస్థల్లో సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు సోదాలు జరిపారు. కోలార్ జిల్లా మాలూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన నంజెగౌడ కోలార్-చిక్కబళ్లాపూర్ జిల్లా సహకార పాల ఉత్పత్తిదారుల సంఘం లిమిటెడ్ అధ్యక్షుడిగా ఉన్నారు. కోముల్‌లో సిబ్బంది నియామకాల్లో అవకతవకలు జరిగాయన్న కేసుల ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కేసు ఆయనపై నమోదు చేసింది. సోమవారం మాలూర్, కోలార్‌లలోని నంజెగౌడ ఇళ్లు, సంబంధించిన సంస్థలపై దాడులు జరిపినట్లు ఈడీ అధికార వర్గాలు తెలిపాయి.

ముదిరిన లక్షద్వీప్-మాల్దీవుల వివాదం

దౌత్యవేత్తను పిలిచి తీవ్ర నిరసన వ్యక్తం చేసిన విదేశాంగ శాఖ

న్యూఢిల్లీ: 'లక్షద్వీప్-మాల్దీవుల' వివాదం ముదురుతోంది. మన పర్యాటక రంగంపై మాల్దీవుల మంత్రుల వివాదాస్పద వ్యాఖ్యలతో మొదలైన 'బాయ్‌కాట్ మాల్దీవ్స్' పిలుపుకు అన్ని వర్గాల నుంచి మద్దతు పెరుగుతోంది. ఆ దేశ దౌత్యవేత్త అలీ నజీర్ మొహమ్మద్‌తో భారత హైకమిషనర్ మునుముహావర్ సోమవారం సమావేశమయ్యారు. భారత్ పట్ల, ప్రధాని మోదీ పట్ల మాల్దీవుల మంత్రుల వ్యాఖ్యలను ఎండగట్టారు. వారిని మాల్దీవులు ఇప్పటికే సస్పెండ్ చేయడం తెలిసిందే. అయినా దీనిపై భారతీయ సమాజంలో ఆగ్రహావేశాలు తగ్గలేదు. అమితాబ్ బచ్చన్, సల్మాన్ ఖాన్, శ్రద్ధా కపూర్, వెంకటేశ్ ప్రసాద్, వీరేందర్ సెహ్వాగ్ తదితర సెలెబ్రిటీలు కూడా 'బాయ్‌కాట్ మాల్దీవ్స్'కు జై కొట్టారు. మాల్దీవుల పర్యటన మానేసి లక్షద్వీప్, అండమాన్ వంటి భారతీయ రమణీయ కేంద్రాలకు వెళ్లాలంటూ ఫొటోలను షేర్‌చేశారు. మాల్దీవులతో వాణిజ్య కార్యకలాపాలు తగ్గించుకోవాలని కన్ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా ట్రేడర్స్ పిలుపునిచ్చింది.

3,400 శాతం పెరిగిన సెర్చింగ్!

లక్షద్వీప్‌లో మోదీ పర్యటన తర్వాత ఆన్‌లైన్ వేదికల్లో భారత దీవుల కోసం వెతికే వారి సంఖ్య ఏకంగా 3,400 శాతం పెరిగిందని మేక్‌మైట్రిప్ సంస్థ పేర్కొంది. మాల్దీవులకు పర్యాటకుల్లో భారతీయుల సంఖ్యే అత్యధికమని ఆ దేశ పర్యాటక శాఖ గణాంకాల్లో వెల్లడైంది. గతేడాది 2.09 లక్షల మంది భారతీయులు అక్కడికెళ్లారు. 2022లో 2.4 లక్షలు, 2021లో 2.11 లక్షల మంది పర్యటించారు. అంతేకాదు, కోవిడ్ కాలంలోనూ 63,000 మంది అక్కడ పర్యటించారు!

ట్రెండింగ్‌లో లక్షద్వీప్

మాల్దీవులకు బదులు భారతీయ పర్యాటక కేంద్రాలకే వెళ్దామన్న సెలబ్రిటీలు పిలుపుతో లక్షద్వీప్ కోసం ఆన్‌లైన్‌లో సెర్చింగ్ అనూహ్యంగా పెరిగింది. 'లక్షద్వీప్' పదంతో ప్రపంచవ్యాప్తంగా సెర్చింగ్ చేస్తున్న వారి సంఖ్య గత రెండు దశాబ్దాల్లో ఎప్పుడూ లేనంత ఎక్కువ స్థాయికి చేరుకుందని 'గూగుల్ ట్రెండ్స్' గణాంకాలను బట్టి తెలుస్తోంది. ఈజ్‌మైట్రిప్ సంస్థ భారత్‌కు మద్దతుగా మాల్దీవులకు విమానాల బుకింగ్స్‌ను రద్దుచేసింది. ''మాల్దీవులు/సీషెల్స్ మాదిరే లక్షద్వీప్‌లోని బీచ్‌లు, పరిసరాలు అద్భుతంగా ఉంటాయి. ఇక్కడే పర్యటించండి'' అని సంస్థ సీఈవో నిషాంత్ పిట్టి చెప్పారు.

పోలియో టీకా బృందంపై ఉగ్ర పంజా

ఆరుగురు పోలీసులు మృతి..మరో 22 మందికి గాయాలు

పెషావర్: పోలియో టీకా సిబ్బందికి రక్షణగా వెళ్లిన పోలీసులే లక్ష్యంగా ఉగ్రవాదులు విసిరిన బాంబు పేలి ఆరుగురు పోలీసులు చనిపోయారు. మరో 22 మంది గాయపడ్డారు. పాకిస్తాన్‌లోని కల్లోల ప్రాంతం ఖైబర్ పంక్తున్వా ప్రావిన్సులో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. అఫ్గానిస్తాన్ సరిహద్దులకు సమీపంలోని బజౌర్ జిల్లా మముంద్ తహశీల్‌కు సోమవారం ఉదయం పోలియో టీకా సిబ్బంది చేరుకున్నారు. గతంలో వారిపై ఉగ్రవాదులు దాడి చేసిన దాఖలాలుండటంతో వారికి భద్రత కల్పించేందుకు పోలీసులు కూడా వచ్చారు. పోలీసులున్న వ్యానుపైకి ఉగ్రవాదులు బాంబులు విసిరారు. దీంతో ఆరుగురు పోలీసు సిబ్బంది మృతి చెందగా మరో 22 మంది గాయపడ్డారు. పోలియో టీకా సిబ్బంది సురక్షితంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. క్షతగాత్రులైన పోలీసుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెబుతున్నారు. ఈ ఘటనకు తామే కారణమంటూ తెహ్రీక్-ఇ- తాలిబన్ పాకిస్తాన్(టీటీపీ)ప్రకటించుకుంది.

పోలీస్ స్టేషన్‌కు నిప్పు పెట్టేశాడు!

దర్భంగా: బిహార్‌లోని దర్భంగా జిల్లాలో ఓ వ్యక్తి పోలీస్ స్టేషన్‌కు నిప్పుపెట్టాడు. ధర్మేంద్ర ఠాకూర్ అనే వ్యక్తి ఆదివారం రాత్రి అరుణ్ యాదవ్ అనే వ్యక్తితో కలిసి మోరో పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. ఆ రోజు తన అన్నతో గొడవ జరిగిందని, అనంతరం అతడు కనిపించకుండాపోయాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అర్ధరాత్రి వరకు అక్కడే పోలీస్ స్టేషన్ ఆవరణలోనే తచ్చాడాడు. డ్యూటీలో ఉన్న పోలీసు సిబ్బంది నిద్రిస్తున్న సమయంలో, స్టేషన్ ఆవరణలోనే చిన్నచిన్న డబ్బాల్లో ఉన్న ద్రావకాన్ని చల్లి నిప్పంటించాడు. మంటలు వెంటనే స్టేషన్‌కు వ్యాపించాయి. సిబ్బంది వెంటనే మంటలను అదుపులోకి తెచ్చారు. ఇదంతా అక్కడి సీసీ టీవీ ఫుటేజీలో నమోదైంది. కొద్ది గంటల తర్వాత పోలీసులు ధర్మేంద్ర ఠాకూర్‌ను పట్టుకున్నారు. అతడు ఎందుకు నిప్పుపెట్టాడో పోలీసులు చెప్పడం లేదు.

ఇజ్రాయెల్ దాడుల్లో హెజ్బొల్లా కమాండర్ మృతి

బీరుట్: దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయెల్ సోమవారం జరిపిన వైమానిక దాడుల్లో హెజ్బొల్లా సీనియర్ కమాండర్ ఒకరు మృతి చెందినట్లు లెబనాన్ రక్షణ శాఖ అధికారి వెల్లడించారు. హెజ్బొల్లా గ్రూపులోని రద్వాన్ ఫోర్సెస్‌కు చెందిన సీనియర్ కమాండర్ తన ఎస్‌యూవీలో వెళ్తుండగా ఖిర్బెట్ సెల్మ్ గ్రామం వద్ద ఇజ్రాయెల్ ఆర్మీ జరిపిన దాడిలో ఆయన చనిపోయినట్లు చెప్పారు. మృతి చెందిన కమాండర్ పేరును మాత్రం ఆయన వెల్లడించలేదు. లెబనాన్-ఇజ్రాయెల్ సరిహద్దుల్లో ఇరాన్ మద్దతున్న హెజ్బొల్లా మిలిటెంట్లు, ఇజ్రాయెల్ మిలటరీకి మధ్య పోరు ఉధృతంగా సాగుతున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. కాగా, తాజా దాడిపై ఇజ్రాయెల్ స్పందించలేదు. తమ ఫైటర్ విమానాలు దక్షిణ లెబనాన్‌లోని హెజ్బొల్లా మౌలిక వసతులే లక్ష్యంగా దాడులు చేసినట్లు తెలిపింది. హెజ్బొల్లా కూడా స్పందించలేదు.

గుడులతో మానసిక బానిసత్వం

బిహార్ విద్యా మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు

రోహ్‌తాస్: దేవాలయాలు మానసిక బానిసత్వానికి దారి తీస్తే, స్కూళ్లు జీవితానికి వెలుగు చూపుతాయని ఆర్‌జేడీకి చెందిన బిహార్ విద్యా మంత్రి చంద్ర శేఖర్ పునరుద్ఘాటించారు. ఇటీవల ఇటువంటి వ్యాఖ్యలే చేసి తీవ్ర విమర్శలనెదుర్కొన్న తమ పార్టీ ఎమ్మెల్యే ఫతేహ్ బహదూర్ సింగ్‌కు ఆయన మద్దతు పలికారు. అయోధ్యలోని రామ మందిరాన్ని జేబులు నింపుకునే దోపిడీ ప్రదేశంగా ఆదివారం పేర్కొన్నారు. ''అయోధ్యలో రామాలయం కోసం కేటాయించిన ఆ ప్రాంతం కేవలం దోపిడీ కోసమే. ఒక వర్గానికి చెందిన కుట్రదారుల జేబులు నింపే ప్రదేశమది. నకిలీ హిందుత్వ, నకిలీ జాతీయవాదుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. రాముడు ప్రతి ఒక్కరి గుండెల్లో ఉన్నాడు. ఆయన కోసం ఏ గుడికీ, ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదు'' అని చంద్రశేఖర్ చెప్పారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
మంగళవారం : 9 : జనవరి : 2024

టీచర్ల నిరసన

సోమవారం బెంగళూరు స్వతంత్ర పార్కులో పాలికె పాఠశాలల కాంట్రాక్టు టీచర్ల ఆందోళన. ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు



న్యూస్‌రీల్

ఉన్నతాధికారి వేధింపులు.. చిరుద్యోగి ఆత్మహత్య



మృతుడు పరమేశ్ (ఫైల్)

మైసూరు: ఉప తహశీల్దార్ వేధింపులు తాళలేక విసిగిపోయి కంప్యూటర్ ఆపరేటర్ ఆఫీసులోనే ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నంజనగూడు తాలూకా హుల్లహళ్లిలో జరిగింది. పరమేశ్ (36) అనే కంప్యూటర్ ఆపరేటర్‌ను నిత్యం మానసికంగా ఉపతహశీల్దార్ శివకుమార్ వేధించేవాడు. ఆఫీసులో పురుగులమందు తాగి పడిపోయిన పరమేశ్‌ను ఇతర ఉద్యోగులు చూసి కేఆర్ ఆస్పత్రికి తరలించగా అక్కడ మరణించాడు. శివకుమార్ వేధింపులే కారణమని డెత్‌నోట్‌లో రాశాడు. నంజనగూడు ఎమ్మెల్యే దర్శన్, జిల్లాధికారి డాక్టర్ రాజేంద్ర ఆస్పత్రికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. శివకుమార్‌ను సస్పెండ్ చేశారు.

అగ్రి విద్యార్థులకు జాగృతి



గౌరిబిదనూరు: తాలూకా గదరె జీపి కెంకరె గ్రామంలో కృషి విశ్వవిద్యాలయం, పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ విద్యార్థులకు జాగృతి కార్యక్రమం జరిగింది. పొలాల్లో, రైతులతో కలిసి ప్రత్యక్ష అనుభవాన్ని పొందడానికై గ్రామంలో కొన్నిరోజులుగా మకాం వేసి పొలం పనుల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రైతులు పంటల విక్రయాల్లో మధ్యవర్తుల సమస్యలు తొలగాలి. విజ్ఞాన ఫలితాలు రైతులకందాలి, అప్పుడే రైతుల జీవితాలలో వెలుగు చూడవచ్చని అన్నారు. ఇప్పటి ఆధునిక ప్రజలు చిరుధాన్యాల వైపు మొగ్గ చూపుతున్నారు, తక్కువ వర్షాపాతంలోనే ఈ పంటల్ని పండించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గదరె జీపి అధ్యక్షురాలు లక్ష్మీనరసమ్మ, జీకేవీకే ముఖ్యులు డా. వెంకటేశ్, హోసూరు మంజునాథ్, రైతులు పాల్గొన్నారు.

సౌందర్య పోటీల్లో ప్రతిభ



నీతా సంతోష్

బనశంకరి: బెళగావి కి చెందిన నీతా సంతోష్. శిరగాంవకర్ మిసెస్ ఏషియా సూపర్‌మోడల్ పురస్కారం దక్కించుకుంది. పెళ్లయ్యాక ఇంటికే పరిమితం కాకుండా అందాల పోటీల్లో సత్తా చాటుకుంది. డిసెంబరు 28 తేదీన ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో మిగతా పోటీదారులను కాదని టాప్‌లో నిలిచింది. ఆమె గతంలో మిసెస్ ఇండియా కర్ణాటక పోటీల్లో బెళగావి జిల్లా విన్నర్ సహా పలు టైటిళ్లను గెలుచుకుంది. ఆమె భర్త సంతోష్ బెళగావిలో రెవిన్యూ అధికారిగా పనిచేస్తున్నారు.

బస్సు పల్టీ, 50 మందికి గాయాలు



కృష్ణరాజపురం: చింతామణి–హోసకోటె రహదారిలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బస్సులోని 50 మందికి పైగా ప్రయాణికులకు గాయాలయ్యాయి. బెంగళూరు నుంచి చింతామణికి బయలుదేరిన ప్రైవేటు బస్సు అతి వేగం వల్ల అదుపుతప్పింది. బనహళ్లి గేట్ వద్ద స్పీడ్ బ్రేకర్ పైనుంచి వేగంగా వెళ్లడంతో ఒక్కసారిగా బస్సు బోల్తా పడింది. పోలీసులు చేరుకుని క్షతగాత్రులను హోసకోటెలోని వివిధ ఆస్పత్రుల్లో చేర్పించారు.

బీఎంటీసీ బస్సుకు మరొకరు బలి



ఘటన స్థలంలో తేజస్ మృతదేహం

కృష్ణరాజపురం: బీఎంటీసీ బస్సులు మృత్యుశకటాలుగా మారుతున్నాయి. తాజాగా నగరానికి చెందిన తేజస్ (22) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన ఉత్తరహళ్లి రోడ్డు మంత్రి ఆల్‌ఫైన్ అపార్టుమెంట్ ఎదుట జరిగింది. ఓవర్‌టేక్ చేసే క్రమంలో బస్సుకు బైక్ తగులుకుని తేజస్ కిందపడిపోయాడు. ఈ సమయంలో యువకుడి మీద నుంచి బస్సు దూసుకెళ్లింది. దీంతో తీవ్రంగా గాయపడి తేజస్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

కళ్లు తెరవకనే కడతేరి..





అబార్షన్ల గండాన్ని దాటుకుని పుట్టే శిశువులు ఎంతమంది?



అబార్షన్ల దందాలో స్కానింగ్ సెంటర్లదే ముఖ్యపాత్ర

- యథేచ్ఛగా అబార్షన్ల బాగోతం
- స్కానింగ్ సెంటర్లపై తనిఖీలు శూన్యం

బనశంకరి: లింగ వివక్ష వల్ల విచ్చలవిడిగా అబార్షన్లు జరుగుతున్నట్లు ఇటీవలి భ్రూణహత్యల స్కాం బయటపెట్టింది. పుట్టక ముందే గర్భంలో మృత్యువాత పడుతున్న ఘోరాలు వెలుగుచూశాయి. రాష్ట్రంలో భ్రూణ హత్యల నియంత్రణకు కఠిన చట్టాలతో చర్యలు తీసుకోవలసిన ఆరోగ్యశాఖ అలసత్వం వహించింది. 1994 నుంచి 2023 వరకు అంటే 29 ఏళ్లలో 100 కేసులు మాత్రమే నమోదు చేశారు. 31 జిల్లాలు ఉండగా, 14 జిల్లాల్లో ఇప్పటివరకు ఒక కేసు కూడా నమోదు కాలేదంటే వైద్యాధికారులు ఎంత చురుగ్గా ఉన్నారో అర్థమవుతుంది.

కమిటీల మొద్దునిద్ర

ఇతర జిల్లాలు కంటే బెంగళూరు అత్యధికంగా 31 కేసులు నమోదైనప్పటికీ ఎక్కువ కేసుల్లో తూతూ మంత్రంగా విచారణ జరిపి మూసివేశారు. భ్రూణహత్య నియంత్రణకు ఆరోగ్య శాఖలో రాష్ట్ర స్థాయిలో, జిల్లాల్లో సలహా సమితులు ఉంటాయి. వీరు ప్రైవేటు అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లు, నర్సింగ్‌హోంలు, డయాగ్నస్టిక్ సెంటర్లలో తరచూ దాడులు జరిపి, లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు చేయకుండా కట్టడి చేయాలి. కానీ ఈ కమిటీలు చురుకుగా పని చేయడంలేదు. జిల్లాస్థాయిల్లో మూడు కమిటీలు ఉండగా మూడునెలలకు ఒకసారి తనిఖీలు నిర్వహించాలి. కానీ మామూళ్లు తీసుకుని మిన్నకుండిపోతున్నారనే తీవ్ర ఆరోపణలు ఉన్నాయి.

6,300 స్కానింగ్ సెంటర్లు

రాష్ట్రంలో 6,300కు పైగా అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లు ఉన్నట్లు ఆరోగ్యశాఖ తెలిపింది. ఆరోగ్యశాఖ అనుమతి లేకుండా వేలాది సెంటర్లు నడుస్తున్నాయి. 70 శాతం సెంటర్లు నిబంధనల్ని పాటించడం లేదు. అడిగినంత డబ్బు తీసుకుని, మూడు నెలల నుంచి ఆరునెలల గర్భిణీలను పరీక్షించి పిండం ఆడ, మగ అనేది చెబుతారు. ఆడపిల్ల అయితే అక్కడే అబార్షన్లు కూడా చేసేస్తారని మహిళా సంఘాలు నేతలు ఆరోపించారు.

భ్రూణ హత్య కేసులు లేని జిల్లాలు

బెంగళూరు గ్రామాంతర, దక్షిణ కన్నడ, చిక్కమగళూరు, చామరాజనగర, కొడగు, ఉడుపి, గదగ, హావేరి, ఉత్తర కన్నడ, కొప్పళ, బీదర్, బళ్లారి, యాదగిరి, విజయనగర జిల్లాల్లో ఒక్క కేసు లేదు.

కేసులు నమోదైన జిల్లాలు

బెంగళూరు 31, బెళగావి 15, విజయపుర 14, తుమకూరు 6, మండ్య 6, చిక్కబళ్లాపుర 5, బాగల్‌కోటే 5, కోలారు 4, దారవాడ 4, రామనగర 2, మైసూరు 2, చిత్రదుర్గ 1, దావణగెరె 1, శివమొగ్గ 1, హాసన 1, కలబురిగి 1 కేసు నమోదైంది.

శిక్షలూ ఉన్నాయి

మొదటిసారి భ్రూణహత్యలో పట్టుబడినవారికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.10 వేలు జరిమానా శిక్ష పడుతుంది. రెండోసారి పట్టుబడినవారికి 5 ఏళ్లు జైలు శిక్ష, రూ.50 వేలు జరిమానా విధించేలా శిక్ష పెరుగుతుంది.

చర్యలు చేపట్టాం: కమిషనర్

రాష్ట్రంలోని స్కానింగ్ సెంటర్లు, క్లినిక్‌లను పరిశీలించి అనుమతులు లేకుంటే మూసివేయిస్తున్నాం, ఇందులో ఆరోగ్య శాఖతో పోలీసులు కూడా చేతులు కలిపారు. ఇటీవల భ్రూణహత్యల స్కాంలో నిర్లక్ష్యం చూపిన ఇద్దరు డాక్టర్లతో పాటు నలుగురిని సస్పెండ్ చేశామని ఆరోగ్యశాఖ కమిషనర్ డీ.రందీప్ తెలిపారు.

ఐదుగురు మాజీ నక్సల్స్ అరెస్టు



అరెస్టయిన మాజీ నక్సలైట్లు

- వెంకటమ్మనహళ్లి దాడి కేసులో నిర్బంధం

తుమకూరు: 19 ఏళ్ల నాటి కేసులో మాజీ నక్సలైట్లను పోలీసులు అరెస్టు చేశారు. 2005 ఫిబ్రవరి 10న పావగడ తాలూకా వెంకటమ్మనహళ్లి గ్రామంలో జరిగిన పోలీసుల హత్యాకాండ కేసులో ఈ ఐదుగురికి ప్రమేయం ఉందనే ఆరోపణలున్నాయి. తుమకూరు జిల్లా– ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతంలో ఉండే వెంకటమ్మనహళ్లిలో అప్పట్లో నక్సల్ కాల్పుల్లో ఏడుగురు పోలీసులు మరణించారు. వీరితో పాటు ఒక బస్సు క్లీనర్ కూడా చనిపోయాడు. ఈ ఘటనలో నిందితుల్లో 17 మందిని విడుదల చేయగా, మరో ఇద్దరు విచారణలో ఉన్నారు. ఆదివారం వీరిని మధుగిరి పోలీసులు అరెస్టు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో సత్యసాయి జిల్లా గంతుమరి గ్రామానికి చెందిన నాగరాజు, తల్లిమడుగువాసులు రామ్‌మోహన్, బోయ ఓబులేశ్, కేఎన్ పాళ్య వాసి బోయ అంజి, కోనాపురం పద్మను అరెస్టు చేసి తరలించారు. ఈ ఐదుగురు దివంగత ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం చొరవతో నక్సల్స్ నుంచి బయటకు వచ్చి ప్రభుత్వ సౌలభ్యాలు పొందుతూ జనజీవనం సాగిస్తున్నారు. మధుగిరిలో కోర్టులో హాజరు పరిచి విచారణకు తరలించారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేకు ఈడీ షాక్

- నంజేగౌడ, సన్నిహితుల ఇళ్లలో సోదాలు



ఎమ్మెల్యే కె వై నంజేగౌడ



తనిఖీల వేళ తహసీల్దార్ ఆఫీసు వద్ద భద్రత

మాలూరు: కోలారు జిల్లాలో ఈడీ దాడులు సంచలనం కలిగించాయి. మాలూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే, కోచిముల్ అధ్యక్షుడు కేవై నంజేగౌడపై కేంద్ర ఈడీ దాడులు ప్రారంభించింది. సోమవారం ఉదయం నంజేగౌడ స్వగ్రామం కొమ్మనహళ్లిలో ఉన్న ఆయన నివాసానికి చేరుకున్న ఈడీ అధికారులు ఇంట్లో సోదాలు చేపట్టారు. బెంగళూరులోని ఆయన నివాసం, కోలారు నగర కార్యాలయం, తహసీల్దార్ ఆఫీసు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, ఆయన ఆధీనంలోని నంజుడేశ్వర స్టోన్ క్రషర్, టేకల్‌లోని పలు స్టోన్ క్రషర్లతో సహా దాదాపు 10కి పైగా ప్రాంతాల్లో సోదాలు జరిపారు.

ముడుపుల ఆరోపణలు

ఇటీవల కోచిముల్ నియామకాల్లో భారీ అక్రమాలకు పాల్పడినట్లు నంజేగౌడ ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఒక్కో ఉద్యోగానికి రూ.50 లక్షల వరకు లంచం తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలోనే దాడులు జరిగాయని తెలుస్తోంది. ఈడీ అధికారులు ఆయన నివాసంలో పలు దాఖలాలను స్వాధీనం చేసుకున్నారు. నంజేగౌడ ఆప్తుడు దొడ్డమల్లె హరీశ్, అబ్బేనహళ్లి గోపాల్, కోచిముల్ అడ్మిన్ నాగేశ్, కోచిముల్ ఎండీ గోపాలమూర్తి నివాసాలపై కూడా దాడులు జరిపి సోదాలు చేస్తున్నారు. దాడుల సమయంలో ఎమ్మెల్యే ఇంటి ముందు, తహసీల్దార్ కార్యాలయం వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

జెట్‌లాగ్ ఎఫెక్ట్.. దర్శన్, రాక్‌లైన్‌కు నోటీస్

- పబ్‌పై కేసు నమోదు

శివాజీనగర: కటేరా చిత్రం విజయవంతమైన సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించి అర్ధరాత్రి వరకు పార్టీ చేసుకున్న ఘటనకు సంబంధించి నటుడు దర్శన్‌తో పాటు అభిషేక్ అంబరీష్, నిర్మాత రాక్‌లైన్ వెంకటేశ్‌కు నోటీసులు జారీ చేశారు. నగరంలోని ఓరియన్ మాల్ వద్ద ఉన్న జెట్‌లాగ్ పబ్‌లో ఈనెల 3న తెల్లవారుజాము వరకు వీరంతా పార్టీ చేసుకున్నారు. దీంతో జెట్‌లాగ్ పబ్‌పైన కూడా సుబ్రమణ్యపుర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నియమాల ప్రకారం అర్ధరాత్రి 1 గంట వరకు మాత్రం పబ్‌ను నడపాలి. అందుకు విరుద్ధంగా తెల్లవారుజాము వరకు పార్టీకి అనుమతి ఇచ్చారు.

నియమాలు ఉల్లంఘించి పబ్ తెరచి ఉన్న కూడా సుబ్రమణ్యపుర పోలీసులు చర్యలు తీసుకోకపోవడంపై ఉత్తర విభాగపు డీసీపీ సైదులు అడావత్ మల్లేశ్వరం పోలీస్ స్టేషన్ ఏసీపీకి వెంటనే విచారణ చేపట్టాలని ఆదేశించారు.



జాతాలో పాల్గొన్న పోలీసులు, విద్యార్థులు

డ్రగ్స్ వ్యతిరేక జాతా

మైసూరు: మైసూరు జిల్లాలో మత్తు పదార్థాల విక్రయం, సేవనం కేసులు పెరిగిపోవడంతో పోలీసులు వాటికి అడ్డుకట్ట వేయడంపై దృష్టి సారించారు. నంజనగూడులో పోలీసులు డ్రగ్స్ వ్యతిరేక జాతాను నిర్వహించారు. ఎస్పీ సీమా లాట్కర్ ఆధ్వర్యంలో ప్రఖ్యాత శ్రీకంఠేశ్వర స్వామి దేవాలయం నుంచి జాతా ఆరంభమై పట్టణ క్రీడా మైదానం వరకు చేరుకుంది. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటికి బానిసైతే జీవితం నాశనమవుతుందని నినాదాలు చేశారు. యువత, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ముంబై డీసీపీ పేరిట మస్కా

- హుబ్లీ వైద్యునికి రూ.30 లక్షలు టోపీ

హుబ్లీ: ముంబై డీసీపీ పేరున నగరానికి చెందిన వైద్యున్ని వీడియో కాల్‌ద్వారా భయపెట్టి వివిధ లింక్‌ల ద్వారా రూ.30.16 లక్షలు గుంజిన ఘటన సోమవారం వెలుగు చూసింది. డాక్టర్ రాజీవ్ బాధితుడు. ప్రైవేట్ కంపెనీ పేరున ఎవరో గుర్తు తెలియని వ్యక్తి కొన్ని వస్తువులను బుక్ చేశారు, దీనికి మీ ఆధార్ కార్డు నంబర్ లింక్ అయిందని డాక్టర్‌ను దుండగులు ముందుగా మభ్యపెట్టారు. దీనికి డాక్టర్ తాను ఎటువంటి కొరియర్ ఆర్డర్ పంపలేదనగా దానికి కేటుగాళ్లు మా వద్ద మీ ఆధార్ కార్డు వివరాలున్నాయి, మీరు ముంబై సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలని బుకాయించారు. తరువాత యాప్ ద్వారా వీడియో కాల్ చేసిన వంచకులు తాను ముంబై డీసీపీని మాట్లాడుతున్నానని భయపెట్టారు. బాధితుని బ్యాంక్ ఖాతా వివరాలను తెలుసుకుని రూ.30.16 లక్షలను బదలాయించుకొని ఫోన్లు స్విచాఫ్ చేసుకున్నాడు. బాధితుడు హుబ్లీ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.



సంక్రాంతి వస్తుండడంతో బెంగళూరు సిటీ మార్కెట్లో చెరకు విక్రయాలు

28 సీట్లలో మనదే గెలుపు

- బీజేపీ భేటీలో విజయేంద్ర



సమావేశంలో పాల్గొన్న నాయకులు

శివాజీనగర: రాష్ట్రంలో బీజేపీకి అనుకూలమైన వాతావరణముందని, లోక్‌సభ ఎన్నికల్లో అన్ని 28 స్థానాల్లో గెలుస్తామని బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీ.వై. విజయేంద్ర అన్నారు. సోమవారం బెంగళూరులో ఓ హోటల్‌లో లోక్‌సభ ఎన్నికల ప్రణాళికా సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ రానున్న లోక్‌సభా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటర్లు గుణపాఠం చెబుతారు. అన్ని సీట్లలో బీజేపీ గెలుపొందడం తథ్యమన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ కూటమికి ఎదురుదెబ్బ తగిలిందన్నారు. రాష్ట్రంలో పార్టీ సంఘటితం కావటానికి కార్యక్రమాలను రూపొందిస్తామన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తామని, కాంగ్రెస్ అసమర్థ పరిపాలనతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. రైతులు ఆత్మహత్య చేసుకొంటున్నారు. ప్రభుత్వం పరిహారం ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సీఎంలు యడియూరప్ప, బొమ్మై, సదానందగౌడ, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, ఆర్. అశోక్ సహా సీనియర్లు పాల్గొన్నారు.

రాజధానిలో జల్లు వర్షం

- పలు జిల్లాలకు వాన సూచన



బెంగళూరులో మేఘావృతం

యశవంతపుర: కొత్త సంవత్సరంలో వర్షాలు పలకరిస్తున్నాయి. సోమవారం బెంగళూరులో వాన కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు జల్లులతో కూడిన వర్షంతో ప్రజలు, ద్విచక్ర వాహనాదారులు ఇబ్బంది పడ్డారు. గత గురువారం కూడా వానలు పడ్డాయి. వచ్చే 24 గంటల్లో బెంగళూరు నగర, గ్రామాంతర జిల్లా పరిధిలో అక్కడక్కడ వర్షాలు కురవవచ్చని బెంగళూరు వాతావారణశాఖ అధికారులు హెచ్చరించారు. బెంగళూరులో ఉష్ణోగ్రతలు 17 నుంచి 29 డిగ్రీల మధ్య ఉంటాయని పేర్కొన్నారు. మంగళవారం దక్షిణ ఒళనాడు బెంగళూరు నగర, గ్రామాంతర, మినహా చిక్కమగళూరు, హాసన్, కొడగు, శివమొగ్గ, చామరాజనగర, చిక్కబళ్లాపుర, కోలారు, మండ్య, మైసూరు, రామనగర, తుమకూరు, విజయనగర జిల్లాల పరిధిలో ఓ మోస్తరు వానలు పడే అవకాశం ఉంది. దావణగెరె, బళ్లారి, చిత్రదుర్గ, విజయనగర జిల్లాల్లో చలి వాతావరణం ఉంటుంది. ఆదివారం బెంగళూరు చుట్టుపక్కల వాన పడింది.



బెంగళూరులో జల్లుల్లో గొడుగులతో మహిళలు

అయోధ్యకు స్పెషల్ రైళ్లు

యశవంతపుర: ఈ నెల 22న అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవానికి వెళ్లే భక్తులకు బెంగళూరు నుంచి అయోధ్యకు ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వేశాఖ అధికారులు నిర్ణయించారు. ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చు. యశవంతపుర –గోరఖ్‌పూర్‌ల మధ్య స్పెషల్ రైళ్లు సంచరిస్తాయి. రాత్రి 11:40 గంటలకు ఇక్కడి నుంచి బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 3:50 గంటలకు గమ్యానికి చేరుతుందని చెప్పారు.

సీఎం నాకు దేవుడన్న జార్కిహోళి

దొడ్డబళ్లాపురం: సీఎం సిద్ధరామయ్యను దేవునిగా కీర్తిస్తూ ఆయన్ను కొలుస్తానన్న మంత్రి సతీష్ జార్కిహొళిపై బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ ధ్వజమెత్తారు. ఇలాంటి ఊసరవెల్లి లాంటి నాయకుల వల్లే ఉత్తర కర్ణాటక అభివృద్ధికి దూరంగా ఉండిపోయిందని ఎక్స్‌లో స్పందించారు. వ్యక్తి పూజ చేయనని, దేవునిపై నమ్మకం లేదని, హిందూ సంప్రదాయాలపై విశ్వాసం లేని వ్యక్తిని దేవునిగా కొలుస్తానంటున్న నీవు ఎంతటి అవకాశవాదివో అర్థం అవుతుందన్నారు. నీ రాజకీయ లబ్ధి కోసం అలాంటి వ్యక్తిని దేవున్ని చేయడమేంటని ప్రశ్నించారు. మంత్రి హుక్కేరిలో ఇందిరా క్యాంటీన్ కార్యక్రమంలో మాట్లాడుతూ సిద్ధరామయ్యను దేవునిలా చూస్తానని చెప్పడం విమర్శలకు తావిచ్చింది.

నాణ్యమైన ఉత్పత్తులను పండించాలి : మంత్రి

శివాజీనగర: సంప్రదాయ పద్ధతిలో సేద్యం చేసే రైతులు ఆధునిక ఆవిష్కారాలు, సాంకేతిక పరిజ్ఞానాలను వినియోగించి దిగుబడులను పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం సాయం చేస్తుందని వ్యవసాయ మంత్రి చెలువరాయస్వామి తెలిపారు. ఇటీవలిరోజుల్లో నాణ్యమైన ఆహార ధాన్యాలకు డిమాండు పెరిగిందని, కాబట్టి రైతులు కూడా నాణ్యతకు పెద్దపీట వేయాలన్నారు. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను సాగు చేయాలన్నారు. ప్యాలెస్ మైదానంలో జరిగిన రైతుల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు భూసార పరీక్షలు చేయించాలని, సేంద్రియ పద్ధతిలో పోషకాంశాలను పెంచుకోవాలని అన్నారు. మంత్రులు ఎం.సీ.సుధాకర్, కృష్ణభైరేగౌడ తదితరులు పాల్గొన్నారు.

భృతి కాదు, ఉద్యోగాలివ్వాలి : వాటాళ్

మైసూరు: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ప్రతినెలా డబ్బులు ఇచ్చే బదులుగా వారికి ఉద్యోగాలు ఇవ్వాలని కన్నడ చళువళి వాటాల్ పక్ష అధ్యక్షుడు వాటాళ్ నాగరాజు డిమాండ్ చేశారు. కన్నడిగులకు ఉద్యోగాలు ఇవ్వాలని, బలవంతంగా హిందీ భాష అమలు చేయరాదని మైసూరు జయ చామరాజేంద్ర సర్కిల్‌లో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని ధరలు పెరిగాయని, మీరు ఇచ్చే డబ్బులు కాఫీ తాగేందుకు కూడా సరిపోవని ఎద్దేవా చేశారు. నిరుద్యోగులకు రూ 3 వేలు, రూ. 1,500 డబ్బులు ఇస్తూ వారిని అవమాన పరుస్తోందని మండిపడ్డారు. ఉన్నత విద్యలో కన్నడిగులకు ప్రాధాన్యం దక్కడం లేదని ఆరోపించారు. బీజేపీ, జేడీఎస్, కాంగ్రెస్ నాయకులు, మఠాధీశుల కాలేజీల్లో బయట రాష్ట్రాల విద్యార్థులకు సీట్లు ఇస్తున్నారని, తొలి ప్రాధాన్యం కన్నడిగులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కేఆర్ఎస్ చుట్టుపక్కల మైనింగ్ నిషేధం

- హైకోర్టు కీలక తీర్పు

శివాజీనగర: కృష్ణరాజ సాగర (కేఆర్ఎస్) చుట్టు పక్కల 20 కి.మీ.పరిధిలో మైనింగ్ నిషేధిస్తూ హైకోర్టు కీలకమైన తీర్పునిచ్చింది. కేఆర్ఎస్ చుట్టు పక్కల 20 కి.మీ. పరిధిలో మైనింగ్ జరపరాదని, జలాశయానికి హాని కలిగించటాన్ని అరికట్టాలి, కేఆర్ఎస్ భద్రత తమకు ముఖ్యమని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పీ.బీ.వరాళె, న్యాయమూర్తి కృష్ణ ఎస్ దీక్షిత్ డివిజనల్ ధర్మాసనం వెల్లడించింది. భూపరివర్తనకు ముందు పరీక్షార్థ పేలుడు జరిపి హానికి అవకాశాన్ని పరిగణించి అనుమతి షరతు విధించిన జిల్లాధికారి ఆదేశాన్ని ప్రశ్నిస్తూ దాఖలైన పిటిషన్ విచారణ చేపట్టిన కోర్టు ఈ ఆదేశాలు వెల్లడించింది. కేఆర్ఎస్ సురక్షితమే తమకు ముఖ్యమని ధర్మాసనం తెలిపింది.

తూటాలతో దొరికిన సైనికాధికారి

యశవంతపుర: బెళగావి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న సైనాధికారి బ్యాగ్‌లో తూటాలు లభించాయి. దీంతో బెళగావి జిల్లా మారిహాళ పోలీసులు అదుపులోకి తీసుకొని ఆయనను విచారిస్తున్నారు. భారత సైన్యంలో కెప్టెన్‌గా పని చేస్తున్న అధికారి పని మీద బెళగావిలోని ఆర్మీ సెంటర్‌కు వెళ్ళారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు వెళ్లడానికి బెళగావిలోని సాంబ్రా ఎయిర్‌పోర్టుకు వెళ్లారు. బ్యాగులను తనిఖీ చేస్తుండగా కొన్ని బుల్లెట్లు బయటపడ్డాయి. దీంతో విమానాశ్రయ అధికారులు స్థానిక ఆర్మీ ఆఫీసుకు సమాచారం ఇచ్చి ఆయనను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. లైసెన్సు ఉన్నప్పటికీ విమానంలో తుపాకులు, తూటాలు వంటి మారణాయుధాలతో ప్రయాణించడం నిషిద్ధం.

క్లుప్తంగా

ఇంటింటా రామ మందిరం సందడి కావాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐనాథ్‌రెడ్డి తదితరులు

బళ్లారి అర్బన్: అయోధ్యలో ఈనెల 22న రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా కేంద్రం ఆదేశాల మేరకు దేశమంతా ప్రతి ఇంటా దీపావళి సందడి మాదిరిగా దీపాలను వెలిగించి కాంతులతో అయోధ్యరామ మందిర ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని గణపాల ఐనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మోకా రోడ్డు సిద్ధార్థ కాలనీలో డాక్టర్ మహేష్‌శర్మ సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శ్రీరామ మందిరం విశ్వానికే గర్వించదగ్గ మందిరమన్నారు. వీహెచ్‌పీ నాయకుడు అశోక్ కుమార్, యోగా గురువు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణంతో విద్యార్థుల పాట్లు



పాఠశాలకు టాటా ఏస్‌లో వెళుతున్న విద్యార్థులు

కంప్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల్లో ప్రకటించిన తొలి గ్యారంటీ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం శక్తి పథకం అమలుతో విద్యార్థులు బస్సుల్లో సీట్లు దొరకక అవస్థలు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వెళ్లాలంటే విద్యార్థులకు బస్సులో సీట్లు దొరకక ఫుట్‌బోర్డుపై నిలబడి భయంభయంగా రాకపోకలు సాగిస్తున్నారు. విద్యార్థులు ఎలాగైనా బడికి వెళ్లాలని ఆటో, టాటా ఏస్ తదితర వాహనాలను ఆశ్రయిస్తున్నారు. భద్రత లేని ప్రయాణంతో ఏవైనా జరగరాని ప్రమాదాలు జరిగితే దానికి బాధ్యులు ఎవరని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో అధికారులు స్పందించి విద్యార్థులకు సౌకర్యం కల్పించాలని ఒత్తిడి చేస్తున్నారు.

నదిలోకి చేప పిల్లల విడుదల



చేప పిల్లలను నదిలోకి వదులుతున్న దృశ్యం

కంప్లి: మత్స్యకారుల జీవనభృతి కోసం కంప్లి కోట వద్ద తుంగభద్ర నదిలో 4 లక్షల చేప పిల్లలను వదిలినట్లు మత్స్య శాఖ డైరెక్టర్ బీఎల్ షడాక్షరి తెలిపారు. ఆయన సోమవారం కంప్లి కోట వద్ద తుంగభద్ర నదిలో చేప పిల్లలను వదిలిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. 2021-22వ సంవత్సరానికి ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన ద్వారా నదిలో ప్రజలు ఎక్కువగా కోరుకునే 4 రకాలకు చెందిన చేప పిల్లలను విడిచినట్లు తెలిపారు. చేపల వేటతో జీవితం సాగించే మత్స్యకారులు ఒక్కో సమయంలో ఉపాధి లేక వలసలు వెళ్లక తప్పడం లేదన్నారు. కంప్లి కోట తీరాన నివాసముంటున్న వందలాది మత్స్యకారుల కుటుంబాలకు నదిలో చేప పిల్లల విడుదల వారిని ఆదుకునేందుకు, జీవనభృతికి ఎంతో దోహదపడుతుందన్నారు.

వృద్ధాప్య వేతనంతో పిల్లలకు తీపి వంటకం



పిల్లలకు అన్నం వడ్డిస్తున్న గంగప్పజ్జ

కంప్లి: హూవినహడగలి తాలూకాలోని నెంబర్ 63 తిమ్మలాపుర గ్రామానికి చెందిన 80 ఏళ్ల గంగప్పజ్జ ప్రతి నెల ప్రభుత్వం నుంచి అందుతున్న వృద్ధాప్య వేతనం రూ.1200లతో ఆ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల పిల్లలకు పాఠశాలలోని వంట పని వారితో నెలకో రకం తీపి వంటకం చేయించి స్వయంగా తానే పిల్లలకు వడ్డిస్తుంటారు. పిల్లలు ఎంతో తృప్తిగా తిని ఆనందిస్తుంటారు. ఆ వృద్ధుడు తనకున్న కొద్దిపాటి భూమిని కౌలుకు ఇచ్చి అలా వచ్చిన కౌలు సొమ్ముతో జీవిస్తుంటాడు. గ్రామస్తులంతా అతని సద్గుణాన్ని కొడియాడారు.

డీకేశి అధికార మదంతో మాట్లాడుతున్నారు

- మండిపడిన యడ్యూరప్ప

శివాజీనగర: ఉప ముఖ్యమంత్రి డీ.కే శివకుమార్ అధికార మదంతో మాట్లాడుతున్నారు. ఇది ఆయనకు గౌరవం తీసుకొచ్చేది కాదని మాజీ సీఎం యడ్యూరప్ప తెలిపారు. మీడియాతో మాట్లాడిన యడ్యూరప్ప, డీసీఎం డీ.కే శివకుమార్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. డీజే హళ్లి, కేజీ హళ్లి కేసు నిందితుల విషయంలో డీకే శివకుమార్ వ్యాఖ్యలకు స్పందిస్తూ, డీకే శివకుమార్ చెప్పినదంతా చూశాను. అధికార మదంతో ఆయన ఏదేదో మాట్లాడుతున్నారు. అది ఆయనకు గౌరవం తీసుకొచ్చేది కాదని అసహనం వ్యక్తం చేశారు.

విద్యుత్ షాక్‌తో ముగ్గురు యువకులు మృతి

- ఓ హీరో కటౌట్లు కడుతుండగా ఘోరం
- గదగ్ జిల్లా సూరణగి గ్రామంలో ఘటన



విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన యువకులు వీరే(ఫైల్)

సాక్షి బళ్లారి: సినిమా హీరోపై ఉన్న అభిమానం ముగ్గురు యువకులకు మృత్యుఒడికి చేర్చిన ఘటన సోమవారం గదగ్ జిల్లాలో చోటు చేసుకుంది. ప్రముఖ కన్నడ సినీ హీరో, రాకింగ్ స్టార్ యష్ పుట్టిన రోజు నేపథ్యంలో ఆదివారం రాత్రి నుంచే అభిమానులు పెద్ద ఎత్తున కటౌట్లు, బ్యానర్లు కట్టి సంబరాలు చేసుకునేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసుకుంటున్నారు. ఈక్రమంలో గదగ్ జిల్లాలో కటౌట్లు కడుతుండగా ముగ్గురు యువకులు విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. తమ హీరో పుట్టినరోజు వేడుకను చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న గదగ్ జిల్లా లక్ష్మేశ్వర తాలూకా సూరణగి గ్రామంలో కటౌట్లు కడుతున్న హనుమంతు(21), మురళీ పంతిమణి(20), నవీన్ గాజీ(19) అనే యువకులు విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మరణించారు. యష్ 30 అడుగుల కటౌట్లు కట్టేందుకు ప్రయత్నిస్తుండగా విద్యుత్ స్తంభానికి ఉన్న లైను మీద పడటంతో ఈ ప్రమాదం జరిగింది. ఘటనలో ముగ్గురు మృతి చెందడంతో పాటు మంజునాథ్, దీపక్, ప్రకాశ్ మాగేడి అనే మరో ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మిన్నంటిన విషాదం

ఒకేసారి ముగ్గురు యువకుల మృతితో పాటు పలువురికి తీవ్ర గాయాలు కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకొన్న వెంటనే ఎమ్మెల్యే చంద్రు లమాణి ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి మృతుల కుటుంబాలకు సాంత్వన పలికారు. గ్రామంలో విషాదఛాయలు, మృతుల కుటుంబ సభ్యులు, బంధువుల ఆక్రందనల మధ్య ముగ్గురికి సామూహిక అంత్యక్రియలు పూర్తి చేశారు. ఘటనపై అక్కడి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబ సభ్యులు

రూ.2 లక్షల పరిహారం

శివాజీనగర: గదగ్ జిల్లా సూరణగిలో విద్యుదాఘాతంతో మృతి చెందిన యశ్ అభిమానులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు పరిహారం ప్రకటించినట్లు మంత్రి హెచ్‌కే పాటిల్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, యశ్‌తో కూడా మాట్లాడామన్నారు. మృతుల కుటుంబాలను త్వరలో యశ్ భేటీ అవుతారన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంటామన్నారు.

కాడుగొల్ల సముదాయాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

తుమకూరు: బుడకట్టు సంస్కృతిని కలిగి ఉన్న కాడుగొల్ల సముదాయాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎమ్మెల్యే ఎస్.ఆర్. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం హెబ్బూరు శ్రీ చిక్కణ్ణ స్వామి క్షేత్రం ధర్మదర్శి డాక్టర్. పాపణ్ణ 50వ పుట్టిన రోజు వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...అనేక సంవత్సరాలుగా ఈ డిమాండ్ ఉందని, వారు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగడానికి వీలవుతుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



చెట్టును ఢీకొన్న మినీబస్సు

చింతామణి: స్కూల్ బస్సు ఢీకొని ఓ మహిళ మృతి చెందిన ఘటన సోమవారం కంచార్లపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని చలంకోట వద్ద చోటుచేసుకుంది. పట్టణంలోని ఎస్ఎస్ఆర్ పాఠశాల మినీబస్సు పిల్లలను తీసుకురావడానికి వెళ్తూ అదుపు తప్పి రోడ్డు పక్కన నడుచుకుని వెళ్తున్న ఓ మహిళను ఢీకొంది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. మృతురాలిని మురగమల్ల గ్రామానికి చెందిన నజ్మాతాజ్‌గా గుర్తించారు. అదే సమయంలో పిల్లలు ఎవరూ లేకపోవడంతో తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం



విజేతలకు బహుమతులను అందిస్తున్న అధికారులు

బళ్లారి అర్బన్: క్రీడలతో మానసిక, శారీరక ఒత్తిళ్ల నుంచి ఉపశమనం పొందవచ్చని ఐజీపీ లోకేష్ కుమార్ పేర్కొన్నారు. పోలీస్ జింఖాన మైదానంలో మూడు రోజుల పాటు జరిగిన టెన్నిస్ టోర్నీ పోటీల్లో విజేతలకు జేఎస్‌డబ్ల్యూ ట్రోఫి పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉత్తర కర్ణాటకలోని 13 జిల్లాల నుంచి 260 మందికి పైగా టెన్నిస్ క్రీడాకారులు పాల్గొని డబల్, సింగల్ మ్యాచ్‌లు ఆడగా, వీరిలో 55 ఏళ్ల పైబడిన వారిలో బళ్లారికి చెందిన డాక్టర్ సూర్యప్రకాష్, అరవింద్ పటేల్, ఉదయ్ భాస్కర్ విజేతలుగా నిలిచారు అలాగే రన్నింగ్ రేస్‌లో దావణగెరె విరుపాక్షి రెడ్డి, మంజునాథ్, సింధనూరు పాటిల్ రన్నరప్‌గా నిలిచారు. 45 ఏళ్ల పైబడిన వారిలో డబుల్స్ పోటీల్లో విరుపాక్షి, శ్రీనివాసులు, దావణగెరెకు చెందిన అనిల్, బాగలకోటె సచిన్, తుమకూరు చేతన్ గెలుపొందారు. 35 ఏళ్ల పైబడిన డబుల్స్ పోటీల్లో సింధనూరు మనీష్, రవిరాజ్, దావణగెరె రుద్రేష్, విశాల్, వినయ్ తమ ప్రతిభను చాటి విజయం సాధించారు. విజేతలకు రన్నరప్‌లకు షీల్డ్, ట్రోఫీతో పాటు సర్టిఫికెట్లు, నగదు బహుమతులను అందించారు. కార్యక్రమంలో జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా, ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు, ఏడీసీ మహమ్మద్ ఝుబేర్, జిందాల్ అధ్యక్షుడు మురుగన్, పోలీస్ జింఖాన అధ్యక్షులు కే.జితేంద్ర, కార్యదర్శి రవిరాజశేఖర్‌రెడ్డి, ఈసీ మెంబర్ కాంద్ర సతీష్ పాల్గొన్నారు.

అలరించిన సంక్రాంతి వైభవం



విజేతలకు బహుమతులను అందించిన దృశ్యం

బళ్లారి అర్బన్: తాలూకాలోని బీడీ హళ్లి మొరార్జీ దేశాయి రెసిడెన్షియల్ పాఠశాల మైదానంలో సోమవారం విద్యార్థులకు ఏర్పాటు చేసిన సంక్రాంతి వైభవం కార్యక్రమాన్ని ప్రముఖుడు కాంద్ర సతీష్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే లక్ష్య సాధనకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. జానపదగీతాలు శివకుమార్ బృందం ఆలపించగా, సాంస్కృతిక నృత్యాలను గోనాళ బృందం ప్రదర్శించింది. సంక్రాంతి రంగోలి, సాంస్కృతిక నృత్యాలు, చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు ఏకలవ్య ట్రస్ట్ అధ్యక్షుడు చంద్రశేఖర్ బహుమతులను అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ అనసూయ, రీజినల్ మేనేజర్ పీఆర్.మురళీకృష్ణ, మాతృమహిళా మండలి అధ్యక్షురాలు పుష్పలత, సందీప్, కళావతి, రాజు, మంజునాథ్ గంగాధర్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు డిమాండ్



మాట్లాడుతున్న రజాక్ ఉస్తాద్

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటకలో ఆర్టికల్-371(జే)కు ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని హైదరాబాద్ కర్ణాటక పోరాట సమితి జిల్లాధ్యక్షుడు రజాక్ ఉస్తాద్ పేర్కొన్నారు. ఆయన సోమవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కళ్యాణ కర్ణాటకలోని రాయచూరు. బళ్లారి, కలబుర్గి, బీదర్, కొప్పళ, యాదగిరి జిల్లాల్లో ఉద్యోగాల నియామకాల్లో ఇతర జిల్లాల వారు కేసులు వేస్తూ నియామకాలకు అడ్డంకులు కల్గిస్తున్న అంశంపై విచారించడానికి కలబుర్గిలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యోగుల పదోన్నతిలో కూడా అన్యాయం జరుగుతోందని, దానిని సవరించి కళ్యాణ కర్ణాటకలోని అభ్యర్థులకు అవకాశాలు కల్పించాలన్నారు. ప్రస్తుతం నియమితులైన అభ్యర్థులకు ఇతర ప్రాంతాల అభ్యర్థులు బెళగావి, బెంగళూరు, కలబుర్గి హైకోర్టుల్లో కేసులు వేయడంతో కళ్యాణ కర్ణాటకలోని అభ్యర్థులు మూడు కోర్టుల చుట్టూ తిరుగుతూ కాలయాపన చేయడమే సరిపోతోందన్నారు. ఆర్టికల్-371(జే) కింద నియామకాల అంశాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలన్నారు.

అఖిల కర్ణాటక బ్రాహ్మణ మహాసభ



ఆనేకల్, అత్తిబెలె ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు

బొమ్మనహళ్లి: బెంగళూరు నగరంలోని శంకరపురంలో సోమవారం అఖిల కర్ణాటక బ్రహ్మణ మహాసభ 2024 వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో రాష్ట్రం నలుమూలల నుంచి బ్రాహ్మణులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రముఖులు నాగవేణి, దత్తాత్రేయ, నాడిగేర్, రవి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లపై కొత్త చట్టం అమలు వద్దు

రాయచూరు రూరల్: ప్రభుత్వాలు డ్రైవర్లపై తెచ్చిన హిట్ అండ్ రన్ కొత్త చట్టాన్ని అమలు చేయడం తగదని కర్ణాటక లారీ డ్రైవర్ల సంఘం పేర్కొంది. సోమవారం టిప్పుసుల్తాన్ పార్క్‌లో చేపట్టిన ఆందోళనలో అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడారు. కొత్త చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

పొగాకు ఉత్పత్తుల విక్రయానికి అనుమతి తప్పనిసరి

కోలారు: జిల్లాలో ఇకపై పొగాకు ఉత్పత్తుల విక్రయానికి అనుమతి తప్పనిసరి అని జిల్లా డిప్యూటీ కలెక్టర్ శంకర్ వణిక్యాల్ తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ భవనంలో పొగాకు నియంత్రణ, కోట్పా చట్టం అమలుపై త్రైమాసిక ప్రగతి పరిశీలన సమావేశాన్ని ప్రారంభించి మాట్లాడారు. కర్ణాటక పురపాలక చట్టంలో మార్పులు తెచ్చినందున పొగాకు ఉత్పత్తుల విక్రయానికి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఈ నేపథ్యంలో పొగాకు విక్రయించే వారందరూ ప్రత్యేకంగా పొగాక విక్రయాలకు అనుమతి పొందాలన్నారు. నగరసభ, పురసభ, పట్టణ పంచాయతీల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయానికి అనుమతికి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అనుమతి లేకుండా పొగాకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని, జరిమానా విధిస్తామన్నారు. సమావేశంలో ఏఎస్పీ జగదీష్, డీఎంఅండ్‌ఓ డాక్టర్ జగదీష్, జిల్లా సర్వేక్షణాధికారిణి డాక్టర్ చారిణి తదితరులు పాల్గొన్నారు.

కాంత్‌రాజ్ నివేదికలో లోపాలు సవరించండి



మాట్లాడుతున్న సిద్ధరామానంద స్వామీజీ

రాయచూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం కాంత్‌రాజ్ నివేదికలో ఉన్న లోపాలను సవరించాలని తింథిణి కాగినెలె గురు పీఠం మఠాధిపతి సిద్ధరామానంద స్వామీజీ పేర్కొన్నారు. సోమవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులాల ప్రాతిపదికన కాకుండా సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లను కేటాయించాలని కోరారు. ఈనెల 12 నుంచి తింథిణిలో హాలు మత వైభవ ఉత్సవాల్లో భాగంగా మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 13న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, సమాజ సేవకులు పాల్గొంటారన్నారు. పాత్రికేయురాలు విజయలక్ష్మి శిరూరుకు కనకరత్న అవార్డు, హైదరాబాద్ కాంచ కాళయ్యకు హాలుమత భాస్కర, తమిళనాడు బొమ్మన్‌కు సిద్ధశ్రీ అవార్డులు అందిస్తారన్నారు.

కారిగనూరులో ప్రబలిన అతిసార



గ్రామంలో పరిస్థితిని పరిశీలిస్తున్న అధికారులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి పరామర్శ

- కలుషిత నీటితో 35 మందికి అస్వస్థత
- చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి



మృతురాలు సీతమ్మ(ఫైల్)

హొసపేటె: తాలూకాలోని కారిగనూరులో అతిసార ప్రబలింది. కలుషిత నీరు తాగి వాంతులు, విరేచనాలతో 30 మందికి పైగా అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఓ వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. వివరాలు..కారిగనూరులోని ఆర్‌బీఎస్ఎస్ఎన్ క్యాంపులో శుక్రవారం అతిసారతో 14 మంది అస్వస్థతకు గురికాగా శనివారానికి వారి సంఖ్య 20కి, ఆదివారం సాయంత్రానికి 35కి చేరింది. కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురైన వారు ప్రభుత్వాసుపత్రిలో చేరారు. వీరిలో సీతమ్మ(66) పరిస్థితి విషమంగా ఉండటంతో తదుపరి చికిత్స కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం బళ్లారి విమ్స్‌లో చేర్పించారు. అయితే చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి ఆమె మరణించింది. ట్యాంక్‌ను శుభ్రం చేయకుండానే సరఫరా చేయడంతో ఆ నీటిని తాగిన గ్రామస్తులు వాంతులు, విరేచనాలకు గురయ్యారు. ప్రస్తుతం బాధితులకు ఆస్పత్రిలో వైద్యులు మెరుగైన చికిత్స అందిస్తున్నారు. అస్వస్థతకు గురైన ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని ఎమ్మెల్యే గవియప్ప, డీసీ దివాకర్ పరామర్శించి వారి ఆరోగ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనపై నీటి శుభ్రతలో ప్రధానంగా తీవ్ర నిర్లక్ష్యం వహించిన నగరసభ కమిషనర్ బండివడ్డర్, అసిస్టెంట్ ఇంజినీర్ సతీష్, జూనియర్ ఇంజినీర్ ఖాజీలను సస్పెండ్ చేస్తూ జిల్లాధికారి ఆదేశాలను జారీ చేశారు.

డైరెక్టర్ల ఎన్నిక

మండ్య: మండ్య తాలూకా హొళలు గ్రామంలోని హొళలు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం డైరెక్టర్ల స్థానాలకు సోమవారం ఎన్నిక నిర్వహించారు. మొత్తం 13 మంది డైరెక్టర్ల స్థానాల కోసం 24 మంది బరిలో నిలిచారు. వీరిలో 11 మంది ఎన్నిక కాగా ఒక మహిళ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రభుత్వ నామినేటెడ్ సభ్యుడుతో కలిసి మొత్తం 13 మంది సభ్యులు ఉన్నారు. డైరెక్టర్లు కృష్ణ, హెచ్.ఎన్. చరణ్, సావిత్రమ్మ, సాగర, హెచ్.ఎస్.శివరామ్, హెచ్ఎల్. నింగరాజు, లలితమ్మ, భాగ్య, అనురాధ, దొడ్డ సిద్దయ్య, అనసూయ, కవిత, హెచ్‌బీ. సురేష్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఆశా ప్రకటించారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తాం



స్థల పరిశీలనలో ఎమ్మెల్యే సుబ్బారెడ్డి, అధికారులు

బాగేపల్లి: బాగేపల్లి తాలూకా పరగోడు గ్రామ పంచాయతీ పరిధిలోని వడ్రపాళ్య గ్రామ సమీపంలో పేదల కోసం ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ఎమ్మెల్యే సుబ్బారెడ్డి సోమవారం అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ...వడ్రపాళ గ్రామానికి అతి సమీపంలోని జాతీయ రహదారి 44 ఆనుకుని ఉన్న సర్వే నెంబర్ 162లో రెండు ఎకరాల స్థలాన్ని గుర్తించామని, వాటిని ఇళ్ల స్థలాలుగా మార్చి 71 మందికి కేటాయిస్తామన్నారు. ఈ మేరకు ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

కోలారు వార్తలు...

విద్యతో జీవిత కౌశల్యాల వృద్ధి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: జీవిత కౌశల్యాలను నేర్చుకోవడానికి విద్య ఎంతో సహాయకారి అని స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంఎస్‌జీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సహనా తెలిపారు. సోమవారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో కళాశాలలో నిర్వహించిన ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకునేలా చదవాలన్నారు. అలాంటి నైపుణ్యాలు, కౌశల్యాలు పెంచుకోవాలన్నారు. మంచి విషయాలు, సమాచారాన్ని స్నేహితులతో ఎల్లప్పుడూ పంచుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి ఇలాంటి శిబిరాల్లో పాల్గొనడం ద్వారా శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా ఎదగవచ్చన్నారు. ఉపాధ్యాయులు హేమావతి, శ్రీదేవి, సందేష్, విశ్వనాథగౌడ తదితరులు ఉన్నారు.

మాదక ద్రవ్యాలపై జాగృతి జాతా



జాతా నిర్వహిస్తున్న దృశ్యం

కేజీఎఫ్: కేజీఎఫ్ జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై జాగృతి జాతా నిర్వహించారు. నగరసభ మైదానం నుంచి ప్రారంభమైన జాతాను కేజీఎఫ్ 3వ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి గణపతి గురుసిద్ధ బాదామి ప్రారంభించారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. భవిష్యత్తులో ఉత్తమ పౌరులు కావాలంటే దురలవాట్లకు బానిస కారాదన్నారు. విద్యార్థులు ఎల్లప్పుడూ చదువుపైనే దృష్టి పెట్టాలన్నారు. మాదక ద్రవ్య ముక్త సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ చేతులు కలపాలన్నారు. జాతాలో తహసీల్దార్ నాగవేణి, కేజీఎఫ్ పోలీస్ జిల్లా ఎస్పీ శాంతరాజు తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దౌర్జన్యాల అడ్డుకట్టకు పోక్సో



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

కోలారు: పిల్లలపై లైంగిక దౌర్జన్యాల అడ్డుకట్టకే పోక్సో వంటి కఠిన చట్టాన్ని తెచ్చారని జడ్జి సునీల్ హొసమని తెలిపారు. సోమవారం తాలూకాలోని నరసాపుర కర్ణాటక పబ్లిక పాఠశాలలో పిల్లలకు బాల్య వివాహ నిషేధ, పోక్సో చట్టాలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజంలో బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థలను అరికట్టడానికి విద్యార్థులు, యువత నడుం బిగించాలన్నారు. తల్లిదండ్రులకు అవగాహన కలిగించడంతో పాటు అలాంటి ఘటనలపై సహాయవాణికి తెలియజేయాలన్నారు. పిల్లల హక్కులకు భంగం కలిగితే 1098 లేదా 14499కు సమాచారం అందించాలన్నారు. బాల్య వివాహాలు జరిపిస్తే రూ.లక్ష జరిమానాతో పాటు జైలుశిక్షకు గురవుతారన్నారు. మైనర్ బాలికలపై అత్యాచారానికి పాల్పడితే పోక్సో చట్టం కింద కఠిన శిక్ష తప్పదన్నారు. బాలల హక్కులను కాలరాసే అధికారం ఎవరికీ లేదన్నారు. ఈసందర్భంగా న్యాయవాది శ్యాం, ఉపాధ్యాయుడు శివప్రసాద్, రవికుమార్, శివశంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాస ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

మాలూరు: తాలూకాలోని ప్రసిద్ధ చిక్క తిరుపతి ప్రసన్న శ్రీవెంకటరమణ స్వామి అలయం ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి స్వామి దర్శనం చేసుకున్నారు. ప్రధాన అర్చకులు రవి, గోపాలకృష్ణ భరద్వాజ్, ఎన్.శ్రీధర్ నేతృత్వంలో ప్రత్యేక పూజలను చేశారు. స్వామి వారి మూల విగ్రహానికి విశేష పూలతో అలంకరించారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

కార్మిక పిల్లల చదువుకు పెద్దపీట

శ్రీనివాసపురం: కట్టడ కార్మికుల పిల్లల విద్యాభ్యాసానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే జీకే వెంకటశివారెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని పురసభ కార్యాలయంలో కట్టడ, ఇతర కార్మికుల పిల్లలకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. మండలి నుంచి టెన్త్, పీయూసీ చదువుతున్న కార్మికుల పిల్లల విద్యాభివృద్ధికి వీటిని పంపిణీ చేస్తున్నామన్నారు. మారుతున్న పరిస్థితుల్లో ఎంతో అవసరమైన ఈ ల్యాప్‌టాప్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో దరఖాస్తు చేసిన 150 మంది విద్యార్థుల్లో 33 మందికి వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండలి అధికారిణి ఎస్ ఆశారాణి, నేత్రావతి, భాను, సంఘం జిల్లా విభాగం కార్యదర్శి వి ఆనంద్, తాలూకా కార్యదర్శి రామచంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

శ్రీనివాసపురం: విద్యార్థినులు విద్యతో మంచి భవిష్యత్తును రూపొందించుకోవాలని ఎమ్మెల్యే జీకే వెంకటశివారెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన కళాశాల వార్షికోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. కళాశాలకు ప్రహరీతో పాటు అవసరమైన మౌలిక సౌకర్యాలను కల్పిస్తామన్నారు. పీయూ విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్రప్ప మాట్లాడుతూ రాజ్యాంగం మహిళలకు నిర్బంధ విద్యా హక్కును కల్పించిందన్నారు. మహిళలు కూడా నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. అనంతరం క్రీడా, సాంస్కృతిక రంగాల్లో విజేతలకు ప్రమాణ పత్రాలు అందించారు. ప్రిన్సిపాల్ సీఆర్ ప్రాణేశ్, టీపీ ఈఓ ఎస్ శివకుమారి, తాలూకా కసాప అధ్యక్షురాలు పీఎస్ మంజుల, తాలూకా దసాప అధ్యక్షుడు జీకే నారాయణస్వామి పాల్గొన్నారు.

క్లుప్తంగా

సెక్యూరిటీ గదిలోకి నాగుపాము


వైరుకు చుట్టుకున్న పాము

శివమొగ్గ: నగరంలోని ఫ్రీడమ్‌పార్కులో ఉన్న కర్ణాటక రాష్ట్ర పారిశ్రామిక భద్రత విభాగం కార్యాలయంలోకి నాగుపాము వచ్చింది. అర్ధరాత్రి సమయంలో పాము కనిపించడంతో సిబ్బంది స్నేక్ కిరణ్‌కు సమాచారం ఇచ్చారు. విద్యుత్ బాక్స్ లోపల ఉన్న పామును కిరణ్ సురక్షితంగా పట్టుకున్నారు. ఈ పాము నాలుగున్నర అడుగులు ఉందని కిరణ్ తెలిపారు. అనంతరం పామును సురక్షిత ప్రాంతంలో వదిలిపెట్టారు.

బ్యాంక్ ఖాతా లూటీ

మైసూరు: ఒక వ్యక్తి బ్యాంక్ ఖాతాను హ్యాక్ చేసి ఆన్‌లైన్ మోసగాళ్లు నగదు దోచుకున్నారు. ఈ ఘటన హెచ్‌డీ కోటెలో జరిగింది. కేఎస్ ఆర్టీసీ ఉద్యోగి రవి అనే వ్యక్తి ఎస్‌బీఐ యోనో యాప్‌ను నిందితులు హ్యాక్ చేశారు. తొలిసారి రూ. 10 వేలు, ఆ తర్వాత రూ. 20 వేలు ఇలా మొత్తం రూ. 30 వేలను తమ ఖాతాలోకి బదిలీ చేసుకున్నారు. బాధితుడు రవి హెచ్‌డీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఈవీఎంలపై అవగాహన


ఓటరుకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మైసూరు: లోకసభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎన్నికల కార్యాలయం ఆధ్వర్యంలో ఈవీఎంలపై సామాన్య ప్రజలకు ఎన్నికల సంఘం అవగాహన కల్పించింది. ఈవీఎంల వినియోగం, వీవీప్యాట్ల పనితీరుపై ప్రజలకు వివరించారు. జిల్లాధికారి డాక్టర్ కేవీ రాజేంద్ర ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం ఏర్పడేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడుతాయని అభిప్రాయపడ్డారు.

సెక్రెటరీపై చర్యలు తీసుకోవాలి



ధర్నా చేస్తున్న జేడీఎస్ కార్యకర్తలు

దొడ్డబళ్లాపురం: రామనగర తాలూకా బానందూరు డెయిరీ సెక్రెటరీపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేస్తూ జేడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం డెయిరీ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. సెక్రెటరి మంజునాథ్ పాడి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, అవినీతికి పాల్పడుతున్నాడని, వెంటనే ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేసారు. మాజీ ఎమ్మెల్యే మంజునాథ్ ధర్నాలో పాల్గొన్నారు.

బియ్యం వద్దు... నగదు ఇవ్వాలని ధర్నా

శివాజీనగర: రాష్ట్ర ప్రభుత్వం అన్నభాగ్య పథకం కింద బియ్యం కాకుండా నగదు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కేఎస్‌సీ కరునాడ సేవకుల పార్టీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. సోమవారం నగరంలో ఫ్రీడం పార్కులో చేరుకొన్న కార్యకర్తలు, ప్రభుత్వం అన్నభాగ్య పథకానికి నెలకు రూ.1600 కోట్ల సొమ్మును ఖర్చు చేస్తోంది. బియ్యంలో నాణ్యత లేదు. పైగా కేజీకి రూ. 34 కొనుగోలు చేస్తోంది, ఇది రేషన్ దుకాణాలకు చేరుకునేలోగా కేజీ బియ్యం రూ.38 అవుతుందని తెలిపారు. ఈ క్రమంలో రేషన్ పొందిన వారు కేవలం రూ. 10 అమ్ముతున్నారని, నాణ్యత లేకపోవడంతో లబ్ధిదారులు బయట విక్రయిస్తున్నారని, ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకురావటం తమ ఉద్దేశ్యమని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ తెలిపారు.

రాగి కుప్పలపై ఏనుగుల దాడి


ఏనుగులు నాశనం చేసిన పంట, బాధిత రైతు రాజప్ప

దొడ్డబళ్లాపురం: కనకపుర తాలూకా మేగళదొడ్డి గ్రామంలో కోతకోసి వేసిన రాగికుప్పలపై అడవి ఏనుగులు దాడిచేసి నాశనం చేసాయి. గ్రామానికి చెందిన రైతు రాజప్ప రెండెకరాల్లో రాగిపంట కోతకోసి పొలంలోనే కుప్పలు పోసి ఉంచాడు. ఆదివారం రాత్రి అడవి ఏనుగులు గుంపు దాడిచేసి కుప్పలను నాశనం చేసి, రాగిపంట తిని వెళ్లిపోయాయి. గ్రామంలో రైతులు అడవి ఏనుగుల భయంతో పంటలకు పగలు, రాత్రి కావలా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. సమాచారం అందుకున్న అటవీ అధికారులు పంటను పరిశీలించారు.

మురిపించిన చిత్రసంతె


టీవీ చిత్రం కాదు..చిత్రకారుడి అద్భుత పెయింటింగ్


చిత్రసంతలో సందర్శకుల రద్దీ

- కళాప్రియుల అపూర్వ స్పందన
- రూ.5 కోట్ల మేర పెయింటింగ్స్ వ్యాపారం

బనశంకరి: సిలికాన్ సిటీలో చిత్రకళా పరిషత్ పరిసరాల్లో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు జరిగిన 21వ చిత్రసంతె నగరవాసులను కనువిందు చేసింది. కర్ణాటకతో పాటు ఇతర రాష్ట్రాలు దేశ విదేశాల నుంచి 4 లక్షల మందికి పైగా సందర్శకులు తరలివచ్చారు, రూ.5 కోట్లకు పైగా విలువైన పెయింటింగ్స్‌ను కొనుగోలు చేశారు. మొత్తం 1,780 మంది చిత్రకారులు పాల్గొని తమ పెయింటింగ్స్‌ను ప్రదర్శించారు. అరచేతిలో పట్టే చిత్రంతో పాటు ఆరడుగుల విస్తీర్ణం ఉన్న చిత్రలేఖనాలు కొలువుతీరాయి. చిత్రాలతో పాటు మట్టి, చెక్క, అమృతశిల, పింగాణి తదితరాలతో రూపొందిన కళారూపాల విక్రయాలూ జరిగాయి.

జల్లికట్టు చిత్రం రూ.15 లక్షలు

- హైదరాబాద్‌కు చెందిన కళాకారుడు పరశురామ్ గీసిన జల్లికట్టు పోటీల్లో ఎద్దుతో ఎద్దుతో పోరాడుతున్న పెయింటింగ్ రూ.15 లక్షలు ధర పలికింది. ఆయిల్ పెయింట్ వినియోగించి గత ఆరునెలలుగా పెయింటింగ్ గీస్తున్నానని, ఇది ఇంకా పూర్తికాలేదని ఈ పెయింటింగ్ విక్రయించడంలేదని ప్రదర్శనకు మాత్రమే పెట్టానని పరశురామ్ తెలిపారు.
- 2016 నుంచి చిత్రసంతెకు వస్తున్నానని ఈ సారి చర్మంపై గీసిన రామాయణ సుందరకాండ, మహా భారత కురుక్షేత్ర యుద్ధం పెయింటింగ్స్ తీసుకువచ్చానని తెలిపారు. దీనికి కనీసం రూ.75 వేల నెంచి రూ.2 లక్షల ధర ఉంటుందని, 2008లో జాతీయ పురస్కారం అందుకున్నానని ఏపీ చిత్రకారుడు హనుమంత తెలిపారు.
- తమిళనాడుకు చెందిన కళాకారుడు జీవన్‌శక్తివేల్ గీసిన మదురై శ్రీ వెంకటేశ్వరస్వామి కళాకృతి ఆకట్టుకుంది. దీని ధర రూ.12 లక్షలుగా నిర్ణయించారు.
- మైసూరు జంబూసవారి చిత్రం కళాకృతి తీసుకువచ్చిన బెళగావి చిత్రకారిణి మీనాక్షి సదలగి మాట్లాడుతూ గత ఏడాది మంత్రాలయం ల్యాండ్‌స్కేప్ చిత్రాలు తీసుకువచ్చానని, రూ.2 లక్షల విలువచేసే కళాకృతులు విక్రయించామని తెలిపారు.
- జంబూసవారి పెయింటింగ్ రూ.3 లక్షలని తెలిపారు. బెంగళూరువాసి అంజన్ కుడ్యచిత్రాలు ఆకట్టుకున్నాయి. స్విచ్ నొక్కితే లైటింగ్‌తో పాటు వాయిద్యాల శబ్దం వినబడేలా తీర్చిదిద్దారు దీని విలువ రూ.75 వేల నుంచి రూ.1.50 లక్ష విలువ ఉంది.

క్యారికేచర్‌పై మక్కువ

ఈసారి చిత్ర సంతెలో స్పాట్ క్యారికేచర్‌కు గిరాకీ ఏర్పడింది. సుమారు 160 మందికి పైగా చిత్రకారులు అక్కడికక్కడే సందర్శకుల చిత్రాలను గీసి ఇచ్చారు. ఒక్కో పెయింటింగ్‌కు రూ.500 నుంచి రూ.800 ధర నిర్ణయించారు. చాలామంది చిత్రకారులు మంచి స్పందన వచ్చిందనే హర్షం వ్యక్తంచేశారు.


ఆకట్టుకునే వ్యంగ్య చిత్రాలు


జల్లికట్టు చిత్రం, ఎద్దుతో పోరాడుతున్న మహిళ పెయింటింగ్


తన పెయింటింగ్‌తో ఓ చిత్రకారిణి

టిప్పర్ లారీ ఢీ.. ఒకరు మృతి

మైసూరు: టిప్పర్ లారీ ఢీ కొనడంతో బైకిస్టు మృతి చెందిన ఘటన నంజనగూడు తాలూకా హల్లరె గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన అబ్దుల్ సలామ్ (55) మృతుడు. ఇతను తన పొలంలో పని ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తుడగా వెనుక నుంచి వచ్చిన టిప్పర్ లారీ ఢీ కొట్టింది. కిందపడిపోయిన అబ్దుల్‌పై లారీ దూసుకెళ్లడంతో అతను అక్కడికక్కడే మరణించాడు. నంజనగూడు గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి...

యశవంతపుర: పీణ్య పరిధిలో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. నగరంలోని కిర్లోస్కర్ లేఔట్‌కు చెందిన సునీల్‌కుమార్ (53) బైక్‌పై వస్తూ అదుపుతప్పి కిందపడి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. మరో ఘటనలో ఆర్టీ నగర దిణ్ణూరు మొయిన్‌రోడ్డులో ఆదివారం రాత్రి కారులో వెళ్తుండగా ఆకస్మికంగా కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. కారు డ్రైవర్ రాజు (39) అక్కడికక్కడే మృతి చెందారు. ఆర్టీ నగర పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు దుర్మరణం


ఫక్రుద్దీన్ (ఫైల్)

బాగేపల్లి: పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు హెచ్ఎస్ ఫక్రుద్దీన్ (75) మృతి చెందారు. పట్టణంలోని 15వ వార్డులో నివాసం ఉంటున్న ఈయన ఇటీవల కాలంలో రైతు సంఘంలో క్రియాశీలకంగా పని చేస్తున్నారు. తన పొలం నుంచి వస్తూ రహదారిపైకి ఎక్కుతుండగా పుట్టపర్తి నుంచి వస్తున్న కారు ఢీకొంది. దీంతో తల భాగం తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. బాగేపల్లి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

26 నుంచి రాజ్యాంగ యాత్రలు

- సీఎం సిద్దు తీర్మానం

బనశంకరి: గ్రామ పంచాయతీలలో భారత రాజ్యాంగ యాత్రను నిర్వహించాలని అధికార కాంగ్రెస్ నిర్ణయించింది. సోమవారం సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన క్యాంపు కార్యాలయంలో అధికారులతో భేటీ నిర్వహించారు. రాజ్యాంగం గొప్పతనాన్ని చాటేలా కార్యక్రమాలను జరపాలని నిర్ణయించారు. జనవరి 26న రాష్ట్రవ్యాప్తంగా రాజ్యాంగ జాగృతి జాతాను నిర్వహిస్తారు. అన్ని గ్రామ పంచాయతీ పరిధిలో జరిపి భావైక్యత గురించి జాగృతం చేసే చిత్రాలను ప్రదర్శిస్తారు. ఒక నెల రోజుల పాటు ఈ జాతాలు జరుగుతాయి. ఫిబ్రవరి 24 , 25 తేదీల్లో బెంగళూరు ప్యాలెస్ మైదానంలో భారీ ఎత్తున ముగింపు వేడుకలను ఏర్పాటుచేస్తారు. పలుశాఖల ఆధ్వర్యంలో రాజ్యాంగ సదస్సులను కూడా జరుపుతారు. మంత్రులు మహదేవప్ప, పాటిల్, కేహెచ్.మునియప్ప, దినేశ్‌గుండూరావ్, ప్రియాంక్‌ఖర్గే పాల్గొన్నారు.

ఆర్థిక సహాయంతో ప్రగతి సాధించండి


పదవీ స్వీకారం చేస్తున్న నూతన సభ్యులు

గౌరిబిదనూరు: ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ వారందించే ఆర్థిక సహాయంతో మహిళలు అభివృద్ధి సాధించాలని జెడ్పీ మాజీ సభ్యుడు జగన్నాథ్ తెలిపారు, తాలూకా మంచేనహళ్లిలోని శ్రీ పిళేకమ్మ దేవాలయంలో ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సామూహిక ధనలక్ష్మీ పూజా కార్యక్రమం, నూతన సభ్యుల అధికార బాధ్యతల స్వీకారోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ఈ సంస్థ తక్కువ వడ్డీతో వివిధ వృత్తుల్లో అభివృద్ధి చెందడానికి సహాయం అందజేస్తుందని అన్నారు. ప్రాజెక్ట్ అధికారి నాగరాజ నాయ్క మాట్లాడుతూ... 2700 స్వసహాయ సంఘాలలో 25 వేల మంది సభ్యులున్నారని వారందరూ సాయానికి అర్హులని అన్నారు. జిల్లా డైరెక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ... ధర్మస్థల దేవాలయం ధర్మకర్త వీరేంద్ర హెగ్డె దేవాలయానికి లభించే ఆదాయం ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నారన్నారు.

కాంగ్రెస్‌వి ఓటు రాజకీయాలు

యశవంతపుర: ఓటు బ్యాంక్ కోసం కాంగ్రెస్ నాయకులు కశ్మీర్ పాక్‌లో భాగమని అంటారని యలహంక ఎమ్మెల్యే ఎస్ఆర్ విశ్వనాథ్ ధ్వజమెత్తారు. బెంగళూరులో విలేకర్లతో మాట్లాడుతూ... స్వాతంత్ర్యానికి ముందు బెళగావి మహారాష్ట్రకు చేరిందని మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ చేసిన వ్యాఖ్యలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బెళగావి విశాల కర్ణాటకలో చేరి అనేక ఏళ్లు అవుతుంది. ఓటు కోసం కాంగ్రెస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు ప్రమాకరమన్నారు. అలాంటి వ్యాఖ్యలు చేసిన లక్ష్మీ హెబ్బాల్కర్‌ను మంత్రి పదవి నుంచి తొలగించాలన్నారు.

అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక


ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న దృశ్యం

చింతామణి: తాలూకాలోని జీడరహళ్లి పాల ఉత్పత్తుల సహకార సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా నరహరి, ఉపాధ్యక్షుడిగా గిరీశ్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి మంజునాథ్ వెల్లడించారు. నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులు మాట్లాడుతూ... సభ్యులు సహకారంతో డెయిరీని లాభాల బాటలో నడిపిస్తామన్నారు. కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సతీష్, నరసింహప్ప, అశ్వత్థరెడ్డి, డెయిరీ కార్యదర్శి అశ్వత్థనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మేకపిల్లను బలిగొన్న చిరుత

దొడ్డబళ్లాపురం: దొడ్డ తాలూకాలో చిరుతలు కలకలం సృష్టిస్తున్నాయి. తాజాగా ఆదివారం రాత్రి దొడ్డ తాలూకా కొట్టిగెమాచేనహళ్లి గ్రామంలో జొరబడ్డ చిరుత ఇంటి ముందు కట్టేసిన మేకపిల్లను ఎత్తుకెళ్లి గ్రామం శివారులో సగం తిని మిగతా కళేబరాన్ని వదిలి వెళ్లిపోయింది. సమీపంలోని కుక్కలమళ్లి గ్రామంలో గతవారం చిరుత మేకలను బలితీసుకుంది. ఇంటి కాంపౌండ్ ఎగిరివచ్చి మరీ మేకలు చంపి తినింది. తాలూకాలో గ్రామీణ ప్రాంతాల్లో చిరుతల సంచారం ఎక్కువ కావడంతో జనం భయభ్రాంతులకు లోనవుతున్నారు. చిరుతలను బంధించాలని అటవీశాఖ అధికారులను డిమాండు చేస్తున్నారు.

22న ఆలయాల్లో ప్రత్యేక పూజలు

బనశంకరి: అయోధ్య రామ మందిరంలో ఈనెల 22న శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో ఒకేసారి ప్రత్యేక పూజలు నిర్వహించాలని దేవదాయశాఖమంత్రి రామలింగారెడ్డి ఆదేశించారు. ఆ రోజు మధ్యాహ్నం 12.29 నిమిషాల నుంచి 12.30 నిమిషాల వరకు శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ జరుగుతున్న సమయంలో ఆలయాల్లో ఒకేసారి పూజలు చేయాలన్నారు.

ఇవాంజలిస్ట్స్ ఫెలోషిప్ కార్యవర్గ సభ్యుల ఎంపిక


సమావేశంలో పాల్గొన్న వివిధ చర్చీల పాస్టర్లు

శివాజీనగర: రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో సేవలందిస్తున్న సేవకులంతా కలసి కొత్తగా హుబ్లీ కేంద్రంగా హుబ్లీ పాస్టర్స్ ఇవాంజలిస్ట్స్ ఫెలోషిప్ కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. సోమవారం గాంధీవాడ బెతల ప్రేయర్ హాల్‌లో జరిగిన హెచ్‌పీఇఎఫ్ నెలవారి సమవేశంలో సీనియర్ పాస్టర్లు రెవరెండ్ బిజ్జా సాలోమాన్, రెవరెండ్ పీ.దానియేల్ సమక్షంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీలో రెవరెండ్ బుర్గా తిమోతి, రెవరెండ్. సుందర్, బ్రదర్ ఎం.జాన్, రెవరెండ్ మహేశ్, రెవరెండ్ శాలెమ్, రెవరెండ్.జే.మరికంటి, రెవరెండ్ పీ.డేవిడ్స్‌ను ఎన్నుకోగా, బెంగళూరు హెచ్‌పీఇఎఫ్ కోఆర్డినేటర్‌గా రెవరెండ్ వై.ప్రభుదాస్‌ను ఎన్నుకొన్నారు. ప్రస్తుత పరిస్థితిలో సేవకుల అభివృద్ధి, సంక్షేమం దృష్టితో ఐక్యత కలిగి ఆత్మీయంగా సేవలందించాలనే ఉద్దేశ్యంతో ఈ నూతన కమిటీని ఎంపిక చేసినట్లు రెవరెండ్ పీ.దానియేల్ తెలిపారు.

హోసూరు వార్తలు..

అన్నా డీఎంకేలోకి చేరికలు


పార్టీ సభ్యత్వం అందజేస్తున్న దృశ్యం

క్రిష్ణగిరి: క్రిష్ణగిరి జిల్లాకు చెందిన డీఎంకే నాయకులు, కార్యకర్తలు పలువురు సోమవారం అన్నా డీఎంకే పార్టీలో చేరారు. బర్గూరు యూనియన్ కౌన్సిలర్ కవితా గోవిందరాజ్, డీఎంకే పార్టీ మాజీ యూనియన్ కార్యదర్శి, పంచాయతీ అధ్యక్షులు గోవిందరాజ్, డీఎంకే కౌన్సిలర్లు రంగనాథ్, శకుంతల, చెన్నప్ప, సూర్య, అయ్యప్ప, కుమార్, రాజేశ్వరి, సోమసుందరం తదితర వందలాది మంది కార్యకర్తలు చెన్నైలో అన్నాడీఎంకే అగ్రనేత వై.పళనీస్వామి సమక్షంలో చేరారు. మాజీ మంత్రి పి.బాలక్రిష్ణారెడ్డి, క్రిష్ణగిరి ఎమ్మెల్యే అశోక్‌కుమార్, వేపనపల్లి ఎమ్మెల్యే కే.పి.మునిస్వామి, మాజీ ఎమ్మెల్యే రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు ఆహ్వానం


ఆహ్వాన పత్రికలను అందజేస్తున్న దృశ్యం

కెలమంగలం: ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహం ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి డెంకణీకోట ప్రాంతంలో శ్రీరామరథయాత్రలో ప్రాణత్యాగం చేసిన వారి కుటుంబాలకు ఆహ్వానం అందింది. దేశ వ్యాప్తంగా 8 వేల మందికి మాత్రమే ఆహ్వానం అందగా తమిళనాడులో 106 మందికి ఆహ్వానం వచ్చింది. 1990లో డెంకణీకోటలో జరిగిన శ్రీరామరథయాత్రలో పాల్గొని పోలీసుల తుపాకీ కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారు. ప్రాణత్యాగం చేసిన శ్రీరామ భక్తులు నరసింహయ్య, బాబు, శంకర్, రాజా కుటుంబాలకు బీజేపీ దక్షిణ విభాగ నిర్వాహకులు సెందిల్‌కుమార్ వాయనాలు అందజేసి ఆహ్వానించారు.

చెట్టు పైనుంచి పడి కూలి మృతి

కెలమంగలం: చింతకాయలు తీసేందుకు చెట్టెక్కిన కూలి ప్రమాదశాత్తు కిందపడి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన అంచెట్టి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు...అంచెట్టి సమీపంలోని కామాక్షిపురం గ్రామానికి చెందిన కూలి పరమశివం (45) రెండు రోజుల క్రితం అదే ప్రాంతంలో చింతకాయలు తొలగించేందుకు చెట్టెక్కాడు. కాయలు కోస్తుండగా జారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని ధర్మపురి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు.

లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు


మహిళలకు కుట్టు యంత్రాలను అందజేస్తున్న కలెక్టర్

హోసూరు: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల మహిళలకు ఉచితంగా కుట్టు యంత్రాలను కలెక్టర్ శరయు అందజేశారు. కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తాగునీరు, రోడ్ల వసతి, మరుగుదొడ్ల ఏర్పాటు, వీధి దీపాలు, ఉచిత కుట్టుయంత్రాలు, వృద్ధాప్యపెన్షన్, ఆర్థిక సాయం కోరుతూ 465 వినతులు వచ్చాయి. వాటిని స్వీకరించిన కలెక్టర్ పరిశీలించి తగుచర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆర్థికంగా వెనుకబడిన క్రిష్టియన్ వర్గానికి చెందిన 14 మంది మహిళలకు తలా రూ. 10,500 విలువ చేసే ఉచిత కుట్టుయంత్రాలను అందజేశారు. అనంతరం కారుణ్య నియామకానికి సంబంధించి ఉద్యోగ ఉత్తర్వులను అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌వో సాధనకురల్, అధికారులు పన్నీర్‌సెల్వం, పద్మలత, మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొలం వివాదంలో ఒకరి హత్య

- పరారీలో నిందితులు


హత్యకు గురైన వ్యాపారి మునిరాజ్ (ఫైల్)

హోసూరు: హోసూరు సమీపంలో పాతకక్షల కారణంగా పాల వ్యాపారి హత్యకు గురయ్యాడు. వివరాల మేరకు హోసూరు తాలూకా బాగలూరు సమీపంలోని ఎలువపల్లి గ్రామానికి చెందిన గోపాలప్ప కొడుకు మునిరాజ్ (45) పాల వ్యాపారం చేస్తున్నాడు. తండ్రి గోపాలప్ప అదే ప్రాంతంలో నివాసముటున్న శాంతమ్మకు చెందిన పొలాన్ని ఆంధ్ర రాష్ట్రానికి చెందిన శ్రీనివాసరావ్‌కు విక్రయించాడు. శ్రీనివాసరావ్ తన పొలం చుట్టూ కంచె ఏర్పాటు చేసుకొన్నాడు. ఈ నేపథ్యంలో శాంతమ్మ అదే పొలంలోనే పశువులను మేపుతుండగా శ్రీనివాసరావ్ అడ్డుకున్నాడు. ఈ ఘటనపై శాంతమ్మ బాగలూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఆ సమయంలో గోపాలప్ప శాంతమ్మకు వ్యతిరేకంగా మాట్లాడడంతో ఆమె కొడుకు మధు (31) గోపాలప్పపై పగ పెంచుకున్నాడు. గోపాలప్పను చంపేందుకు యత్నించి విఫలమయ్యాడు. గోపాలప్ప కొడుకు మునిరాజ్ ఆదివారం బైక్‌పై వెళ్తుండగా మధు, మరొకరు కలిసి కొడవలితో నరికి చంపారు. బాగలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. దుండగులు పరారీలో ఉన్నారు. హతునికి భార్య, ఒక కొడుకు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఈ హత్యతో స్థానికంగా ఉద్రిక్తత ఏర్పడింది.

రాగి పంట కొనుగోలు కేంద్రాలు

హోసూరు: ప్రభుత్వం రాగిపంట విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసిందని తళి వ్యవసాయ శాఖ ఉపడైరెక్టర్ మురుగన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం రైతులు పండిస్తున్న రాగి క్వింటాలుకు రూ. 3,846 ధర నిర్ణయించింది. గత నెల 20వ తేదీ డెంకణీకోట తాలూకా మదగొండపల్లిలో కేంద్రాన్ని ప్రారంభించిందని, త్వరలో అందేవనపల్లి, అంచెట్టి, తళి ప్రాంతాల్లోనూ ఏర్పాటవుతాయని, ఈ కేంద్రాల్లో రైతులు రాగి ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. రైతులు పొలం పాస్‌బుక్, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్సు తదితరాలను చూపించాలని తెలిపారు.

పంచాయతీలో నిధుల స్వాహా

క్రిష్ణగిరి: క్రిష్ణగిరి సమీపంలోని చెన్నసంద్రం పంచాయతీలో యథేచ్ఛగా చెక్కులను పాస్ చేసి పంచాయతీ నగదును స్వాహా చేసిన కార్యదర్శిని సస్పెండ్ చేశారు. వివరాల మేరకు క్రిష్ణగిరి జిల్లా కుందారపల్లి సమీపంలోని చెన్నసంద్రం పంచాయతీ అధ్యక్షునిగా చక్రవర్తి, కార్యదర్శిగా మణిగంటన్ ఉన్నారు. ఇద్దరూ కలిసి రూ. 15.92 లక్షల పంచాయతీ నగదును స్వాహా చేసినట్లు స్థానిక ప్రజలు ఫిర్యాదు చేశారు. విచారణలో రుజువు కావడంతో పంచాయతీ అధ్యక్షునికి చెక్ పవర్‌ను రద్దు చేశారు, కార్యదర్శిని సస్పెండ్ చేశారు.

సీపీఐ ఆందోళన


డెంకణీకోటలో ఆందోళన నిర్వహిస్తున్న సీపీఐ కార్యకర్తలు

కెలమంగలం: తమిళనాడులో తుపాను బాధితులకు అందజేయాల్సిన నిధులను ఇవ్వడంలో కేంద్ర మోసగిస్తోందని ఆరోపిస్తూ సోమవారం డెంకణీకోట పాత బస్టాండులో సీపీఐ ఆందోళన చేపట్టింది. జిల్లా కౌన్సిలర్ భూదట్టియప్ప అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర కమిటీ సభ్యులు లగుమయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ... రెండు నెలలుగా భారీ వర్షాల కారణంగా పెద్ద ఎత్తున ప్రజలు జీవనోపాధిని కోల్పోయారని, వరద బాధితులకు కేంద్ర ప్రభుత్వం నుంచి అందించాల్సిన నిధులను బీజేపీ ప్రభుత్వం మోసగిస్తోందని, వెంటనే బాధితులకు నివారణ నిధులను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గురివింద.. గుంజీలు

ఓ పత్రికాధిపతి ఎలా ఉండకూడదో... ఒక లీజుదారుడు ఎలా ఉండకూడదో... ఒక వ్యాపారి ఎలా ఉండకూడదో... అన్నిటికీ మించి ఒక మనిషి ఎలా ఉండకూడదో చెప్పడానికి రామోజీ రావు ప్రత్యక్ష ఉదాహరణ. కాకపోతే.. న్యాయం ఆలస్యమైనా గెలుస్తుంది. కొన్నేళ్ల కిందట విశాఖలో అదే జరిగింది. ఇపుడు విజయవాడలోనూ రామోజీ విషయంలో అదే జరిగింది. ఆయనకు మానవత్వం, బంధుత్వాలకు అర్థం తెలియదని.. ఇతరుల సొమ్మును అప్పనంగా కాజేస్తాడని... రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే సైంధవుడని మరోసారి నిరూపితమయింది. ఫలితం ... కొన్నేళ్ల క్రితం తన కబ్జాలో ఉన్న విశాఖ ఈనాడు కార్యాలయం భూమిని అసలు యజమానికి అప్పగించిన ఈ గురివింద గింజ... ఇప్పుడు విజయవాడలోని స్థలాన్ని కూడా భూ యజమానికి అప్పగించి చిత్తగించారు. ఆ స్థలాన్ని ఖాళీ చేస్తున్నట్లు బోర్డు ఏర్పాటు చేసి మరీ బయటకు వెళ్లారు. అంతిమంగా న్యాయమే గెలుస్తుందన్న సత్యం మరోసారి రుజువైంది.

- సాక్షి, అమరావతి



విజయవాడ బెంజి సర్కిల్‌లోని ఈనాడు కార్యాలయాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

లీజు స్థలాన్ని కబ్జా చేసి..

విజయవాడలో అత్యంత రద్దీగా ఉండే బెంజ్ సర్కిల్ సమీపంలో దాదాపు 3 ఎకరాల్లో ఉన్న భవనం అది. చూడగానే అరె.. ఇది ఈనాడు ఆఫీసే కదా అనుకోవడం సహజం! ఎందుకంటే 40 ఏళ్లకుపైగా అది అలాగే చలామణి అవుతోంది మరి. ఈనాడు కార్యాలయంగా, రామోజీ రావు ఆస్తిగా ముద్ర పడిపోయింది. కానీ వాస్తవం ఏమిటంటే... ఇప్పుడే కాదు అది ఎప్పుడూ ఈనాడు సొంత స్థలం కాదు. కబ్జా ముసుగులో చెరుకూరి రామోజీ చెరబట్టిన స్థలం అది. దాదాపు 3 ఎకరాల్లో ఉన్న ఆ భూమి అసలైన యజమాని వల్లూరి రామకృష్ణ. ఆయన ఆ భూమిని రెండు భాగాలుగా 1980లో రామోజీకి లీజుకిచ్చారు. రామోజీ తన తోడల్లుడు డాల్ఫిన్ అప్పారావు ద్వారా వల్లూరి రామకృష్ణను సంప్రదించి ఆ భూమిని 33 ఏళ్ల లీజుకు తీసుకున్నారు. ప్రస్తుతం రూ.వందల కోట్ల మార్కెట్ విలువ ఉన్న భూమిని కేవలం వందల రూపాయలకే లీజుకు దక్కించుకున్నారు. అందులో 1.80 ఎకరాల విస్తీర్ణంలో ఈనాడు కార్యాలయ భవనాన్ని నిర్మించుకున్నారు. ఆ విధంగా ఆ భూమిని గుప్పిట పట్టిన తరువాత రామోజీ తన నిజ స్వరూపాన్ని ప్రదర్శించారు. లీజు గడువు ముగిసినా ఖాళీ చేయకుండా భూ యజమానులను ముప్పు తిప్పలు పెట్టారు. విజయవాడ అభివృద్ధికి అడ్డంకిగా నిలిచారు.

రోడ్డు విస్తరణను అడ్డుకుని..

విజయవాడ బాగా విస్తరించడం, ట్రాఫిక్ పెరగడంతో బెంజ్ సర్కిల్ సమీపంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. దీనిపై ప్రజల నుంచి అందిన వినతులను పరిశీలించిన తరువాత 2004లో విజయవాడ మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న ప్రవీణ్ ప్రకాశ్ ఆ రహదారిని విస్తరించాలని భావించారు. కానీ రోడ్డు విస్తరణ కోసం 'ఈనాడు' ప్రహరీని తొలగించేందుకు రామోజీ సమ్మతించలేదు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ రహదారి వెంబడి ఇరువైపులా డ్రెయిన్లు నిర్మించే ప్రయత్నం చేసినా రామోజీ అడ్డుకున్నారు. ఆ వరుసలో ఉన్న పలు వ్యాపార సంస్థలు, ఇతర కార్యాలయాల ప్రహరీలను తొలగించి రహదారిని విస్తరించినా ఈనాడు వద్దకు వచ్చేసరికి ఆగిపోయింది.

ఎన్‌హెచ్ఏఐకి బ్రేకులు

కేంద్ర జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) సైతం ఏమీ చేయలేకపోయింది. బందరు–పుణె జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించేందుకు ఎన్‌హెచ్ఏఐ 2018లో కార్యాచరణకు ఉపక్రమించింది. బందరు నుంచి విజయవాడ వరకు రహదారిని విస్తరించినా బెంజ్ సర్కిల్ సమీపంలోకి వచ్చేసరికి ఎన్‌హెచ్ఏఐకి బ్రేకులు పడ్డాయి. ఈనాడు ప్రహరీని తొలగించేందుకు రామోజీ ససేమిరా అనడంతో రహదారి విస్తరణ నిలిచిపోయింది. ఈ పరిణామాలతో 20 ఏళ్లుగా బెంజ్ సర్కిల్ వద్ద ట్రాఫిక్ సమస్యకు పరిష్కారమే లభించలేదు. మరోవైపు రహదారులు విస్తరించకపోవడంతో రాష్ట్రంలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారంటూ తన కరపత్రికలో నీతులు వల్లిస్తూనే ఉన్నారు.

లీజు ముగిసినా గబ్బిలంలా..

బెంజ్ సర్కిల్ సమీపంలోని ఖరీదైన భూమిని హస్తగతం చేసుకోవాలనే దుర్బుద్ధితో భూ యజమానిని రామోజీ ముప్పుతిప్పలు పెట్టారు. లీజుకు తీసుకున్న కొద్ది రోజులకే వివాదం పెట్టుకున్నారు. తన పలుకుబడితో తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. బెదిరింపులకు పాల్పడ్డారు. కనీసం లీజు గడువు ముగిసిన తరువాతైనా తన భూమి తనకు దక్కుతుందని వల్లూరి రామకృష్ణ ఆశించారు. 33 ఏళ్ల లీజు గడువు 2013తో ముగిసింది. అయినా సరే భూమిని ఖాళీ చేయకపోవడంతో రామోజీరావుతో సుదీర్ఘంగా వల్లూరి రామకృష్ణ, డాల్ఫిన్ అప్పారావుల న్యాయ పోరాటం సాగింది. ఏకంగా పదేళ్లపాటు తమ భూమి కోసం భూ యజమానులు పోరాడాల్సి వచ్చింది. ఎట్టకేలకు న్యాయం గెలిచింది. కోర్టు ఆదేశాలతో రామోజీ ఖాళీ చేశారు.



పుట్టుక నుంచే కుట్ర..!



ఈనాడు కార్యాలయాలు ఎక్కడెక్కడ ఉన్నాయో రామోజీ భూ అక్రమాలు అక్కడ కొనసాగాయి. ఈనాడు నెలకొల్పిన విశాఖలో కూడా భూ యజమానిని అదేవిధంగా మోసగించి ముప్పుతిప్పలు పెట్టారు. విశాఖలోని సీతమ్మధారలో మంతెన ఆదిత్య ఈశ్వరకుమార్ వర్మ కుటుంబానికి చెందిన 2.70 ఎకరాల భూమిలో ఈనాడు కార్యాలయాన్ని 1974లో ఏర్పాటు చేశారు. 33 ఏళ్ల లీజు గడువు ముగిసిన తరువాత ఆ భూమిని ఖాళీ చేసేందుకు రామోజీ మొండికేశారు. అంతే కాకుండా రహదారి విస్తరణ కోసం అందులో517 చ.మీటర్ల భూమిని విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఇచ్చి అందుకు ప్రతిఫలంగా మరోచోట 872 చ.మీటర్ల భూమిని పొందారు. అసలు యజమాని అయిన వర్మ కుటుంబానికి దాన్ని అప్పగించకుండా రామోజీ దర్జాగా తమ పేరిట రిజిస్టర్ చేసుకున్నారు. ఆ భూమి మార్కెట్ విలువ రూ.3 కోట్లు కావడం గమనార్హం. ఇక మార్కెట్ విలువ ప్రకారం రూ.32.5 లక్షల లీజు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.10 వేలు మాత్రమే చెల్లిస్తూ ఆ భూమిని గుప్పిట పట్టారు. లీజు ముగిసినా ఖాళీ చేయకపోవడంతో భూమి యజమాని వర్మ 2007లో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దాంతో న్యాయస్థానాన్ని మోసగించేందుకు రామోజీ ఏకంగా ఫోర్జరీకి పాల్పడ్డారు. విశాఖ జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్‌ను ఫోర్జరీ చేశారని వర్మ ఆధారాలతో నిరూపించడంతో రామోజీ కుట్ర బెడిసికొట్టింది. కుట్ర, ఫోర్జరీ కింద రామోజీపై కేసు కూడా నమోదు చేశారు. దీనిపై వర్మ సుప్రీంకోర్టు వరకు సుదీర్ఘ న్యాయ పోరాటం చేయాల్సి వచ్చింది. చివరికి ధర్మమే గెలిచింది. సీతమ్మధారలో ఈనాడు కార్యాలయం ఉన్న భూమిని ఖాళీ చేసి భూ యజమానికి అప్పగించాలని సుప్రీంకోర్టు 2012లో ఆదేశించింది. దాంతో రామోజీ తోక ముడిచి ఆ భూమిని ఖాళీ చేసి ఈనాడు కార్యాలయాన్ని నగర శివారులో పెందుర్తి సమీపంలోకి తరలించారు.

బాండ్లు తనకే ఇవ్వాలంటూ..

బెజవాడ ఈనాడు కార్యాలయం భూమిని కాజేసేందుకు రామోజీ మడత పేచీ పెట్టారు. రహదారి విస్తరణ కోసం సేకరించే భూమికి పరిహారంగా భూ, భవన యజమానులకు జారీ చేసే ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్లను తనకే ఇవ్వాలంటూ విజయవాడ కార్పొరేషన్‌కు నోటీసు పంపించారు. భూ యజమాని అయిన రామకృష్ణకు కాకుండా తనకే ఇవ్వాలని రామోజీ వాదించడంతో మున్సిపల్ అధికారులు షాక్ తిన్నారు. దీనిపై న్యాయ వివాదంతో అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోయారు. రామోజీ కోరుకుంది కూడా అదే! రహదారి విస్తరణ నిలిచిపోవాలన్నదే ఆయన ఉద్దేశం. అదే జరిగింది కూడా.

అంతిమ విజయం ధర్మానిదే...

న్యాయస్థానం ఆదేశాల తరువాత కూడా తాను ఆక్రమించిన భూమిని ఖాళీ చేసేందుకు రామోజీరావు ఏడాది సమయం తీసుకున్నారు. కోర్టు ఇచ్చిన గడువు ఇటీవల 2023 డిసెంబర్ 31తో ముగిసింది. దీంతో దారులన్నీ మూసుకుపోవడంతో ఇక తప్పనిసరి పరిస్థితుల్లో బెంజ్ సర్కిల్ సమీపంలోని ఈనాడు కార్యాలయాన్ని ఖాళీ చేశారు. అక్కడి యంత్రాలు, ఫర్నీచర్ తదితరాలను ఆటోనగర్‌లోని కార్యాలయానికి తరలించారు. ఎట్టకేలకు రామోజీ అక్రమ భూబాగోతానికి తెరపడింది. అసలైన యజమానులకు వారి భూమి దక్కింది. ఆ భూమిని తాజాగా ఓ వాణిజ్య సంస్థకు లీజుకు ఇచ్చారు. ఆలస్యమైనా సరే చివరికి న్యాయమే గెలుస్తుందని మరోసారి రుజువైంది.

అంగన్‌వాడీల సమ్మెలో రాజకీయ ప్రమేయం

- రాజకీయ ఎజెండాకు అంగన్‌వాడీలు బలికావద్దు
- అంగన్‌వాడీల డిమాండ్లు అన్నీ పరిష్కరించాం
- సమ్మెతో బాలింతలు, గర్భిణులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు
- మున్సిపల్ ఉద్యోగులు కూడా సమ్మెపై పునరాలోచించాలి
- ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: అంగన్‌వాడీల సమ్మెలో రాజకీయ ప్రమేయం ఉందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని టార్గెట్‌గా చేసుకుని రాజకీయ పార్టీలు కుయుక్తులు పన్నుతున్నాయని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. అంగన్‌వాడీలు రాజకీయ ఉచ్చులో పడొద్దని, పార్టీల ఎజెండాకు బలికావద్దని అన్నారు. సమయం మించిపోలేదని, సమ్మె విరమించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన సోమవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. అంగన్‌వాడీ వర్కర్లను యూనియన్లు రెచ్చగొట్టి రాజకీయం చేస్తున్నాయన్నారు. అంగన్‌వాడీల డిమాండ్లు అన్నీ అంగీకరించి అమలు చేశామన్నారు. ఒక్క వేతనాల పెంపునకు మాత్రం ఇది సమయం కాదని, కొంత గడువు ఇస్తే ఎన్నికల అనంతరం పరిస్థితిని బట్టి పెంచుతామని నచ్చజెప్పామన్నారు. అయినా సమ్మెను కొనసాగించి పేదలకు అత్యవసర సేవలు అందించకుండా ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. వీరి సమ్మె వల్ల గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రీ స్కూల్ యాక్టివిటీలోనూ అంగన్‌వాడీలు కీలకమన్నారు. పేదలకు అందే సేవల్లో ఇబ్బందులు కలిగితే ప్రభుత్వానిదే బాధ్యత అని, అందుకే అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అంగన్‌వాడీల విధులు అత్యవసర సర్వీసు కాబట్టే ఎస్మా ప్రయోగించామన్నారు. దీనిపై జైలుకైనా వెళ్తామంటూ యూనియన్ నేతలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. రాజకీయ పార్టీల నాయకులు వెనకుండి రెచ్చగొట్టి సమ్మెను నడిపిస్తున్నట్టు తేటతెల్లమైందని, సమస్యను మరింత జటిలం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వంలో భాగమన్న విషయం మరిచిపోయి తీవ్ర వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలోనూ టీడీపీ చేరిపోయిందని, చంద్రబాబు హయాంలో అంగన్‌వాడీల పట్ల ఎలా వ్యవహరించారో అందరికీ తెలుసని అన్నారు. పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందించకపోయినా పర్వాలేదని, ఇది అత్యవసర సర్వీసు కాదని చంద్రబాబును చెప్పమనండి అని అన్నారు.

తెలంగాణకంటే ఎక్కువగానే సీఎం జగన్ చేశారు

సీఎం వైఎస్ జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ కంటే ఎక్కువగానే అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు వేతనాలు పెంచారని సజ్జల గుర్తు చేశారు. రెండేళ్ల తర్వాత తెలంగాణ ప్రభుత్వం వేతనాలు పెంచిందని, భవిష్యత్‌లో మనం కూడా పెంచుతామని నచ్చజెప్పామన్నారు. ప్రభుత్వాన్ని దించేస్తామనే బెదిరింపులు తగదన్నారు. అంగన్‌వాడీల డిమాండ్లలో పరిష్కారమయ్యేవన్నీ సీఎం జగన్ చేస్తూనే వచ్చారన్నారు. ఉన్న విషయాన్ని ప్రభుత్వం నిజాయితీగా చెబుతోందని తెలిపారు. ఎవరిపైనా దురుసుగా వ్యవహరించవద్దని పోలీసులకు ఆదేశాలిచ్చామన్నారు. ప్రభుత్వం తీసుకునే ప్రత్యామ్నాయ చర్యలకు అడ్డుపడితే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు. తెగే వరకు లాగడం మంచిది కాదని, ప్రభుత్వం వైపు నుంచి అలాంటి ఇబ్బంది ఉండదని అన్నారు. పట్టుదలకు పోకుండా అంగన్‌వాడీలు, పారిశుద్ధ్య కార్మికులు సమ్మె విరమించాలని కోరారు. మున్సిపల్ కార్మికులతో చర్చలు జరుగుతున్నాయని, వారిని ఎస్మా పరిధిలోకి తెచ్చే ఆలోచన ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు.

టీడీపీకి అభ్యర్థులు లేరు.. మా టీమ్ పర్‌ఫెక్ట్‌గా ఉంది

వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీల మార్పుపై చంద్రబాబు కొత్త బాష్యం చెబుతున్నారని, మరి చంద్రబాబు, లోకేశ్, గంటా శ్రీనివాసరావు, వంగలపూడి అనిత, జవహర్, ఇతర టీడీపీ నేతలు వేరే నియోజకవర్గాల్లో ఎలా పోటీ చేశారని సజ్జల ప్రశ్నించారు. అవసరమైన స్థానాల్లో దీటైన అభ్యర్థులను బరిలో దించేలా సీఎం వైఎస్ జగన్ మార్పులు చేస్తున్నారన్నారు. ఎన్నికల పోరుకు ముందుగానే 175 సీట్ల విషయంలో అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో 175 స్థానాల్లో పోటీ చేయాల్సి వస్తే టీడీపీకి అభ్యర్థులే లేరని, వైఎస్సార్‌సీపీ అన్ని స్థానాల్లోనూ దీటైన అభ్యర్థులను సిద్ధం చేయడంతో తమ టీమ్ పర్‌ఫెక్ట్‌గా ఉందని ఉద్ఘాటించారు. వైఎస్సార్‌సీపీలో ఏదో అయిపోయినట్టు చంద్రబాబు, ఎల్లో మీడియా ప్రచారం చేయడం పరిపాటిగా మారిందన్నారు. నిజానికి చంద్రబాబు రాజకీయంగా ఫెయిలయ్యారని, చివరకు పవన్ కాళ్లు పట్టుకుని బతిమాలుకుంటున్నాడని అన్నారు. అందరూ కట్టగట్టుకుని వచ్చినా తాము గెలవడం తథ్యమన్నారు. వలంటీర్లు ఉద్యోగులు కానప్పుడు ఎన్నికల విధుల్లో ఎలా పాల్గొంటారని, ప్రజాస్వామ్యంలో పౌరులుగా పనిచేస్తారని విలేకరుల ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సచివాలయ ఉద్యోగులంతా ప్రభుత్వ ఉద్యోగులేనన్నారు. బోగస్ ఓట్లు అంటూ వైఎస్సార్‌సీపీపై బురద జల్లేందుకు టీడీపీ ప్రయత్నించి భంగపడిందన్నారు. వాస్తవానికి హైదరాబాద్‌లో ఉన్న వారి నుంచి బోగస్ ఓట్లను టీడీపీ నేతలు పెద్ద ఎత్తున చేర్పిస్తున్నారన్నారు. టీడీపీ పుట్టి మునిగిపోయిందని, వచ్చే ఎన్నికల్లో ఇప్పుడున్న 23 సీట్లు కూడా రావని సజ్జల స్పష్టం చేశారు.

'బిల్కిస్' దోషులకు... శిక్ష తగ్గింపు చెల్లదు

సుప్రీంకోర్టు సంచలన తీర్పు.. గుజరాత్ ప్రభుత్వ 'రెమిషన్' కొట్టివేత



న్యూఢిల్లీ/దాహోద్: బిల్కిస్ బానో కేసులో సుప్రీంకోర్టు సోమవారం సంచలనాత్మక తీర్పు వెలువరించింది. ఆమెపై అత్యాచారం, కుటుంబీకుల హత్య కేసులో 11 మంది దోషులకు శిక్షా కాలం తగ్గిస్తూ గతేడాది గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కొట్టేసింది. వారు రెండు వారాల్లోగా కోర్టులో లొంగిపోవాల్సిందిగా ఆదేశించింది. న్యాయమూర్తులు జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ధర్మాసనం ఈ మేరకు 251 పేజీల తీర్పు వెలువరించింది. ఓ మహిళపై ఇంతటి క్రూర నేరాలకు పాల్పడ్డ కేసుల్లో శిక్ష తగ్గింపుకు అసలు ఆస్కారమెలా ఉంటుందని గుజరాత్ ప్రభుత్వాన్ని నిలదీసింది. ఇలాంటి విషయాల్లో నిర్ణయాలు తీసుకునేటప్పుడు బాధితురాలి జాతి, మత విశ్వాసాలతో నిమిత్తం ఉండకూడదని స్పష్టం చేసింది. ''శిక్ష తగ్గింపు (రెమిషన్) గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న మతిలేని నిర్ణయం. ఈ విషయంలో దోషులతో ప్రభుత్వం పూర్తిగా కుమ్మక్కైంది. వారి విడుదల కోసం అన్నివిధాలా తీవ్ర అధికార దుర్వినియోగానికి పాల్పడింది'' అంటూ కడిగి పారేసింది. ''సుప్రీంకోర్టులో రెమిషన్ పిటిషన్ సందర్భంగా దోషులు ఈ కేసులో వాస్తవాలను దాచారు. తద్వారా అత్యున్నత న్యాయస్థానాన్నే ఏమార్చారు. తద్వారా రెమిషన్‌పై పరిశీలనకు ఆదేశాలు పొందారు'' అంటూ ఆక్షేపించింది. ఆ తీర్పు కూడా చెల్లుబాటు కాబోదని ప్రకటించింది. సుప్రీంకోర్టు తీర్పును బాధితురాలితో పాటు ప్రధాన రాజకీయ పక్షాలన్నీ స్వాగతించాయి. బానో స్వస్థలంలో ఆమె బంధుమిత్రులు బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. జైలుకు వెళ్లిన అనంతరం రెమిషన్ కోసం మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆశ్రయించే అవకాశం దోషులకు ఉంది.

తీర్పుపై స్పందనలు..

బానో అవిశ్రాంత పోరాటం ఎట్టకేలకు ఫలించింది. అన్యాయంపై, బీజేపీ సర్కారు అహంకారంపై ఆమె సాధించిన విజయమిది. ఎన్నికల లబ్ధి కోసం నేరగాళ్లకు ఆశ్రయమిస్తున్నదెవరో, న్యాయానికి పాతరేస్తున్నదెవరో సుప్రీంకోర్టు తీర్పుతో మరోసారి తేటతెల్లమైంది.
- కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ

ఇది సాహసోపేతమైన తీర్పు. ఇందుకు సుప్రీంకోర్టుకు కృతజ్ఞతలు.
- తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ

బానోకు కేంద్రం తక్షణం క్షమాపణలు చెప్పాలి.
- మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ

మహిళలపై జరిగే అన్యాయాలను జాతి సహించబోదని ఈ తీర్పు మరోసారి నిరూపించింది.
- బీఆర్ఎస్ నేత కల్వకుంట్ల కవిత

గుజరాత్‌లో 2002లో గోద్రా రైలు దహనకాండ అనంతరం మత ఘర్షణలు చెలరేగడం తెలిసిందే. ఆ సందర్భంగా బిల్కిస్ బానో ఉదంతం చోటుచేసుకుంది. 5 నెలల గర్భిణి అయిన 21 ఏళ్ల బిల్కిస్‌పై దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె మూడేళ్ల కూతురుతో పాటు కుటుంబానికి చెందిన ఏడుగురిని హత్య చేశారు. ఈ కేసులో 11 మందిని దోషులుగా సీబీఐ ప్రత్యేక కోర్టు ఖరారు చేసింది. వారికి జీవిత ఖైదు విధిస్తూ 2008లో తీర్పు వెలువరించింది. దీన్ని బాంబే హైకోర్టు కూడా సమర్థించింది. 15 ఏళ్ల పాటు జైలు శిక్ష అనుభవించాక తమను విడుదల చేయాలంటూ వారిలో ఒకరు 2022 మేలో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీన్ని పరిశీలించాలన్న కోర్టు ఆదేశం మేరకు గుజరాత్ ప్రభుత్వం ఒక కమిటీ వేసింది. దాని సిఫార్సు ఆధారంగా మొత్తం 11 మందికీ రెమిషన్ మంజూరు చేయడంతో 2022 ఆగస్టు 15న వారంతా విడుదలయ్యారు. దీనిపై బిల్కిస్ ఆవేదన వెలిబుచ్చింది. రాజకీయ పార్టీలతో పాటు అన్న విర్గాలూ వారి విడుదలను తీవ్రంగా తప్పుబట్టాయి. గుజరాత్ ప్రభుత్వ చర్యపై దేశమంతటా నిరసనలు వ్యక్తమయ్యాయి. వారి విడుదలను సుప్రీంకోర్టులో బిల్కిస్‌తో పాటు పలువురు సుప్రీంకోర్టులో సవాలు చేశారు. 11 రోజుల వాదనల అనంతరం 2023 అక్టోబర్ 12న ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది. రెమిషన్‌ను కొట్టేస్తూ తాజాగా తీర్పు వెలువరించింది.

గుజరాత్ ప్రభుత్వానికి అధికారం లేదు

ఈ కేసులో విచారణ జరిగి దోషులకు శిక్ష పడింది మహారాష్ట్రలో గనుక వారికి రెమిషన్ ప్రసాదించే అధికారం గుజరాత్ ప్రభుత్వానికి లేదని ఈ సందర్భంగా స్పష్టం చేసింది. లేని అధికారాన్ని చేతుల్లోకి తీసుకుని శిక్ష తగ్గించిందంటూ తప్పుబట్టింది. రెమిషన్ నిర్ణయాన్ని కొట్టేసేందుకు ఈ ఒక్క ప్రాతిపదికే చాలని పేర్కొంది. '2022లో సుప్రీంకోర్టుకు వెళ్లిన నిందితులు కేసులో వాస్తవాలను దాచి ధర్మాసనాన్ని తప్పుదోవ పట్టించి పునఃసమీక్షకు తీర్పును పొందారు. ఈ విషయంలో గుజరాత్ ప్రభుత్వం కూడా వారితో కుమ్మక్కైంది' అంటూ ఆక్షేపించింది. ''రెమిషన్ కోసం దోషుల్లో ఒకరు 2019లోనే గుజరాత్ హైకోర్టును ఆశ్రయించగా మహారాష్ట్ర ప్రభుత్వం వద్దకు వెళ్లాల్సిందిగా సూచించింది. 2020లోనూ మరో పిటిషన్ పెట్టుకున్నా కొట్టేసింది. దాంతో దోషి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆశ్రయించినా లాభం లేకపోయింది. రెమిషన్ ఇవ్వొద్దంటూ సీబీఐతో పాటు సీబీఐ ప్రత్యేక జడ్జి కూడా సిఫార్సు చేశారు. ఈ వాస్తవాన్ని సుప్రీంకోర్టు ముందు దాచిపెట్టారు'' అంటూ మండిపడింది. రెమిషన్ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలంటూ బానో నేరుగా సుప్రీంకోర్టులో పిల్ వేయడం ఆర్టికల్ 32 ప్రకారం సబబేనని ధర్మాసనం స్పష్టం చేసింది. 'శిక్ష విధించాల్సింది ప్రతీకార దృష్టితో కాదు. నేరం పునరావృతం కాకుండా చూసేందుకు. దాంతోపాటు దోషుల్లో మార్పు తెచ్చేందుకు' అన్న ప్లేటో సూక్తిని జస్టిస్ నాగరత్న ప్రస్తావించారు. శిక్ష తగ్గింపు నిర్ణయానికి కూడా దీన్ని వర్తింపజేయాల్సి ఉంటుందన్నారు. దోషుల హక్కులతో పాటు బాధితుల హక్కులనూ పరిగణనలోకి తీసుకోవడం తప్పనిసరని స్పష్టం చేశారు.

ఎంపీ అభ్యర్థులు కావలెను

▶ మొదటి పేజీ తరువాయి

ముందుకు రాకపోవడం ఇందుకు కారణం. దీంతో ఎన్ఆర్ఐలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గుంటూరు ఎంపీగా గల్లా జయదేవ్ వరుసగా రెండుసార్లు గెలిచినా ఇప్పుడు పోటీచేయడానికి ఆయన సుముఖంగా లేకపోవడం.. పైగా ఎవరూ ముందుకు రాకపోవడం ఆ పార్టీలో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. గల్లా జయదేవ్ 2019లో గెలిచిన తర్వాత రాజకీయాల్లో చురుగ్గాలేరు. ఆయన గుంటూరులో అడుగుపెట్టి రెండేళ్లు దాటింది. మళ్లీ పోటీచేయబోనని అధిష్టానానికి తెగేసి చెప్పేశారు. దీంతో గుంటూరులో పోటీచేసే అభ్యర్థుల కోసం టీడీపీ అన్వేషిస్తున్నా ఫలితం ఉండడంలేదు. మాజీమంత్రి ఆలపాటి రాజా, పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రను పోటీచేయాలని అడిగినా వారు ససేమిరా అంటున్నారు. దీంతో గుంటూరులోని ఒక విద్యాసంస్థల చైర్మన్‌ను పోటీచేయాలని కోరినట్లు కూడా సమాచారం. నిజానికి.. 2019లో పోటీచేయడానికి ఆయన ముందుకొచ్చినా అధిష్టానం అప్పట్లో ఆయన్ను పట్టించుకోలేదు. ఇప్పుడు పోటీచేయడానికి ఆయన ముందుకొచ్చి కొంత మొత్తం డిపాజిట్ చేసినప్పటికీ తాను పోటీచేయబోనంటూ ఆయన తప్పుకున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. తర్వాత రాజ్యసభకు అవకాశం కల్పించాలని కోరి పోటీ నుంచి తప్పుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఎన్ఆర్ఐల కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

రూ.వంద కోట్లు చూపిస్తేనే..

మరోవైపు.. ఒక్కో ఎంపీ అభ్యర్థి పోటీ చేయాలంటే కనీసం రూ.వంద కోట్లు చూపించాలని లోకేశ్ అడుగుతున్నారని, అందుకెవ్వరూ ముందుకు రావడంలేదని పార్టీ నాయకులు చెబుతున్నారు.

నరసరావుపేట, బాపట్లకూ ససేమిరా..

ఇదిలా ఉంటే.. నరసరావుపేట లోక్‌సభ స్థానానికి కూడా ఇప్పటివరకూ అభ్యర్థి దొరకలేదు. 2014లో చివరి నిముషంలో కాంగ్రెస్ నుంచి వచ్చిన రాయపాటి సాంబశివరావుకు టిక్కెట్ ఇచ్చారు. 2019లో రాయపాటి వద్దంటున్నా బలవంతంగా ఇచ్చారు. ఇప్పుడాయన వయస్సు రీత్యా పోటీకి సిద్ధంగాలేరు. దీంతో ఇక్కడ పోటీచేసేవారి కోసం వెతుకుతున్నారు. పెమ్మసాని చంద్రశేఖర్ అనే ఎన్ఆర్ఐ కోసం ప్రయత్నిస్తున్నారు. అయితే, ఆయన కూడా అంత ఆసక్తి చూపడం లేదని సమాచారం. ఇక బాపట్ల ఎస్సీ నియోజకవర్గం కావడంతో ఇక్కడ అభ్యర్థి దొరకడం టీడీపీకి తలనొప్పిగా మారింది. 2014, 2019లో పోటీచేసిన మాల్యాద్రి ఇప్పుడు రాజకీయాల్లో చురుగ్గా లేకపోవడం, పోటీకి ఆసక్తి చూపకపోవడంతో కొత్త అభ్యర్థి కోసం అధిష్టానం వెతుకుతోంది. ఇక్కడ నుంచి గుంటూరు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్‌ను పోటీచేయించాలని పార్టీ భావిస్తున్నా ఆయన ససేమిరా అంటున్నారు. దీంతో బాపట్ల ఎంపీ అభ్యర్థి కోసం ఆ పార్టీ బుర్ర బద్దలుకొట్టుకుంటోంది.

'ఈవీ'కి ఏపీ ప్రోత్సాహం భేష్

- ఇండియా ఎలక్ట్రిక్ వెహికల్ మార్కెట్ రౌండప్ 2023 నివేదిక వెల్లడి

సాక్షి, అమరావతి: పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యుత్ వాహనాలకు ఏపీ అందిస్తున్న తోడ్పాటు భేష్ అని ఇండియా ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) మార్కెట్ రౌండప్ 2023 నివేదిక కొనియాడింది. దేశవ్యాప్తంగా ఈవీలపై అధ్యయనం చేసిన ఎనర్జీ అడ్వయిజరీ, సాఫ్ట్‌వేర్ సేవల సంస్థ కస్టమైజ్జ్ ఎనర్జీ సొల్యూషన్స్ తాజా నివేదికను విడుదల చేసింది. 2023లో ద్విచక్ర, త్రిచక్ర విద్యుత్ వాహనాల అమ్మకాల్లో 80 శాతం వృద్ధి కనిపిస్తుండగా, 2030 నాటికి మొత్తం వాహనాల్లో 30 శాతం ఈవీలే ఉండాలనేది కేంద్రప్రభుత్వ లక్ష్యంగా నిర్ణయించిన విషయం విదితమే. తద్వారా రానున్న ఏడేళ్లలో 846 మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలను, 474 మిలియన్ టన్నుల చమురు దిగుమతులను తగ్గించవచ్చని కేంద్రం అంచనా వేస్తోంది. ఇందుకు తోడ్పాటునందిస్తున్న నాలుగు రాష్ట్రాల్లో ఏపీ కూడా ఉందని నివేదిక తెలిపింది. 2032 నాటికి దేశవ్యాప్తంగా ఏటా 27.2 మిలియన్ల విద్యుత్ వాహనాల విక్రయం జరుగుతుందని పేర్కొంది. 2030 నాటికి మొత్తం పెట్రోల్, డీజిల్, గ్యాస్ వాహనాల్లో సగం విద్యుత్ వాహనాలే ఉండాలనే లక్ష్యాన్ని ఏర్పరచుకున్న ఆంధ్రప్రదేశ్ చొరవను ఆదర్శంగా తీసుకోవాలని ఇతర రాష్ట్రాలకు ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ వంటి కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు ఇప్పటికే సూచించాయి. తాజాగా ఈవీ ప్రమోషన్‌కు వివిధ విధానాల ద్వారా సహకరిస్తూ ప్రోత్సాహకాలు అందించడంలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, హరియాణ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు ముందున్నాయని ఎనర్జీ సొల్యూషన్స్ సంస్థ నివేదికలో వివరించింది. ఏపీలో ప్రస్తుతం 65 వేల విద్యుత్ వాహనాలున్నాయి.

క్రిషా ఆర్ట్ స్పేస్...
చిత్రలేఖనాల నిలయం.
పుష్పాలంకరణ కళకు వేదిక.
కళను గ్రంథస్తం చేస్తున్న కలాశాల.



షర్మిలా అగర్వాల్, ఇకెబానా మాస్టర్

పూల కళాతోరణం

షర్మిల నిలయం

హైదరాబాద్, శ్రీనగర్ కాలనీ, షర్మిలా అగర్వాల్ ఇంట్లోకి అడుగుపెడితే మ్యూజియంలోకి ప్రవేశించిన అనుభూతి కలుగుతుంది. విశాలమైన రెండు గదుల గోడల నిండా ఆమె వేసిన చిత్రలేఖనాలు, ఆమె సేకరించిన అరుదైన కళారూపాలు ఉన్నాయి. సెంటర్ టేబుళ్లు, కార్నర్ స్టాండుల్లో ఇకేబానా (జపాన్ పుష్పాలంకరణ కళ) ఫ్లవర్ అరేంజ్‌మెంట్ అలరిస్తుంది. మరోవైపు ర్యాక్‌లలో ఆమె ఆవిష్కరించిన పుస్తకాల ప్రతులు కొలువుదీరి ఉన్నాయి. షర్మిలా అగర్వాల్ స్వయంగా రచయిత్రి, చిత్రకారిణి, ఇకేబానా పుష్పాలంకరణలో నిష్ణాతురాలు. ఈ మూడు కళలూ ఒకరిలో రాశిపోసి ఉండడంతో కావచ్చు ఆమె చిత్రాల్లో... ఆమె కవిత్వంలో కనిపించే భావుకత ద్యోతకమవుతుంది, అలాగే అదే చిత్రాల్లో ఆమె అలంకరించే ఇకేబానా కూడా కనిపిస్తుంది. రచయిత కావడంతో ఇకేబానా పుష్పాలంకరణను అక్షరబద్ధం చేస్తున్నారు. ఇప్పటి వరకు నాలుగు పుస్తకాలు వెలువరించారామె. గడచిన గురువారం (నాలుగవ తేదీన) 'ఇకేబానా సులభం' తెలుగు పుస్తకాన్ని ఆవిష్కరించారు. చిన్నపిల్లలకు ప్రాక్టీస్ వర్క్‌బుక్స్ పోలిన పది పుస్తకాల సెట్‌ను నేడు విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా సాక్షితో మాట్లాడుతూ 'గురువు పర్యవేక్షణలో నేర్చుకోవడం అందరికీ సాధ్యం కాదు, కాబట్టి ఈ పుస్తకాల సహాయంతో ఇంట్లోనే ప్రాక్టీస్ చేయవచ్చు. ఇకేబానా పుష్పాలంకరణ కళ ప్రతి తెలుగింటికీ చేరాలనేది నా కల. పుస్తకాన్ని ఎవరికి వారు స్వయంగా నేర్చుకోవడానికి అనువుగా రూపొందించాను' అన్నారామె.

పువ్వు మాట్లాడుతుంది!

''పూలు మన మనసుకు అద్దం పడతాయి. పుష్పాలంకరణ మన ఇంటికి వచ్చిన అతిథులకు మన మాటగా మౌనంగా స్వాగతం పలుకుతుంది, మనసును ఆహ్లాదపరుస్తుంది. అందుకే ప్రతి ఇంటిలో తాజా పువ్వు కనిపించాలి. అందుకే నా ఈ ప్రయత్నం. ఇక నా వివరాలకు వస్తే... నేను పుట్టింది, పెరిగింది ఉత్తరప్రదేశ్‌లోని బరేలిలో. రాసే అలవాటు చిన్నప్పటి నుంచి ఉంది. నా కవితలు స్థానిక హిందీ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. పెయింటింగ్స్ కూడా ఇష్టంగా వేసే దాన్ని. ఇక చదువు కూడా అదే బాటలో సాగింది. లిటరేచర్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఫైన్ ఆర్ట్స్‌లో కోర్సు చేశాను. మీనియేచర్ పెయింటింగ్స్ ఎక్కువగా ప్రాక్టీస్ చేస్తుంటాను. పెళ్లి తర్వాత హైదరాబాద్ రావడం నాకు టర్నింగ్ పాయింట్ అనే చెప్పాలి. హైదరాబాద్ నగరం చిత్రకారిణిగా నాకు గుర్తింపునిచ్చింది. సోలో ఎగ్జిబిషన్‌లు పెట్టాను, వేరే ప్రదర్శనల్లో నా చిత్రాలను ప్రదర్శించాను. నా స్టూడియోలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దాదాపు అన్ని ప్రదేశాల ప్రత్యేకతలనూ చూడవచ్చు. హిందీలో చంద్‌లమ్హే., కహా అన్ కహా రాశాను. పెయింటింగ్ గురించి మెళకువలు నేర్పించడానికి 'ఇన్నర్ రిఫ్లెక్షన్స్' పేరుతో రచనను సిద్ధం చేస్తున్నాను. ఇకేబానా గురించి చెప్పాలంటే ఇది నిరంతరసం సాధన చేయాల్సిన కళ. ఈ ఆర్ట్‌లో కొత్త విషయాలను నేర్చుకోవడానికి జపాన్‌కి ఆరుసార్లు వెళ్లాను. గతంలో 'ఇకేబానిస్ట్స్ అరౌండ్ ద వరల్డ్, ఇకేబానా ఫర్ బిగినర్స్, ఇకేబానా జపానీ పుష్పకళ' ప్రచురించాను. 'ఇకేబానా మనదేశానికి వచ్చి అరవై ఏళ్లు దాటింది. ముంబయికి చెందిన నిర్మలా లుక్మాణి 1961లో జపాన్‌కెళ్లి ఒహారా స్కూల్‌లో డిగ్రీ చేసి తిరిగి వచ్చిన తర్వాత ఇంట్లోనే విద్యార్థులకు శిక్షణనివ్వడం మొదలుపెట్టారు...' వంటి చారిత్రక వివరాలందించాను. తెలుగు స్నేహితుల సహాయంతో 'ఇకేబానా సులభం' పుస్తకంలో... ఇకేబానా కళను నేర్చుకోవాలనే ఆసక్తి ఉండి, స్వయంగా క్లాసులకు హాజరు కాలేని వాళ్లకు పూసగుచ్చినట్లు వివరించాను. ఫ్లవర్‌పాట్ కొలతలు, కొమ్మలు, పూల పరిమాణాలతో సహా కచ్చితంగా రేఖాచిత్రాలతో పుస్తకం రాశాను. జపాన్‌లో ఉపయోగించే పూలతో అలంకరణను చూపిస్తూనే మనకు లభించే పూలు, ఆకులతో అలంకరించడం కూడా ఫొటోలతో చూపించాను. ఫ్లవర్‌వాజ్‌లుగా ఉపయోగించే పాత్రలు, పిన్‌హోల్డర్‌లు, పూలు... ఎందులోనూ కృత్రిమత్వం ఉండదు. నురుగు లాంటి వాటికి నిషేధం. శ్వాసకు హాని కలగరాదు, మట్టిలో కరిగే క్రమంలో నేలకు హాని కలిగించరాదు. ఇది నియమం.



ఈ పెయింటింగ్‌ను పరిశీలించండి. ఇందులో అజంతా గుహలున్నాయి. బౌద్ధ భిక్షువులు, రికా (ఇకేబానాలో ఓ శైలి) పుష్పాలంకరణ ఒక భాగంలో కనిపిస్తాయి. మరొక భాగంలో అంతఃపుర స్త్రీలు పుష్పాలంకరణ చేస్తున్నారు. కిందవైపు సామాన్య మహిళలు ఫ్లవర్ అరేంజ్‌మెంట్‌లో సంతోషిస్తున్నారు. జపాన్ నుంచి ఈ కళ బౌద్ధ భిక్షువుల ద్వారా ఇండియాకి వచ్చినప్పుడు రాజకుటుంబాల మహిళలకు చేరింది. ఆ తర్వాత సామాన్యులకు పరిచయమైంది. ఇది ప్రాచీన చారిత్రక నేపథ్యం.

చిత్ర వైవిధ్య లేఖనం

నేను పుట్టిపెరిగిన ఉత్తరాది జీవనశైలిని నా చిత్రాలు ప్రతిబింబిస్తుంటాయి. అక్కడి జీవనశైలిలో టెర్రస్‌కు ప్రాధాన్యం ఎక్కువ. ఉష్ణోగ్రతలు గరిష్ఠం, కనిష్ఠం రెండూ తీవ్రంగా ఉంటాయి. వేసవిలో సాయంత్రం నుంచి తెల్లవారే వరకు డాబా మీద గడుపుతారు. శీతాకాలంలో మధ్యాహ్నపు ఎండ కోసం డాబా మీద ఉంటారు. దైనందిన జీవితంలో సగభాగం డాబా మీద గడుస్తుంది. కాబట్టి డాబా అన్ని ఏర్పాట్లతో ఉంటుంది. నా చిత్రాలు ఉత్తరాది జీవితాన్ని కళ్లకు కడతాయి. ఇకేబానా పరిణామక్రమం కూడా చిత్రాల్లో మిళితమై ఉంటుంది. ఈ కళ జపాన్ స్కూళ్ల నుంచి మన దేశానికి థియరిటికల్‌గా వచ్చి అరవై ఏళ్లు దాటినప్పటికీ సంపన్న, ఎగువ మధ్యతరగతి దగ్గరే ఆగి పోయింది. సామాన్యులకు చేరాలంటే నేను ఊరూరా స్కూళ్లను పెట్టలేను, కాబట్టి అక్షరం అనే మాధ్యమాన్ని ఎంచుకున్నాను. తెలుగు నేల నాకు చాలా ఇచ్చింది. తెలుగు నేలకు నేను తిరిగి ఇవ్వడం ద్వారా కృతజ్ఞత చెల్లించుకుంటున్నాను. ఈ పుష్పాలంకరణ కళను తెలుగు రాష్ట్రాల్లో కుగ్రామాలకు కూడా చేర్చాలనేది నా ఆకాంక్ష'' అన్నారు షర్మిలా అగర్వాల్.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

స్టార్ చెఫ్‌కు మిషెలాన్ స్టార్

ఫస్ట్ టైమ్



గరిమా అరోరా



'అబ్బో! ఇప్పుడు తినాలా!' అని బద్ధకించే వాళ్లను కూడా ఆవురావురుమంటూ తినేలా చేసింది ముంబైకి చెందిన గరిమా అరోరా. వంటల తత్వాన్ని ఒడిసిపట్టిన గరిమా చెఫ్, రెస్టారెంట్ నిర్వాహకురాలిగా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంది.

తాజాగా...

'మిషెలాన్ స్టార్' అవార్డ్ గెలుచుకున్న తొలి భారతీయ మహిళగా ప్రత్యేకత సాధించింది గరిమా అరోరా. ప్రపంచ వ్యాప్తంగా 'ఔట్ స్టాండింగ్ కుకింగ్'కు సంబంధించి చెఫ్‌లకు ఇచ్చే ఫ్రాన్స్ దేశపు అత్యున్నత అవార్డ్ మిషెలాన్ స్టార్.

గరిమా ఫుడ్ ఫిలాసఫీ ఏమిటీ?

'వంటకం ఎలా ఉండాలంటే తినే వ్యక్తి చుట్టుపక్కల ప్రపంచాన్ని పూర్తిగా మరిచిపోవాలి. ఆస్వాదన మీద తప్ప మరే విషయం మీద దృష్టి మళ్లకూడదు'

కొత్త వంటకాలను రుచి చూడడం, కొత్త వంటకాలు తయారు చేసి ఇతరులకు పరిచయం చేయడం అంటే గరిమాకు ఇష్టం. ఆ ఇష్టమే 'చెఫ్' అయ్యేలా చేసింది. గరిమాకు థాయిలాండ్‌లో 'గా' పేరుతో ఇండియన్ రెస్టారెంట్ ఉంది. ఊహించని సమ్మేళనాలతో దినుసులు, రకరకాల వంటకాల ఘుమఘుమలతో అతిథులను ఆశ్చర్యపరచడంలో 'గా' ముందు ఉంటుంది.

'ఏడు నెలల పిల్లాడిని చూసుకోవడం, బిజినెస్, కిచెన్ పనులను సమన్వయం చేసుకునే ప్రయత్నం చేస్తున్నాను. నా టీమ్‌ను నా శక్తిగా చెబుతాను. రకరకాల కస్టమర్‌లు, లేటునైట్‌లు. పని ఒత్తిడి ఉన్నా, నేను అందుబాటులో లేకపోయినా రెస్టారెంట్ సజావుగా సాగేలా చేస్తారు. వారి సపోర్ట్ లేకపోతే కుటుంబ బాధ్యతలు, వ్యాపార పనులను సమన్వయం చేసుకోవడానికి చాలా కష్టపడాల్సి వచ్చేది. మిషెలాన్ స్టార్ అవార్డ్ గెలుచుకోవడంలో తగిన సహాయ సహకారాలు అందించి టీమ్ నన్ను ముందుకు నడిపించింది.

రెస్టారెంట్‌లో పనిచేయడం లేదా నిర్వహించడం అంత సులభం కాదు. ఎంతో అంకితభావం ఉండాలి. కష్టపడే తత్వం ఉండాలి. ఇంట్లో వాళ్లతో హాయిగా మాట్లాడానికి కూడా సమయం దొరకకపోవచ్చు. సెలవులు, పండగలు, ఫంక్షన్‌లు మిస్ కావచ్చు. అన్నిటినీ తట్టుకోగలిగితే ఎన్నో సాధించవచ్చు' అంటున్న గరిమా అరోరా మరిన్ని పురస్కారాలు గెలుచుకోవాలని ఆశిద్దాం.

నా సక్సెస్‌మంత్ర

పురాణాల నుంచి చరిత్ర వరకు వంటలకు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను తెలుసుకుంటాను. మన భారతీయ పురాతన వంటకాల నుంచి ప్రేరణ పొందుతాను. సంప్రదాయ, ఆధునిక పద్ధతులను మిళితం చేస్తాను. స్థానికంగా దొరికే పదార్థాలను ఉపయోగిస్తాను.

– గరిమా అరోరా

ముగ్గు-ముచ్చట



ప్రతిభ భారతి
నవాబు పేట,
మహబూబ్ నగర్

22 చుక్కలు
22 వరుసలు




ముగ్గులు పంపవలసిన చిరునామా: ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

ఇండిగ్యాప్‌తో ఆరోగ్యం, అధికాదాయం!

సాగుబడి
ఉత్తరాషాడ కార్తె: జనవరి 11 నుంచి

- 'మంచి వ్యవసాయ పద్ధతులు' అనుసరించి పండించే ఆహారోత్పత్తులకు 'ఇండిగ్యాప్' ధృవీకరణ
- 'ఇండిగ్యాప్' ప్రమాణాలను రైతులకు అందుబాటులోకి తెచ్చిన తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్
- తొలి ఏడాది 33 రైతు ఉత్పత్తిదారుల కంపెనీల రైతులకు శిక్షణ
- ఈ ఉత్పత్తులకు 130 దేశాల్లో మంచి గిరాకీ.. రైతులు అధికాదాయం పొందే అవకాశం



రసాయనిక ఎరువులు, పురుగుమందులు.. జన్యుమార్పిడి విత్తనాలను అస్సలు వాడకుండా పంటలు పండించే సేంద్రియ / ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు దేశ విదేశాల్లో 'ఆర్గానిక్' సర్టిఫికేషన్ గుర్తింపు ఉన్న విషయం తెలిసిందే. అయితే, 'మంచి వ్యవసాయ పద్ధతుల(జి.ఎ.పి.)'తో పండించే ఆహారోత్పత్తులకు 'గ్యాప్' సర్టిఫికేషన్‌కు కూడా అదే మాదిరి గుర్తింపు ఉంది. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా 130 దేశాల్లో 'గ్లోబల్‌గ్యాప్' ప్రమాణాలు అమల్లో ఉన్నాయి. ఈ ఆహారోత్పత్తులకు ఆయా దేశాల్లోని వినియోగదారులు, రిటైలర్ల ఆదరణతో పాటు అంతర్జాతీయ మార్కెట్‌లోనూ మంచి గిరాకీ ఉంది. 'గ్లోబల్‌గ్యాప్'కు అనుగుణంగా దేశీయంగా రైతులు, ప్రాసెసింగ్ పరిశ్రమదారులు పాటించవలసిన 'ఇండిగ్యాప్' ప్రమాణాలను భారత ప్రభుత్వ సంస్థ క్వాలిటీ కౌన్సెల్ ఆఫ్ ఇండియా (క్యు.సి.ఐ.) 2021లో అందుబాటులోకి తెచ్చింది. ఈ ప్రమాణాలను రైతులకు మొట్టమొదటగా అందుబాటులోకి తెచ్చిన ఘనత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి దక్కటం విశేషం. తొలుత ఈ ప్రమాణాలను పాటించటం అలవాటు చేసుకునే రైతులకు.. భవిష్యత్తులో సేంద్రియ సర్టిఫికేషన్ పొందటం సులువు అవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో 'గ్లోబల్‌గ్యాప్', 'ఇండిగ్యాప్' ప్రమాణాలు, వాటి ప్రయోజనాల పూర్వాపరాలపై 'సాక్షి సాగుబడి' ప్రత్యేక కథనం..

ఆహారం ప్రజలకు స్థానికంగా, సరసమైన ధరలో, అందరికీ అందుబాటులో ఉంటే ప్రజలకు ఆహార భద్రత (ఫుడ్ సెక్యూరిటీ) ఉన్నట్లు.

ఆ ఆహారం మనుషుల ఆరోగ్యానికి హాని కలిగించని ప్రమాణాలతో పండించి, నిల్వ చేసినదై ఉంటే అది క్షేమదాకమైన ఆహారం (సేఫ్ ఫుడ్).

తగుమాత్రంగా రసాయనాలు వాడుతూ, ఇతర జాగ్రత్తలు పాటిస్తూ సేఫ్ ఫుడ్‌ను పండించడానికి రైతులకు ఉపకరించేవే 'మంచి వ్యవసాయ పద్ధతులు'. వీటిని 'గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్ (జి.ఎ.పి.– గ్యాప్) అంటారు. అంతర్జాతీయంగా అమల్లో ఉన్న 'గ్లోబల్‌గ్యాప్' ప్రమాణాలకు అనుగుణంగా రూపొందినవే 'ఇండిగ్యాప్' ప్రమాణాలు. ఈ ప్రమాణాల ద్వారా రైతుల ఉత్పత్తులకు గిరాకీ పెరిగి, వారి నికరాదాయం పెరుగుతుందని అనుభవాలు చెబుతున్నాయి.

'గ్లోబల్‌గ్యాప్' పుట్టుపూర్వోత్తరాలు

తెలిసో తెలియకో పరిమితికి మించి రసాయనిక ఎరువులు, పురుగుమందులను విచ్చలవిడిగా వాడుతూ పంటలు పండిస్తున్నందు వల్ల ప్రజారోగ్యం దెబ్బతింటోంది. కొందరు రైతులు నిషిద్ధ పురుగుమందులను సైతం వాడుతున్నారు. పురుగుమందులు చల్లటానికి, పంట కోతకు మధ్య పాటించాల్సిన వ్యవధిని సైతం పాటించకపోవటం వల్ల విష రసాయనాల అవశేషాలు పరిమితికి ఎన్నో రెట్లు ఎక్కువ కనిపిస్తున్న సందర్భాలు లేకపోలేదు. కొన్ని సందర్భాల్లో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు కోసిన తర్వాత కలుషిత నీటిలో కడగటం వంటి, రవాణా, నిల్వ పద్ధతుల్లో కూడా టోకు, చిల్లర వ్యాపారులు నిర్దేశిత ప్రమాణాలు పాటించకపోవటం పరిపాటిగా మారింది. ఇటువంటి సురక్షితం కాని ఆహారోత్పత్తుల వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటున్నది. మన రాష్ట్రం, దేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిస్థితి ఇదే.

ఈ సమస్యలకు పరిష్కారం కనుగొనే లక్ష్యంతో ఆహార వ్యవస్థలో గుణాత్మక మార్పులు తేవడానికి యూరప్‌లో చిల్లర వర్తకులు 1997లో 'యూరోప్‌గ్యాప్' పేరుతో మంచి వ్యవసాయ పద్ధతుల అమలుకు ప్రయత్నాలు ప్రారంభించారు. వారి కృషి ఫలితంగా మెరుగుపరిచిన ప్రమాణాలు 2007లో 'గ్లోబల్‌గ్యాప్' పేరుతో ప్రపంచ దేశాలకు అందుబాటులోకి వచ్చాయి.

ప్రభుత్వ ఖర్చుతోనే పరీక్షలు

'ఇండిగ్యాప్' సర్టిఫికేషన్ పొందే ప్రయత్నాలను దేశంలో మొదటిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే 2023 ఖరీఫ్ నుంచి ప్రారంభించింది. తొలుత 20 వ్యవసాయ, 13 ఉద్యాన ఎఫ్‌పిసిలకు శిక్షణ ఇచ్చాం. ఇప్పటికే కొందరు రైతులు తక్కువ ఖర్చుతో, రసాయనిక అవశేషాల్లేని ఆహారం పండించి రైతులు అధిక ఆదాయం పొందారు. పరిమితికి మించి రసాయనిక అవశేషాల్లేని ఆహారోత్పత్తులను పండించిన తర్వాత శాంపుల్స్‌ను బెంగళూరు పంపి ప్రభుత్వ ఖర్చులతోనే 200 వరకు రసాయనాలకు సంబంధించి పరీక్ష చేయిస్తున్నాం. ఒక్కో శాంపిల్‌కు రూ. 10-12 వేలు ఖర్చు అవుతోంది. ఏపీలోనే రూ.2.6 కోట్లతో అధునాతన లాబ్‌ను ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇండ్‌గ్యాప్ సర్టిఫికేషన్ పొందే రైతు ఉత్పత్తిదారుల కంపెనీలు 130 దేశాలకు ఎగుమతి చేయొచ్చు. ఆర్గానిక్ సర్టిఫికేషన్‌ను రైతులకు అందించడానికి సంబంధించి అపెడా ద్వారా ప్రయత్నాలు జరుగుతున్నాయి. మన రైతుల బ్రాండెడ్ ఉత్పత్తులను దేశ విదేశాల్లో మంచి ధరకు విక్రయించి అధికాదాయం రాబట్టాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.



– డా. ఎ. త్రివిక్రమరెడ్డి (97393 16931), డైరెక్టర్, ఏపీ విత్తన, సేంద్రియ ధృవీకరణ అథారిటీ, గుంటూరు

రైతుల్లో మార్పు వస్తోంది!



మంత్రి కాకాణి నుంచి ఇండిగ్యాప్ ధృవీకరణ పత్రాన్ని అందుకుంటున్న ఉయ్యూరు సాంబిరెడ్డి (ఎడమ)

మా శ్రేష్ట ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీలో 300 మంది రైతులు ఉన్నారు. ఇండిగ్యాప్ సర్టిఫికేషన్ కోసం రూ. 18 వేలు ఫీజు చెల్లించి నమోదు చేసుకున్నాం. మొదటి ఏడాది 24 మంది రైతులు 50 ఎకరాల్లో పసుపు సాగు చేస్తున్నారు. వచ్చే ఏడాది నాటికి 100 మంది రైతులు 500 ఎకరాల్లో పసుపు సాగు చేయించాలన్నది లక్ష్యం. మా రైతులు 10% రసాయనిక ఎరువులు 90% సేంద్రియ ఎరువులు వాడుతున్నారు. నిషేధిత పురుగుమందులు వాడకుండా ఇండిగ్యాప్ నిపుణులు ఎప్పటికప్పుడు సూచిస్తున్న విధంగా అన్ని రకాల జాగ్రత్తలు పాటిస్తున్నాం. పసుపు పండిన తర్వాత ప్రభుత్వమే పరీక్ష చేయించి, ఇండిగ్యాప్ సర్టిఫికెట్ ఇస్తుంది. ఈ సర్టిఫికెట్ ఉంటే దేశ విదేశాల్లో మా ఉత్పత్తులకు మంచి గిరాకీ ఉంటుంది. ఈ సర్టిఫికేషన్ కోసం పనిచేస్తున్న మా సభ్య రైతుల్లో మార్పు కనిపిస్తోంది. ఇండిగ్యాప్ మామిడి, మిరప, అరటి రైతులకు లాభదాయకంగా ఉంటుంది. అన్ని వివరాలూ మాన్యువల్‌గా నమోదు చేస్తున్నాం. వచ్చే ఏడాది ఆన్‌లైన్ సదుపాయం అందుబాటులోకి వస్తే వెసులుబాటుగా ఉంటుంది.

– ఉయ్యూరు సాంబిరెడ్డి (93969 62345), శ్రేష్ట ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ, కొల్లిపర, గుంటూరు జిల్లా

చిన్న,సన్నకారు రైతుల కోసం..!



విదేశాల్లో రిటైల్ స్టోర్లలో పక్కపక్కనే సాధారణ రసాయనిక వ్యవసాయంలో పండించిన ఆహారోత్పత్తులు, సేంద్రియ సర్టిఫైడ్ ఆహారోత్పత్తులతో పాటు.. మంచి వ్యవసాయ పద్ధతుల (గ్యాప్) ద్వారా పరిమితంగా రసాయనాలు వాడి పండించిన సర్టిఫైడ్ ఉత్పత్తులు కూడా పక్కపక్కనే పెట్టి అమ్ముతూ ఉంటారు. వినియోగదారులు తమ స్థోమతను బట్టి వాటిని కొనుగోలు చేస్తుంటారు. యూరప్‌లో 1997లో రిటైల్ వర్తకుల చొరవ వల్ల 'గ్లోబల్‌గ్యాప్' సర్టిఫికేషన్ ప్రారంభమైంది. ఆ ప్రమాణాలకు అనుగుణంగా మన దేశంలో క్వాలిటీ కౌన్సెల్ ఆఫ్ ఇండియా 'ఇండిగ్యాప్' ప్రమాణాలను నిర్దేశించింది. ఈ ప్రమాణాలను ఖచ్చితంగా పాటించటం, సర్టిఫికేషన్ పొందే ప్రక్రియకు సంబంధించిన అంశాలపై మా సంస్థ అనేక రాష్ట్రాల్లో అధికారులు, ఎఫ్‌పిసిలు, రైతులకు శిక్షణ ఇస్తున్నాం. గతంలో మహారాష్ట్రం, ఏపీలకు చెందిన ద్రాక్ష రైతులకు కూడా శిక్షణ ఇచ్చాం. ఔషధ మొక్కల పెంపకంపై స్పైసెస్ బోర్డు తోడ్పాటుతో రైతులకు శిక్షణ ఇస్తున్నాం. శంషాబాద్‌లో క్షేత్రస్థాయిలో ఇండిగ్యాప్, సేంద్రియ సర్టిఫికేషన్లకు అనుగుణంగా శాస్త్రవేత్తలు, అధికారులు, ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు ఆచరణాత్మక శిక్షణ ఇచ్చేందుకు త్వరలో నమూనా క్షేత్రాన్ని నిర్మిస్తున్నాం. 'ఇండిగ్యాప్' ప్రమాణాల ప్రకారం రైతులు పంటలు పండించి ఎఫ్‌పిఓలు, కోఆపరేటివ్‌ల ద్వారా గ్రూప్ సర్టిఫికెట్ పొందొచ్చు. పరిమితికి మించి రసాయనిక పురుగుమందుల అవశేషాల్లేని మంచి ఆహారానికి ఇటు దేశీయ మార్కెట్లలో గాని, అటు అంతర్జాతీయ మార్కెట్లలో గాని మంచి గిరాకీ ఉంది. రైతులు అధికాదాయం పొందవచ్చు.

– కోటెల శ్రీహరి (98480 34740), వ్యవస్థాపకులు, కృషిగ్యాప్ డిజిటల్ సొల్యూషన్స్, హైదరాబాద్
www.krishigap.com

- ధాన్యపు పంటలు, కూరగాయలు, పండ్లు, పూల సాగుతో పాటు ఆక్వా సాగుకు కూడా 'గ్లోబల్‌గ్యాప్' ప్రమాణాలు వర్తింపజేస్తున్నారు.
- పంట పొలాలు, తోటలు, ఆక్వా చెరువుల్లో సాగు పద్ధతుల్లో ప్రతి దశలోనూ.. అదేవిధంగా ఆహారోత్పత్తుల సేకరణ, రవాణా, నిల్వ, ప్రాసెసింగ్ వ్యవస్థల్లో పాటించాల్సిన ప్రమాణాలను 'గ్లోబల్‌గ్యాప్' ప్రమాణాల సంస్థ నిర్దేశిస్తోంది.
- భారత్ సహా 130 దేశాల్లో ఇప్పటికి 1,95,000 మంది రైతులు గ్లోబల్‌గ్యాప్ సర్టిఫికేషన్ పొందారు.
- 43 లక్షల హెక్టార్లలో రైతులు అందుకు అనుగుణంగా సాగు చేస్తూ.. సాధారణ ఉత్పత్తులతో పోల్చితే అధిక ధరకు అమ్ముకుంటున్నారు.
- 25 లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల చేపలు, రొయ్యలతో పాటు.. 2.1 కోట్ల టన్నుల సర్టిఫైడ్ కాంపౌండ్ ఫీడ్‌ను ఉత్పత్తి చేసి విక్రయిస్తున్నారు.
- టర్కీలో గ్యాప్ ప్రమాణాలు పాటించిన రైతుల పొలాల్లో రసాయనిక ఎరువుల వాడకం 19–31% మేరకు తగ్గింది. రసాయనిక పురుగుమందుల వాడకం 50%, శిలీంధ్రనాశనులు 25%, కలుపు మందులు 70% తగ్గిందని ఒక అధ్యయనంలో తేలింది.
- మన దేశంలో చిన్న, సన్నకారు రైతులు, పెద్ద రైతులు అనుసరించదగిన మంచి వ్యవసాయ పద్ధతులను క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియా (క్యు.సి.ఐ.) 'ఇండిగ్యాప్' ప్రమాణాలను 2021లో ప్రకటించింది. 2023 ఆగస్టులో గ్లోబల్ గ్యాప్ ప్రమాణాలతో ఇండిగ్యాప్‌ను అనుసంధానం చేశారు.



పసుపు తోటలో శ్రేష్ట ఎఫ్‌పిసి రైతు నెర్ల విజయేంద్రరెడ్డి

- 180కి పైగా గ్లోబల్‌గ్యాప్ సర్టిఫికేషన్ సంస్థలు అంతర్జాతీయగా రైతులకు సేవలందిస్తున్నాయి.
- మన దేశంలో 'ఇండిగ్యాప్' సర్టిఫికేషన్ విస్తరణ సేవలను వ్యవసాయ, అనుబంధ శాఖల ద్వారా అమలుకు శ్రీకారం చుట్టిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కావటం విశేషం. క్వాలిటీ కౌన్సెల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గున్వత్తా సంకల్ప్ పథకం కింద ఇండిగ్యాప్ సర్టిఫికేషన్ కార్యక్రమం అమలవుతోంది.
- తొలి ఏడాది 33 ఎఫ్‌పిసిలకు శిక్షణ ఇచ్చారు. మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల్లోనూ ఇండ్‌గ్యాప్ అమలుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. కృషిగ్యాప్ డిజిటల్ సొల్యూషన్స్ సంస్థ ఇందుకు తోడ్పడుతోంది.
- స్పైసెస్‌బోర్డు ద్వారా మిరప, పసుపు తదితర సుగంధ ద్రవ్య పంటల్లో సైతం ఏపీ, తెలంగాణ, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఇండిగ్యాప్ సర్టిఫికేషన్‌ను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.

– పంతంగి రాంబాబు, సాక్షి సాగుబడి డెస్క్



రన్నరప్ అనాహత్ సింగ్

ప్రతిష్టాత్మక బ్రిటిష్ జూనియర్ ఓపెన్ స్క్వాష్ టోర్నమెంట్‌లో భారత రైజింగ్ స్టార్ అనాహత్ సింగ్ రన్నరప్‌గా నిలిచింది. బర్మింగ్‌హామ్‌లో జరిగిన ఈ టోర్నీలో ఢిల్లీకి చెందిన 15 ఏళ్ల అనాహత్ సింగ్ అండర్–17 బాలికల సింగిల్స్ విభాగంలో రజత పతకం గెలిచింది. 68 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో టాప్ సీడ్ అనాహత్ 11–7, 11–13, 10–12, 11–5, 9–11తో రెండో సీడ్ నాదీన్ ఎల్‌హమీ (ఈజిప్ట్) చేతిలో ఓటమి చవిచూసింది. ఈ టోర్నీ చరిత్రలో అనాహత్‌కిది మూడో పతకం. 2019లో అండర్–11 విభాగంలో, 2023లో అండర్–15 విభాగంలో అనాహత్ స్వర్ణ పతకాలు సాధించింది.



టెస్టు క్రికెట్‌కు క్లాసెన్ వీడ్కోలు

దక్షిణాఫ్రికా జట్టు వికెట్ కీపర్ హెన్రిచ్ క్లాసెన్ టెస్ట్ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. 32 ఏళ్ల క్లాసెన్ 2019లో భారత జట్టుతో రాంచీలో జరిగిన టెస్ట్‌తో అరంగేట్రం చేశాడు. ఇటీవల స్వదేశంలో భారత్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో క్లాసెన్‌కు స్థానం దక్కలేదు. కేవలం నాలుగు టెస్టులే ఆడిన క్లాసెన్ 104 పరుగులు సాధించాడు. 10 క్యాచ్‌లు పట్టిన అతను రెండు స్టంపింగ్‌లు చేశాడు. వన్డే, టి20 ఫార్మాట్‌లలో మాత్రం కెరీర్ కొనసాగిస్తానని చెప్పిన క్లాసెన్ ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు.

దబంగ్ ఢిల్లీకి ఏడో గెలుపు

ముంబై: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో దబంగ్ ఢిల్లీ జట్టు తమ జోరు కొనసాగిస్తోంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ 40–34తో మాజీ చాంపియన్ యు ముంబా జట్టును ఓడించింది. ఈ లీగ్‌లో దబంగ్ ఢిల్లీకిది ఏడో విజయం కావడం విశేషం. తాజా ఫలితంతో ఢిల్లీ జట్టు 40 పాయింట్లతో రెండో స్థానానికి ఎగబాకింది. ముంబాతో జరిగిన పోరులో ఢిల్లీ తరఫున అశు మలిక్ అత్యధికంగా 13 పాయింట్లు స్కోరు చేశాడు. మంజీత్ ఆరు పాయింట్లు, యోగేశ్ నాలుగు పాయింట్లు సాధించారు. యు ముంబా తరఫున అమీర్ మొహమ్మద్ 11 పాయింట్లు, గుమన్ సింగ్ 9 పాయింట్లు స్కోరు చేశారు. మరో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 35–33తో పట్నా పైరేట్స్‌పై విజయం సాధించింది. బెంగళూరు బుల్స్ తరఫున సచిన్ నర్వాల్ 9 పాయింట్లు, సుర్జీత్ సింగ్ 8 పాయింట్లు స్కోరు చేశారు. నేడు జరిగే మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్‌తో బెంగాల్ వారియర్స్ తలపడుతుంది.



పాయింట్ల పట్టిక PKL

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
పుణేరి పల్టన్	10	9	1	0	46
దబంగ్ ఢిల్లీ	11	7	3	1	40
గుజరాత్ జెయింట్స్	11	7	4	0	39
జైపూర్ పింక్ పాంథర్స్	10	6	2	2	38
యు ముంబా	10	6	4	0	32
హరియాణా స్టీలర్స్	10	6	4	0	31
బెంగళూరు బుల్స్	12	5	7	0	31
పట్నా పైరేట్స్	11	5	6	0	29
బెంగాల్ వారియర్స్	10	3	5	2	23
యూపీ యోధాస్	11	3	7	1	21
తమిళ్ తలైవాస్	10	2	8	0	14
తెలుగు టైటాన్స్	10	1	9	0	9

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు



సిరీస్ ఎవరిదో?

- నేడు భారత్, ఆస్ట్రేలియా మహిళల జట్ల మధ్య చివరి టి20 మ్యాచ్
- గెలిచిన జట్టు ఖాతాలోకి సిరీస్
- రాత్రి 7 గంటల నుంచి స్పోర్ట్స్–18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

నవీ ముంబై: మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో భారత్, ఆస్ట్రేలియా మహిళా జట్లు చెరొకటి గెలిచి సమఉజ్జీలుగా ఉన్నాయి. ఇప్పుడు సిరీస్‌ను గెలుచుకునేందుకు ఫైనల్ లాంటి పోరులో అమీతుమీ తేల్చుకునేందుకు ఇరుజట్లు సిద్ధమయ్యాయి. వన్డే సిరీస్‌లో క్లీన్‌స్వీప్ అయిన భారత అమ్మాయిలు ఇప్పుడు టి20 సిరీస్‌ను కోల్పోడానికి సిద్ధంగా లేరు. ఆఖరి పోరులో ఎలాగైనా నెగ్గాలనే లక్ష్యంతో హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం బరిలోకి దిగుతోంది. తద్వారా కొత్త ఏడాదిలో క్లీన్‌స్వీప్ పరాభవాన్ని మరిచేలా ఈ టి20 సిరీస్ విజయం సాధించాలనే పట్టుదలతో ఉంది. తొలి మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో నెగ్గినట్లే ఈ ఆఖరి పోరులోనూ దాన్ని పునరావృతం చేస్తే సిరీస్ కష్టం కానేకాదు. ముఖ్యంగా టాపార్డర్ బ్యాటర్లు బాధ్యతగా ఆడాలి. స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమీమాలు రాణిస్తే తొలి మ్యాచ్‌ను గెలుచుకున్నంత సులభంగా సిరీస్‌నూ గెలుచుకోవచ్చు. గత మ్యాచ్‌లో వీరి వైఫల్యమే జట్టును దెబ్బ తీసింది. దీంతో పాటు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ వరుస వైఫల్యాలు జట్టుకు ప్రతికూలంగా మారాయి. ఈ నలుగురు కీలకమైన చివరి మ్యాచ్‌లో రాణిస్తే మాత్రం మన మహిళా జట్టుకు తిరుగుండదు. బౌలింగ్‌లో రేణుక సింగ్, శ్రేయాంక పాటిల్, దీప్తి శర్మ, పూజ వస్త్రకర్ నిలకడగా రాణిస్తున్నారు. ఆసీస్‌తో పోల్చుకుంటే భారత ఫీల్డింగ్ సాధారణంగా ఉంది. ఈ నేపథ్యంలో జట్టు మేనేజ్‌మెంట్ ఫీల్డింగ్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరముంది.

మరోవైపు ఏకైక టెస్టు మ్యాచ్ ఓడాక అలీసా హీలీ నాయకత్వంలోని ఆస్ట్రేలియా జట్టు దెబ్బతిన్న పులిలా వన్డేల్లో పంజా విసిరింది. తాజా టి20 సిరీస్‌లోనూ తొలి మ్యాచ్‌లో చిత్తుగా ఓడినా... రెండో మ్యాచ్‌లో బదులు తీర్చుకుంది. ఇప్పుడు ఇదే ఉత్సాహంతో భారత గడ్డపై రెండో సిరీస్ విజయంపై కన్నేసింది.



ఫుట్‌బాల్ దిగ్గజం బెకెన్‌బాయెర్ కన్నుమూత

మ్యూనిక్: జర్మనీ ఫుట్‌బాల్ దిగ్గజం ఫ్రాంజ్ బెకెన్‌బాయెర్ కన్నుమూశారు. 78 ఏళ్ల ఈ మాజీ కెప్టెన్ ఆదివారం నిద్రలోనే తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుటుంబసభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అయితే ఆయన మృతికి గల కారణాన్ని మాత్రం వెల్లడించలేదు. జర్మనీ ఫుట్‌బాల్‌లో బెకెన్‌బాయెర్ శిఖరం. డిఫెండర్ పొజిషన్‌లో ఆడే ఆయన తొలుత కెప్టెన్‌గా తదనంతరం కోచ్‌గా విజయవంతమై జర్మనీకి రెండు ప్రపంచకప్ టైటిళ్లను అందించారు. పశ్చిమ జర్మనీ కెప్టెన్‌గా 1974లో ప్రపంచకప్ టైటిల్‌ను అందించిన ఆయన 1990 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన జర్మనీకి కోచ్‌గానూ వ్యవహరించారు.

ఇషా డబుల్ ధమాకా

- మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో స్వర్ణ పతకాలు
- పారిస్ ఒలింపిక్స్ బెర్త్ సొంతం



జకార్తా: ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ షూటింగ్ టోర్నమెంట్‌లో తొలి రోజు భారత షూటర్లు అదరగొట్టారు. నాలుగు స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యంతో కలిపి మొత్తం ఆరు పతకాలు గెల్చుకున్నారు. అంతేకాకుండా రెండు పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌లు కూడా ఖరారయ్యాయి. తెలంగాణ యువ షూటర్ ఇషా సింగ్ మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో బంగారు పతకాలు సొంతం చేసుకుంది. ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో ఇషా సింగ్ భారత్‌కు ఒలింపిక్ బెర్త్ అందించింది. ఎనిమిది మంది షూటర్లు ఎలిమినేషన్ పద్ధతిలో పోటీపడ్డ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్లో ఇషా సింగ్ 243.1 పాయింట్లు స్కోరు చేసి విజేతగా నిలిచింది. తలత్ కిష్మలా (పాకిస్తాన్; 236.3 పాయింట్లు) రజతం, భారత్‌కే చెందిన రిథమ్ సాంగ్వాన్ (214.5 పాయింట్లు) కాంస్యం కైవసం చేసుకున్నారు. భారత్‌కే చెందిన మరో షూటర్ సురభి రావు 154 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచింది. అంతకుముందు క్వాలిఫయింగ్‌లో రిథమ్, సురభి రావు 579 పాయింట్లతో వరుసగా మూడు, ఐదు స్థానాల్లో నిలువగా... ఇషా సింగ్ 578 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించారు. క్వాలిఫయింగ్‌లో రిథమ్, సురభి, ఇషా సింగ్ సాధించిన స్కోరు ఆధారంగా భారత జట్టుకు టీమ్ విభాగంలో బంగారు పతకం లభించింది. భారత బృందం మొత్తం 1736 పాయింట్లు స్కోరు చేసింది.

పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో భారత షూటర్ వరుణ్ తోమర్ స్వర్ణ పతకం నెగ్గడంతోపాటు భారత్‌కు పారిస్ ఒలింపిక్ బెర్త్‌ను ఖరారు చేశాడు. ఇదే ఈవెంట్‌లో మరో భారత షూటర్ అర్జున్ సింగ్ చీమా రజత పతకం నెగ్గాడు. ఎనిమిది మంది షూటర్లు పాల్గొన్న ఫైనల్లో వరుణ్ 239.6 పాయింట్లు స్కోరు చేసి విజేతగా నిలువగా... అర్జున్ 237.3 పాయింట్లతో రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. వరుణ్, అర్జున్ సింగ్, ఉజ్వల్ మలిక్‌లతో కూడిన భారత బృందం 1740 పాయింట్లతో టీమ్ విభాగంలో పసిడి పతకాన్ని గెల్చుకుంది. ఇప్పటి వరకు భారత్ నుంచి 15 మంది షూటర్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు. టోక్యో ఒలింపిక్స్‌లోనూ భారత్ నుంచి 15 మంది షూటర్లు బరిలోకి దిగారు.

శ్రీకాంత్‌కు సవాల్

నేటి నుంచి మలేసియా ఓపెన్



కౌలాలంపూర్: గత సీజన్ భారత స్టార్ షట్లర్లకు మిశ్రమ ఫలితాలిచ్చింది. కానీ ఇప్పుడు ఒలింపిక్ నామ సంవత్సరం కావడంతో మన బ్యాడ్మింటన్ ఆటగాళ్లంతా నూతనోత్సాహంతో కొత్త సీజన్‌కు శ్రీకారం చుట్టేపనిలో ఉన్నారు. నేటి నుంచి జరిగే మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 టోర్నీలో శుభారంభమే లక్ష్యంగా మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్, లక్ష్యసేన్, ప్రపంచ 8వ ర్యాంకర్ ప్రణయ్, డబుల్స్‌లో అగ్రశ్రేణి జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి కోటి ఆశలతో కొత్త ఏడాదిని విజయవంతం చేసుకోవాలని ఆశిస్తున్నారు. నేడు జరిగే తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ఆరో సీడ్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)తో శ్రీకాంత్, వెంగ్ హాంగ్ యంగ్ (చైనా)తో లక్ష్య సేన్ తలపడతారు.

ఆంధ్ర జట్టుకు మూడు పాయింట్లు

బెంగాల్‌తో రంజీ మ్యాచ్ 'డ్రా'

విశాఖ స్పోర్ట్స్: ఈ ఏడాది రంజీ ట్రోఫీ సీజన్‌ను ఆంధ్ర క్రికెట్ జట్టు 'డ్రా'తో ప్రారంభించింది. బెంగాల్ జట్టుతో ఇక్కడి వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో జరిగిన నాలుగు రోజుల మ్యాచ్‌ను ఆంధ్ర జట్టు 'డ్రా' చేసుకుంది. 36 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించినందుకు ఆంధ్ర జట్టు ఖాతాలో మూడు పాయింట్లు చేరగా... బెంగాల్ జట్టుకు ఒక్క పాయింట్ లభించింది. మ్యాచ్ చివరిరోజు ఓవర్‌నైట్ స్కోరు 339/6తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర 165.4 ఓవర్లలో 445 పరుగులకు ఆలౌటైంది. రికీ భుయ్ (347 బంతుల్లో 175; 23 ఫోర్లు, 1 సిక్స్) భారీ సెంచరీ సాధించి ఆంధ్ర జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కేలా చేశాడు. షోయబ్ మొహమ్మద్ ఖాన్ (149 బంతుల్లో 56; 7 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి ఏడో వికెట్‌కు 133 పరుగులు జోడించిన రికీ భుయ్ చివరి వికెట్‌గా వెనుదిరిగాడు. బెంగాల్ బౌలర్లలో కైఫ్ మూడు వికెట్లు తీయగా, ఆకాశ్ దీప్, ఇషాన్ పోరెల్, కరణ్ లాల్ రెండేసి వికెట్లు పడగొట్టారు. 36 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బెంగాల్ జట్టు 25 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి 82 పరుగులు సాధించింది. ఫలితం వచ్చే అవకాశం లేకపోవడంతో టీ విరామం తర్వాత ఇరు జట్ల కెప్టెన్‌లు 'డ్రా'కు అంగీకరించి ఆటను ముగించారు. ఆంధ్ర జట్టు తదుపరి మ్యాచ్‌ను ఈనెల 12 నుంచి వాంఖెడె స్టేడియంలో ముంబై జట్టుతో ఆడుతుంది.



సినిమా

అందుకేనేమో



• ఎన్టీఆర్

'జనతా గ్యారేజ్' (2016) వంటి హిట్ మూవీ తర్వాత హీరో ఎన్టీఆర్–డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న తాజా చిత్రం 'దేవర'. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సైఫ్ అలీఖాన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. కల్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్స్‌పై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ .కె నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా రూపొందుతోన్న ఈ చిత్రం తొలి భాగం 'దేవర పార్ట్ 1' ఏప్రిల్ 5న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలవుతోంది. కాగా ఈ సినిమా గ్లింప్స్‌ను ఆయా భాషల్లో సోమవారం విడుదల చేశారు మేకర్స్. 'ఈ సముద్రం సేపల్ని కంటే కత్తుల్ని, నెత్తుర్ని ఎక్కువ సూసుండాది.. అందుకేనేమో దీన్ని ఎర్ర సముద్రం అంటారు' అంటూ ఎన్టీఆర్ చెప్పిన డైలాగ్‌తో గ్లింప్స్ రిలీజైంది. ''దేవర' సినిమా కోసం ఎన్టీఆర్ అభిమానులతో పాటు ప్రేక్షకులు, ట్రేడ్ వర్గాలు సైతం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి. ఆ అంచనాలను దృష్టిలో పెట్టుకుని ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కిస్తున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్, కెమెరా: రత్నవేలు.

దర్శకుడు జయదేవ్ మృతి



ప్రముఖ జర్నలిస్ట్, సినీ దర్శకుడు కె. జయదేవ్ సోమవారం రాత్రి గుండెపోటుతో హైదరాబాద్‌లో మృతి చెందారు. పలు షార్ట్ ఫిలింస్‌కి దర్శకత్వం వహించిన జయదేవ్ 'కొరంగి నుంచి' (2022) అనే చిత్రానికి దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఎఫ్‌డీసీ) నిర్మించింది. మంచి చిత్రాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఎన్‌ఎఫ్‌డీసీ ప్రతి ఏడాది కొన్ని చిత్రాలకు ఫండింగ్ ఇస్తుంది. అందులో భాగంగా 'కొరంగి నుంచి'కి కోటి రూపాయల ఫండింగ్ ఇచ్చారు. 25 ఏళ్ల తర్వాత నటి అర్చన ఈ సినిమాలో నటించటం విశేషం. ఈ చిత్రం పలు జాతీయ, అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శితమైంది. భారత రత్న సి.ఎన్.ఆర్. రావుపై ఫిల్మ్ డివిజన్‌కు డాక్యుమెంటరీ నిర్మించారు జయదేవ్. ఇంకా ఎన్‌ఎఫ్‌డీసీ, ఫిల్మ్ డివిజన్‌కు పలు డాక్యుమెంటరీలు నిర్మించారు. 'సాక్షి' వెబ్‌లో కొంత కాలం పనిచేశారు. ప్రముఖ దర్శకుడు, జర్నలిస్టు కేఎన్‌టీ శాస్త్రికి జయదేవ్ చిన్న కుమారుడు. గతంలో ఎన్‌ఎఫ్‌డీసీ నిర్మించిన 'తిలదానం' చిత్రానికి కేఎన్‌టీ శాస్త్రి దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే. జయదేవ్‌కు భార్య యశోద, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



సినిమా హిట్‌కి ఆస్కార్ ఉపయోగపడదు

– కీరవాణి

"నేను మొదటి నుంచి సెలక్టివ్‌గానే సినిమాలు చేస్తున్నాను. ఒక సినిమాకి హైప్ అనేది రిలీజ్ అయ్యే పాటల ద్వారా వస్తుంది. అంతే కానీ నాకు వచ్చిన 'ఆస్కార్' అవార్డు అనేది ఓ సినిమా విజయానికి ఉపయోగపడదని భావిస్తాను. నా వరకూ సంగీతం బాగా అందించాలి. సినిమాని డైరెక్టర్ బాగా తీయాలి. అది జనాలకి నచ్చాలి. 'నా సామిరంగ' చిత్రం ప్రేక్షకులను అలరిస్తుంది'' అని సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఎంఎం కీరవాణి అన్నారు. నాగార్జున, ఆషికా రంగనాథ్ జంటగా విజయ్ బిన్నీ దర్శకత్వం వహించిన చిత్రం 'నా సామిరంగ'. శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ చిత్రానికి సంగీతం అందించిన ఎంఎం కీరవాణి విలేకరులతో పంచుకున్న విశేషాలు.

• నాగార్జునగారు, నా కాంబినేషన్‌లో 'ప్రెసిడెంట్‌గారి పెళ్ళాం, అల్లరి అల్లుడు, అన్నమయ్య, శ్రీరామదాసు..' వంటి పలు హిట్ సినిమాలు వచ్చాయి. ఇప్పుడు వస్తున్న 'నా సామిరంగ' కూడా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. 'ప్రెసిడెంటుగారి పెళ్ళాం' గ్రామీణ నేపథ్యం ఉన్న సినిమా. అందులో ఉన్నట్లుగానే 'నా సామిరంగ'లోనూ వినోదాత్మక అంశాలు చాలా ఉన్నాయి. ఈ మూవీ మరో 'ప్రెసిడెంటుగారి పెళ్ళాం' అవుతుందని ఆశిస్తున్నాను. పైగా 'నా సామిరంగ' నాగార్జునగారికి యాప్ట్ టైటిల్.

• సీనియర్స్ కంటే కొత్త దర్శకుల్లో బాగా కష్టపడే తత్వం ఉంటుంది. ఎలాగైనా తమను తాము నిరూపించుకోవాలనే కసితో పని చేస్తారు. ఈ చిత్రదర్శకుడు విజయ్ బిన్నీ కూడా అంతే.. చాలా త్వరగా ఈ సినిమా తీయగలిగాడు. దాసరి నారాయణరావు, కోడి రామకృష్ణ, రాఘవేంద్ర రావుగార్లలా క్వాలిటీ తగ్గకుండా త్వరగా సినిమా తీయడం తన ప్రధాన బలం అని భావిస్తున్నాను. బిన్నీ డ్యాన్స్ మాస్టర్ కాబట్టి ప్రతి పాటని ఫుల్ డ్యాన్స్ కోణంలో ఆలోచించడం సహజం. కానీ, దానికి భిన్నంగా ఇందులో రెండు మూడు మెలోడీ పాటలు చేయించాడు. అప్పుడు తను పరిపక్వత ఉన్న దర్శకుడనిపించింది. తెలుగు నేటివిటీ, కట్టుబాట్లు, సంక్రాంతి పండగ కళ ఉట్టిపడేలా ఈ చిత్రాన్ని రూపొందించాడు. సంగీతం కూడా ఫ్రెష్‌గా ఉంటుంది.

• 'నా సామిరంగ' చిత్రానికి పాటలన్నీ చంద్రబోస్‌గారే రాశారు. అయితే అన్నం తినేటప్పుడు కొంచెం పచ్చడి నంజుకుంటాం. అలా అని పచ్చడి తిన్నామని ప్రత్యేకంగా చెపుకోం.. అన్నం తిన్నామని మాత్రమే చెప్పుకుంటాం కదా (నవ్వుతూ). ఇదీ అంతే. నేను ప్రొఫెషనల్ లిరిక్ రైటర్‌ని కాదు. ఎవరైనా వచ్చి రాయమని అడిగినా రాయను. కానీ రీ రికార్డింగ్ చేసినప్పుడు ఒక సందర్భం పుడుతుంది. అలాంటి సందర్భంలో నుంచి ఓ ఆలోచన వస్తుంది. ఆ సందర్భం వచ్చింది కాబట్టి ఈ సినిమాలో ఓ పాట రాశానంతే.

• 'నా సామిరంగ' చిత్రంలో ఇప్పటి తరానికి కావాల్సిన పాటలు ఇచ్చాను. నా వయసు ఎక్కువైనా నా వద్ద పని చేసే వారందరూ యువకులే.. వారి ఆలోచనలు నేటి యువతకు తగ్గట్టు ఉంటాయి. అలా ముందుకెళుతున్నాను (నవ్వుతూ). ఓ పాట వైరల్ కావడం, కాకపోవడం అనేది మన చేతిలో లేదు. ఇప్పుడు ఇంటర్నెట్ ఉంది.. వ్యూస్‌ని బట్టి తెలుస్తోంది. కానీ గతంలో పాట హిట్ అయ్యిందా? లేదా అని తెలుసుకోవాలంటే కష్టంగా ఉండేది. ఏదైనా పెళ్లికి వెళ్లి చూసేవాళ్లం. అక్కడ బ్యాండ్‌లో ఆ పాట ప్లే చేస్తుంటే హిట్టయినట్టు.. లేకుంటే కానట్టు అని తెలుసుకునే వాళ్లం (నవ్వుతూ).

• నేను సంగీతం అందిస్తున్న 'హరిహర వీరమల్లు' సినిమాకి మూడు పాటలు రికార్డ్ చేశాం. చిరంజీవిగారి సినిమా మ్యూజిక్ సిట్టింగ్స్ ప్రారంభమయ్యాయి. రాజమౌళిగారితో చేయబోయే కొత్త సినిమా మ్యూజిక్ వర్క్ నా వరకూ ఇంకా రాలేదు.

సంక్రాంతికి ఫస్ట్ లుక్



• విజయ్ కిరగందూర్, ప్రశాంత్ నీల్, పృథ్వీరాజ్ ప్రభాస్

ప్రభాస్ అభిమానులకు శుభవార్త. సంక్రాంతి కానుకగా ఆయన నటిస్తున్న తాజా చిత్రం అప్‌డేట్ రానుంది. మారుతి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. పీపుల్స్ మీడియా పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ని సంక్రాంతి పండగ రోజున విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ప్రభాస్‌ను కొత్త జానర్‌లో కొత్తగా చూపించబోతున్నారు దర్శకుడు మారుతి. ఈ చిత్రానికి వివేక్ కూఛిబొట్ల సహ నిర్మాత. కాగా 'సలార్ పార్ట్ 1: సీజ్‌ఫైర్' సినిమాతో మరో హిట్‌ను తన ఖాతాలో వేసుకున్న ప్రభాస్ ఆ ఆనందాన్ని యూనిట్ సభ్యులతో కలిసి సెలబ్రేట్ చేసుకున్నారు. రెట్టించిన ఉత్సాహంతో తర్వాతి సినిమాల షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ప్రస్తుతం నాగ్ అశ్విన్ దర్శకత్వంలో 'కల్కి 2898 ఏడీ' సినిమాలోనూ, మారుతి చిత్రంలోనూ ప్రభాస్ నటిస్తున్నారు.

ఇది యుఐ ప్రపంచం



• ఉపేంద్ర

'ఇది ఏఐ వరల్డ్ కాదు.. యుఐ వరల్డ్' అనే బ్యాక్‌గ్రౌండ్ వాయిస్‌తో మొదలవుతుంది 'యుఐ' చిత్రం టీజర్. ఉపేంద్ర స్వీయ దర్శకత్వం వహిస్తూ, హీరోగా నటిస్తున్న చిత్రం 'యుఐ'. జి. మనోహరన్, కేపీ శ్రీకాంత్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి నవీన్ మనోహరన్ సహనిర్మాత. బందీలుగా ఉన్నవారి హాహాకారాలు, విచిత్ర వేషధారణలో ఉన్న వ్యక్తులు కనిపిస్తుండగా, వారిని రక్షించడానికే అన్నట్లు హీరో ఉపేంద్ర ఎంట్రీతో టీజర్ ముగుస్తుంది. సోమవారం జరిగిన ఈ టీజర్ విడుదల కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్, ప్రముఖ నటుడు శివ రాజ్‌కుమార్ అతిథులుగా పాల్గొన్నారు. ''ఈ చిత్రానికి ఇండస్ట్రియల్ లైట్ మ్యాజిక్ (ఐఎల్‌ఎమ్) క్రియేషన్ టెక్నాలజీని వాడాం. దాదాపు 90 శాతం వీఎఫ్‌ఎక్స్ ఉంటాయి'' అని యూనిట్ పేర్కొంది. ఉపేంద్ర సరసన రీష్మా నానయ్య నటిస్తున్న ఈ చిత్రంలో నిధి సుబ్బయ్య, మురళీ శర్మ, పి. రవిశంకర్ ముఖ్య పాత్రధారులు. ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ బి. లోక్‌నాథ్, కెమెరా: హెచ్‌సి వేణుగోపాల్.

టైటిల్ చాలా ఆసక్తిగా ఉంది

– 'దిల్' రాజు



• అనన్య, 'దిల్' రాజు, మోహన్

''శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్' టైటిల్ చాలా ఆసక్తిగా ఉంది. ఈ మూవీలో మంచి వినోదం ఉంటుందనే నమ్మకం కలుగుతోంది.. సినిమా విజయం సాధించాలి'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. 'వెన్నెల' కిశోర్, అనన్య నాగళ్ల ప్రధాన పాత్రల్లో రైటర్ మోహన్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోంది. లాస్య రెడ్డి సమర్పణలో వెన్నపూస రమణా రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ని 'దిల్' రాజు విడుదల చేశారు. అనంతరం మోహన్ మాట్లాడుతూ– ''క్రైమ్ కామెడీ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. ఈ సినిమాలో మూడు పాత్రలున్నాయి'' అన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రాజేశ్ రామ్ బాల, నటులు నాగ మహేశ్, భద్రం, నటి ప్రభావతి పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, కెమెరా: మల్లికార్జున్ ఎన్.

ఈ కార్యక్రమంలో 'దిల్' రాజు మాట్లాడుతూ– ''హను–మాన్' సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో చిరంజీవిగారు నా గురించి మాట్లాడిన మాటలను వక్రీకరించి, 'దిల్' రాజు మీద చిరంజీవి విమర్శలు గుప్పించారంటూ కొన్ని వెబ్ సైట్స్‌లో రాశారు. ఇకపై వ్యూస్ కోసం నా మీద తప్పుడు వార్తలు రాస్తే తాట తీస్తా. సంక్రాంతికి ఓ తమిళ సినిమాని నేను విడుదల చేస్తున్నానని కూడా రాశారు. కానీ నేనే ఆ సినిమా విడుదల వాయిదా వేయించాను. 'హను–మాన్' సినిమాని ఈ నెల 12న కాకుండా 14న రిలీజ్ చేస్తే ఎక్కువ థియేటర్స్ దొరుకుతాయని చెప్పాను.. అంతే కానీ, రిలీజ్ చేయొద్దని చెప్పలేదు. ఈ నెల 12న మహేశ్‌బాబు 'గుంటూరు కారం', 'హను–మాన్'కి నైజాంలో థియేటర్స్ ఉన్నాయి. కానీ పెద్ద స్టార్స్ అయిన నాగార్జున, వెంకటేశ్ గార్ల సినిమాలకి థియేటర్స్ దొరకలేదని చెప్పాను. తప్పుడు రాతలతో ఏం చేద్దామనుకుంటున్నారు. నేను ఎప్పుడూ అందరికీ అందుబాటులో ఉంటాను. నా గురించి వార్త రాసేటప్పుడు ఎలాంటి సందేహం వచ్చినా ఫోన్ చేస్తే మాట్లాడతాను'' అన్నారు.

తొలి చిత్రం రిలీజ్ కాకుండానే..



• యశస్వి, సుకుమార్

ఒక కొత్త దర్శకుడికి అతని తొలి చిత్రం విడుదల కాక ముందే రెండో సినిమాకి చాన్స్ వస్తే మాటల్లో చెప్పలేనంత ఆనందంగా ఉంటుంది. దర్శకుడు యశస్వి వి. ఆ ఆనందంలోనే ఉన్నారు. దీపక్ సరోజ్ హీరోగా 'సిద్ధార్థ్ రాయ్' అనే ప్రేమకథా చిత్రానికి దర్శకత్వం వహించారు యశస్వి. ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. కాగా ఈ చిత్రం విషయంలో యశస్వి ప్రతిభను గుర్తించిన సుకుమార్ తన సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌లో ఓ సినిమాకి దర్శకత్వం వహించే అవకాశం ఇచ్చారు. సుకుమార్ దగ్గర పని చేయకపోయినప్పటికీ ఆయనకు ఏకలవ్య శిష్యుడు యశస్వి. ఇక ఇప్పటికే పలువురు ప్రతిభ గల దర్శకులను సుకుమార్ పరిచయం చేసిన విషయం తెలిసిందే.

సాక్షి బిజినెస్
మంగళవారం
9-1-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
671	198
71,355	21,513

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	14,711	△	187
డోజోన్స్	37,390	▽	76
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,694	△	5
డాక్స్	16,716	△	122
షాంఘై	2,888	▽	42
నికాయ్	33,377	△	89

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,192
బంగారం (99.5 స్వచ్ఛత)	61,943
వెండి (కేజీ)	71,386

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	82.71	83.73
£	బ్రిటన్ పౌండ్	104.42	106.97
€	యూరో	89.84	92.23
¥	జపాన్ ఎన్ (100)	56.98	58.29
AUS$	ఆస్ట్రేలియా డాలర్	54.89	56.82
S$	సింగపూర్ డాలర్	61.46	62.56
SAR	సౌదీ రియాల్	21.21	22.84
UAE D	యూఏఈ దిర్హామ్	21.74	23.53
¥	చైనా యువాన్	10.49	12.56

కేజీ బ్లాక్ నుంచి ఓఎన్‌జీసీ చమురు ఉత్పత్తి ప్రారంభం



న్యూఢిల్లీ: సుదీర్ఘ జాప్యం తర్వాత కృష్ణా గోదావరి (కేజీ) బేసిన్‌లోని డీప్ సీ బ్లాక్ నుంచి ప్రభుత్వ రంగ ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) చమురు ఉత్పత్తిని ప్రారంభించింది. కంపెనీతో పాటు కేంద్ర చమురు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి ఈ విషయం తెలిపారు. అయితే, ఉత్పత్తి చేస్తున్న పరిమాణాన్ని మాత్రం వెల్లడించలేదు. కేజీ–డీడబ్ల్యూఎన్–98/2 (కేజీ–డీ5) ప్రాజెక్టుతో తమ చమురు ఉత్పత్తి సామర్థ్యం 11 శాతం, గ్యాస్ ఉత్పత్తి సామర్థ్యం 15 శాతం పెరుగుతుందని ఓఎన్‌జీసీ తెలిపింది. 2022–23లో ఓఎన్‌జీసీ 18.4 మిలియన్ టన్నుల క్రూడాయిల్, రోజుకు 20 బిలియన్ క్యూబిక్ మీటర్ల గ్యాస్ ఉత్పత్తి చేసింది. తాజాగా అందుబాటులోకి వచ్చిన బ్లాక్‌లో చమురు ఉత్పత్తి గరిష్ఠంగా రోజుకు 45,000 బ్యారెళ్లు, గ్యాస్ ఉత్పత్తి 10 మిలియన్ క్యూబిక్ మీటర్ల స్థాయికి చేరగలదని మంత్రి తెలిపారు. అయితే, ఎప్పటికి ఆ స్థాయిని చేరవచ్చనేది వెల్లడించలేదు. కేజీ బేసిన్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్‌కి చెందిన కేజీ–6 బ్లాక్ పక్కనే కేజీ–డీ5 బ్లాక్ ఉంది. దీన్ని మూడు క్లస్టర్లుగా విడగొట్టి ముందుగా రెండో క్లస్టర్‌పై పనులు ప్రారంభించారు. వాస్తవ ప్రణాళికల ప్రకారం 2021 నవంబర్‌లోనే ఇందులో ఉత్పత్తి ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ కోవిడ్ పరిణామాలతో 2023 మే నెలకు, అటుపైన ఆగస్టుకు, తర్వాత డిసెంబర్‌కు వాయిదా పడుతూ వచ్చింది.

తాన్లా బోర్డులోకి ట్రాయ్ మాజీ చైర్మన్ ఆర్‌ఎస్ శర్మ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ట్రాయ్ మాజీ చైర్మన్ ఆర్‌ఎస్ శర్మను డైరెక్టర్ల బోర్డులో నియమించినట్లు తాన్లా ప్లాట్‌ఫామ్స్ సోమవారం ప్రకటించింది. దీంతో సంస్థ బోర్డ్ డైరెక్టర్ల సంఖ్య ఏడుకు చేరుకుంది. 2015–20 మధ్య ట్రాయ్ చైర్మన్‌గా ఆయన విధులు నిర్వర్తించారు. ఎంపవర్డ్ గ్రూప్ ఆఫ్ కోవిడ్ వ్యాక్సిన్ అడ్మినిస్ట్రేషన్ చైర్మన్‌గా.. భారత్‌లో కోవిడ్–19 టీకా కార్యక్రమానికి డిజిటల్ వెన్నెముక అయిన కో–విన్ రూపకల్పన, అమలుకు నాయకత్వం వహించారు. నేషనల్ హెల్త్ అథారిటీ సీఈవోగా కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలైన ఆయుష్మాన్ భారత్ జన్ ఆరోగ్య యోజన, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అమలులో కీలకపాత్ర పోషించారు. 2009–13 మధ్య ఆధార్ కార్డుల జారీ సంస్థ యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్, మిషన్ డైరెక్టర్‌గా పని చేశారు.

జీ–సోనీ డీల్‌కు బ్రేక్?

- సీఈవోగా గోయెంకా కొనసాగింపుపై ప్రతిష్టంభన
- డీల్‌ను రద్దు చేసుకునే యోచనలో సోనీ

న్యూఢిల్లీ: దాదాపు రెండేళ్లుగా కొనసాగుతున్న జీ ఎంటర్‌టైన్‌మెంట్ (జీల్) – సోనీ భారత విభాగం విలీన ప్రయత్నాలకు బ్రేక్ పడనున్నట్లు తెలుస్తోంది. విలీన సంస్థకు జీ సీఈవో పునీత్ గోయెంకా సారథ్యం వహించే విషయంపై సోనీ సుముఖంగా లేకపోవడమే ఇందుకు కారణమని సంబంధిత వర్గాలు తెలిపాయి. దీంతో నిర్దిష్ట షరతులను పాటించలేదనే కారణంతో ఈ ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని సోనీ గ్రూప్ భావిస్తున్నట్లు తెలిపారు. డీల్ కుదుర్చుకునేందుకు నిర్దేశించుకున్న గడువు కన్నా ముందే జనవరి 20లోగా రద్దు నోటీసును పంపించే అవకాశం ఉందని వివరించాయి. వివరాల్లోకి వెళ్తే.. జపాన్ దిగ్గజం సోనీ గ్రూప్ తమ భారత విభాగాన్ని, జీల్‌ను విలీనం చేసేందుకు సంబంధించి 2021లో ఒప్పందం కుదుర్చుకుంది. ఇది సాకారమైతే దేశీయంగా 10 బిలియన్ డాలర్ల



మీడియా దిగ్గజంగా విలీన సంస్థ ఆవిర్భవిస్తుంది. సదరు ఒప్పందం ప్రకారం జీ గ్రూప్ వ్యవస్థాపకుడు సుభాష్ చంద్ర తనయుడు, సీఈవో పునీత్ గోయెంకానే విలీన సంస్థకు కూడా సారథ్యం వహించాలి. కానీ, ఈలోగా చంద్ర, గోయెంకాలు తమ అధికారాన్ని దుర్వినియోగం చేసి సొంత అవసరాల కోసం నిధులను మళ్లించారంటూ సెబీ ఆరోపించడంతో డీల్ పురోగతిపై సందేహాలు రేకెత్తాయి. అయితే, ఈ మొత్తం వ్యవహారాన్ని కార్పొరేట్ గవర్నెన్స్‌పరమైన వివాదంగా పరిగణిస్తున్న సోనీ.. విలీన సంస్థ సారథ్య బాధ్యతలను గోయెంకాకు అప్పజెప్పడానికి విముఖంగా ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కానీ, ముందుగా అనుకున్న ప్రకారం సీఈవోగా తనని కొనసాగించాల్సిందేనంటూ గోయెంకా పట్టుబడుతున్నట్లు వివరించాయి. ఈ నేపథ్యంలోనే డీల్‌ను సోనీ రద్దు చేసుకోవాలని భావిస్తున్నట్లు పేర్కొన్నాయి.

రూ. 50 లక్షల కోట్లకు ఫండ్స్ ఆస్తులు

- 2023లో రూ.11 లక్షల కోట్ల వృద్ధి
- డిసెంబర్‌లో ఈక్విటీల్లోకి రూ.17వేల కోట్లు
- నూతన గరిష్టాలకు సిప్ పెట్టుబడులు

న్యూఢిల్లీ: దేశ మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ సరికొత్త మైలురాయికి చేరుకుంది. అన్ని మ్యూచువల్ ఫండ్స్ సంస్థల నిర్వహణలోని ఆస్తులు 2023 డిసెంబర్ ముగింపునకు రూ.50 లక్షల కోట్ల మార్క్‌ను అధిగమించాయి. గతేడాది మొత్తం మీద ఫండ్స్ నిర్వహణ ఆస్తులు (ఏయూఎం) 27 శాతం (రూ.10.9 లక్షల కోట్లు) వృద్ధి చెంది రూ.50.77 లక్షల కోట్లకు చేరాయి. 2022లో కేవలం 5.7 శాతం మేర (రూ.2.65 లక్షల కోట్లు) ఫండ్స్ ఏయూఎం పెరిగింది. 2021 చివరికి ఫండ్స్ ఏయూఎం రూ.37.72 లక్షల కోట్లుగా ఉంటే, 2022 చివరికి రూ.39.88 లక్షల కోట్లకు చేరింది. గతేడాది మెరుగైన పనితీరుకు.. ఈక్విటీ మార్కెట్లలో ఆశావహ ధోరణి, మ్యూచువల్ ఫండ్స్ పట్ల పెరుగుతున్న



అవగాహన, బలమైన ఆర్థిక మూలాలు, ఫండ్స్ పెట్టుబడుల విషయంలో క్రమశిక్షణ, ఇవన్నీ అనుకూలించాయి. గత డిసెంబర్‌లో ఫండ్స్ ఏయూఎం (అన్ని విభాగాలు కలిపి) 3.53 శాతం పెరిగింది. వరుసగా 11వ ఏడాదీ ఫండ్స్ నిర్వహణ ఆస్తులు పెరిగాయి. గతేడాది రూ.1.61 లక్షల కోట్లు ఈక్విటీ పథకాల్లోకి రాగా, హైబ్రిడ్ పథకాలు రూ.87,000 కోట్లను ఆకర్షించాయి. ''మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ మొదటి రూ.10 లక్షల కోట్ల నిర్వహణ ఆస్తులు సమకూర్చుకోవడానికి 50 ఏళ్లు పట్టింది. రూ.40 లక్షల కోట్ల నుంచి రూ.50 లక్షల కోట్లకు చేరుకోవడం ఏడాదిలోనే సాధ్యపడింది'' అని యాంఫీ సీఈవో వెంకట్ చలసాని పేర్కొన్నారు.

ఈక్విటీ పథకాలకు దన్ను..

2023 డిసెంబర్‌లో ఈక్విటీ ఫండ్స్‌లోకి రూ.16,997 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. నవంబర్ నెలలో వచ్చిన రూ.15,536 కోట్లతో పోల్చి చూస్తే 9.40 శాతం వృద్ధి కనిపించింది.

- సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) ద్వారా నెలవారీగా వచ్చే పెట్టుబడులు నూతన గరిష్టాలకు చేరాయి. డిసెంబర్‌లో రూ.17,610 కోట్లు సిప్ ద్వారా వచ్చాయి.
- డిసెంబర్‌లో థీమ్యాటిక్/సెక్టోరల్ ఫండ్స్ వెలుగులో నిలిచాయి. ఈ విభాగమే అత్యధికంగా రూ.6,005 కోట్లను ఆకర్షించింది. నవంబర్‌లో ఇదే విభాగంలోకి వచ్చిన పెట్టుబడులు రూ.1,965 కోట్లుగానే ఉన్నాయి.
- వీటి తర్వాత స్మాల్‌క్యాప్ పథకాలు అత్యధికంగా రూ.3,865 కోట్లను రాబట్టాయి.
- లార్జ్, మిడ్‌క్యాప్ ఫండ్స్ రూ.2,339 కోట్లు, మల్టీ క్యాప్ ఫండ్స్ రూ.1,852 కోట్లు ఆకర్షించాయి.

సెన్సెక్స్ 671 పాయింట్లు క్రాష్

నిఫ్టీకి 198 పాయింట్ల నష్టం

- ప్రపంచ ప్రతికూల సంకేతాల ప్రభావం
- క్యూ3 ఆర్థిక ఫలితాల వెల్లడికి ముందు లాభాల స్వీకరణ
- బ్యాంకింగ్, మెటల్, ఎఫ్‌ఎంసీజీ షేర్లలో అమ్మకాలు

ముంబై: ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందడంతో పాటు దేశీయ కార్పొరేట్ డిసెంబర్ క్వార్టర్ ఫలితాల ప్రకటనకు ముందు ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఫలితంగా సోమవారం దేశీయ మార్కెట్లు దాదాపు ఒక శాతం నష్టపోయాయి. సెన్సెక్స్ 671 పాయింట్లు పతనమై 71,355 వద్ద నిలిచింది. నిఫ్టీ 198 పాయింట్లు నష్టపోయి 21,513 వద్ద స్థిరపడింది. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు ఆసియా మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలతో వెంటనే నష్టాల్లోకి జారుకున్నాయి. రియల్టీ, మీడియా మినహా అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బ్యాంకింగ్, ఫైనాన్స్, ఐటీ, మెటల్, ఎఫ్‌ఎంసీజీ షేర్లలో విక్రయాలు వెల్లువెత్తాయి. ఒక దశలో సెన్సెక్స్ 725 పాయింట్లు నష్టపోయి 71,301 వద్ద, నిఫ్టీ 218 పాయింట్లు పతనమైన 21,711 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకాయి. మధ్య తరహా షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో బీఎస్‌ఈ మిడ్ క్యాప్ సూచీ 0.87% నష్టపోయింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.16.03 కోట్ల షేర్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.156 కోట్ల విలువైన షేర్లను కొన్నారు.



- అమెరికాలో డిసెంబర్‌కు సంబంధించి వ్యవసాయేతర రంగాల్లో 2.16 లక్షల ఉద్యోగాల కల్పన జరిగింది. పేరోల్ డేటా అంచనాలకు మించి నమోదవడంతో 'ఫెడ్ వడ్డీ రేట్ల తగ్గింపు వాయిదా' ఊహాగానాలు తెరపైకి వచ్చాయి. చైనా ద్రవ్యోల్బణ, వాణిజ్య లోటు డేటాతో సహా ఆయా దేశాల కీలక స్థూల ఆర్థిక గణాంకాల వెల్లడి ముందు అప్రమత్తత చోటు చేసుకోవడంతో ఆసియా, యూరప్ మార్కెట్లు బలహీనంగా కదలాడాయి. అమెరికా ఫ్యూచర్లు సైతం స్వల్ప నష్టాల్లో ట్రేడవుతున్నాయి.
- మెక్వైర్ ఈక్విటీస్ రీసెర్చ్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ బ్యాంకులపై రేటింగ్ డౌన్‌గ్రేడ్ చేయడంతో బ్యాంకింగ్ రంగ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఎస్‌బీఐ 2%, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, కోటక్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్లు 1.51% నష్టపోయాయి.
- బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ సోమవారం ఒక్కరోజే రూ.2.91 లక్షల కోట్ల సంపద తగ్గి రూ.366 లక్షల కోట్లకు దిగివచ్చింది.
- నష్టాల మార్కెట్లో కొన్ని చిన్న రంగాల షేర్లు రాణించాయి. అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ షేరు ఇంట్రాడేలో 2.50% పెరిగి రూ.1182 వద్ద జీవితకాల గరిష్టాన్ని తాకింది.
- ఈక్విటీ షేర్ల బైబ్యాక్‌కు బోర్డు ఆమోదించినట్లు బజాజ్ ఆటో వెల్లడించింది. షేరుకి రూ. 10,000 ధర మించకుండా 40,00,000 షేర్లను తిరిగి కొనుగోలు చేయనున్నట్లు తెలియజేసింది. ఇందుకు రూ. 4,000 కోట్లు వెచ్చించనుంది.

రూ. 120 కోట్లతో మోల్డ్‌టెక్ ప్లాంట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్యాకేజింగ్ రంగ సంస్థ మోల్డ్‌టెక్ ప్యాకేజింగ్ రూ.100 కోట్లతో కొత్తగా మూడు ప్లాంట్లను ప్రారంభించింది. తెలంగాణలోని సుల్తాన్‌పూర్, హరియాణాలోని పానిపట్, తమిళనాడులోని చెయ్యార్ వద్ద ఏర్పాటయ్యాయి. వీటి మొత్తం వార్షిక సామర్థ్యం 5,500 మెట్రిక్ టన్నులు. గ్రాసిమ్ ఇండస్ట్రీస్ కోసం మహారాష్ట్రలోని మహద్ వద్ద రూ.20 కోట్లతో 1,500 మెట్రిక్ టన్నుల వార్షిక సామర్థ్యం గల ప్లాంటు 2024 అక్టోబర్ నాటికి రెడీ అవుతోంది. 2024–25లో మోల్డ్‌టెక్ రూ.75–80 కోట్ల మూలధన వ్యయం చేయనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.120 కోట్లు, 2022–23లో రూ.148 కోట్లు వెచ్చించింది. 2024–25లో పరిమాణంలో 15–18 శాతం వృద్ధిని ఆశిస్తోంది. తాజా విస్తరణతో 2024–25లో మొత్తం వార్షిక తయారీ సామర్థ్యం



54,000 మెట్రిక్ టన్నులకు చేరుతుందని మోల్డ్‌టెక్ సీఎండీ జె.లక్ష్మణ రావు వెల్లడించారు. 'కొత్త ప్లాంట్లు కంపెనీ వృద్ధి అవకాశాలను ప్రధానంగా ఫార్మా ప్యాకేజింగ్‌లో మెరుగుపరుస్తాయి. ఫార్మా పరిశ్రమ నుండి మా ఉత్పత్తులకు డిమాండ్ చాలా ప్రోత్సాహకరంగా ఉంది. 2024–25 తొలి త్రైమాసికం నుండి ఫార్మా ప్యాకేజింగ్ ఆదాయం తోడవుతుంది. 5–6 ఏళ్లలో మొత్తం ఆదాయంలో ఫుడ్, ఎఫ్‌ఎంసీజీ, ఫార్మా విభాగాలు 50 శాతం సమకూర్చాలన్నది మా ప్రణాళిక' అని తెలిపారు.

ఏసీసీ చేతికి ఏషియన్ కాంక్రీట్స్



న్యూఢిల్లీ: ఏషియన్ కాంక్రీట్స్, సిమెంట్స్‌లో మిగిలిన 55 శాతం వాటాను అదానీ గ్రూప్ కంపెనీ ఏసీసీ కై వసం చేసుకుంది. ఇందుకు సుమారు రూ.426 కోట్లు వెచ్చించింది. అంబుజా సిమెంట్స్ అనుబంధ సంస్థ అయిన ఏసీసీకి ఇప్పటికే ఏషియన్ కాంక్రీట్స్‌లో 45 శాతం వాటా ఉంది. ఏషియన్ కాంక్రీట్స్, సిమెంట్స్‌కు హిమాచల్ ప్రదేశ్‌లోని నలఘర్ వద్ద 1.3 మిలియన్ టన్నుల ప్లాంటు, అలాగే అనుబంధ కంపెనీ అయిన ఏషియన్ ఫైన్ సిమెంట్స్‌కు పంజాబ్‌లోని రాజ్‌పురాలో 1.5 మిలియన్ టన్నుల సిమెంట్ ప్లాంటు ఉంది.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఇండియన్ నేవీలో 10+2(బీటెక్) క్యాడెట్ ఎంట్రీ స్కీమ్

ఇండియన్ నేవీ ఎగ్జిక్యూటివ్,టెక్నికల్ బ్రాంచుల్లో 10+2(బీటెక్) క్యాడెట్ ఎంట్రీ స్కీమ్ కింద నాలుగేళ్ల బీటెక్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులైన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. కేరళ రాష్ట్రం ఎజిమలలోని ఇండియన్ నేవల్ అకాడమీలో శిక్షణ ఉంటుంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 35 (మహిళలకు 10 ఖాళీలు కేటాయించారు).
» **కోర్సు వివరాలు:** 10+2(బీటెక్) క్యాడెట్ ఎంట్రీ స్కీమ్(పర్మనెంట్ కమిషన్).
» **బ్రాంచ్:** ఎగ్జిక్యూటివ్, టెక్నికల్.
» **కోర్సు ప్రారంభం:** 2024 జూలైలో.
» **వయసు:** 02.01.2005 నుంచి 01.07.2007 మధ్య జన్మించిన వారై ఉండాలి.
» **అర్హత:** కనీసం 70శాతం మార్కులతో సీనియర్ సెకండరీ పరీక్ష(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్) ఉత్తీర్ణతతో పాటు జేఈఈ(మెయిన్) పరీక్షలో ర్యాంకు సాధించి ఉండాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **ఎంపిక విధానం:** జేఈఈ(మెయిన్) ర్యాంక్, పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**20.01.2024
» **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

మేనేజ్, హైదరాబాద్‌లో టెలీ అడ్వైజర్ పోస్టులు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్(మేనేజ్).. ఒప్పంద ప్రాతిపదికన టెలీ అడ్వైజర్(నేచురల్ ఫార్మింగ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** అగ్రికల్చర్ పీజీ(అగ్రోనమి/సాయిల్‌సైన్స్/అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ /ప్లాంట్ పాథాలజీ/అగ్రికల్చర్ అటానమీ/అగ్రికల్చర్ మార్కెటింగ్/అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్). టెలీ అడ్వైజరీ సర్వీసెస్ అనుభవం,కంప్యూటర్,భాషా నైపుణ్యాలు ఉండాలి. **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.50,000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**15.01.2024
» **వెబ్‌సైట్:** www.manage.gov.in

టీటీడీ తిరుపతిలో 78 డిగ్రీ/జూనియర్ లెక్చరర్ పోస్టులు

తిరుపతిలోని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శాశ్వత ప్రాతిపదికన టీటీడీ డిగ్రీ కళాశాలలు/ఓరియంటల్ కళాశాలల్లో డిగ్రీ లెక్చరర్లు, టీటీడీ జూనియర్ కళాశాలల్లో జూనియర్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 78
» **పోస్టుల వివరాలు:** డిగ్రీ లెక్చరర్‌లు–49, జూనియర్ లెక్చరర్‌లు–29.
» **డిగ్రీ లెక్చరర్లు:** సబ్జెక్టుల వారీగా ఖాళీలు: బోటనీ–03,కెమిస్ట్రీ–02, కామర్స్–09, డెయిరీ సైన్స్–01,ఎలక్ట్రానిక్స్–01, ఇంగ్లిష్–08, హిందీ–02, హిస్టరీ–01, హోమ్ సైన్స్–04, ఫిజికల్ ఎడ్యుకేషన్–02, ఫిజిక్స్–02, పాపులేషన్ స్టడీస్–01, సంస్కృతం–01, సంస్కృత వ్యాకరణం–01, స్టాటిస్టిక్స్–04, తెలుగు–03, జువాలజీ–04.
» **అర్హత:** కనీసం 55శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. నెట్/స్లెట్ అర్హత సాధించి ఉండాలి.
» **జూనియర్ లెక్చరర్లు:** సబ్జెక్టుల వారీగా ఖాళీలు: బోటనీ–04, కెమిస్ట్రీ–04, సివిక్స్–04, కామర్స్–02, ఇంగ్లిష్–01, హిందీ–01, హిస్టరీ–04, మ్యాథమేటిక్స్–02, ఫిజిక్స్–02, తెలుగు–03, జువాలజీ–02.
» **అర్హత:** కనీసం 55శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు డిగ్రీ లెక్చరర్‌కు రూ.61,960 నుంచి రూ.1,51,370. జూనియర్ లెక్చరర్‌కు రూ.57,100 నుంచి రూ.1,47,760.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(కంప్యూటర్ ఆధారిత రిక్రూట్‌మెంట్ టెస్ట్), ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 2024, ఫిబ్రవరి మొదటి వారం.
» **వెబ్‌సైట్:** www.tirumala.org

బెల్ బెంగళూరులో 12 ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్).. తాత్కాలిక ప్రాతిపదికన ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12
» **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/బీఎస్సీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 32 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి 55,000
» **పనిచేయాల్సిన ప్రదేశం:** పంజాబ్.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అసిస్టెంట్ మేనేజర్(హెచ్ఆర్), బీఈఎల్, జలహళ్లి, బెంగళూరు చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 23.01.2024.
» **వెబ్‌సైట్:** www.bel-india.in

పదిలో బెస్ట్ గ్రేడ్ ఇలా!

పదో తరగతి ప్రతి విద్యార్థి జీవితంలో ఎంతో కీలకం! పదిలో సాధించిన మార్కులను ఉన్నత విద్య, ఉద్యోగాల కోణంలో ప్రతి దశలోనూ పరిగణనలోకి తీసుకుంటున్నారు. అందుకే పదో తరగతి వార్షిక పరీక్షలకు అంతటి ప్రాధాన్యం!! ఇంతటి కీలకమైన పదో తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో మార్చి 18వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో.. పదో తరగతిలో.. పదికి పది గ్రేడ్ పాయింట్లు సాధించేందుకు సబ్జెక్ట్ వారీగా ప్రిపరేషన్ టిప్స్..

» ఏపీలో మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు
» తెలంగాణలోనూ మార్చి 18 నుంచి టెన్త్ ఎగ్జామ్స్
» సిలబస్, ప్రశ్నల తీరుపై అవగాహనతో ఉత్తమ స్కోర్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2024, మార్చి 18 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలను నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు షెడ్యూల్‌ను కూడా విడుదల చేశారు. అంతేకాకుండా ఈసారి.. సైన్స్(పీఎస్, ఎన్‌ఎస్) పేపర్లను వేర్వేరుగా రెండు రోజుల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. మరోవైపు తెలంగాణలోనూ మార్చి 18 నుంచి పరీక్షలు జరపనున్నట్లు పేర్కొన్నారు. దీంతో విద్యార్థులు తమ సన్నద్ధతకు పదును పెట్టుకోవాలని సబ్జెక్ట్ నిపుణులు సూచిస్తున్నారు.

తెలుగు.. తేలిగ్గా తీసుకోవద్దు

మన మాతృ భాష తెలుగు అనే ఆలోచనతో విద్యార్థులు ఈ సబ్జెక్ట్‌ను కొంత తేలిగ్గా తీసుకుంటారు. కానీ.. మంచి గ్రేడ్ పాయింట్లు సాధించాలంటే మాత్రం విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిందే. అందుకోసం.. పద్యభాగం, గద్యభాగంలోని అన్ని అంశాలను గుర్తుంచుకోవాలి. వాటిని పునశ్చరణ చేసుకోవాలి. పాఠాన్ని కేవలం చదవడంతో సరిపెట్టకుండా.. సారాంశాన్ని, ఉద్దేశాన్ని తెలుసుకోవాలి. ప్యాసేజ్ పేరిట ఉండే అపరిచిత గద్యం ఎంతో ముఖ్యం. ఈ విషయంలో సొంతంగా ఆలోచిస్తూ చదవాలి. ఉప వాచకానికి సంబంధించి ఇతివృత్తం, ప్రాముఖ్యత, పాత్రలు, వాటి ప్రాధాన్యత, వ్యక్తుల ప్రవర్తన శైలి తదితర అంశాల ద్వారా ఇచ్చే సందేశాన్ని తెలుసుకోవాలి. తెలుగు సబ్జెక్ట్‌లో వ్యాకరణం కూడా ముఖ్యమే. ఈ వ్యాకరణంలో మెరుగ్గా రాణించాలంటే.. సంధులు, సమాసాలు, సంయుక్తార్థాలు, ఉత్పత్త్యర్థాలు, జాతీయాలు బాగా చదవాలి. ఇప్పటి నుంచి ప్రతి రోజు క్లాస్ రూంలో బోధించే అంశాలను అదే రోజు ఇంటి వద్ద ప్రాక్టీస్ చేయడం ఎంతో ఉపకరిస్తుంది. విద్యార్థులు జనవరి మొదటి వారం నుంచి పునశ్చరణకు ప్రత్యేకంగా సమయం కేటాయించేలా ప్రిపరేషన్ ప్రణాళిక రూపొందించుకోవాలి.

ఇంగ్లిష్ - ఆందోళన వద్దు

గ్రామీణ ప్రాంత విద్యార్థులు కొంత ఆందోళన చెందే సబ్జెక్ట్ ఇది. కానీ.. ఇందులోనూ మంచి మార్కులు పొందే అవకాశం ఉంది. ఇందుకోసం చేయాల్సిందల్లా.. ముందుగా ఇంగ్లిష్ పదజాలం, వినియోగంపై అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా వాటిని తాము సొంతంగా విశ్లేషించే నైపుణ్యం పెంచుకోవాలి. ఇందుకోసం పాత ప్రశ్న పత్రాలు–సమాధానాలను పరిశీలించడం మేలు చేస్తుంది. విద్యార్థులు ప్రతి పాఠం చివరలో ఉండే కాంప్రహెన్సన్ ప్రశ్నలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ప్రతి పాఠానికి సంబంధించి సారాంశాన్ని గ్రహించి.. సొంతంగా రాసుకునే అలవాటు చేసుకోవాలి. పోయెట్రీ ప్రశ్నల్లో మంచి మార్కుల సాధన కోసం సదరు పద్యంలో ముఖ్య పదాలు, యాంటానిమ్స్, సినానిమ్స్‌పై దృష్టి సారించాలి. వీటితో పాటు పార్ట్స్ ఆఫ్ స్పీచ్, డైరెక్ట్, ఇన్‌డైరెక్ట్ స్పీచ్, యాక్టివ్ వాయిస్, ప్యాసివ్ వాయిస్, ఫ్రేజల్ వెర్బ్స్‌ను చదవాలి. వీటిని చదవడంతోపాటు ప్రాక్టీస్ కూడా చేస్తే మెరుగైన మార్కులు పొందొచ్చు. అన్‌నోన్ ప్యాసేజ్ కింద ఇచ్చే ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటే.. ఆ ప్యాసేజ్ సారాంశాన్ని గుర్తించే నైపుణ్యం అవసరం. లెటర్ రైటింగ్‌కు సంబంధించి పంక్చుయేషన్స్, బాడీ ఆఫ్ ది లెటర్ వంటి అంశాలపై పట్టు పెంచుకోవాలి.

మ్యాథమెటిక్స్.. ప్రాక్టీస్‌తోనే స్కోర్

మ్యాథమెటిక్స్.. భవిష్యత్తులో ఉన్నత విద్య, ప్రవేశ పరీక్షలు..ఇలా అన్నింటా ఎంతో కీలకంగా నిలుస్తుంది. ఈ సబ్జెక్ట్‌లో వందకు వంద సాధించే అవకాశం ఉంటుంది. అందుకోసం ప్రతి చాప్టర్‌ను సంపూర్ణంగా అధ్యయనం చేయడంతోపాటు వాటికి సంబంధించిన ప్రశ్నలు (ప్రాబ్లమ్స్)ను ప్రాక్టీస్ చేయాలి. సంఖ్యా వ్యవస్థ; బీజ గణితం; నిరూపక రేఖాగణితం; పేపర్–2లో రేఖా గణితం; క్షేత్ర మితి; త్రికోణమితి; సంభావ్యత, సాంఖ్యక శాస్త్రంపై పట్టు సాధించాలి. విద్యార్థులు ప్రిపరేషన్ సమయంలోనే సమస్య సాధనతోపాటు కారణాల నిరూపణ, వ్యక్తీకరణ, ఒక సమస్యను ఇతర అంశాలతో అనుసంధానం చేయడం వంటి నైపుణ్యాలు పొందాలి. ముఖ్యమైన నిర్వచనాలు,సూత్రాలను నోట్స్ రూపంలో రాసుకుంటే.. రివిజన్ సమయంలో ఉపయుక్తంగా ఉంటుంది. టెక్స్ట్ బుక్‌లో ప్రతి చాప్టర్ చివరన ఇచ్చే సమస్యలను తప్పకుండా ప్రాక్టీస్ చేయాలి. గ్రాఫ్‌లు, నిర్మాణాత్మక సమస్యలకు సమాధానాలు కనుగొనేందుకు ప్రాక్టీస్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. వాస్తవ సంఖ్యలు; సమితులు; బహుపదులు; రెండు చరరాశులలోని రేఖీయ సమీకరణాల జత అధ్యాయాలలోని గ్రాఫ్ ఆధారిత సమస్యలు; సంభావ్యత; సాంఖ్యక శాస్త్రం; త్రికోణమితి; క్షేత్రమితిలోని ముఖ్యమైన సమస్యలను సాధన చేస్తే సులభంగానే 60 శాతం మార్కులు సొంతం చేసుకోవచ్చు.

ఫిజికల్ సైన్స్.. అన్వయ దృక్పథం

ఫిజికల్ సైన్స్‌లో మంచి మార్కులు సాధించాలంటే.. అనువర్తిత ఆధారిత ప్రిపరేషన్ సాగించాలి. ఇందులో ఫిజిక్స్ నుంచి ఏడు, కెమిస్ట్రీ నుంచి ఏడు మొత్తం 14 చాప్టర్లు చదవాల్సి ఉంటుంది. ఆయా చాప్టర్లకు సంబంధించిన అంశాలను నిజ జీవిత సంఘటనలతో అన్వయించుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి. విషయ అవగాహనతోపాటు, ప్రశ్నించడం–పరికల్పన చేయడం; ప్రయోగాలు–క్షేత్ర పర్యటనలు; సమాచార నైపుణ్యాలు–ప్రాజెక్ట్ పనులు; పటాలు–వాటి ద్వారా భావ ప్రసారం వంటి వాటిపైనా కృషి చేయాలి. కాంతి పరావర్తనం, కాంతి వక్రీభవనం, విద్యుత్ ప్రవాహం, రసాయన బంధం, పరమాణు నిర్మాణం, కార్బన్ సమ్మేళనాలపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలి. అదే విధంగా.. మూలకాల ధర్మాలు–వర్గీకరణ, రసాయన సమీకరణాలను బాగా ప్రాక్టీస్ చేయాలి. ఇలా చేయడం వల్ల లఘు, అతి స్వల్ప, బహుళైచ్ఛిక ప్రశ్నలకు సులువుగా సమాధానాలిచ్చే పట్టు లభిస్తుంది. ప్రశ్నను ఎలా అడిగినా సమాధానం ఇచ్చే సంసిద్ధత పెంచుకుంటే బెస్ట్ స్కోర్ చేయొచ్చు.

నేచురల్ సైన్సెస్

జీవశాస్త్రంలో టాప్ స్కోర్ కోసం సబ్జెక్ట్ అవగాహనతోపాటు విశ్లేషణ నైపుణ్యాలు కీలకంగా మారుతున్నాయి. ఇందుకోసం ఫ్లో చార్ట్‌లు, బ్లాక్ డయాగ్రమ్స్‌లను సొంతంగా రూపొందించుకోవాలి. ఒక అంశాన్ని నేర్చుకున్న తర్వాత దాన్ని వాస్తవ పరిస్థితులతో అన్వయించే నేర్పు సొంతం చేసుకోవాలి. ప్రయోగాలకు సంబంధించి ప్రయోగం ఫలితంతో పాటు.. ప్రయోగ నిర్వహణ ప్రక్రియపై అవగాహన పొందాలి. చాప్టర్‌లో పేర్కొన్న అభ్యాసాలకు సంబంధించి విశ్లేషణ, కారణాలు, పోలికలు, బేధాలు తెలుసుకుంటూ చదవాలి. డయాగ్రమ్స్‌కు సంబంధించిన భాగాలను గుర్తించడమే కాకుండా..వాటి ప్రాముఖ్యతను వర్ణించగలిగే విధంగా ప్రాక్టీస్ చేయాలి.

సోషల్ స్టడీస్.. సమకాలీనంగా

సోషల్ స్టడీస్‌లో అడిగే ప్రశ్నల తీరులో మార్పు వచ్చింది. విద్యార్థులు ఈ విషయాన్ని గుర్తించి సమకాలీన అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి. టెక్స్ట్ బుక్‌లో ఒక అంశం గురించి ఉంటే.. దానికి సంబంధించి మన నిజ జీవితంలో జరుగుతున్న సంఘటనలతో పోల్చుకుంటూ చదవడం లాభిస్తుంది. సమకాలీన అంశాల విషయంలో ప్రతిస్పందన,ప్రశ్నించడం, ప్రశంస/అభినందనలపై సాధన చేయాలి. అవగాహనకు సంబంధించి ఒక నిర్దిష్ట అంశాన్ని చదివి, సొంత పరిజ్ఞానంతో రాసే విధంగా నైపుణ్యం పెంచుకోవాలి. జాగ్రఫీ, ఎకనామిక్స్‌లో భారతదేశం –భౌగోళిక స్వరూపం, శీతోష్ణస్థితి, భారతదేశ నీటి వనరులు, వలసలు, ఆహార భద్రత, ఉత్పత్తి–ఆదాయం, సుస్థిరాభివృద్ధి పాఠ్యాంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. హిస్టరీలో రెండు ప్రపంచ యుద్ధ కాలాల సమయంలో ప్రపంచం; సమకాలీన సామాజిక ఉద్యమాలపై దృష్టి పెట్టాలి. భారత జాతీయోద్యమ చరిత్రను ప్రత్యేక దృష్టితో చదవాలి. సివిక్స్‌కు సంబంధించి రాజ్యాంగం మూల సూత్రాలు, రాజ్యాంగంలో పేర్కొన్న అంశాలను ఏఏ దేశాల రాజ్యాంగల నుంచి అనుసరించారు? వంటి కోణాల్లో చదవాలి. డయాగ్రమ్/రేఖాచిత్ర, పేరాగ్రాఫ్ ఆధారిత ప్రశ్నలను కూడా ప్రాక్టీస్ చేయాలి.

ఉత్తమ స్కోర్‌కు సూచనలు

- అవగాహన, ప్రతిస్పందన, స్వీయ విశ్లేషణ నైపుణ్యాలు పెంచుకోవాలి.
- ప్రాక్టీస్ ఆధారిత ప్రిపరేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.
- అనువర్తిత నైపుణ్యం పెంపొందించుకునేలా చదవాలి.
- మ్యాథమెటిక్స్, సైన్స్ సబ్జెక్ట్‌లకు సంబంధించి బేసిక్ కాన్సెప్ట్స్, థీరమ్స్‌ను బాగా అధ్యయనం చేయాలి.
- ప్రతి అంశాన్ని సొంతంగా విశ్లేషించే విధంగా ప్రాక్టీస్ చేయాలి.
- జనవరి నుంచి అధిక సమయం పునశ్చరణకు కేటాయించాలి.
- జనవరి చివరి నాటికి ప్రిపరేషన్, రివిజన్ రెండిటినీ పూర్తి చేసుకోవాలి.
- ఫిబ్రవరి నుంచి మార్చి మొదటి వారం వరకు ప్రీ–ఫైనల్స్‌కు హాజరవ్వాలి.
- తొలి పరీక్షకు వారం ముందు నుంచి పూర్తిగా ఆ పరీక్ష కోసమే సమయం కేటాయించాలి.

క్లుప్తంగా...

‘ఈఈఎంటీ-2024’ రిజిస్ట్రేషన్ గడువు పొడిగింపు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 7, 10 తరగతి విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకు ఎడ్యుకేషనల్ ఎపిఫనీ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న ‘ఈఈఎంటీ-2024’ (ఎడ్యుకేషనల్ ఎపిఫనీ మెరిట్ టెస్ట్) పరీక్ష రిజిస్ట్రేషన్ గడువును పొడిగించారు. తొలుత ఈ నెల 8వ తేదీ వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు గడువు విధించారు. అయితే, గడువు పెంచాలని విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వస్తున్న విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని ఈ నెల 23 వరకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. 23న ప్రాక్టీస్ టెస్ట్, ఫిబ్రవరి 1న ప్రిలిమినరీ, 6న ప్రాక్టీస్ టెస్ట్-2, 8న మెయిన్స్ పరీక్ష ఉంటుందని ఎడ్యుకేషనల్ ఎపిఫనీ కన్వీనర్ పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. రిజిస్ట్రేషన్లు https://educationalepiphany.org/eemt2024/registration.php ద్వారా చేసుకోవచ్చన్నారు.

పగిడ్యాల సహకార సంఘానికి ప్రధాని మోదీ అభినందన


ప్రధానితో మాట్లాడుతున్న సీఈవో ఖాజా

సాక్షి, న్యూఢిల్లీ/పగిడ్యాల: వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర లబ్ధిదారులతో ముఖాముఖిలో భాగంగా నంద్యాల జిల్లా పగిడ్యాల సహకార సంఘాన్ని ప్రధాని మోదీ అభినందించారు. వందేళ్లకు పైగా ఈ సంఘాన్ని నడుపుతున్న స్థానిక రైతుల స్ఫూర్తికి ప్రధాని సెల్యూట్ చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీతో సహకార సంఘం సీఈవో ఖ్వాజా మొయినుద్దీన్ మాట్లాడారు. మహిళా రైతులతో కలిపి ఈ గ్రూప్‌లో మొత్తం 5,600 మంది రైతులు ఉన్నారని తెలిపారు. పంటల సాగు, పశువుల పెంపకం తదితరాల కోసం రూ.11.90 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు వివరించారు. నాబార్డు నిధులు రూ.3.35 కోట్లు ఉపయోగించి ఐదు గోదాములు నిర్మించినట్లు చెప్పారు. అనంతరం ప్రధాని మోదీ ఎరువుల వినియోగం తగ్గించి.. సేంద్రియ వ్యవసాయం చేయాలని రైతులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు(కర్నాటక) ఈరన్న కడాడి, కలెక్టర్ మనజీర్ జిలానీ, జేసీ రాహుల్, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేరికలు ఎందుకు లేవో చెప్పండి

76 ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలకు విద్యాశాఖ నోటీసులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విద్యార్థుల చేరికలు లేని ప్రైవేటు ఎయిడెడ్ స్కూళ్లపై పాఠశాల విద్యాశాఖ దృష్టి సారించింది. 2022-23 విద్యా సంవత్సరంలో ‘జీరో ఎన్‌రోల్’ ఉన్న స్కూళ్ల కారణాలు చెప్పాలని ఆయా యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసింది. ఆయా స్కూళ్లలో ప్రస్తుతమున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది వివరాలను పంపాలని ఆర్జేడీలు, డీఈవోలను ఆదేశించింది. ఉమ్మడి 13 జిల్లాల్లో శ్రీకాకుళం, అనంతపురం మినహా మిగిలిన 11 జిల్లాల్లో మొత్తం 76 ప్రైవేట్ ఎయిడెడ్ స్కూళ్లల్లో గత విద్యా సంవత్సరం ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. ఈ వరుసలో అత్యధిక జీరో ఎన్‌రోల్ స్కూళ్లు పశ్చిమ గోదావరి జిల్లాలో 34, ప్రకాశం జిల్లాలో 13 ఉన్నాయి. వీటి తర్వాత గుంటూరు (7), కర్నూలు (5), తూర్పు గోదావరి (4), కృష్ణా (4), విజయనగరం (3), వైఎస్సార్ (3), విశాఖపట్నం, చిత్తూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో ఒక్కోటి చొప్పున ఉన్నాయి.

సర్దుబాటు చేయండి: టీచర్స్ గిల్డ్

ప్రైవేటు ఎయిడెడ్ స్కూళ్లల్లో ఉన్న అదనపు ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించి విద్యార్థులు ఉన్నచోట సర్దుబాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరింది. ప్రస్తుతం రాష్ట్రంలోని ఈ తరహా స్కూళ్లలో విద్యార్థులు లేకున్నా టీచర్లు ఉన్నారని గిల్డ్ అధ్యక్ష, కార్యదర్శులు బి.చిట్టిబాబు, ఎల్కే చిన్నప్ప పేర్కొన్నారు.

త్వరలో 2వేల పీఏసీఎస్‌ల్లో జన్‌ఔషధి కేంద్రాలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న 2వేల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో (పీఏసీఎస్) ప్రధానమంత్రి భారతీయ జన్ ఔషధి కేంద్రాలను కేంద్రం త్వరలో ప్రారంభించనుంది. ‘సహకార్ సే సమృద్ధి’ అనే నినాదంతో ఆదివారం ఢిల్లీలో పీఏసీఎస్ మెగా కాన్క్లేవ్ నిర్వహించారు. కేంద్ర మంత్రులు అమిత్ షా, మన్సుఖ్ మాండవియా ఈ కార్యక్రమానికి హాజరై.. ఆంధ్రప్రదేశ్‌తో పాటు మరో నాలుగు రాష్ట్రాల ప్రతినిధులకు పీఏసీఎస్- సింబాలిక్ సర్టిఫికెట్ స్టోర్ కోడ్‌లు అందజేశారు. ఇప్పటికే దేశంలో 10,500 జన్ ఔషధి కేంద్రాలు నడుస్తున్నాయి. ఇక్కడ 1,965 ఉత్తమ నాణ్యత కలిగిన ఔషధాలను 50 నుంచి 90 శాతం తక్కువ ధరకే ప్రజలకు అందజేస్తున్నామని కేంద్ర మంత్రి మాండవియా తెలిపారు. ఇప్పటి వరకు 3 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయని, తొలి విడతలో దేశవ్యాప్తంగా మరో 2 వేల పీఏసీఎస్‌ల్లో జన్ ఔషధి కేంద్రాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. రూ. 65 రేటు ఉన్న ఔషధాలను ఈ కేంద్రాల్లో కేవలం రూ. 5కే అందజేస్తున్నామని అమిత్ షా వివరించారు.

అబద్ధాల గురువు బాబుకు దరువు



తన రూ.100 విలువైన షేరు ఏకంగా రూ.5,28,630 చొప్పున అమ్మిన ‘ఈనాడు’

అప్పటికి రూ.1,800 కోట్ల నష్టాల్లో ఉండి కూడా.. భారీ ధరకు అమ్మిన ‘ఈనాడు’

- బాబుపై స్కిల్ స్కామ్, అసైన్డ్ ల్యాండ్స్, ఫైబర్‌నెట్, ఇన్నర్ రింగ్‌రోడ్ కేసులు
- ఇటీవలే స్కిల్ స్కామ్‌లో అరెస్టయి ఏకంగా 52 రోజులు జైల్లో ఉన్న బాబు
- ఆరోగ్యం బాగాలేదని... చికిత్స అవసరమనే సాకుతో బెయిలుపై బయటకు
- ఈ కేసుల్లో దేన్లో శిక్ష పడినా.. మిగిలిన జీవితం మొత్తం జైల్లో గడపాల్సిందే
- ఇవన్నీ కావాలనే విస్మరిస్తూ... జగన్‌పై ఎన్నికల వేళ రామోజీరావు దుష్ప్రచారం

(సాక్షి, ప్రత్యేక ప్రతినిధి)

‘ఈనాడు’కు 50 ఏళ్లు. రామోజీకైతే 87. కానీ ఏం లాభం? పత్రికేమో అబద్ధాలకు కేరాఫ్. ఈయనేమో మోసాలకు గురువు. అయినా సిగ్గుండక్కర్లా? 17 ఏళ్లుగా తన ఇన్‌కమ్ ట్యాక్స్, మార్గదర్శి కేసుల్ని నానబెడుతూ... సాగదీస్తూ... కోర్టులకు అడ్డం పడుతూ వస్తున్న రామోజీ రావు... ‘సాక్షి’లో పెట్టుబడుల కేసుల్ని వాయిదాలతో నెట్టుకొచ్చేస్తున్నారని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై నిందలు వేయటమేంటి? మరీ ఇంత పచ్చి అబద్ధాలతో ఈ వయసులో ఏం సాధిస్తావయ్యా రామోజీరావ్!!. చంద్రబాబు కోసం మరీ ఇంత దిగజారిపోవాలా!?.

అసలు ఈ కేసుల్లో వైఎస్ జగన్ తరఫున లాయర్లు ఎన్నడైనా కావాలని ఒక్క వాయిదానైనా అడిగారా? ఒక్కసారైనా హాజరుకాకుండా ఉన్నారా? ఎందుకిన్ని అబద్ధాలు? ముఖ్యమంత్రి కాబట్టి ఆయనకు కోర్టు మినహాయింపునిచ్చింది. దీంతో ఆయన తరఫు న్యాయవాదులు తప్పనిసరిగా ప్రతి వాయిదాకూ హాజరవుతున్నారు. రామోజీ కేసుల్లో కూడా హాజరయ్యేది లాయర్లేగా? మరెందుకు ఈ అరుపులు? ఎన్నికలు వస్తున్నాయనే కదా? గత ఎన్నికల ముందు కూడా ఇంతే. ఈ కేసులు నిరూపణ అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శిక్ష పడుతుందని పదేపదే రాసి... జనాన్ని భయపెట్టాలని చూస్తే ఏమయింది? మీ అబద్ధాలను నమ్మబోమని మొహమ్మీద ఫెడేల్మని కొట్టి 151 సీట్లతో అఖండ విజయం కట్టబెట్టారు. అయినా బుద్ధి రాలేదా? ఇప్పుడూ అవే రాతలా? ఇంకెన్నాళ్లు రామోజీ!!.

అసలు ఈ కేసులేంటి? ఎవరు వేసినవి? ఎప్పటివి?

రాష్ట్రంలో ఎల్లో మీడియా అబద్ధాలకు అంతులేకుండా పోతోందని, రెండో కోణాన్ని చూపించే పత్రిక అత్యవసరమని భావించటంతో పుట్టుకొచ్చిన పత్రిక ‘సాక్షి’. పత్రిక భవిష్యత్తుపై నమ్మకం ఉండటంతోనే పలువురు ఇన్వెస్టర్లు దీన్లో పెట్టుబడులు పెట్టారు. వారి నమ్మకం గెలిచింది. ‘సాక్షి’ ఒక మీడియా సంస్థగా తిరుగులేని విజయాన్ని సొంతం చేసుకుని 15 ఏళ్లు పూర్తి చేసుకుంది. తమ పెట్టుబడులు అనుకున్నదానికన్నా ఎక్కువ సక్సెస్ అయ్యాయని ఇన్వెస్టర్లు కూడా సంతోషంగా ఉన్నారు. చంద్రబాబు- రామోజీ మాత్రం దీన్ని తట్టుకోలేకపోతున్నారు. వాస్తవానికి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కాంగ్రెస్‌లో ఉన్నన్నాళ్లూ ఏ కేసులూ లేవు. ఆ పార్టీని వీడటంతోనే కక్ష సాధింపులు మొదలయ్యాయి. తమకు రాజకీయ ప్రత్యర్థిగా అవతరించవచ్చనే భయంతో కాంగ్రెస్... టీడీపీతో చేతులు కలిపి మరీ కుట్రలకు దిగింది.

ఇదీ.. బాబు-కాంగ్రెస్ కుట్రకు మూలం

అసలు ‘సాక్షి’లోకి వచ్చిన పెట్టుబడులు పెట్టుబడులే కాదని... అదంతా ఆ సంస్థకు వచ్చిన ఆదాయమని, కాబట్టి దానిపై పన్ను కట్టాలంటూ చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన ఓ ఐటీ అధికారి ‘సాక్షి’కి అడ్డగోలు నోటీసులిచ్చారు. ఇదే... ఈ కేసుకు మూలం. తమకిలా ఉపకారం చేసినందుకు ఆ అధికారికి తాను అధికారంలోకి రాగానే చంద్రబాబు తగిన కానుక ఇచ్చుకున్నారు. ఏపీ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేసి మరీ దానికి సీఈఓను చేశారు. ఈ నోటీసుల్ని ఓ పత్రిక ప్రచురిస్తే... ఆ పత్రిక కథనాన్ని జతచేసి కాంగ్రెస్ నేత శంకర్రావు హైకోర్టుకు లేఖ రాశారు. దాన్ని పిటిషన్‌గా కోర్టు స్వీకరించింది. తమనూ చేర్చాలని టీడీపీ నేతలు ఎర్రన్నాయుడు, అశోక్‌గజపతి కోరారు. కోర్టు చేర్చింది. నిజానికి అప్పటికి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎమ్మెల్యే, ఎంపీ కాదు. ఏ మంత్రితోనూ మాట్లాడింది లేదు. నాటి రాజధాని హైదరాబాద్‌లో కూడా ఉండేవారు కాదు. కాంగ్రెస్ బెదిరింపులకు లొంగకపోవటంతో ఎక్కడో బెంగళూరులో ఉన్న వైఎస్ జగన్‌పై కేసులు పడ్డాయి. కోర్టు తీర్పుతో దర్యాప్తు మొదలయింది.

మూకుమ్మడి సోదాలతో భయోత్పాతం

ఇక సీబీఐ దర్యాప్తు మొత్తాన్ని తనే నిర్దేశిస్తూ ఎల్లో మీడియా శివాలెత్తింది. నాటి దర్యాప్తు అధికారులు సైతం వందల బృందాలతో వైఎస్ జగన్ ఇల్లు, కార్యాలయాలు, ఫ్యాక్టరీలు, ఇన్వెస్టర్ల ఇళ్లు సోదాలు చేసి భయోత్పాతం సృష్టించారు. చివరకు ఏమీ దొరక్క... ఐటీ అధికారి నోటీసులో ఏమయితే పేర్కొన్నారో... దాదాపుగా అవే అంశాలు పేర్కొంటూ 11 ఛార్జిషీట్లు దాఖలు చేశారు. ఈడీ కూడా సీబీఐని కాపీ చేసి... అది వేసిన 11 ఛార్జిషీట్లనూ తనూ యథాతథంగా వేసేసింది. అదీ కథ. అంటే అన్నిటికీ మూలం.. బాబు కోసం... ఓ అధికారి ఇచ్చిన ఐటీ నోటీసు. కానీ చివరకు ఏమయిందో తెలుసా? ఆ ఐటీ నోటీసును ఐటీ ట్రిబ్యునల్ కొట్టేసింది. ఆ పెట్టుబడులన్నీ సక్రమమేనని తేల్చిచెప్పింది. ఈ తీర్పుతో... తెలుగుదేశం- కాంగ్రెస్ అధిష్ఠానం కలిసి చేసిన కుట్ర స్పష్టంగా బయటపడింది. పెట్టుబడులు సక్రమమేనని ఐటీ అప్పిలేట్ ట్రిబ్యునలే చెప్పినపుడు... దాని ఆధారంగా వేసిన ఛార్జిషీట్లు నిలబడతాయా? మరి ఈ కేసులో ఏం ఉందని రామోజీరావు దిగజారి రాస్తున్నారు?

చంద్రబాబుకు జీవితాంతం జైలే...

స్కిల్ డెవలప్‌మెంట్ అంటూ సీమెన్స్ కంపెనీకి సంబంధం లేకుండానే ఆ కంపెనీతో నకిలీ ఒప్పందం చేసుకుని... ఏకంగా రూ.241 కోట్లను తన సొంత ఖాతాల్లోకి మళ్లించేసుకున్న ఘనుడు చంద్రబాబు నాయుడు. ఈ కుంభకోణంలో ఇటీవలే 52 రోజులు జైల్లో ఉండి.... ఆరోగ్యం బాగాలేదని, పరీక్షలు చేయించుకోవాలని చెప్పి బెయిలు తెచ్చుకున్నాడు. మరోవైపు విజయవాడలో ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్‌ను తమ భూముల మీదుగా మళ్లించి స్కామ్‌కు పాల్పడ్డారనే కేసు కూడా ఈయనపై ఉంది. రాజధాని పేరిట దళితుల అసైన్డ్ భూములను అక్రమంగా హస్తగతం చేసుకున్న కేసు మరొకటి... ఫైబర్‌నెట్ పేరిట తన బినామీ సంస్థ టెరాసాఫ్ట్‌కు అడ్డగోలు కాంట్రాక్టు కట్టబెట్టి నిధులు కాజేసిన కేసు ఇంకొకటి. వీటిలో ఏ ఒక్కకేసు నిరూపణ అయినా... ఏడేళ్లకన్నా ఎక్కువే శిక్ష పడుతుంది. అంటే.. 73 ఏళ్ల చంద్రబాబు ఏ కేసులో నిజం నిరూపణ అయినా జీవితాంతం జైల్లోనే ఉంటారు. మరి ఈ నిజాన్ని మీ పత్రికలో చెప్పరెందుకు రామోజీ? ఎందుకంటే ఆయన మీ.. చంద్రబాబు కాబట్టి!!. అంతేగా?

షేరు విలువపై మీరా.. మాట్లాడేది?

‘సాక్షి’ మీడియా సంస్థ 10 రూపాయల విలువైన షేరును రూ.350 చొప్పున ఇన్వెస్టర్లకు విక్రయించిందని, ఇంత ప్రీమియం చెల్లించటమే కుంభకోణమని ప్రతిసారీ రామోజీరావు రాని ఆవేశాన్ని తెచ్చుకుని మరీ ఊగిపోతుంటారు. మరి ‘ఈనాడు’ పత్రిక తన 100 రూపాయల విలువైన షేరును ఏకంగా రూ.5,28,630 చొప్పున విక్రయించింది. పైపెచ్చు ఆ సమయంలో ‘ఈనాడు’ రూ.1,800 కోట్ల నష్టాల్లో ఉంది. దీనికితోడు పనికిమాలిన పాత సినిమా రీళ్లను రూ.700 కోట్లుగా లెక్కగట్టి అమ్మేసింది. ఇది అసలు ఏ స్థాయి కుంభకోణం? ‘ఈనాడు’ కన్నా మెరుగైన పత్రికను, మెరుగైన డిజైన్, ఆధునిక యంత్రాలతో తీసుకువచ్చినపుడు... షేరును రూ.350కి విక్రయించటం అక్రమమెలా అవుతుంది? పెట్టుబడి పెట్టిన ఇన్వెస్టర్లంతా సంతోషంగానే ఉన్నారుకదా? ఈ కేసులు గనక లేకుంటే ఏనాడో వారి వాటాలకు పెట్టుబడి కన్నా ఎక్కువ విలువ వచ్చి ఉండేది. మరి ఈ వాస్తవాలన్నీ దాచి అబద్ధాల కథనాలెందుకు? ఎన్నికల సమయంలో ఏదో ఒకరకంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై బురద జల్లాలనుకునే దౌర్భాగ్యపు రాతలు ఇంకెన్నాళ్లు?

లోకేశ్ దెబ్బకు టీడీపీ కకావికలు

ఎన్టీఆర్ జిల్లా టీడీపీలో ముసలం ● బాబు, లోకేశ్ శైలితో రగిలిపోతున్న కేశినేని నాని వర్గం

- కేశినేని నాని బాటలో మరింత మంది నేతలు
- టీడీపీలో మొదలైన రాజీనామాల పర్వం
- కార్పొరేటర్ కేశినేని శ్వేత రాజీనామా
- పార్టీలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నామని ఆవేదన
- పొమ్మన్న తర్వాత కూడా ఉండలేమని స్పష్టీకరణ
- బాబాయ్ చిన్ని గురించి మాట్లాడి స్థాయి తగ్గించుకోలేమని వ్యాఖ్య
- జిల్లాలో పార్టీ ముగ్గురి చెప్పు చేతల్లో నడుస్తోందంటున్న నాని వర్గీయులు
- బెజవాడతోపాటు చుట్టుపక్కల నియోజకవర్గాల్లో టీడీపీకి అభ్యర్థులు లేరని వెల్లడి


మేయర్ భాగ్యలక్ష్మికి రాజీనామా పత్రం అందిస్తున్న కార్పొరేటర్ కేశినేని శ్వేత

సాక్షి ప్రతినిధి, విజయవాడ/పటమట (విజయవాడ తూర్పు): టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్ చేస్తున్న నీచ రాజకీయాలకు ఎన్టీఆర్ జిల్లాలో ఆ పార్టీలో పెద్ద ముసలమే పుట్టింది. ముఖ్యంగా లోకేశ్ కొట్టిన దెబ్బకు జిల్లాలో ఆ పార్టీ కకావికలవుతోంది. బాబు, లోకేశ్ చర్యలకు విసిగిపోయి పార్టీకి ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) గుడ్‌బై చెప్పడంతో జిల్లాలో పార్టీ నేతలు అధిక సంఖ్యలో రాజీనామాలకు సిద్ధమవుతున్నారు. ఇకపై పార్టీలో పని చేయలేమని తెగేసి చెబుతున్నారు. టీడీపీకి చెందిన విజయవాడ 11వ డివిజన్ కార్పొరేటర్, నాని కుమార్తె కేశినేని శ్వేత సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ అంశం బెజవాడ టీడీపీలో మరింత కలకలం రేపింది. రాజీనామా ఆమోదం పొందిన వెంటనే పార్టీకి రాజీనామా చేస్తామని శ్వేత వెల్లడించారు. కేశినేని నాని పార్టీకి రాజీనామా చేశాక కార్యకర్తలతో మాట్లాడి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తారన్నారు. గౌరవం లేని పార్టీలో ఇమడలేకే రాజీనామా చేస్తున్నామని ఆమె చేసిన వ్యాఖ్యలు టీడీపీలో అలజడి రేపుతున్నాయి. ఏడాదిన్నరగా పార్టీలో తీవ్ర అవమానాలకు గురయ్యామని ఆమె ఆవేదన వ్యక్తం చేయడం పార్టీలో చర్చకు దారితీసింది. కేశినేని వర్గీయులు మరికొంత మంది కూడా రాజీనామాలకు సిద్ధమవుతున్నారు. ప్రధాన అనుచరులుగా ఉన్న తిరువూరు మాజీ ఎమ్మెల్యే స్వామిదాసు, మైలవరం నియోజకవర్గానికి చెందిన బొమ్మసాని సుబ్బారావు, విజయవాడ వెస్ట్ నియోజకవర్గానికి చెందిన బేగ్ వంటి వారు కేశినేని వెంటే ఉన్నారు. కేశినేని నాని మూడోసారి కూడా విజయవాడ నుంచే లోక్‌సభకు పోటీ చేస్తారని, విజయం సాధిస్తారని శ్వేత ప్రకటించారు. తన బాబాయ్ కేశినేని చిన్ని గురించి మాట్లాడి తమ స్థాయిని తగ్గించుకోలేమని అన్నారు. అవినీతి పరులను పార్టీ ప్రోత్సహిస్తోందని విమర్శించారు.

ఇది లోకేశ్ అజ్ఞానమే

తిరువూరు సభకు, కేశినేని నానికి సంబంధం ఏమిటన్న లోకేశ్ వ్యాఖ్యలపై పలువురు టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాని ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్‌సభ నియోజకవర్గంలో భాగమైన తిరువూరులో జరుగుతున్న పార్టీ సభతో సంబంధం లేదని అనడం లోకేశ్ అజ్ఞానమేనని వ్యాఖ్యానిస్తున్నారు. ‘మా నాన్న నియోజకవర్గంలో సభ జరుగుతుంటే ఎంపీగా ఆయనకు సంబంధం ఉండదా’ అని కేశినేని శ్వేత గట్టిగానే ప్రశ్నించారు. లోకేశ్ అజ్ఞానం వల్లే పార్టీలో విభేదాలు తలెత్తుతున్నాయని, సీనియర్ నేతలను ఆయన అవమానిస్తున్నారని విమర్శిస్తున్నారు. లోకేశ్ గుట్లు తెలిసిన కేశినేని నాని వ్యతిరేక వర్గం ఆయన్ని బ్లాక్ మెయిల్ చేసి, ఆధిపత్యం చలాయిస్తోందని చెబుతున్నారు. కేశినేని చిన్ని, నాని వ్యతిరేక వర్గంలోని ముగ్గురు టీడీపీ నేతలు చెప్పినట్లే ప్రస్తుతం పార్టీలో నడుస్తోందని వ్యాఖ్యానిస్తున్నారు. ముగ్గురు బ్లాక్ మెయిలర్ల చెప్పు చేతల్లోకి లోకేశ్, పార్టీ వెళ్లిపోయారంటూ కేశినేని శ్వేత అన్నారు. జిల్లాలో టీడీపీ అధినేత కార్యక్రమాలేవీ నానికి చెప్పడంలేదని తెలిపారు. ఎన్నో అవమానాలు భరించి పార్టీలో ఉన్నామన్నారు. మీరు పార్టీలో వద్దు పొమ్మన్నాక కూడ ఉండలేం కదా అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా ఉన్నామని, ఆస్తులు అమ్ముకున్నామని, వ్యాపారాలు నిలిపివేసి, త్యాగం చేస్తే, చివరికి చంద్రబాబు తమను వంచించారని కేశినేని నాని రగిలిపోతున్నారు. పిలిచి మాట్లాడకుండా, దూతలను పంపి పార్టీ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దని చెప్పడాన్ని తీవ్ర అవమానంగా భావిస్తున్నారు. చుట్టుపక్కల రాజమండ్రి, ఏలూరు, గుంటూరు, బాపట్ల ఎంపీ స్థానాలకు టీడీపీ అభ్యర్థులే కరువైన తరుణంలో ప్రజల్లో పట్టున్న విజయవాడ సిట్టింగ్ ఎంపీకి టికెట్ లేదని చెప్పటాన్ని ఆ పార్టీ నాయకులే జీర్ణించుకోలేక పోతున్నారు.

మేయర్ ఫార్మాట్‌లో కార్పొరేటర్ శ్వేత రాజీనామా

ఎంపీ కేశినేని నాని కుమార్తె, విజయవాడ 11వ డివిజన్ కార్పొరేటర్ కేశినేని శ్వేత సోమవారం తన అనుచరులతో కలిసి వీఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మిని కలిసి రాజీనామాను సమర్పించారు. మేయర్ ఫార్మాట్‌లో ఆమె రాజీనామా లేఖ సమర్పించారు. ఈ సందర్భంగా శ్వేత మాట్లాడుతూ.. తమకు టీడీపీలో గౌరవం లేదని, అందుకే రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. రాజీనామా ఆమోదం పొందాక టీడీపీకి రాజీనామా చేస్తానని తెలిపారు. నాని, తాను ప్రజల తరఫున పోరాటం చేస్తామని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో నగరంలోని మూడు నియోజకవర్గాల నాయకులు తమను ఇబ్బంది పెట్టారని చెప్పారు. ఇప్పుడు టీడీపీకి విజయవాడ, మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గాల్లో అభ్యర్థులే లేరని అన్నారు. టీడీపీ నుంచి తమతో వచ్చేవాళ్ళకి కచ్చితంగా అండగా ఉంటామని పేర్కొన్నారు. అంతకు ముందు ఆమె విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను కలిసి తన రాజీనామా నిర్ణయాన్ని చెప్పారు.

‘సాక్షి’ పెట్టుబడులు సక్రమమే

- 2022 డిసెంబర్లో తీర్పునిచ్చిన ఐటీ అప్పిలేట్ ట్రిబ్యునల్
- షేర్ ప్రీమియాన్ని ఆదాయంగా పరిగణించలేం
- ఇన్వెస్ట్‌మెంట్ల విషయంలో నిబంధనలన్నీ పాటించారు
- జగతి సంస్థ పెట్టుబడి లావాదేవీలన్నీ చట్ట పరిధిలోనే జరిగాయి
- అలాంటపుడు అవి క్విడ్- ప్రో-కో ఎలా అవుతాయి?
- ఐటీ ఉత్తర్వులిచ్చి పదేళ్లు దాటినా సాక్ష్యాలేవీ సమర్పించలేదు
- సీబీఐవి కేవలం ఆరోపణలే... వాటికి హేతుబద్ధత లేదు

(సాక్షి, ప్రత్యేక ప్రతినిధి)



సాక్షి మీడియాలోకి వచ్చిన పెట్టుబడులన్నీ సక్రమమేనని, చట్టబద్ధమేనని 2022 డిసెంబర్లో ఐటీ అప్పిలేట్ ట్రిబ్యునల్ స్పష్టంగా చెప్పింది. జగతి పబ్లికేషన్స్‌లో ఇన్వెస్టర్లంతా చట్టానికి లోబడే పెట్టుబడులు పెట్టారని, ఇన్వెస్ట్‌మెంట్లు స్వీకరించడంలో కంపెనీలు చట్టప్రకారం పాటించాల్సిన నిబంధనలన్నిటినీ జగతి పబ్లికేషన్స్ పాటించిందని ఐటీ శాఖ అప్పిలేట్ ట్రిబ్యునల్ స్పష్టం చేసింది. ఈ కంపెనీలోకి పెట్టుబడులన్నీ క్విడ్-ప్రో-కో రూపంలో వచ్చాయి కనుక వాటిని ఆదాయంగా పరిగణించి, ఆ మొత్తం పై పన్ను చెల్లించాలంటూ 2011లో నాటి ఐటీ అధికారి ఇచ్చిన నోటీసులను ట్రిబ్యునల్ కొట్టివేసింది. ఐటీ విభాగం తమ వాదనకు మద్దతుగా సమర్పించిన సీబీఐ ఛార్జిషీట్లను... అసలు సాక్ష్యంగానే పరిగణించలేమని తెగేసి చెప్పింది. సాక్ష్యానికి ఉండాల్సిన కనీస లక్షణాలేవీ ఆ ఛార్జిషీట్లకు లేవని కూడా బెంచ్ వ్యాఖ్యానించింది. ‘ఆ ఛార్జిషీట్లలో ఉన్నవన్నీ సీబీఐ చేసిన ఆరోపణలే తప్ప నిరూపితమైనవేమీ కావు. అయినా మీరు నోటీసులిచ్చిన అసెస్‌మెంట్ ఇయర్ దాటి ఇప్పటికి పదేళ్లు గడిచింది. మీరేమైనా దర్యాప్తు చేశారా? క్విడ్ ప్రోకో ఆరోపణలు నిరూపించే ఆధారాలేమైనా సంపాదించారా? సీబీఐ ఆరోపణలనే సాక్ష్యంగా సమర్పిస్తే ఎలా? సీబీఐ ఛార్జిషీట్లకు ఎలాంటి హేతుబద్ధతా లేదు. ఈ కేసులో అవి అనవసరం, అప్రస్తుతం కూడా’ అని జ్యుడిషియల్, అకౌంటింగ్ సభ్యులతో కూడిన ట్రిబ్యునల్ బెంచ్ తేల్చిచెప్పింది. తద్వారా... సాక్షి మీడియాలోకి వచ్చిన పెట్టుబడులపై రామోజీరావు, టీడీపీ అధిపతి చంద్రబాబునాయుడు, మిగిలిన ఎల్లో గ్యాంగ్ పనిగట్టుకుని చేస్తున్న దుష్ప్రచారానికి విలువ లేదని, అదంతా బూటకమని స్పష్టమయింది. సుదీర్ఘకాలం విచారించి, ఇరుపక్షాల వాదనలూ సమగ్రంగా విన్న అనంతరం 2022 డిసెంబరు 23న బెంచ్ 153 పేజీల ఉత్తర్వులను వెలువరించింది.

ఒక్కొక్కరికీ ఒక్కో ‘లా’ ఎలా?

‘‘కొందరు ఇన్వెస్టర్ల విషయంలో ఇదే సీబీఐ ప్రత్యేక న్యాయస్థానంలో మెమో దాఖలు చేసింది. వారి విషయంలో ఎలాంటి క్విడ్ ప్రో కో లావాదేవీలూ జరగలేదని స్పష్టంగా చెప్పింది. పోనీ... మిగతా ఇన్వెస్టర్ల విషయంలో క్విడ్ ప్రోకో జరిగిందని కూడా ఆ మెమోలో చెప్పలేదు. మరి క్విడ్ ప్రో కో అని మీరెలా అంటారు?’’ అని బెంచ్ తన ఉత్తర్వుల్లో ఐటీ విభాగాన్ని ప్రశ్నించింది. ప్రయివేటు లిమిటెడ్‌లో షేరు ప్రీమియం అనేది ఇన్వెస్టర్లతో జరిగే చర్చలు, వారి అంచనాల వల్లే నిర్ణయమవుతుందని పేర్కొంది.

ఇన్వెస్టర్ల వాదనను గమనించారా?

సాక్ష్యాలుగా సమర్పించిన పలు వాదనల్లో నిమ్మగడ్డ గ్రూపు సంస్థల డైరెక్టరు నిమ్మగడ్డ ప్రకాశ్ చేసిన వాదనను బెంచ్ ప్రస్తావించింది. ‘‘ఈనాడులో పెట్టుబడులకోసం బ్లాక్‌స్టోన్ అనుకున్న విలువలో 20 శాతం డిస్కౌంట్‌కే సాక్షిలో వాటా దొరికింది. ఐదు ప్రాధాన్య రంగాల్లో పెట్టుబడులు పెడదామని అనుకున్నాం. అందులో మీడియా ఒకటి. అందుకే సాక్షిలో పెట్టాం’’ అనే ప్రకాశ్ వ్యాఖ్యల్ని పరిగణనలోకి తీసుకోవాలని బెంచ్ వ్యాఖ్యానించింది. వచ్చిన పెట్టుబడులను ఆదాయంగా పరిగణించలేమని విస్పష్టంగా తేల్చిచెప్పింది.

తెలియని మార్గాలంటే ఎలా?

కోల్‌కతాలోని కొన్ని కంపెనీల నుంచి వచ్చిన రూ. 15 కోట్లను తెలియని మార్గాల నుంచి వచ్చిన మొత్తంగా ఐటీ విభాగం పేర్కొంది. దాన్ని బెంచ్ తప్పుబడుతూ... కోల్‌కతా కంపెనీలతో సహా పెట్టుబడి ప్రతి కంపెనీ పాన్, రిజిస్ట్రేషన్ నెంబరు, అడ్రసు వంటి వివరాలన్నీ జగతి సంస్థ సమర్పించిందని, అన్నీ చట్టబద్ధంగానే ఉన్నప్పుడు ‘గుర్తు తెలియని ఆదాయం’ ఎలా అవుతుందని ప్రశ్నించింది.

వాల్యుయేషన్ నివేదిక నిజమేగా?

‘‘వాల్యుయేషన్ రిపోర్టును అస్సలు తప్పు బట్టడానికి లేదు. అందులో పేర్కొన్న అంశాలన్నీ సాక్షి పత్రిక విషయంలో నిజమయ్యాయి. అనుకున్నట్లుగానే సర్క్యులేషన్ పెరిగింది. పోటీపత్రిక ఈనాడు గుత్తాధిపత్యం తగ్గింది. పోటీపత్రిక 30 ఏళ్లలో సాధించిన సర్క్యులేషన్‌ను సాక్షి ఏడాదిన్నరలోనే సాధించింది. కనుక వాల్యుయేషన్ నివేదికను తప్పుబట్టలేం. సాక్షి యాజమాన్యానికి అనుభవం లేకున్నా అంత ప్రీమియం తీసుకున్నారనే వాదన అర్థరహితం. వారి లీడర్‌షిప్‌లో ఆ పత్రిక అంచనాలన్నిటినీ అందుకుంది. కాబట్టి క్విడ్ ప్రో కో వాదనకు అర్థమే లేదు’’ అని బెంచ్ పేర్కొంది. ఐటీ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఇంత విస్పష్టంగా తీర్పునిచ్చినా... రామోజీ, చంద్రబాబు గ్యాంగ్ మాత్రం ఇప్పటికీ పాత పాటే పాడుతూ... పాచి కథనాలనే మళ్లీ మళ్లీ ప్రచురిస్తూ ఏదో చేసేయాలని ఆరాటపడుతుండటమే విచిత్రం.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

ఇంటింటా రామ మందిరం సందడి కావాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐనాథ్‌రెడ్డి తదితరులు

బళ్లారి అర్బన్: అయోధ్యలో ఈనెల 22న రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా కేంద్రం ఆదేశాల మేరకు దేశమంతా ప్రతి ఇంటా దీపావళి సందడి మాదిరిగా దీపాలను వెలిగించి కాంతులతో అయోధ్యరామ మందిర ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని గణపాల ఐనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మోకా రోడ్డు సిద్ధార్థ కాలనీలో డాక్టర్ మహేష్‌శర్మ సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శ్రీరామ మందిరం విశ్వానికే గర్వించదగ్గ మందిరమన్నారు. వీహెచ్‌పీ నాయకుడు అశోక్ కుమార్, యోగా గురువు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణంతో విద్యార్థుల పాట్లు



పాఠశాలకు టాటా ఏస్‌లో వెళుతున్న విద్యార్థులు

కంప్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల్లో ప్రకటించిన తొలి గ్యారంటీ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం శక్తి పథకం అమలుతో విద్యార్థులు బస్సుల్లో సీట్లు దొరకక అవస్థలు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వెళ్లాలంటే విద్యార్థులకు బస్సులో సీట్లు దొరకక ఫుట్‌బోర్డుపై నిలబడి భయంభయంగా రాకపోకలు సాగిస్తున్నారు. విద్యార్థులు ఎలాగైనా బడికి వెళ్లాలని ఆటో, టాటా ఏస్ తదితర వాహనాలను ఆశ్రయిస్తున్నారు. భద్రత లేని ప్రయాణంతో ఏదైనా జరగరాని ప్రమాదాలు జరిగితే దానికి బాధ్యులు ఎవరని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో అధికారులు స్పందించి విద్యార్థులకు సౌకర్యం కల్పించాలని ఒత్తిడి చేస్తున్నారు.

నదిలోకి చేప పిల్లల విడుదల



చేప పిల్లలను నదిలోకి వదులుతున్న దృశ్యం

కంప్లి: మత్స్యకారుల జీవనభృతి కోసం కంప్లి కోట వద్ద తుంగభద్ర నదిలో 4 లక్షల చేప పిల్లలను వదిలినట్లు మత్స్య శాఖ డైరెక్టర్ బీఎల్ షడాక్షరి తెలిపారు. ఆయన సోమవారం కంప్లి కోట వద్ద తుంగభద్ర నదిలో చేప పిల్లలను వదిలిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. 2021–22వ సంవత్సరానికి ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన ద్వారా నదిలో ప్రజలు ఎక్కువగా కోరుకునే 4 రకాలకు చెందిన చేప పిల్లలను విడిచినట్లు తెలిపారు. చేపల వేటతో జీవితం సాగించే మత్స్యకారులు ఒక్కో సమయంలో ఉపాధి లేక వలసలు వెళ్లక తప్పడం లేదన్నారు. కంప్లి కోట తీరాన నివాసముంటున్న వందలాది మత్స్యకారుల కుటుంబాలకు నదిలో చేప పిల్లల విడుదల వారిని ఆదుకునేందుకు, జీవనభృతికి ఎంతో దోహదపడుతుందన్నారు.

వృద్ధాప్య వేతనంతో పిల్లలకు మిఠాయి



పిల్లలకు అన్నం వడ్డిస్తున్న గంగప్పజ్జ

కంప్లి: హూవినహడగలి తాలూకాలోని నెంబర్ 63 తిమ్మలాపుర గ్రామానికి చెందిన 80 ఏళ్ల గంగప్పజ్జ ప్రతి నెల ప్రభుత్వం నుంచి అందుతున్న వృద్ధాప్య వేతనం రూ.1200లతో ఆ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల పిల్లలకు పాఠశాలలోని వంట పని వారితో నెలకో రకం తీపి వంటకం చేయించి స్వయంగా తానే పిల్లలకు వడ్డిస్తుంటారు. పిల్లలు ఎంతో తృప్తిగా తిని ఆనందిస్తుంటారు. ఆ వృద్ధుడు తనకున్న కొద్దిపాటి భూమిని కౌలుకు ఇచ్చి అలా వచ్చిన కౌలు సొమ్ముతో జీవిస్తుంటాడు. గ్రామస్తులంతా అతని సద్గుణాన్ని కొడియాడారు.

సామూహిక వివాహాలు



కార్యక్రమంలో పాల్గొన్న స్వామీజీ తదితరులు

కంప్లి: విజయనగర జిల్లా హరపనహళ్లి తాలూకా అడవిహళ్లిలో సద్గురు శివయోగి వీర గంగాధర హాలస్వామి ముళ్ల సమాధికి అపారమైన భక్తుల సమక్షంలో వైభవంగా మహోత్సవాలు జరిగాయి. మఠంలో మొత్తం 9 రోజుల పాటు వివిధ ధార్మిక కార్యక్రమాలు ప్రారంభించారు. గురుబసవేశ్వర కార్తికోత్సవం, ముళ్ల సమాధి మహోత్సవం, వీరమహేశ్వర శివదీక్ష, సామూహిక వివాహాలు, హాలస్వామి రథోత్సవం జరిగాయి.

విద్యుత్ షాక్‌తో ముగ్గురు యువకులు మృతి

- ఓ హీరో కటౌట్లు కడుతుండగా ఘోరం
- గదగ్ జిల్లా సూరణగి గ్రామంలో ఘటన



విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన యువకులు వీరే(ఫైల్)

సాక్షి బళ్లారి: సినిమా హీరోపై ఉన్న అభిమానం ముగ్గురు యువకులకు మృత్యుఒడికి చేర్చిన ఘటన సోమవారం గదగ్ జిల్లాలో చోటు చేసుకుంది. ప్రముఖ కన్నడ సినీ హీరో, రాకింగ్ స్టార్ యష్ పుట్టిన రోజు నేపథ్యంలో ఆదివారం రాత్రి నుంచే అభిమానులు పెద్ద ఎత్తున కటౌట్లు, బ్యానర్లు కట్టి సంబరాలు చేసుకునేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసుకుంటున్నారు. ఈక్రమంలో గదగ్ జిల్లాలో కటౌట్లు కడుతుండగా ముగ్గురు యువకులు విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. తమ హీరో పుట్టినరోజు వేడుకను చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న గదగ్ జిల్లా లక్ష్మేశ్వర తాలూకా సూరణగి గ్రామంలో కటౌట్లు కడుతున్న హనుమంతు(21), మురళీ పంతిమణి(20), నవీన్ గాజీ(19) అనే యువకులు విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మరణించారు. యష్ 30 అడుగుల కటౌట్లు కట్టేందుకు ప్రయత్నిస్తుండగా విద్యుత్ స్తంభానికి ఉన్న లైను మీద పడటంతో ఈ ప్రమాదం జరిగింది. ఘటనలో ముగ్గురు మృతి చెందడంతో పాటు మంజునాథ్, దీపక్, ప్రకాశ్ మాగేడి అనే మరో ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మిన్నంటిన విషాదం

ఒకేసారి ముగ్గురు యువకుల మృతితో పాటు పలువురికి తీవ్ర గాయాలు కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకొన్న వెంటనే ఎమ్మెల్యే చంద్రు లమాణి ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి మృతుల కుటుంబాలకు సాంత్వన పలికారు. గ్రామంలో విషాదఛాయలు, మృతుల కుటుంబ సభ్యులు, బంధువుల ఆక్రందనల మధ్య ముగ్గురికి సామూహిక అంత్యక్రియలు పూర్తి చేశారు. ఘటనపై అక్కడి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబ సభ్యులు

రూ.2 లక్షల పరిహారం

శివాజీనగర: గదగ్ జిల్లా సూరణగిలో విద్యుదాఘాతంతో మృతి చెందిన యశ్ అభిమానులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు పరిహారం ప్రకటించినట్లు మంత్రి హెచ్‌కే పాటిల్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, యశ్‌తో కూడా మాట్లాడామన్నారు. మృతుల కుటుంబాలను త్వరలో యశ్ భేటీ అవుతారన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంటామన్నారు.

డిమాండ్ల సాధన కోసం సమ్మె

బళ్లారి రూరల్ : దక్షిణ పశ్చిమ రైల్వే మజ్దూర్ యూనియన్ బళ్లారి శాఖ, ఆల్ ఇండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్ న్యూఢిల్లీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం బళ్లారి రైల్వేస్టేషన్‌లో రైల్వే ఉద్యోగులు సమ్మె చేశారు. యూనియన్ హుబ్లీ డివిజన్ సహకార్యదర్శి, బళ్లారి శాఖ కార్యదర్శి, ఫ్రైమ్ మెంబర్ పీ.ఎం.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ 2004 తరువాత రైల్వే శాఖలో ఉద్యోగాలు పొందిన వారికి నేషనల్ పెన్షన్ స్కీమ్(ఎన్‌పీఎస్)ను రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీమ్(ఓపీఎస్)ను అమలు చేయాలని కేంద్ర పభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. ఓపీఎస్‌లో ఉద్యోగులకు చివరి జీతంలో 50 శాతం జీతాన్ని పెన్షన్‌గా ఇస్తారు. తరువాత కొన్నేళ్లకు 100 శాతం జీతం వస్తుందని తెలిపారు. అదే ఎన్‌పీఎస్‌లో ఉద్యోగి జీతం నుంచి 10 శాతం రికవరీ, ప్రభుత్వం 14 శాతంతో కలిపి 24 శాతం అవ్వగా అందులో కేవలం 60 శాతం మాత్రమే పెన్షన్‌గా ఇస్తారన్నారు. మిగిలిన 40 శాతం ఏమవుతుందో కూడా ఉద్యోగులకు తెలియదన్నారు. దీనివల్ల పదవీ విరమణ పొందిన ఉద్యోగులు అవసరాలకు కూడా సరిపోకపోగా పిల్లల చదువులు, సొంతగూడు ఏర్పాటు చేసుకోలేక పోతారన్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ సమ్మె ఈనెల 8వ తేదీ నుంచి 11 వరకు కొనసాగుతుందన్నారు. సమ్మెలో ఎస్‌డబ్ల్యూఆర్‌ఎంయూ అధ్యక్షుడు రాములు నాయక్, కోశాధికారి ఎం.విజయ్‌కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం



విజేతలకు బహుమతులను అందిస్తున్న అధికారులు

బళ్లారి అర్బన్: క్రీడలతో మానసిక, శారీరక ఒత్తిళ్ల నుంచి ఉపశమనం పొందవచ్చని ఐజీపీ లోకేష్ కుమార్ పేర్కొన్నారు. పోలీస్ జింఖాన మైదానంలో మూడు రోజుల పాటు జరిగిన టెన్నిస్ టోర్నీ పోటీల్లో విజేతలకు జేఎస్‌డబ్ల్యూ ట్రోఫి పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉత్తర కర్ణాటకలోని 13 జిల్లాల నుంచి 260 మందికి పైగా టెన్నిస్ క్రీడాకారులు పాల్గొని డబల్, సింగల్ మ్యాచ్‌లు ఆడగా, వీరిలో 55 ఏళ్ల పైబడిన వారిలో బళ్లారికి చెందిన డాక్టర్ సూర్యప్రకాష్, అరవింద్ పటేల్, ఉదయ్ భాస్కర్ విజేతలుగా నిలిచారు అలాగే రన్నింగ్ రేస్‌లో దావణగెరె విరుపాక్షి రెడ్డి, మంజునాథ్, సింధనూరు పాటిల్ రన్నరప్‌గా నిలిచారు. 45 ఏళ్ల పైబడిన వారిలో డబుల్స్ పోటీల్లో విరుపాక్షి, శ్రీనివాసులు, దావణగెరెకు చెందిన అనిల్, బాగలకోటె సచిన్, తుమకూరు చేతన్ గెలుపొందారు. 35 ఏళ్ల పైబడిన డబుల్స్ పోటీల్లో సింధనూరు మనీష్, రవిరాజ్, దావణగెరె రుద్రేష్, విశాల్, వినయ్ తమ ప్రతిభను చాటి విజయం సాధించారు. విజేతలకు రన్నరప్‌లకు షీల్డ్, ట్రోఫీతో పాటు సర్టిఫికెట్లు, నగదు బహుమతులను అందించారు. కార్యక్రమంలో జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా, ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు, ఏడీసీ మహమ్మద్ ఝుబేర్, జిందాల్ అధ్యక్షుడు మురుగన్, పోలీస్ జింఖాన అధ్యక్షులు కే.జితేంద్ర, కార్యదర్శి రవిరాజశేఖర్‌రెడ్డి, ఈసీ మెంబర్ కాంద్ర సతీష్ పాల్గొన్నారు.

అలరించిన సంక్రాంతి వైభవం



విజేతలకు బహుమతులను అందించిన దృశ్యం

బళ్లారి అర్బన్: తాలూకాలోని బీడీ హళ్లి మొరార్జీ దేశాయి రెసిడెన్సియల్ పాఠశాల మైదానంలో సోమవారం విద్యార్థులకు ఏర్పాటు చేసిన సంక్రాంతి వైభవం కార్యక్రమాన్ని ప్రముఖుడు కాంద్ర సతీష్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే లక్ష్య సాధనకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. జానపదగీతాలు శివకుమార్ బృందం ఆలపించగా, సాంస్కృతిక నృత్యాలను గోనాళ బృందం ప్రదర్శించింది. సంక్రాంతి రంగోలి, సాంస్కృతిక నృత్యాలు, చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు ఏకలవ్య ట్రస్ట్ అధ్యక్షుడు చంద్రశేఖర్ బహుమతులను అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ అనసూయ, రీజినల్ మేనేజర్ పీఆర్.మురళీకృష్ణ, మాతృమహిళా మండలి అధ్యక్షురాలు పుష్పలత, సందీప్, కళావతి, రాజు, మంజునాథ్ గంగాధర్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు డిమాండ్



మాట్లాడుతున్న రజాక్ ఉస్తాద్

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటకలో ఆర్టికల్–371(జే)కు ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని హైదరాబాద్ కర్ణాటక పోరాట సమితి జిల్లాధ్యక్షుడు రజాక్ ఉస్తాద్ పేర్కొన్నారు. ఆయన సోమవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కళ్యాణ కర్ణాటకలోని రాయచూరు. బళ్లారి, కలబుర్గి, బీదర్, కొప్పళ, యాదగిరి జిల్లాల్లో ఉద్యోగాల నియామకాల్లో ఇతర జిల్లాల వారు కేసులు వేస్తూ నియామకాలకు అడ్డంకులు కల్గిస్తున్న అంశంపై విచారించడానికి కలబుర్గిలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యోగుల పదోన్నతిలో కూడా అన్యాయం జరుగుతోందని, దానిని సవరించి కళ్యాణ కర్ణాటకలోని అభ్యర్థులకు అవకాశాలు కల్పించాలన్నారు. ప్రస్తుతం నియమితులైన అభ్యర్థులకు ఇతర ప్రాంతాల అభ్యర్థులు బెళగావి, బెంగళూరు, కలబుర్గి హైకోర్టుల్లో కేసులు వేయడంతో కళ్యాణ కర్ణాటకలోని అభ్యర్థులు మూడు కోర్టుల చుట్టూ తిరుగుతూ కాలయాపన చేయడమే సరిపోతోందన్నారు. ఆర్టికల్–371(జే) కింద నియామకాల అంశాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలన్నారు.

అలసత్వ అధికారులపై చర్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బసనగౌడ

రాయచూరు రూరల్: తాలూకాలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులకు సంబంధించి చర్చించాల్సిన అంశాలపై ఆ శాఖాధికారులు గైర్హాజరైతే ఎలా? అని సమావేశాలకు గైర్హాజరైన అధికారులపై చర్యలు చేపట్టాలని రూరల్ ఎమ్మెల్యే బసనగౌడ పేర్కొన్నారు. సోమవారం జెడ్పీ కార్యాలయంలో జరిగిన కేడీపీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. 3500 మంది రైతులకు పంప్ సెట్ మోటార్లు అందించారన్నారు. గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి నీరు అందించాలన్నారు. ఈ సందర్భంగా ఏసీ మెహబూబి, ఏపీఎంసీ అధ్యక్షుడు మల్లికార్జునగౌడ, ఉపాధ్యక్షుడు బషీర్, కేడీపీ సభ్యులు పల్లవి, వీరేష్, తిమ్మప్ప నాయక్, హుసేన్,ఝిందప్ప, శరణ బసవ రెడ్డి, పంపాపతి, అధికారులున్నారు.

దుకాణాల తాళాలు తెరవరూ..



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: నగరంలోని చంద్రబండ రోడ్డులో నిర్మించిన నగరసభ దుకాణాలకు వేసిన తాళాలను తెరవాలని వ్యాపారస్తులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో అధ్యక్షుడు చెన్నయ్య మాట్లాడారు. గత నెల 20న నగరసభ అధికారులు అకస్మాత్తుగా నోటీసులు జారీ చేయకుండా దుకాణాలకు తాళం వేయడాన్ని ఖండించారు. స్వంత డబ్బులను ఖర్చు పెట్టి మరమ్మతులు చేసుకొని వ్యాపారాలతో కుటుంబ జీవనం సాగిస్తున్న వారిపై అధికారులు తీసుకున్న చర్యలను ఉపసంహరించుకోవాలని కోరుతూ స్థానికాధికారికి వినతి పత్రం సమర్పించారు.

వంతెన మరమ్మతులపై భిన్నస్వరాలు



మరమ్మతుకు నోచుకోనున్న వంతెన

రాయచూరు రూరల్: కృష్ణా నదిపై అధ్వాన స్థితికి చేరిన వంతెన మరమ్మతు పనుల కోసం ఈనెల 10వ తేదీ నుంచి 45 రోజుల పాటు వాహన రాకపోకల నిలిపివేతకు అధికార యంత్రాంగం తీసుకున్న చర్యలపై ప్రజల నుంచి భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మధ్య వాహనాల రాకపోకల నిషేధానికి సిద్ధం కావడంతో గడినాడు భాగంలో సంకాంత్రి పండుగకు కృష్ణానదిలో స్నానాల ఆచరణకు, యాదగిరి జిల్లా మైలాపూర్ మైలార మల్లయ్య జాతర, మకర సంక్రాంతికి రామగడలో జరగనున్న ఉత్సవాలకు హాజరు కాగోరే ప్రజలకు అసౌకర్యంగా ఉంటుందని ప్రజలు వాపోతున్నారు. ఈనెల 20వ తేదీ తర్వాత వంతెన మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టాలని కోరుతున్నారు.

కారిగనూరులో ప్రబలిన అతిసార



గ్రామంలో పరిస్థితిని పరిశీలిస్తున్న అధికారులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి పరామర్శ

- కలుషిత నీటితో 35 మందికి అస్వస్థత
- చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

హొసపేటె: తాలూకాలోని కారిగనూరులో అతిసార ప్రబలింది. కలుషిత నీరు తాగి వాంతులు, విరేచనాలతో 30 మందికి పైగా అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఓ వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. వివరాలు.. కారిగనూరులోని ఆర్‌బీఎస్‌ఎస్‌ఎన్ క్యాంపులో శుక్రవారం అతిసారతో 14 మంది అస్వస్థతకు గురికాగా శనివారానికి వారి సంఖ్య 20కి, ఆదివారం సాయంత్రానికి 35కి చేరింది. కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురైన వారు ప్రభుత్వాసుపత్రిలో చేరారు. వీరిలో సీతమ్మ(66) పరిస్థితి విషమంగా ఉండటంతో తదుపరి చికిత్స కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం బళ్లారి విమ్స్‌లో చేర్పించారు. అయితే చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి ఆమె మరణించింది. ట్యాంక్‌ను శుభ్రం చేయకుండానే సరఫరా చేయడంతో ఆ నీటిని తాగిన గ్రామస్తులు వాంతులు, విరేచనాలకు గురయ్యారు. ప్రస్తుతం బాధితులకు ఆస్పత్రిలో వైద్యులు మెరుగైన చికిత్స అందిస్తున్నారు. అస్వస్థతకు గురైై ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని ఎమ్మెల్యే గవియప్ప, డీసీ దివాకర్ పరామర్శించి వారి ఆరోగ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనపై నీటి శుభ్రతలో ప్రధానంగా తీవ్ర నిర్లక్ష్యం వహించిన అధికారులపై జిల్లాధికారి చర్యలకు ఆదేశించారు.



మృతురాలు సీతమ్మ(ఫైల్)

ముగ్గురు అధికారులపై వేటు

హొసపేటె: నగర శివారులోని కారిగనూరు 22వ వార్డులో కలుషిత నీటిని తాగి 30 మందికి పైగా ప్రజలు వాంతులు, విరేచనాలతో ఆస్పత్రిలో చేరారు. ఈ ఘటనలో కారిగనూరు నివాసి సీతమ్మ మృతి చెందారు. ఈ విషయంలో నగరసభ యంత్రాంగం వార్డులో మంచినీటి సరఫరాకు చెందిన ట్యాంక్‌ను సరిగా శుభ్రం చేయకుండా నిర్లక్ష్యం వహించడంతో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహమ్మద్ ఖాన్ సూచన మేరకు నగరసభ అధికారి బీటీ.బండివడ్డర్, ఇంజినీర్లు సతీష్, ఖాజీలపై సస్పెన్షన్ వేటు వేస్తూ జిల్లాధికారి ఆదేశాలను జారీ చేశారు.



సస్పెండైన నగరసభ అధికారి బండివడ్డర్

త్వరలో ఎన్‌డబ్ల్యూకేఆర్‌టీసీకి 884 కొత్త బస్సులు

- మంత్రి రామలింగారెడ్డి

హుబ్లీ: త్వరలో వాయువ్య కర్ణాటక రోడ్డు రవాణా సంస్థ(ఎన్‌డబ్ల్యూకేఆర్‌టీసీ)కు 884 కొత్త బస్సులను అందిస్తామని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి రామలింగారెడ్డి పేర్కొన్నారు. ఆయన సోమవారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సంతోష్ లాడ్‌తో కలిసి నగరంలోని గోకుల్ రోడ్డు బస్టాండ్‌లో ధార్వాడ నగర బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన, గోకుల్ రోడ్డు బస్టాండ్ అప్‌గ్రేడ్ పనులకు శంకుస్థాపన చేయడమే కాకుండా పల్లకీ బస్సులను జాతికి అంకితం చేసి మాట్లాడారు. వీటిలో 100 ఎలక్ట్రిక్ బస్సులను జంట నగరాల్లో సంచారానికి కేటాయిస్తామన్నారు. బెంగళూరు తర్వాత రాష్ట్రంలో పెద్దదైన హుబ్లీ బస్సు స్టేషన్ స్థలాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో శక్తి యోజన ప్రారంభం అయ్యాక ఇప్పటి వరకు కోటికి పైగా మహిళా ప్రయాణికులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందారన్నారు. ఇతర కార్పొరేషన్లలో ఇచ్చినట్లుగానే ప్రమాద పరిహార బీమాను ఈ సంస్థలో కూడా రూ.కోటికి పెంచామన్నారు. 9 వేల మందికి ఉద్యోగాలు కల్పించామన్నారు. కోవిడ్ సమయంలో నిలిచిన 3800 బస్సులు తిరిగి ఇప్పుడు ప్రారంభం అయ్యాయన్నారు. దీని వల్ల శక్తి యోజనకు బస్సుల సమస్య తీరిందన్నారు. ఈ ప్రాంత ప్రజలకు పాత బస్సులను కేటాయించకుండా కొత్త బస్సులను కేటాయించామన్నారు.

4 పల్లకీ బస్సుల ప్రారంభం

అంతకు ముందు సకల సౌకర్యాలు ఉన్న బీఎస్‌ఆర్ నాన్ ఏసీ స్లీపర్ 4 పల్లకీ బస్సులను మంత్రులు ప్రారంభించారు. ఈ బస్సుల్లో 30 సీట్లు ఉంటాయి. ప్రతి వాహనం విలువ రూ.40 లక్షలు. ఇక మరో 6 వాహనాలు ఈనెల చివరిలోగా రానున్నాయి. మరో 10 వాహనాలు కొనుగోలుకు టెండర్ ప్రక్రియ జరుగుతోందన్నారు. రూ.13 కోట్ల వ్యయంతో ధార్వాడ నగర బస్టాండ్‌ను నిర్మిస్తామన్నారు. రూ.23 కోట్లతో హుబ్లీ కొత్త బస్టాండ్ నిర్మించి ఆధునీకరిస్తామన్నారు. ఇన్ని పనులు జరుగుతున్నా అభివృద్ధి జరగడం లేదంటూ బీజేపీ వాపోతోందని మంత్రి అన్నారు. పని చేసే వారిని వదలరు. బీజేపీ నేతల మాటలకు విలువ లేదు. వారు పని చేయక పోవడం వల్ల ప్రజలు ఇంటికి పంపించారన్నారు. ప్రతి రోజు 60 లక్షల మంది మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. దీన్ని విమర్శించే బీజేపీకి వారి శాపం తగులుతుందన్నారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి డ్రామాలు ఆడుతున్నారని, అభివృద్ధి గురించి పూర్తి వివరాలతో మాట్లాడితే బాగుంటుందని ఆయన అన్నారు.

ఎన్‌ఆర్‌బీసీకి నీరివ్వాలని వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న రైతన్నలు

రాయచూరు రూరల్: దేవదుర్గ తాలూకాలో నీరు లేక వాడిపోతున్న మిరప పంటకు నారాయణపుర కుడి కాలువ(ఎన్‌ఆర్‌బీసీ) ద్వారా నీరు వదలాలని రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేసింది. సోమవారం దేవదుర్గ తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులు చేపట్టిన ఆందోళనలో జిల్లాధ్యక్షుడు చామరస మాలిపాటిల్ మాట్లాడారు. తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.

యథేచ్ఛగా ఇసుక రవాణా



జిల్లాలో ప్రవహిస్తున్న కృష్ణా నది



అక్రమంగా నిల్వ చేసిన ఇసుక

రాయచూరు రూరల్: కృష్ణా నది తీరం వెంట యథేచ్ఛగా ఇసుక రవాణా సాగుతోంది. రాయచూరు, యాదగిరి జిల్లాల్లో ఇసుక రవాణా మూడు పువ్వులు, ఆరు కాయలుగా నడుస్తోంది. వర్షాభావం, పశువులకు, తాగేందుకు నీరు లేక రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతుంటే టిప్పర్లతో రాత్రికి రాత్రే ఇసుకను సరిహద్దులు దాటించేస్తున్నారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మధ్య ఇసుక రవాణా వాహనాలు విచ్చలవిడిగా నడుస్తున్నాయి. అక్రమ ఇసుక రవాణా చేసే వారిపై పోలీస్, రెవిన్యూ, ఆర్టీఓ శాఖాధికారులు మౌనం వహిస్తున్నారు. నారాయణపుర డ్యాం దిగువన జేసీబీల గర్జనతో, హిటాచీల శబ్దం, ట్రాక్టర్లు, టిప్పర్లతో యాదగిరి, రాయచూరు జిల్లాలు, తెలంగాణలోని జూరాల, గూగల్, గుర్జాపూర్, దేవదుర్గ, వడిగేర, సురపుర, భీమరాయన గుడి, షాపుర వంటి ప్రాంతాల్లో చెక్‌పోస్టులున్నా వాటి కళ్లుగప్పి అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయలేక పోతున్నారు. హైదరాబాద్, మహారాష్ట్రలోని షోలాపూర్, సాంగ్లీ, మీరజ్ వరకు అక్రమ రవాణా కొనసాగుతుంది. ఒక టిప్పర్‌కు రూ.55–60 వేలు, కలబుర్గి జిల్లాలో రూ.80 వేలు, ఇతర రాష్ట్రాలకు రూ.లక్షా 50 వేల వరకు ధర ఉన్నాయి. నిత్యం 400 టిప్పర్ల మేర రవాణా అవుతున్నాయి. ప్రతి టిప్పర్‌లో 35 టన్నుల మేర ఇసుక రవాణా చేస్తారు. రోజు రూ.2 కోట్ల మేర వ్యాపార లావాదేవీలు కొనసాగుతాయి. యాదగిరి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శరణ బసప్ప దర్శనాపూర్, దేవదుర్గ ఎమ్మెల్యే కరెమ్మ నాయక్ నియోజకవర్గాల్లో వాహన సంచారం అధికమైంది. కలబుర్గి, యాదగిరి, రాయచూరు జిల్లాల అధికారులు, ఎస్పీలు మౌనం వహించడంపై ప్రజలు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు.

రేణుకాచార్య రథ జ్యోతికి స్వాగతం



యాత్రకు స్వాగతం పలికిన స్వామీజీలు

రాయచూరు రూరల్: నగరంలో జగ్గుగురు రేణుకాచార్య 36 అడుగుల విగ్రహ రథ జ్యోతికి స్వాగతం లభించింది. సోమవారం నగరంలోని గంజ్ సర్కిల్‌లో నుంచి తెలంగాణ వైపునకు పయనించింది. శ్రీమద్ రంభాపురి జగద్గురు వీర సోమేశ్వర స్వామీజీ, కిల్లే బృహన్మఠాధిపతి శాంతమల్ల, సోమవారపేట మఠాధిపతి అభినవ రాచోటి రేవణ సిద్దేశ్వర శివాచార్యులు, ప్రభుశాస్త్రి, కల్లయ్య, శరణబసవ, రాచయ్యస్వామి, వీరనగౌడ, పర్వతరెడ్డి, మంజునాథ్, శరణులు పాల్గొన్నారు.

డ్రైవర్లపై కొత్త చట్టం అమలు వద్దు



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రైవర్లపై తెచ్చిన హిట్ అండ్ రన్ కొత్త చట్టాన్ని అమలు చేయడం తగదని కర్ణాటక లారీ డ్రైవర్ల సంఘం పేర్కొంది. సోమవారం టిప్పుసుల్తాన్ ఉద్యానవనంలో చేపట్టిన ఆందోళనలో అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడారు. లోక్‌సభలో అంగీకరించిన హిట్ అండ్ రన్ అశాస్త్రీయ చట్టంతో డ్రైవర్లపై రూ.10 లక్షల వరకు జరిమానా విధించడానికి వీలవుతుందన్నారు. కొత్త చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

కాంత్‌రాజ్ నివేదికలో లోపాలు సవరించండి



మాట్లాడుతున్న సిద్ధరామానంద స్వామీజీ

రాయచూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం కాంత్‌రాజ్ నివేదికలో ఉన్న లోపాలను సవరించాలని తింథిణి కాగినెలె గురు పీఠం మఠాధిపతి సిద్ధరామానంద స్వామీజీ పేర్కొన్నారు. సోమవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులాల ప్రాతిపదికన కాకుండా సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లను కేటాయించాలని కోరారు. ఈనెల 12 నుంచి తింథిణిలో హాలు మత వైభవ ఉత్సవాల్లో భాగంగా మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 13న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, సమాజ సేవకులు పాల్గొంటారన్నారు. పాత్రికేయురాలు విజయలక్ష్మి శిరూరుకు కనకరత్న అవార్డు, హైదరాబాద్ కాంచ కాళయ్యకు హాలుమత భాస్కర, తమిళనాడు బొమ్మన్‌కు సిద్ధశ్రీ అవార్డులు అందిస్తారన్నారు.